ఈనాడు

గుంటూరు 3-5-2026 ఆదివారం సిటీ సంపుటి 31 సంచిక 27 | THE LARGEST CIRCULATED TELUGU DAILY | రూ. 8-00 పేజీలు 22+28 | www.eenadu.net

Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

సెలవుల్లో సరదాగా!

సెలవుల్లో స్నేహితులతో కలిసి మన తెలివితేటలకు పదునుపెడదామా! చదువుకునేటప్పుడే కాదు.. ఆడుకుంటూ కూడా కొత్త విషయాలు నేర్చుకోవచ్చు. దీనికోసం 'నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్' ఆట ఆడేద్దాం.

పంచుకుంటే పెరిగే జ్ఞానం



ముందుగా మీరు, మీ ఫ్రెండ్స్ ఇద్దరు ముగ్గురు కలిసి కూర్చోండి. ఒక్కొక్కరూ ఒక్కో పేపరు, పెన్ను తీసుకోండి. మీకు సమాధానాలు తెలిసిన ఆసక్తికరమైన జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలను ఆ పేపర్ మీద రాయండి. ఎవరి పేపర్లో వారు కనీసం ఐదు నుంచి పది ప్రశ్నలు రాసుకోవాలి. ఇప్పుడు మీ పేపర్లను ఒకరికొకరు మార్చుకోండి. దీనివల్ల మీకు తెలియని కొత్త విషయాలు మీ ఫ్రెండ్ ద్వారా తెలుస్తాయి. ఎవరెవరు ఏమేం రాశారో గట్టిగా బయటకు చదవండి. ఇంకెందుకు ఆలస్యం.. మీ గ్యాంగ్‌తో కలిసి ఈ సరదా ఆట మొదలుపెట్టేయండి మరి. మీకు తెలియని కొత్త విషయాలు ఈ ఆటలో నేర్చుకుంటే వాటిని నోట్ చేసుకోవడం మర్చిపోకండేం.


మీరే రిపోర్టర్



టీవీలో వార్తలు చూస్తుంటాం మనం. ఈసారి మనమే వార్తలు చెబితే ఎలా ఉంటుంది? భలే ఉంటుంది కదూ! అందుకే సెలవుల్లో మనలోని జర్నలిస్టుని నిద్రలేపుదామా.

దీనికోసం మనకు కావాల్సిందల్లా ఒక చిన్న మైక్ బొమ్మ. ముందుగా మీ కాలనీలో లేదా అపార్ట్‌మెంట్‌లో మీరు పరిష్కరించాలి అనుకుంటున్న ఓ సమస్యను గుర్తించండి. దాని గురించి పరిశోధించండి. పెద్దల సాయంతో బోలెడు వివరాలు సేకరించండి. ఓ మంచి వార్తా కథనంలా రాసే ప్రయత్నం చేయండి. దాన్ని టీవీలో చెబుతున్నట్టుగా మీరే వార్తలా చెప్పండి. రాసిన కాపీలను పెద్దవాళ్లకు పంచండి.

మేం సముద్ర దొంగల్లాంటి వాళ్లం



వస్తూవస్తూ క్యూబానూ స్వాధీనం చేసుకుంటామేమో: ట్రంప్

- అవసరమైతే తీవ్రదాడులకు సిద్ధం
- ఇరాన్‌కు డబ్బు కడితే ఊరుకోం
- నౌకాయాన కంపెనీలపై ఆంక్షలు విధిస్తామన్న అమెరికా
- చర్చలకైనా, యుద్ధానికైనా సిద్ధమే: ఇరాన్

బీరుట్, వాషింగ్టన్: తాము ఒకరకంగా సముద్రపు దొంగల (పైరేట్స్) లాంటి వాళ్లమేనని, కానీ.. ఆటలు ఆడటం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రోజుల క్రితం గల్ఫ్ సముద్ర జలాల్లో ఒక నౌకను అమెరికా నౌకాదళం సీజ్ చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం రాత్రి ఫ్లోరిడాలో ఈ వ్యాఖ్య చేశారు. ఈ నౌకలోని సరకును, చమురును తీసుకున్నామని, అదొక లాభదాయక వ్యాపారమని చెప్పారు. "ఇరాన్‌కి నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు లేకుండా పోయాయి. నాయకత్వం కూడా బలహీనమైంది. వాళ్లు ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నారు. మాకు కావాల్సిన స్థాయిలో ప్రతిపాదనలు లేవు. తుది ఒప్పందం సాధ్యమవుతుందా లేదా అన్నది తెలియడం లేదు. ఇరాన్ నాయకత్వంలో అంతర్గత విభేదాలున్నాయి. వాళ్లలో ఉన్న వర్గాలన్నీ ఒప్పందాన్ని కోరుకుంటున్నా, ఏకాభిప్రాయం లేదు. మేం ఇప్పుడు వెనక్కి తగ్గితే మరో మూడు సంవత్సరాల్లో సమస్య మళ్లీ వస్తుంది. అందుకే పూర్తి పరిష్కారం వచ్చే వరకు మేం వెనక్కి వెళ్లం" అని ట్రంప్ తెలిపారు.

తీవ్ర దాడులకూ సిద్ధం..

అవసరమైతే తీవ్రదాడులకూ సిద్ధంగా ఉన్నామని, సాధ్యమైనంత వరకు చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని ఆశిస్తున్నామని ట్రంప్ తెలిపారు. యుద్ధం ముగిసిన తర్వాత ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. తమ నౌకాదళం అమెరికాకు తిరిగి వస్తూ క్యూబాను కూడా స్వాధీనం చేసుకుంటుందేమోనని జోక్ చేశారు. విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ సుమారు 100 గజాల దూరంలో ఆగగానే క్యూబా వచ్చి ధన్యవాదాలు చెప్పిమరీ లొంగిపోతుందన్నారు.



హర్మూజ్ జలసంధిపై ట్రంప్ వ్యాఖ్యలకు కళ్లెం వేస్తున్నట్లుగా టెహ్రాన్‌లో ఏర్పాటు చేసిన బిల్ బోర్డు

■ సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటడానికి నౌకాయాన సంస్థలు ఇరాన్‌కు డబ్బులు చెల్లించినట్లయితే ఊరుకునేది లేదని, వాటిపై తాము ఆంక్షలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ మేరకు 'అమెరికా విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం' పోస్ట్ చేసింది. చుట్టూ తిరిగి రావాల్సిందిగా 45 వాణిజ్య నౌకలకు చెప్పినట్లు వెల్లడించింది. అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ కూడా ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇరాన్ నాయకత్వాన్ని 'మురుగు కాలువలోని ఎలుకలు' అని అభివర్ణించారు.

హర్మూజ్‌పై నియంత్రణ బలోపేతం చేస్తాం: ఇరాన్

పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు ఐఆర్‌జీసీ నౌకాదళం తెలిపింది. దాదాపు 2,000 కి.మీ.మేర విస్తరించి ఉన్న ఇరాన్ తీరప్రాంతంపై నియంత్రణ కొనసాగేలా చూస్తామని ప్రకటించింది. ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో సుమారు 20,000 మంది నావికులు నౌకల్లోనే నిలిచిపోయారు. చర్చలకైనా, యుద్ధానికైనా తాము సిద్ధమేనని ఇరాన్ చెబుతోంది. దీనిపై తేల్చుకోవాల్సింది అమెరికాయేనంది. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశం ఉందని ఇరాన్ సీనియర్ సైనికాధికారి ఒకరు శనివారం తెలిపారు. అమెరికన్ల నుంచి ఎదురయ్యే ఎలాంటి దాడులనైనా, మూర్ఖపు చర్యలనైనా ఎదుర్కొనేందుకు తమ సాయుధ దళాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. గల్ఫ్ ప్రాంతంలోని వివిధ దేశాల్లో అమెరికా సైనిక స్థావరాలకు ఇరాన్ సైన్యం ఊహించని స్థాయిలో నష్టం కలిగించిందని సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. కనీసం 16 స్థావరాలను, సైనిక వ్యవస్థలను ఇరాన్ ధ్వంసం చేసింది. వాటిలో కొన్ని ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయి.

● నోబెల్ పురస్కార విజేత నర్గెస్ మొహమ్మది ఆరోగ్య పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని, శుక్రవారం రాత్రి ఇరాన్‌లోని కారాగారం నుంచి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని ఆమె నిర్వహిస్తున్న ఫౌండేషన్ తెలిపింది.

● ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేస్తున్నందుకు ఇద్దరు వ్యక్తులకు ఇరాన్ సుప్రీంకోర్టు విధించిన మరణ శిక్షను శనివారం ఉరితీత ద్వారా అమలు పరిచారు.

సర్కారు లాలిపాట

- పేదలు, ఉద్యోగినుల పిల్లలకు ప్రభుత్వ సంరక్షణ కేంద్రాలు
- విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో త్వరలో ప్రారంభం
- పేదల పిల్లలకు ఉచితం, ఇతరులకు స్వల్ప ఛార్జీలు

ఈనాడు, అమరావతి: ఉద్యోగినులు, పేద మహిళల పిల్లల సంరక్షణ కోసం రాష్ట్రంలో మొదటిసారి శిశు సంరక్షణ కేంద్రాలు ప్రారంభించనున్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి నగరాల్లో ఐదు చొప్పున ప్రయోగాత్మకంగా 15 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించనున్నారు. కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, పర్యవేక్షణ వంటివి చూస్తారు. కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ శనివారం మార్గదర్శకాలు జారీ చేశారు.

▼ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగినులు, కూలి పనులకు వెళ్లే పేద మహిళల పిల్లల సంరక్షణ కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రాలు లేవు. దీంతో ప్రసవమైన కొన్ని నెలల వరకు వారు ఉద్యోగానికి, ఉపాధికి వెళ్లలేకపోతున్నారు. ఇలాంటివారి కోసం ఒక్కో నగరంలో ఇప్పుడు ఐదు కేంద్రాలు ప్రారంభించనున్నారు. వీటిలో రెండు మురికివాడల్లో, మిగిలిన మూడు మధ్య తరగతి కుటుంబాలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తారు.

▼ ఆరు నెలల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులను వీటిలో సంరక్షిస్తారు. ఒక్కో కేంద్రంలో 25 మందికి ప్రవేశం ఉంటుంది.

▼ మురికివాడల్లో పేద మహిళల పిల్లలకు ప్రవేశం, సంరక్షణ పూర్తిగా ఉచితం. మధ్య తరగతి కుటుంబాల కోసం ప్రారంభించే కేంద్రాల్లో అందుబాటు ధరల్లో ఛార్జీలుంటాయి.

ఏటా రూ.1.50 కోట్ల వ్యయం

మూడు నగరాల్లో ప్రారంభించే శిశు సంరక్షణ కేంద్రాల నిర్వహణకు ఏడాదికి రూ.1.50 కోట్ల చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయనుంది. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఒక్కో కేంద్రంలో ముగ్గురు సహాయకులను ఏర్పాటు చేయనున్నారు.

భారతి సిమెంట్‌ది పాతపాటే

సున్నపురాయి లీజులు సక్రమంగానే పొందామంటూ వాదన

- గనులశాఖ కమిటీ ముందు హాజరై వివరణ
- వారం రోజుల్లో లీజు రద్దు ఉత్తర్వులు!

ఈనాడు – అమరావతి: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ సతీమణి భారతి డైరెక్టర్‌గా ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్.. వైకాపా ప్రభుత్వంలో పొందిన సున్నపురాయి లీజుల్లో ఎలాంటి ఉల్లంఘనలు లేవంటూ పాతపాటే పాడింది. ఇటీవల గనులశాఖ అధికారుల కమిటీ ముందు వ్యక్తిగతంగా హాజరై, వివరణ ఇచ్చేందుకు వీలు కల్పించగా అక్కడ కూడా గత వాదననే వినిపించింది. ప్రభుత్వం, గనులశాఖ నుంచి మరిన్ని వివరాలు కావాలంటూ పట్టుబట్టింది. అధికారులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగానే లీజులు మంజూరైనట్లు తుది నిర్ణయానికి వచ్చారని తెలిసింది.

ఈ-వేలం లేకుండానే లీజులు మంజూరు

■ వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలంలోని 509.18 ఎకరాలు, ఎర్రగుంట్ల మండలంలోని 235.56 ఎకరాల్లో రెండు సిమెంట్ గ్రేడ్ సున్నపురాయి లీజులకు రఘురామ్ సిమెంట్స్ లిమిటెడ్ దరఖాస్తు చేసుకోగా 2008లో వైఎస్ ప్రభుత్వం ప్రాథమిక అనుమతి ఇచ్చింది. అనంతరం ఇది భారతి సిమెంట్ చేతుల్లోకి వెళ్లింది.

■ ప్రాథమిక అనుమతి తర్వాత మైనింగ్ ప్లాన్, పర్యావరణ అనుమతులు, తదితరాలు పొందితేనే పూర్తిస్థాయి లీజులు మంజూరు చేస్తారు. గడువులోపు భారతి సిమెంట్ ఆ అనుమతులు తెచ్చుకోలేకపోయింది.

■ కేంద్ర గనులశాఖ 2015, 2021ల్లో చేసిన సవరణల ప్రకారం ప్రధాన ఖనిజాల (మేజర్ మినరల్స్) లీజులను ఈ-వేలం ద్వారానే కేటాయించాలి. అయితే జగన్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో భారతి సిమెంట్‌కు 2008 నాటి దరఖాస్తులు, ప్రాథమిక అనుమతి ఆధారంగా లీజులు మంజూరు చేసేస్తూ ఉత్తర్వులిచ్చింది.

మాదే రైట్ అంటూ వాదన

■ కేంద్ర ఆదేశాలతో భారతి సిమెంట్ రెండు లీజులు, ఏసీసీ, రామ్‌కో సిమెంట్‌కు చెందిన ఒక్కో సున్నపురాయి లీజును ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ ప్రభుత్వం తొలుత తాఖీదులు ఇచ్చింది.

■ తాము చట్టప్రకారమే లీజులు పొందామని, గతంలోనే లీజుకు దరఖాస్తు చేసుకున్నందున కేంద్ర గనులశాఖ సవరణ నిబంధన వర్తించదని భారతి సిమెంట్ వాదించింది. అధికారుల ముందు హాజరై తగిన వాదన వినిపిస్తామని తెలిపింది. రామ్‌కో సిమెంట్ కూడా ఇదే విధంగా పేర్కొంది. ఏసీసీ లిఖితపూర్వక వివరణతోనే సరిపెట్టుకుంది. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా పర్వాలేదని తెలిపింది.

■ గత నెలలో భారతి, రామ్‌కో సిమెంట్స్ యాజమాన్యాలు గనులశాఖ అధికారులతో కూడిన కమిటీ ముందు హాజరై మళ్లీ పాత కథే చెప్పాయి. గతంలో తామిచ్చిన వివరణపై న్యాయశాఖ ప్రభుత్వానికి ఏమని సూచించిందో ఆ నోట్‌ఫైల్, తదితరాలు ఇవ్వాలని భారతి సిమెంట్ కోరినట్లు తెలిసింది. తర్వాత లిఖితపూర్వకంగా కూడా వివరణ ఇస్తామని తాజాగా అది కూడా అందజేసింది.

■ భారతి సిమెంట్స్ వివరణలోని అంశాలను గనులశాఖ అధికారులు పరిశీలిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఏసీసీ సిమెంట్ లీజు రద్దుకు దాదాపు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు భారతి సిమెంట్‌కు చెందిన రెండు లీజులు, రామ్‌కో సిమెంట్స్‌కు చెందిన లీజు రద్దుకు కూడా నిర్ణయం తీసుకొని, వారంలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

■ భారతి సిమెంట్‌తోపాటు అసోసియేట్ సిమెంట్ కంపెనీస్ (ప్రస్తుతం అదానీ సిమెంట్స్)కి వైఎస్సార్ కడప జిల్లా మైలవరం మండలంలోని 2,463 ఎకరాల్లో లీజును, రామ్‌కో సిమెంట్స్‌కు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం జయంతిపురంలోని 267.30 ఎకరాల్లో లీజును కూడా వైకాపా ప్రభుత్వం మంజూరు చేసింది.

■ ఇవి నిబంధనలకు విరుద్ధమని కేంద్ర గనులశాఖ, ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం) ఏడాదిన్నర కిందట గుర్తించాయి. చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాయి.



క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి వారాంతపు రద్దీ

వీఐపీ సిఫారసు లేఖల రద్దు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి భక్తుల రద్దీ వారాంతంలో కొనసాగుతోంది. శనివారం సాయంత్రానికి ఎలాంటి టోకెన్లు లేని భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు నిండిపోయి రింగురోడ్డు మీదుగా శిలాతోరణం బాటగంగమ్మ ఆలయం మధ్య క్యూలైన్‌లో ప్రవేశిస్తున్నారు. వీరికి దాదాపు 14 గంటల్లో శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. క్యూలైన్‌లోని భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నారు. క్యూలైన్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు తితిదే ఉన్నతాధికారులు ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. శ్రీవారిని 71,008 మంది భక్తులు దర్శించుకోగా హుండీ కానుకలు రూ.3.52 కోట్లు లభించాయి.

■ తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో శ్రీవారి సర్వదర్శనానికి వస్తున్న భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తితిదే అధికారులు చర్యలు చేపట్టారు. ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికారుల సిఫారసు లేఖలపై జారీచేసే వీఐపీ బ్రేక్ దర్శనాలను అనుమతించలేదు. రద్దీకి అనుగుణంగా జూన్, జులై వరకు సిఫారసు లేఖలపై ఆంక్షలు విధించే అవకాశం ఉంది. తితిదే అధికారికంగా ప్రకటన చేయకున్నా గతంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగానే ప్రస్తుతం వాటిని నిరాకరించినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఈ నెల 6న జరిగే తితిదే బోర్డు సమావేశంలో నిర్ణయం వెల్లడించనున్నారు.

ఆయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.23,656

- గతంలో ఎప్పుడూ లేనంత ధర
- ఉద్యానశాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించి ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23,656గా ప్రకటించింది. ఈ మేరకు ఉద్యానశాఖ సంచాలకులు కె.శ్రీనివాసులు ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనంత రికార్డుస్థాయి ధర ప్రకటించడంతో రైతులు ఆనందంతో ఉన్నారు. ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రం ముందంజలో ఉంది. సుమారు 2.11 లక్షల మంది రైతులు 2.82 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 55,645 ఎకరాల్లో, 2025-26 ఆర్థిక సంవత్సరంలో 75,360 ఎకరాల్లో కొత్తగా తోటలు ఏర్పాటయ్యాయి. ఫలితంగా గత దశాబ్దంలోనే ఈ సంవత్సరం రాష్ట్రంలో అత్యధిక ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY



గుంటూరు 3-5-2026 ఆదివారం సిటీ సంపుటి 31 సంచిక 27 | రూ. 8-00 పేజీలు 22+28 | www.eenadu.net

Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam,Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

ఆకాశంలో కథలు

తలెత్తి చూస్తే.. నీలి ఆకాశం. అక్కడక్కడా మబ్బులు. ఆ మేఘాలు భలే చిత్రవిచిత్రమైన ఆకారాల్లో ఉంటాయి కదూ! మనం చూస్తుండగానే గాలికి కదిలిపోతుంటాయి కూడా. కానీ మనం గమనిస్తే.. ఆ మబ్బుల ఆకారాలు గమ్మత్తుగా ఉంటాయి. ఒకసారి కుందేలులా మరోసారి కుక్కపిల్లలా కనిపిస్తుంటాయి. చెట్టు, పడవ, బంతి, మనిషి ముఖం.. ఇలా మనం గుర్తించాలే కానీ ఎన్నో షేప్స్‌లో అలరిస్తూ ఉంటాయి. అయితే ఎప్పుడూలా వాటిని చూసి వదిలేయకుండా మనం ఈసారి కొత్తగా ఆలోచిద్దామా!



- మీరు, మీ ఫ్రెండ్స్ లేదా ఇంట్లో వారితో కలిసి మేఘాలను చూసేందుకు సాయంత్రం పూట కూర్చోండి.
- అవి ఎలా ఉన్నాయో, ఎటు కదులుతున్నాయో గమనించండి.
- మీరు గుర్తించిన ఆకారాల జాబితాను రాయండి. ఉదాహరణకు బాతు, గాలిపటం, పక్షి.. ఇలా!
- ఇప్పుడా పదాలతో ఓ మంచి కథ అల్లేందుకు బుర్రకు పదును పెట్టండి. అంటే.. బాతు - పక్షి కలిసి గాలిపటం ఎగరేయాలి అనుకున్నాయి. అప్పుడేమో.. ఇలా అన్నమాట.

దాన్ని ఒక పుస్తకంలో రాసి జాగ్రత్త చేయండి. అలా మరిన్ని రాసేందుకు ప్రయత్నించండి.

సెలవుల్లో సరదాగా!

చిట్టి నేస్తాలకు..

చిన్న చిన్న పక్షులను చూస్తే భలే ముద్దుగా ఉంటుంది. శబ్దాలు చేస్తూ అందంగా తిరుగుతుంటాయి. కానీ, ఈ ఎండల్లో వాటికి నీరు, ఆహారం వెతుక్కోవడం చాలా కష్టం కదా! మరి మనం సాయం చేద్దామా? అందుకే ఇంట్లో ఉండే కొబ్బరి పీచుతో 'బర్డ్ ఫీడర్'ను తయారు చేద్దామా?

ముందుగా కొబ్బరి పీచును విడదీయాలి. అది పక్షులకు పరుపులా మెత్తగా ఉండాలి.



- దాన్ని ఒక చిన్న గూడులా దగ్గరకు చేయాలి.
- పీచు ఊడిపోకుండా చుట్టూ తాడుతో మెల్లగా చుట్టాలి.
- ఈ గూడుకి ఒక బలమైన తాడు కట్టి, ఇంటి బాల్కనీలోనో లేదా చెట్టు కొమ్మకో ఎండ తగలకుండా నీడలో కట్టాలి.
- ఈ పీచు మధ్యలో గింజలను వేయాలి. కుదిరితే గాజు కప్పులో నీళ్లను పెట్టాలి.
- పీచు చల్లగా ఉంటుంది. పక్షులు వచ్చి కాసేపు అక్కడ సేదతీరతాయి.

ఇవే కాదు పిల్లలూ.. ఇంకా...

- అమ్మకు సాయంగా... మంట లేకుండా వంట చేసేద్దామా!
- జ్ఞాపకాలు పోగేసి ఓ పుస్తకంగా మారుద్దాం... రండి!
- కబుర్లు పంచుకోవడం కాదు...జ్ఞానాన్ని పెంచుకుందాం
- మనింట్లో పాత వస్తువులతో కొత్తవి సృష్టించేద్దాం!

- లోపలి పేజీల్లో

..ఇలా ఆసక్తిగొలిపే ఎన్నో విశేషాలు, ఆటలు, ఆనందాలను రోజూ మీ కోసం తెస్తోంది 'సెలవుల్లో సరదాగా!'.. చూడ్డం మరచిపోకండేం...

నియోజకవర్గం మొత్తం రీపోలింగ్

పశ్చిమ బెంగాల్‌లోని ఫల్టాపై ఈసీ అసాధారణ నిర్ణయం

21న రీపోలింగ్, 24న కౌంటింగ్

ఏకపక్షంగా పోలింగ్ జరిగిందన్న స్థానికుల ఫిర్యాదుతో చర్య

అక్కడ ప్రజాస్వామ్య ప్రక్రియ విధ్వంసమైందని వ్యాఖ్య 2 లో

బీమా రంగంలోకి 100% ఎఫ్‌డీఐ

ఎల్ఐసీలో 20 శాతానికే పరిమితి

నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం ఆర్థిక లో

బహు సంతాన ప్రాప్తిరస్తు

ఆగస్టు 15 నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలుకు ప్రభుత్వం కసరత్తు

ఏటా 50 వేల జంటలకు ఉచితంగా ఐవీఎఫ్ సౌకర్యం

- ప్రతి నెలా నాలుగో శనివారం 'పిల్లలే సంపద' గ్రామసభలు



ఈనాడు - అమరావతి

ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ప్రోత్సహించిన ప్రభుత్వం.. రాష్ట్రంలో జనాభా పరంగా గతి తప్పుతున్న పరిస్థితులతో అప్రమత్తమైంది. నానాటికీ యువత సంఖ్య తగ్గి.. వృద్ధుల జనాభా పెరుగుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులను చక్కదిద్దేందుకు సమాయత్తమవుతోంది. ఆగస్టు 15 నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల నుంచి ప్రతి నెలా నాలుగో శనివారం 'పిల్లలే సంపద' గ్రామసభలు నిర్వహిస్తారు. జనాభా సంఖ్యను నియంత్రించడం కంటే.. ప్రజల ఆరోగ్యం, కుటుంబ భద్రత, జీవన ప్రమాణాల మెరుగుపై దృష్టి పెడితే.. ఆరోగ్యాంధ్ర సాకారమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా కీలక ప్రణాళికలతో ఆరోగ్యాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ.782.25 కోట్ల నిధులతో ప్రణాళికలను పట్టాలెక్కించనుంది. (మిగతా 2లో)

ప్రధాన సవాళ్లు ఇవే..

- మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 ఉండాలి. కానీ, అధికారిక గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో అది 1.5కి పడిపోయింది. టీఎఫ్ఆర్‌లో మొదటి స్థానంలో కర్నూలు జిల్లా (1.89) ఉంటే.. అట్టడుగు స్థానంలో విశాఖ జిల్లా (1.32) ఉంది.
- వృద్ధుల సంఖ్య పెరగడంతో పాటు మధ్య వయసు వారి సంఖ్య పెరుగుతూ సమాజం వృద్ధాప్య దశలోకి వెళ్తోంది. మధ్యస్థ వయసు 32.5 ఏళ్లు. 60 ఏళ్లు పైబడిన జనాభా 2036 నాటికి 19% అవుతుందని అంచనా.
- రాష్ట్రంలో మహిళల ఉపాధి భాగస్వామ్యం 31% మాత్రమే. దీంతో జీఎస్‌డీపీ నష్టం 15% వరకు ఉంటుందని అంచనా.

సీఎం పర్యవేక్షణలో స్క్రీనింగ్ కమిటీ..

పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ప్రాజెక్టు పనితీరును ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడంతో పాటు జిల్లాల పర్యటనలకూ సిద్ధమవుతున్నారు.

- వ్యూహాత్మక పర్యవేక్షణకు సీఎం అధ్యక్షతన అత్యున్నత స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తారు
- కీలక శాఖలతో సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జనాభా స్థిరీకరణ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుంది.
- రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో సమన్వయానికి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆరోగ్యాంధ్ర జనాభా నిర్వహణ మిషన్ కార్యకలాపాలు చేపడుతుంది.
- ఐటీ శాఖ పరిధిలో డేటా విశ్లేషణ, డ్యాష్‌బోర్డు నిర్వహణ, సూచనల రూపకల్పన.
- కలెక్టర్లు ప్రతినెలా జిల్లా స్థాయిలో, తహసీల్దార్లు ప్రతివారం మండల స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశాలతో ప్రాజెక్టు సమర్థ అమలుకు చర్యలు తీసుకుంటారు.
- కీలక శాఖల పర్యవేక్షణలో లక్ష్యాలు చేరుకునేలా ప్రణాళిక అమలు చేస్తారు.
- పనితీరు ఆధారంగా సచివాలయాలకు ప్రోత్సాహకాలు, ఆరోగ్యాంధ్ర పురస్కారాలు అందజేస్తారు.

కల్తీ నెయ్యి సరఫరాకు చెవిరెడ్డి, భూమనలూ కారకులే


కొనుగోలు కమిటీ సభ్యుల హోదాలో టెండరు నిబంధనల సడలింపునకు పచ్చజెండా


కన్వీనర్ హాజరు కాని సమావేశంలో ఏకపక్షంగా నిర్ణయం

డెయిరీలను రెండేళ్లపాటు ఎంప్యానల్ చేయాలనే సూచన బేఖాతరు

ఆ నిర్ణయాలతోనే తితిదేలోకి కల్తీ నెయ్యి సరఫరా సంస్థల చొరబాటు

విశ్రాంత ఐఏఎస్ దినేష్‌కుమార్ కమిషన్ నివేదికలో వెల్లడి


చెవిరెడ్డి భాస్కరరెడ్డి


భూమన కరుణాకరరెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా జరగడానికి... ఆ పార్టీ కీలక నేతలు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలూ కారకులేనని విశ్రాంత ఐఏఎస్ దినేష్‌కుమార్ కమిషన్ తేల్చింది. వీరిద్దరూ ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో కొనుగోలు కమిటీ సభ్యులుగా కొనసాగారు. అంతకు ముందువరకూ పటిష్ఠంగా ఉన్న నెయ్యి సరఫరా టెండర్ల నిబంధనల సడలింపునకు వీరే తొలుత (మిగతా 2లో)



సైనస్ తీవ్ర సమస్యగా పరిణమించింది

యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణల్లో తగిలిన గాయాలు ఇప్పుడు బాధిస్తున్నాయి

పరామర్శించేందుకు వచ్చిన చంద్రబాబుకు వివరించిన పవన్‌కల్యాణ్ 2 లో

మట్టితో.. మ్యాజిక్

మనం వంటింట్లోకి వెళ్లి ఏదైనా తీర్చామంటే పెద్ద వాళ్లు అస్సలు ఒప్పుకోరు కదా? 'గిన్నెలు పాడవుతాయ్', 'సామాన్లు కింద పడేస్తావ్' అని చెబుతుంటారు. అందుకే ఈ హాలిడేస్‌లో మన గిన్నెలను మనమే తయారు చేసుకుందాం! అది కూడా ఎలాంటి ఖర్చు లేకుండా ఉంటే? చాలా బాగుంటుంది కదా! మనం ఎంచక్కా మట్టితో వీటిని చేసుకోవచ్చు. దీనికోసం మనకు మెత్తటి మట్టి (బంక మట్టి అయితే ఇంకా మంచిది), కొంచెం నీళ్లు, పాత చెంచాలు లేదా చిన్న కట్టెపుల్లలు ఉంటే చాలు.



ఎలా చేయాలంటే..

■ మట్టిలో కొద్దిగా నీళ్లు పోసి, చపాతీ పిండిలా గట్టిగా కలపాలి. రాళ్లు లేకుండా చూసుకోండేం!

■ దాంతో చిన్న చిన్న కప్పులు, ప్లేట్లు, కుండలు, గరిటెలు వంటివి మనకు నచ్చిన ఆకారంలో తయారు చేసుకోవచ్చు.

■ తయారు చేసిన గిన్నెలను ఎండలో ఒక రోజంతా ఉంచితే అవి గట్టిగా మారతాయి.

■ ఆరిన తర్వాత వాటిపై మన దగ్గరున్న కలర్స్‌తో డిజైన్లు వేస్తే భలే ముద్దుగా ఉంటాయి.



సెలవుల్లో సరదాగా!

లాభాలేంటి?

● మట్టితో ఆడుతుంటే మన వేళ్లు, చేతులు బలంగా తయారవుతాయి.

● కొత్త కొత్త ఆకారాలు మన క్రియేటివిటీని ఎంతగానో పెంచుతాయి.

ఇంకెందుకు ఆలస్యం.. మన మట్టి వంటశాల పనులు మొదలుపెడదామా మరి?

పాతవే కొత్తగా..

ఇంట్లో పనికిరాని పాత న్యూస్‌పేపర్లు, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు బోలెడన్ని కనిపిస్తుంటాయి. వాటిని పారేయకుండా, మనలోని క్రియేటివిటీకి పని చెబితే.. అందమైన అలంకార వస్తువులుగా మార్చేయవచ్చు. దీనికోసం కావాల్సిందల్లా పాత పేపర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లూ, కత్తెర, మీ దగ్గర ఉన్న రంగులు.



ఏమేం చేయవచ్చు?

పేపర్ బాస్కెట్స్: పాత న్యూస్ పేపర్లను సన్నని స్ట్రిప్స్‌లా చుట్టి, వాటిని ఒకదానికొకటి అల్లుతూ చిన్న చిన్న బుట్టలు లేదా పెన్ హోల్డర్స్ తయారు చేయవచ్చు. వాటికి రంగులు వేస్తే అచ్చం కొన్న వాటిలాగే మెరిసిపోతాయి.

వాల్ హ్యాంగింగ్స్: బాటిళ్లను అందంగా నచ్చిన షేప్‌లో కట్ చేసి, వాటికి పేపర్ ఫ్లవర్స్ అతికించి గోడకు వేలాడదీయవచ్చు.

పాత వస్తువులను తిరిగి వాడటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుంది. అంతేకాకుండా, తక్కువ ఖర్చుతో మన గదిని మనమే అందంగా అలంకరించుకోవచ్చు. ఇది మెదడుకు మంచి వ్యాయామం కూడా!

సైనస్ తీవ్ర సమస్యగా పరిణమించింది

ఈనాడు, అమరావతి: 'సైనస్ సంబంధిత ఇబ్బందిగా భావించినా... అది తీవ్ర సమస్యగా పరిణమించింది. ఇన్‌ఫెక్షన్‌గా మారి కంటిపై ప్రభావం చూపింది. దీంతో వైద్యులు ఫంక్షనల్ ఎండోస్కోపిక్ సైనస్ సర్జరీ(ఫెస్) చేశారు' అని తన శస్త్రచికిత్స వివరాల్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వివరించారు. సర్జరీ తర్వాత ఇప్పటికీ కొంతమేర నాసల్ బ్లీడింగ్ సమస్య ఉందని, మరో వారం రోజుల్లో అంతా సర్దుకుంటుందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌కల్యాణ్‌ను చంద్రబాబు శనివారం పరామర్శించారు. తమ ఇంటికి వచ్చిన సీఎంకు పవన్‌కల్యాణ్ దంపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ ఆరోగ్యం గురించి చంద్రబాబు తెలుసుకున్నారు. 'సినిమా షూటింగుల్లో భాగంగా యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణల్లో తగిలిన గాయాల్ని అప్పట్లో పట్టించుకోలేదు. అవి కూడా ఇప్పుడు బాధిస్తున్నాయి' అని సీఎంకు పవన్‌కల్యాణ్ చెప్పారు.

నిర్దేశిత సమయంలోనే పాలనా వ్యవహారాలు చూడండి

శస్త్రచికిత్స అనంతరమూ పవన్‌కల్యాణ్ శాఖాపరమైన సమీక్షలు చేయడం, దస్త్రాలు పరిశీలించడాన్ని ప్రస్తావిస్తూ... నిర్దేశిత సమయంలోనే ఆ విధులు నిర్వర్తించాలని చంద్రబాబు సూచించారు. 'ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి. వైద్యుల సూచనలు తప్పక పాటించండి. తగిన విశ్రాంతి తీసుకోండి' అని సూచిస్తూ... త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

బొలెరో ఢీకొట్టడంతో బైక్‌పైనే యువకుల సజీవ దహనం!

అనంతపురం జిల్లాలో దుర్ఘటన



మంటల్లో ద్విచక్ర వాహనం.. సజీవ దహనమైన మిత్రులు

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాన్ని బొలెరో ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటన అనంతపురం జిల్లా కూడేరు మండలంలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు.. వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన శీన, సుభాషిణి దంపతుల కుమారుడు అజిత్ (20), నాగరాజు, చౌడమ్మ దంపతుల కుమారుడు ఆకాశ్ (22) మిత్రులు. వీరు ద్విచక్రవాహనంపై శనివారం రాత్రి అనంతపురం వెళ్తున్నారు. కూడేరు మండలం అరవకూరు వద్ద 47వ జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం వీరిని ఢీకొట్టింది. అనంతరం బొలెరో మరో ఆటోపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంకు ఒక్కసారిగా పేలి, భారీగా మంటలు వ్యాపించాయి. దాంతో బైక్ మీదున్న అజిత్, ఆకాశ్ సజీవ దహనమయ్యారు. బైక్ నంబరు, ఫోన్‌లోని సిమ్‌ల ఆధారంగా మృతుల వివరాలను పోలీసులు సేకరించారు. ఇదే ప్రమాదంలో ఆటో బోల్తాపడి ధ్వంసం కాగా, అందులో వెళ్తున్న అనంతపురానికి చెందిన గోపాల్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడిని జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.



అజిత్



ఆకాష్

స్వగ్రామంలో విషాదం..

బైక్ ప్రమాదంలో సజీవ దహనం అయిన ఆకాశ్.. ఆయన తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇతడు సొంతంగా ట్రాక్టరు నడుపుకొంటూ కుటుంబానికి తోడుగా ఉంటున్నాడు. అజిత్ గ్రామంలోనే వెల్డింగ్ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. ఎక్కడికైనా వీరిద్దరూ కలిసి వెళ్తుంటారు. శనివారం కూడా ఇద్దరూ కలిసి అనంతపురం వెళ్తుండగా మృత్యువు కబళించడంతో గ్రామంలో తల్లిదండ్రులు, బంధువులు రోదించిన తీరు అందరికి కన్నీరు తెప్పించింది.

సుబ్బారెడ్డిని వదిలేసినట్టేనా?

- కల్తీ నెయ్యి కుంభకోణంలో స్పష్టమైన పాత్ర కనిపిస్తున్నా నిందితుడిగా చేర్చరా?
- ఆయన పీఏ చిన్నప్పన్న తీసుకున్న లంచం ఎవరికెళ్లిందో నిగ్గు తేల్చరా?
- బ్యాంకు ఖాతాలు పరిశీలించకుండానే దర్యాప్తు ముగింపు
- ఈ కేసు నుంచి సుబ్బారెడ్డిని బయటపడేయడమే సిట్ లక్ష్యమా?

ఈనాడు, అమరావతి: తితిదేకి నెయ్యి సరఫరా నిబంధనల్ని సడలించే తీర్మానంపై అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డే సంతకం చేశారని..

కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీల్ని లంచం డిమాండ్ చేసిన చిన్నప్పన్న సుబ్బారెడ్డికి నమ్మినబంటని..

చిన్నప్పన్న లంచం అడిగాడని భోలేబాబా డెయిరీ డైరెక్టర్ ఫిర్యాదు చేసినా సుబ్బారెడ్డి పట్టించుకోలేదని..

నెయ్యిలో కల్తీ జరిగిందని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్ ఇచ్చిన నివేదికను ఆయన తొక్కిపట్టారని..

కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని తెలినా భోలేబాబా నుంచి నెయ్యి కొనుగోలును అడ్డుకోలేదని..

ఇలా కళ్ల ముందు ఎన్ని దృష్టాంతాలు కనిపిస్తున్నా ఈ కుంభకోణంపై దర్యాప్తు జరిపిన సిట్ మాత్రం సుబ్బారెడ్డిని వదిలేసినట్టే కనిపిస్తోంది. కల్తీ నెయ్యి కేసులో సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉందని, ఆయన బ్యాంకు ఖాతాలు పరిశీలించేందుకు అనుమతివ్వాలని కోర్టును కోరిన సిట్... వాటిని చూడకుండానే దర్యాప్తు ముగించేయడం, సుబ్బారెడ్డిని నిందితుల జాబితాలో చేర్చకపోవడం చూస్తుంటే ఆయనను కాపాడటమే లక్ష్యంగా సిట్ దర్యాప్తు సాగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కూడా తన నివేదికలో.. 'నెయ్యి నమూనాల్ని నాణ్యత పరీక్షల కోసం పంపించాలని ఆదేశించిన సుబ్బారెడ్డిపైనే వాటి ఫలితాలు ఏమయ్యాయో తెలుసుకోవాల్సిన బాధ్యత, విధి ఉంది' అని మాత్రమే ప్రస్తావించింది.

బ్యాంక్ స్టేట్‌మెంట్ చూడకుండానే...

కల్తీ నెయ్యి సరఫరా కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని యాక్సిస్ బ్యాంక్ శాఖలో వైవీ సుబ్బారెడ్డి, ఆయన భార్య స్వర్ణలతారెడ్డి పేరిట ఉన్న బ్యాంకు ఖాతాల లావాదేవీల వివరాలివ్వాలంటూ బ్యాంక్ మేనేజర్‌కు సిట్ అధికారులు గత ఏడాది అక్టోబరులో నోటీసులిచ్చారు. వాటిని సవాల్ చేస్తూ సుబ్బారెడ్డి దంపతులు హైకోర్టులో పిటిషన్ వేశారు. అప్పటికే తీసుకున్న వివరాలతో దర్యాప్తు కొనసాగించొచ్చని, తదుపరి ఉత్తర్వులిచ్చే వరకూ బ్యాంక్ నుంచి మిగతా వివరాలు తీసుకోవద్దంటూ సిట్‌ను కోర్టు ఆదేశించింది. 'కల్తీ నెయ్యి కేసులో సుబ్బారెడ్డి పాత్ర అనుమానాస్పదంగా ఉంది. దర్యాప్తును కొలిక్కి తెచ్చేందుకే సుబ్బారెడ్డి, స్వర్ణలతారెడ్డిల బ్యాంకు లావాదేవీల వివరాలు కోరుతున్నాం. నేర ఘటనతో బ్యాంకు లావాదేవీలు ముడిపడి ఉన్నట్లు అనుమానం వస్తే ఆ ఖాతాను పరిశీలించే అధికారం దర్యాప్తు అధికారికి ఉంటుంది. అందువల్ల సుబ్బారెడ్డి దంపతుల పిటిషన్ కొట్టేయాలి' అని సిట్ కౌంటర్ వేసింది. ఇంతా చేసి.. చివరికి ఆ బ్యాంకు ఖాతాల లావాదేవీలేవీ పరిశీలించకుండానే, వాటి ప్రస్తావన లేకుండానే దర్యాప్తును ముగించేసింది. తుది అభియోగపత్రమూ దాఖలు చేసేసింది. ఇది అసలు సూత్రధారిని తప్పించేందుకేనన్న విమర్శలు వస్తున్నాయి.



టెండరు నిబంధనలు నీరుగార్చినా చర్యలేవి?

2019 ఆగస్టులో తితిదే నెయ్యి కొనుగోళ్ల టెండర్ నిబంధనల్ని పటిష్ఠపరుస్తూ అప్పటి ఈవో ఉత్తర్వులిస్తే, ప్రైవేటు డెయిరీలకు మేలు చేసేందుకు నాలుగు నెలలకే వాటిని సడలిస్తూ తితిదే పాలకమండలి నిర్ణయం తీసుకుంది. ఆ తీర్మానంపై అప్పటి ఛైర్మన్ సుబ్బారెడ్డి, ఒక డిప్యూటీ ఈవో సంతకాలు మాత్రమే ఉన్నాయి. ప్రీమియర్ అగ్రిఫుడ్స్ సంస్థకు 35 వేల కిలోల నెయ్యి సరఫరాకు కొనుగోలు కమిటీ ఇచ్చిన సప్లై ఆర్డర్‌కి ఆమోదం తెలుపుతూ, దానికిందే ఈ తీర్మానం కూడా రాసేసి సంతకాలు పెట్టేశారు. కోట్ల రూపాయల కల్తీ నెయ్యి కుంభకోణానికి మూలమే ఈ తీర్మానం. కానీ నిబంధనలు ఎందుకు సడలించారో తనకు తెలియదని, నాణ్యత పెంచేందుకే నిబంధనలు సడలించినట్టు అధికారులు చెప్పారని సుబ్బారెడ్డి చిలకపలుకులు పలుకుతున్నారు. టెండర్ నిబంధనలు సడలించాలన్నది బోర్డు సమష్టి నిర్ణయమా, ఏకపక్షంగా తీర్మానం రాసేసి ఛైర్మన్ సంతకం పెట్టేశారా వంటి సందేహాలూ ఉన్నాయి.

సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక తొక్కి పెట్టడం నేరం కాదా?

నెయ్యి నమూనాలను పరీక్షల కోసం సీఎఫ్‌టీఆర్ఐకి పంపాలని ఆదేశించిన సుబ్బారెడ్డికి.. ఫలితాలు ఎలా వచ్చాయో తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా? సీఎఫ్‌టీఆర్ఐ నివేదికను తొక్కిపెట్టడం నేరం కాదా? కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని పరీక్షల్లో నిర్ధారణైన తర్వాత కూడా భోలేబాబా డెయిరీకి కిలో రూ.329 చొప్పున 1.07 లక్షల కిలోలు సరఫరా చేసేందుకు 2022 ఆగస్టు 29న ఆర్డరు ఇవ్వటం, దాని ప్రకారం 2022 అక్టోబరు 28 వరకూ భోలేబాబా డెయిరీ నెయ్యి సరఫరా చేయటం వాస్తవం కాదా? ప్రీమియర్ అగ్రి ఫుడ్స్, వైష్ణవి డెయిరీలు 2024 వరకూ సరఫరాదారులుగా కొనసాగటానికి కారకులెవరు? ఇవన్నీ సుబ్బారెడ్డికి తెలియకుండానే జరిగాయా? మరి ఆయనపై చర్యలేవి?

చిన్నప్పన్న నిందితుడైతే.. ఆయన వెనుకున్న సుబ్బారెడ్డి ఎందుకు కాదు?

◆ కల్తీ నెయ్యి కుంభకోణం కేసులో కీలక నిందితుడైన కదురు చిన్నప్పన్న కేవలం సుబ్బారెడ్డికి పీఏ మాత్రమే కాదు. ఆయన కుటుంబానికి నమ్మిన బంటు. దిల్లీలోని ఏపీ భవన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా జీతం తీసుకుంటూ.. ఛైర్మన్ తరఫున తితిదేలో వ్యవహారాలు చక్కబెట్టేవాడు. నెయ్యి కుంభకోణంలో చిన్నప్పన్న కీలకపాత్ర పోషించినట్టు నిర్ధారించిన సిట్, అతను లంచాల రూపంలో తీసుకున్న డబ్బు ఎవరికి వెళ్లిందో ఎందుకు తేల్చలేదు?

◆ చిన్నప్పన్నకు 2019 జనవరి నుంచి నుంచి 2024 జూన్ మధ్య వేతనం ద్వారా వచ్చిన ఆదాయం రూ.65 లక్షలు. కానీ దిల్లీలోని ఏపీ భవన్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో చిన్నప్పన్న ఖాతాలో ఐదేళ్లలో ఏకంగా రూ.4.69 కోట్లు జమైంది. దానిలో రూ.4.64 కోట్లు వివిధ ఖాతాలకు మళ్లించేశారు. అవి ఎవరివో తేల్చాలి కదా?

◆ సుబ్బారెడ్డికి తెలియకుండా ఒక సాధారణ ఉద్యోగి... భోలేబాబా డెయిరీ ప్రతినిధుల్ని దిల్లీ పిలిపించి కిలోకి రూ.25 చొప్పున లంచం అడగ్గలడా? ప్రీమియర్ డెయిరీ నుంచి రూ.50 లక్షలు లంచం తీసుకోగలడా? సిట్ వీటిని కావాలనే విస్మరించిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కల్తీ నెయ్యి సరఫరాకు చెవిరెడ్డి, భూమనలూ కారకులే

(మొదటి పేజీ తరువాయి)

సిఫార్సు చేశారు. తితిదేకి నెయ్యి సరఫరా చేయాలనుకునే డెయిరీలను రెండేళ్ల పాటు ఎంప్యానల్ చేయాలని టెండరు నిబంధనల సవరణ కోసం ఏర్పాటైన కమిటీ సూచించినా దాన్ని బేఖాతరు చేశారు. తగిన కారణం లేకుండానే ఆ సూచనను తిరస్కరించారు. కొనుగోలు కమిటీకి కన్వీనరైన తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం జనరల్ మేనేజర్, టెండరు నిబంధనల సవరణ కోసం ఏర్పాటైన కమిటీ కన్వీనర్, సభ్యులు ఎవరూ హాజరు కాకున్నా.. చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, ఆర్థిక సలహాదారు ఓ.బాలాజీ, మరో సభ్యుడు ఎం.రాములు సమావేశమై.. టెండర్ల నిబంధనల సడలింపు సిఫార్సులకు ఏకపక్షంగా ఆమోదం తెలిపేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో ఈ వివరాలన్నీ పేర్కొంది. దీన్నిబట్టి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డిల నిర్ణయం వల్లే... తితిదేలోకి కల్తీనెయ్యి సరఫరా సంస్థలు చొరబడడానికి, ఏళ్లపాటు కల్తీనెయ్యి సరఫరా చేయడానికి అవకాశం ఏర్పడిందని స్పష్టమవుతోంది. కల్తీనెయ్యి సరఫరాకు చెవిరెడ్డి, భూమనల నిర్ణయాలు ఎలా కారణమయ్యాయో నివేదికలో వెల్లడించిన ఏకసభ్య కమిషన్.. వారిపై చర్యలకు మాత్రం సిఫార్సు చేయలేదు.

అంత తక్కువ ధరకు నెయ్యి సరఫరా సాధ్యమేనా?

అసాధారణం అనిపించేంత తక్కువ ధరలకు నెయ్యి సరఫరా చేస్తామంటూ కొన్ని డెయిరీలు బిడ్‌లు దాఖలు చేయగా... అసలంత తక్కువ ధరకు నెయ్యి సరఫరా సాధ్యమేనా? అనే కనీస అనుమానాలైనా వ్యక్తం చేయకుండా ఆ బిడ్‌లను కొనుగోలు కమిటీ గుడ్డిగా ఆమోదించేసింది. నాణ్యతను కాపాడటంలో విఫలమైంది. దానివల్లే ఆయా సంస్థలు తితిదేకు కల్తీనెయ్యి సరఫరా చేయగలిగాయి. నెయ్యి కొనుగోళ్ల టెండర్లలో రివర్స్ ఆక్షన్‌లో ఎల్1గా నిర్ణయించిన ధరను... సదరు డెయిరీ ఆ తర్వాత ఒక లేఖ ద్వారా తగ్గించినప్పుడూ కొనుగోలు కమిటీ కాంట్రాక్ట్ ఖరారు చేయాలని సిఫార్సు చేసేది. ఇలా సంప్రదింపులతో చేయడం టెండర్ నిబంధనలకు విరుద్ధం. అయినా కమిటీ పట్టించుకోలేదు. టెండర్ నిబంధనల్ని పక్కాగా అమలు చేయడంలోనూ విఫలమైంది. అసలు కల్తీనెయ్యి సరఫరాకు అనువైన పరిస్థితులన్నింటినీ కొనుగోలు కమిటీయే సృష్టించింది. తితిదేకి నాణ్యమైన సరకులు సరఫరా జరిగేలా చూడటంలో కీలకం, నిర్ణయాత్మకమైన కొనుగోలు కమిటీ.. దానికి తూట్లు పొడిచేలా వ్యవహరించింది. తితిదేకి కల్తీనెయ్యి సరఫరా, వినియోగం కేవలం సరఫరాదారుల తప్పిదమే కాదు. కొనుగోలు నిబంధనల రూపకల్పన, మదింపు దశలో పరిపాలనాపరమైన వైఫల్యమేనని ఏకసభ్య కమిషన్ నివేదికలో స్పష్టం చేసింది.

రక్తమోడుతూ నేలపై పడినా.. పట్టించుకోని ఆసుపత్రి సిబ్బంది!

- కత్తిపోట్లకు గురైన వ్యక్తికి సకాలంలో చికిత్స అందని వైనం
- రాజోలు ప్రభుత్వాసుపత్రిలో ఘటన

రాజోలు, మలికిపురం, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చేరిన వ్యక్తి రక్తమోడుతూ నేలపై పడినా వైద్య సిబ్బంది పట్టించుకోలేదు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సఖినేటిపల్లి మండలం రామేశ్వరంలో దంపతులు పోలినాటి రాజు, విజయకుమారి నివసిస్తున్నారు. దివ్యాంగురాలైన విజయకుమారిని కొద్ది రోజులుగా రాజు హింసిస్తున్నాడు. దీంతో విజయకుమారిని ఆమె సోదరుడు బండారు నాగరాజు పుట్టింటికి తీసుకువెళ్లారు. ఈ విషయంపై శుక్రవారం రాత్రి గుడిమెళ్లంకలోని బావమరిది ఇంటికి వెళ్లిన రాజు.. అక్కడి బైక్‌ను తగలబెడతానంటూ హడావిడి చేశాడు. ఆగ్రహం చెందిన నాగరాజు రాజుపై కత్తితో దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. అక్కడి సిబ్బంది రెండు గంటల పాటు పట్టించుకోలేదు. ఈ క్రమంలో క్షతగాత్రుడు బెడ్‌పై నుంచి కిందపడిపోయాడు. దివ్యాంగురాలైన భార్య ఆయన్ను లేపేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. రెండు గంటల తర్వాత బాధితుడి ఆరోగ్యం విషమంగా ఉండటంతో వైద్య సిబ్బంది కుట్లు వేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తీసుకెళ్లమని ఆయన భార్యకు సూచించారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కలెక్టర్ మహేష్ కుమార్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దయానాను వివరణ కోరారు. సిబ్బంది సక్రమంగానే విధులు నిర్వర్తిస్తున్నారని, ఘటనపై పరిశీలన చేస్తున్నామని దయానా వివరణ ఇచ్చారు. కాగా తనపై దాడిచేసిన నాగరాజుపై రాజు ఫిర్యాదు చేయడంతో హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మలికిపురం ఎస్సై పి.సురేశ్ తెలిపారు.



రాజోలు ప్రభుత్వ ఆసుపత్రిలో నేలపైన రక్తమోడుతున్న రాజు

నియోజకవర్గం మొత్తం రీపోలింగ్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ఫల్టా నియోజకవర్గంపై ఎన్నికల సంఘం (ఈసీ) అసాధారణ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గం మొత్తం రీపోలింగ్ నిర్వహించాలని శనివారం నిర్ణయించింది. ఫల్టాలోని మొత్తం 285 కేంద్రాల్లో ఈ నెల 21న రీపోలింగ్ జరగనుంది. అక్కడ 24వ తేదీన కౌంటింగ్ జరుగుతుంది. మిగిలిన 293 నియోజకవర్గాల్లో సోమవారం కౌంటింగ్ జరగనుంది. ఫల్టాలో ఈ నెల 29వ తేదీన రెండో విడతలో భాగంగా పోలింగ్ జరిగింది. ఎన్నికల ఫలితాల వెల్లడి అనంతరం తమకు భద్రత కల్పించాలని డిమాండు చేస్తూ దక్షిణ 24 పరగణాల జిల్లాలోని ఫల్టా నియోజకవర్గంలో శనివారం వందల మంది స్థానికులు ఆందోళనకు దిగారు. ఫల్టా, హసీం నగర్‌లలో ఆందోళనలు జరిగాయి. ఆందోళనకారుల్లో ఎక్కువ మంది మహిళలున్నారు. వారిలో చాలా మంది వద్ద భాజపా జెండాలున్నాయి. వారంతా హసీం నగర్‌లో 7 గంటలపాటు రోడ్డును దిగ్బంధించారు. తృణమూల్ కార్యకర్తల నుంచి ప్రాణ హాని ఉందని ఆరోపించారు. తృణమూల్ అభ్యర్థి జహంగీర్ ఖాన్‌కు అనుచరుడైన గ్రామ పంచాయతీ ప్రధాన్ ఇస్రాఫిల్ తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఏప్రిల్ 30 నుంచి ఆయన తమ ప్రాంతంలో తిరుగుతున్నారని, మే 5వ తేదీ తర్వాత రక్తపాతం జరుగుతుందని హెచ్చరిస్తున్నారని భాజపా మహిళా మోర్చా నేత ఫాతిమా బీబీ తెలిపారు. రీపోలింగ్ నిర్వహించాలని మరో ఆందోళనకారుడు డిమాండు చేశారు. దీనిపై ఈసీకి ఫిర్యాదు చేశామని, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందని వెల్లడించారు. ఈ హైడ్రామా కొనసాగుతుండగానే ఈసీ రీపోలింగ్‌పై అసాధారణ నిర్ణయం తీసుకుంది. స్థానికుల ఆందోళనల నేపథ్యంలో భారీ బలగాలతో, సాయుధ వాహనాలతో సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఫల్టా ప్రాంతాన్ని సందర్శించారు. భద్రతకు హామీ ఇచ్చారు. దీంతో రాత్రి 7 గంటల సమయంలో ఆందోళనకారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ఫల్టాలో స్థానికుల ఆందోళనతో వచ్చిన సీఆర్పీఎఫ్ బలగాలు

ఫల్టాలో ప్రజాస్వామ్య ప్రక్రియ విధ్వంసమైందని ఎన్నికల సంఘం అధికార ప్రతినిధి ఒకరు వ్యాఖ్యానించారు. 'ప్రజాస్వామ్య ప్రక్రియ విధ్వంసాన్ని, తీవ్రమైన ఎన్నికల నేరాలను పరిగణనలోకి తీసుకుని ఫల్టాలోని అన్ని కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించాం. 21న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రీపోలింగ్ జరగనుంది. ఈ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 24న చేపడతాం' అని తెలిపారు.

◆ ఒక నియోజకవర్గం మొత్తం రీపోలింగ్‌కు ఆదేశించడం ఎన్నికల సంఘం చరిత్రలో అత్యంత అరుదు.

బహు సంతాన ప్రాప్తిరస్తు

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రణకు స్వస్తి..: జనాభా నియంత్రణ విధానాలకు స్వస్తి పలికి.. జనాభా సంరక్షణ దిశగా దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీ4 మోడల్‌లో హక్కుల ఆధారిత విధానం తెచ్చి, కుటుంబాల హక్కులను గౌరవిస్తూ.. సమగ్ర జనాభా సంక్షేమాన్ని ప్రోత్సహించనుంది. పిల్లల పెంపకానికి ఎక్కువ ఖర్చవుతుందని ప్రణాళిక విభాగం సర్వేలో వెల్లడించిన 53.7% ప్రజల సమస్యలను తగ్గించడంపై దృష్టి సారించనుంది.

సంక్షేమం, అభివృద్ధి ప్రణాళికలివీ..

◆ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1కి పెంచడం లక్ష్యం ◆ ఏటా 50 వేల జంటలకు ఉచితంగా ఐవీఎఫ్ సౌకర్యం కల్పిస్తారు ◆ కు.ని. శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం తగ్గిస్తారు ◆ అందరికీ 100% డిజిటల్ ఆరోగ్య సేవలు చేరువ చేస్తారు ◆ ఈ ఏడాది జూన్ నాటికి 5.2 కోట్ల మందిని ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) పరిధిలోకి తేనున్నారు ◆ మహిళా కార్మికశక్తి భాగస్వామ్యాన్ని 25% పెంచేందుకు కృషి చేస్తారు ◆ శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, 12 నెలల పాటు తల్లిదండ్రుల ప్రసూతి సెలవుల పైలట్ ప్రాజెక్టు అమలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం చేపడతారు ◆ అన్ని జిల్లాల్లో వృద్ధుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు ◆ ఇతరులపై ఆధారపడే వారి నిష్పత్తి పెరగకుండా చూస్తారు ◆ జీవితకాల నైపుణ్యం లక్ష్యంగా 80% ఉద్యోగ నియామక రేటు సాధించడంపై దృష్టి పెడతారు ◆ స్టేట్ స్కిల్ అబ్జర్వేటరీ ద్వారా ఏటా 10 వేల మంది సంరక్షణ రంగ (కేర్ ఎకానమీ) కార్మికులకు శిక్షణ కల్పిస్తారు.

పెంచిన వాణిజ్య గ్యాస్ ధరలను తగ్గించాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: ఓట్ల కోసం వేషం కట్టడం, ఎన్నికలు ముగిశాక జనాల నెత్తిన భారం మోపడం ప్రధాని మోదీకి వెన్నతో పెట్టిన విద్యని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తరువాత 'బండ బాదుడు' దేశ ప్రజలకు కేంద్రం ఇచ్చిన అతిపెద్ద బహుమతని శనివారం ఓ ప్రకటనలో ఆమె మండిపడ్డారు. 'వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ.993 పెంచిన ఘనత మోదీకే దక్కుతుంది. పెంచిన ధరతో టీ స్టాళ్లు, మినీ హోటళ్లు, ఇతర చిన్న వ్యాపారుల జీవితాలు అగమ్య గోచరంగా మారాయి. కేంద్రం స్పందించి పెంచిన ధరను తగ్గించాలి' అని డిమాండ్ చేశారు.

గ్రహం అనుగ్రహం

3-5-2026 ఆదివారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళ పక్షం

విదియ: రా. 12-49 తదుపరి తదియ

అనూరాధ: పూర్తి

వర్జ్యం: ఉ. 10-01 నుంచి 11-47 వరకు

అమృత ఘడియలు: రా. 8-36 నుంచి 10-22 వరకు

దుర్ముహూర్తం: సా. 4-33 నుంచి 5-24 వరకు

రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు

సూర్యోదయం: ఉ.5.37; సూర్యాస్తమయం: సా.6.15

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నిజామాబాద్	44.0	29.7
అనంతపురం	43.0	28.5
కర్నూలు	42.5	29.6
కడప	42.2	28.0
నెల్లూరు	42.0	30.2
హైదరాబాద్	41.5	29.1
రాజమహేంద్రవరం	41.5	27.0
ఒంగోలు	40.7	29.4
తిరుపతి	40.5	29.5
గుంటూరు	40.0	32.0
విజయవాడ	39.6	30.2
నరసాపురం	36.0	29.5
తాడేపల్లిగూడెం	36.0	29.0
శ్రీకాకుళం	36.0	28.0
విశాఖపట్నం	33.6	24.0
విజయనగరం	32.0	15.0

ఇదీ సంగతి!




ఈనాడు

ఏది ఆనందం?

మోహావేశంతో హఠాత్తుగా ఆలింగనం చేసుకోబోయిన వరూధిని ఆపిందామె. 'నన్ను అందుకోవాలంటే నువ్వింకా బాగా ఎదగాలి' అంది- వాత్సల్యంతో జుత్తు నిమురుతూ! గాలి నాసరరెడ్డి కవితలోని 'ఆమె'ను బతుకుపై అన్వయిస్తే- తన పేరు 'జీవితానందం' అవుతుంది. అది ఎలా దొరుకుతుందనేది- పెద్ద ప్రశ్న. 'డబ్బుంటే!' అనిపిస్తుంది చాలామందికి. కానీ 'చేతినిండా డబ్బుంటే ఆనందం మనవెంటే- అని ఎవరైనా అనుకుంటే, పెద్ద పొరబాటు ఉండదు- అంతకంటే!' అన్నారు ప్రపంచ కుబేరుడు స్టీవ్ జాబ్స్. 'జీవితానందాన్ని వెతుక్కోవాల్సింది డబ్బుకు ఆవల వేరే గొప్ప ప్రపంచంలో' అన్నారాయన. బాల్యంలో తొలిసారి కొన్న ర్యాలీ సైకిల్ ఇచ్చినంత ఆనందం- బాగా సంపాదించాక కొన్న ఆరో కొత్తకారు ఇవ్వలేదని అనుభవంలో తెలుస్తుంది. దీన్ని 'క్షీణోపాంత ప్రయోజన (లా ఆఫ్ డిమినిషింగ్ మార్జినల్ యుటిలిటీ) సూత్రం' అంటుంది అర్థశాస్త్రం. ఒకటో యాపిల్ పండు ఎంతో రుచిగా అనిపించినా, ఆరోదో, ఏడోదో వెగటుగా తోచడాన్ని ఆ సూత్రానికి ఉదాహరణగా చెబుతుంది. పోనీ 'సంసార సుఖానుభూతి- జీవిత పరమావధి' అనుకుంటే- 'వివరికి అదీ రోతే' అన్నాడు 'కాయల్గాచె'... పద్యంలో- సుఖభోగాలెరిగిన ధూర్జటి మహాకవి.

'మేడలా మిద్దెలా మడచుట్టేసుగులా... నీ ఆనందం కోసం ఏంకావాలన్నా ఇచ్చేస్తాను' అంటూ ముందుకొచ్చాడు బలిచక్రవర్తి. నవ్వాడు వామనుడు. 'మూడడుగుల మేరయు త్రోవకిచ్చుటయు బ్రహ్మాండంబు నా పాలికిన్' అన్నాడు- భాగవతంలో! అది నిజం. 'నాకిది చాలు' అన్న ఎరుకే ఆనందానికి సరైన రహదారి. కార్తవీర్యార్జునుడు భారీ పరివారంతో ఆశ్రమానికి రాగానే- జమదగ్ని మహర్షి 'సుశీల' అనే తన కామధేనువు సాయంతో వారందరికీ అందించిన బ్రహ్మాండమైన విందు గురించి భాగవతం చెప్పింది. విశ్వామిత్రుడికి, ఆయన సైన్యానికి క్షణాల్లో భోజన సదుపాయాలు అమర్చిన వశిష్ఠముని గోవు 'శబల' సంగతి రామాయణంలోది. అంటే, విందులు వినోదాలు రాజభోగాలు మహర్షులకు తెలియనివేమీ కావు. తమ కోసం ఏదైనా సృష్టించగల కామధేనువులే అడవుల్లో ఉన్నా- కామాలను అదుపుచేసి, కందమూలాలతో తృప్తిపడ్డారు. 'ఫల రసాదులు కురియవే- పాదపములు(చెట్లు) స్వాదు జలములు నుండవే- సకల నదులు... ప్రకృతి ఇచ్చేవి చాలు' అనుకుని తృప్తిగా జీవించారు- పోతన 'బాలరసాలసాల'... పద్యానికి తాత్పర్యాలు!

కాబట్టి జీవితానందం చిరునామా- తృప్తిలో ఉందని తెలుస్తోంది. హృద్యం అంటే హృదయాన్ని ఆకర్షించేది, గుండె లోతులను తాకేదని అర్థం. మహాభారతంలోని 'ఏయది హృద్యము! ఏయది వినిన ఎరుక సమగ్రంబై యుండు?' అన్న శౌనకాది మహర్షుల ప్రశ్నలో ఎరుక పదం చాలా కీలకం. ఆనందంగా జీవించడానికి కావాల్సిందేమిటో తెలియడమే 'ఎరుక' అంటే. ఆనందం 'కోసం' సంపాదించడానికి, ఆనందం'గా' సంపాదించడానికి మధ్య తేడా తెలియడమే ఎరుక అంటే. నెలకు లక్షలాది రూపాయల జీతాన్నిచ్చే పెద్ద కార్పొరేట్ ఉద్యోగాన్ని వదులుకున్న రాకేష్ అనే విద్యాధికుడు బెంగళూరులో ఆటో తోలుకుంటున్నాడు. 'నాకు ఇదే మనశ్శాంతిని ఇస్తోంది' అంటున్నాడు. 'జీవితానందానికి అదే మూలం' అనేది ఆయన ఎరుక! ఆ ఎరుకే నిశ్చలానందం- ఆయనపాలిట. 'నాకు మనశ్శాంతి కావాలి' అని కోరాడో సాధకుడు. 'నీ ప్రశ్నలోని మొదటి, చివరి పదాలు రెండింటినీ వదిలేసి చూడు' అన్నాడు సాధువు. చాలా గొప్ప మాట అది. రాకేష్‌కు తెలిసింది- తాను స్వేచ్ఛగా తృప్తిగా ఆనందం'గా' బతకడానికి అవసరమైన ఇంధనం- ధనం కాదని! సంపాదించిన దానిలోకన్నా, వదిలించుకున్న వాటిలోనే నిజమైన మనిషి మనకు దొరుకుతాడు!



ప్రతి ఉదయాన్నీ కొత్తగా చూడండి. దాన్ని చూడకుండా వెళ్లిపోయిన వారెందరో ఉంటారు. చూస్తున్నామూ అంటే మనం అదృష్టవంతులమే. ఆ అదృష్టాన్ని ఆస్వాదించడమే జీవితం.

– రవీంద్రనాథ్ టాగోర్

పరీక్షా సమయాలు

ప్రతి మనిషికీ జీవితాంతం పరీక్షా సమయాలు ఎదురవుతూనే ఉంటాయి. మన సహనాన్ని పరిశీలించేందుకు కాలం పరీక్షలు పెడుతూనే ఉంటుంది. ఎరుకతో, ఎంతో జాగ్రత్తతో ఆ దశను దాటాలి. ధ్యానం, ప్రార్థనలతో భగవంతుడికి దగ్గరగా ఉండాలి. ఆత్మవిశ్వాసం పెంచమని, కష్టం నుంచి గట్టెక్కించమని నిరంతరం ఆ దైవాన్ని వేడుకోవాలి. ఆధ్యాత్మిక గ్రంథపఠనం చేయాలి. మౌనంగా ఉంటూ మనసు చెప్పేది వినడానికి ప్రయత్నించాలి. వీలైనంతవరకూ ఒంటరితనాన్ని వీడి సజ్జనుల సాంగత్యంతో ముందుకెళ్లాలి.

భూదాన ఉద్యమ నేత వినోబా భావేకి బాల్యంలో భయం ఎన్నో పరీక్షలు పెట్టింది. గోడమీద నీడను చూసి ఎంతో భయపడి పోయేవారట ఆయన. ఒక రోజు అలాగే భయంకరమైన నీడను చూసి పరుగు పరుగున వెళ్లి అమ్మ ఒడిలోకి చేరారు. ఆ నీడ మన బానిస లాంటిదని, మనం ఏం చేస్తే అది కూడా అదే పని చేస్తుందని, భయం అనేది బయట ఉండదని, మనలోనే ఉంటుందని తల్లి ఆయనకు ధైర్యం నూరి పోసింది. హేతుబద్ధమైన ఆలోచనలతో సకల భయాలను తరిమి వేయవచ్చుననే గొప్ప పాఠాన్ని అమ్మ దగ్గరే నేర్చుకున్నారు వినోబా భావే.



అంతర్యామి

మన జీవితాల్లోనే కాదు.. ఎంతోమంది మహా పురుషులు తమ తమ జీవన గమనంలో ఎన్నో ఒడుదొడుకులకు లోనయ్యారు. సత్య హరిశ్చంద్రుడంతటి వాడు కాటి కాపరిగా జీవనం సాగించాడు. గొప్ప దానశీలిగా పేరుగాంచిన బలి ఏకంగా పాతాళానికి వెళ్లిపోవాల్సి వచ్చింది. కురుక్షేత్ర యుద్ధం కౌరవ, పాండవులకు పద్దెనిమిది రోజుల మహా పరీక్షే అయ్యింది. దుర్యోధనుడు సోదరులతో సహా మరణించాడు. స్వచ్ఛంద మరణ వరం కలిగిన భీష్ముడి లాంటి మహాయోధుడు నిస్సహాయంగా కూలిపోయాడు. ఇంతకన్నా పెద్ద పరీక్ష ఉంటుందా? మరణభయంతో విలవిల్లాడుతున్న పరీక్షిత్తుకు భాగవతం బోధించి ఊరట కలిగించాడు శుకుడు. అంత్యకాలంలో అది వింటూ అతడు మోక్షం పొందాడు. అవతార పురుషులకైనా పరీక్షలు తప్పవు.

ఇలాంటి సమయాల్లోనే దర్మంగా, ధైర్యంగా ఉండాలి. వచ్చిన కష్టాలను పరీక్షలుగా భావించి వాటి ద్వారా ఎన్నో పాఠాలు నేర్చుకోవాలి. వివేకాన్ని, విజ్ఞానాన్ని సంపాదించుకోవడానికి సమయాన్ని వెచ్చించుకోవాలి. వివేకం ఉన్నచోటే ఆనందం ఉంటుంది. అప్పుడే మనిషి వివేకానందుడిగా మారతాడు. పెనుగాలికి సైతం చెక్కు చెదరని పర్వతంలా నిలిచేలా గుండెకు శిక్షణ ఇవ్వాలి. భగవంతుడి మీద అపారమైన నమ్మకం ఉంచి, ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి. ఓటమి ఎదురైనప్పుడు దానికి కారణాలేంటో సమీక్షించుకోవాలి. తమ తమ మార్గాలను నైతిక దిశలోకి మార్చుకోవాలి. పరాజయానికి దారితీసిన పరిస్థితుల గురించి పునరాలోచించుకుని కొత్త వ్యూహాలను ఆశ్రయించాలి. 'నేను గెలిచి తీరుతాను లేదా నేర్చుకుంటాను' అని చెప్పేవారు దక్షిణాఫ్రికా నేత నెల్సన్ మండేలా. పరీక్షా సమయాలను రైలు పట్టాలుగా చేసుకుని బతుకు బండిని నిరాటంకంగా ముందుకు నడిపించడమే మనిషి కర్తవ్యం.

– భమిడిపాటి వెంకటేశ్వరరావు

మాయదారి రివ్యూలు!



ప్రస్తుత అంతర్జాల ప్రపంచం మనకు తెలియకుండానే మనకొక కొత్త అలవాటు నేర్పింది. ఏ వస్తువు కొనాలన్నా, సినిమా చూడాలన్నా, హోటల్‌కు వెళ్లాలన్నా మనం ముందుగా చూసేది రివ్యూలనే. ఒకప్పుడు ఇలాంటి నిర్ణయాలు వ్యక్తుల అనుభవాలు, సంభాషణల ఆధారంగా ఉండేవి. స్నేహితులు, బంధువుల మాటలే మార్గదర్శకాలుగా ఉపయోగపడేవి. ఇప్పుడు ఆ పని సెల్‌ఫోన్ చేస్తోంది. నిమిషాల్లో వందల రివ్యూలను ముందుంచుతోంది. కానీ, ఆ రివ్యూల్లో నిజం నేతిబీరచందమవుతోంది.



కొన్నేళ్ల క్రితందాకా రివ్యూలు అంటే వాస్తవిక అనుభవాలకు ప్రతిబింబాలు. ఒకరు హోటల్‌కు వెళ్లి మంచి అనుభవాన్ని పొందితేనే ప్రశంసించేవారు. సేవలు బాగాలేకపోతే విమర్శించేవారు. ఆ అభిప్రాయాల్లో నిజాయతీ ఉండేది. వాటికి విలువ ఉండేది. చదివే వారికి నమ్మకం కలిగించేవి. ఆన్‌లైన్ ప్రపంచంలోనూ మొదట్లో ఇదే పద్ధతి కొనసాగింది. రివ్యూల సంఖ్య పెరిగిన కొద్దీ నాణ్యత కొరవడింది. ఇప్పుడు ప్రతి ఉత్పత్తి కింద వందల సంఖ్యలో అయిదు తారల రివ్యూలు కనిపిస్తున్నాయి. మరోచోట అదే ఉత్పత్తిపై తీవ్ర విమర్శలు కూడా ఉంటాయి. ఏది నిజమో అర్థంకాక వినియోగదారులు అయోమయంలో పడుతున్నారు. పరిస్థితి వ్యక్తిగత సందేహం స్థాయిని దాటేసి వ్యవస్థాపరమైన సమస్యగా మారింది.



గణనీయంగా నకిలీలు

ప్రపంచవ్యాప్తంగా జరిగిన పరిశోధనలు ఒక ఆందోళనకర వాస్తవాన్ని చెబుతున్నాయి. ఆన్‌లైన్‌లో కనిపించే రివ్యూలలో గణనీయంగా నకిలీవేననే అనుమానాలున్నాయి. కొన్ని అధ్యయనాలు మూడింట ఒకటోవంతు రివ్యూలు నమ్మదగినవి కాకపోవచ్చని సూచిస్తున్నాయి. వినియోగదారుల్లో అధికశాతం తమ జీవితంలో ఒక్కసారైనా నకిలీల బారినపడినట్లు చెబుతున్నారు. సాంకేతికతను దుర్వినియోగం చేయడమే ఇందుకు కారణం. కృత్రిమ మేధస్సు, ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌లు, బోట్లు కొన్ని సెకన్లలోనే వందలాది రివ్యూలను సృష్టించగలుగుతున్నాయి. అవి చదివితే నిజమైన మనుషులు రాసినట్టే అనిపిస్తాయి. కానీ వాటి వెనక ఎలాంటి అనుభవం ఉండదు. కేవలం మార్కెటింగ్ లక్ష్యమే ఉంటుంది. కొన్ని సంస్థలు తమ ఉత్పత్తులను మెరుగ్గా చూపించేందుకు నకిలీ రివ్యూలను సృష్టిస్తుంటే, మరికొన్ని పోటీదారు ఉత్పత్తులపై నకిలీ, చెడు అభిప్రాయాలను ప్రచారం చేస్తున్నాయి. వినియోగదారుడి నిర్ణయాలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ఒక మంచి వస్తువు కూడా నకిలీ, ప్రతికూల రివ్యూల వల్ల అమ్మకాల రేసులో వెనకంజ వేసే ముప్పుంది. నాణ్యత లేని ఉత్పత్తి నకిలీ ప్రశంసలతో ముందుకు రావచ్చు. దీనివల్ల వస్తు సేవలపై పారదర్శకత తగ్గిపోతుంది. నిజమైన రివ్యూ, నకిలీల మధ్య తేడాను గుర్తించడంలో మనుషుల్లో కచ్చితత్వం చాలా తక్కువగా ఉందని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. అంటే మనం చదివే ప్రతి రివ్యూపై అనుమానం నెలకొనే పరిస్థితి ఉంటోంది.

ఇదంతా వ్యాపార రంగానికే పరిమితం కాలేదు. సినిమా, పర్యటనలు, విద్యాసంస్థలు, ఉద్యోగ అవకాశాలు తదితర రంగాల్లోనూ రివ్యూల ప్రభావం విస్తృతంగా పెరిగింది. మంచి రివ్యూ ఒక సంస్థను పైకి తీసుకెళ్లగలదు. నకిలీ లేదా ప్రతికూల రివ్యూలు ప్రతిష్ఠను దిగజార్చగలవు. ఇప్పుడు చాలామంది డాక్టర్లు, ఆసుపత్రులు, క్లినిక్‌లను రివ్యూల ఆధారంగానే ఎంచుకుంటున్నారు. అయితే, ఇక్కడే ముఖ్యమైన సమస్య తలెత్తుతోంది. ఒక రోగి అనుభవం అనేక కారణాలపై ఆధారపడి ఉంటుంది. వైద్యుడి నైపుణ్యం మాత్రమే కాకుండా- రోగి పరిస్థితి, సమయం, చికిత్సపై అవగాహన వంటివన్నీ ప్రభావితం చేస్తాయి. కానీ ఒక చిన్న అసంతృప్తి కూడా పెద్ద ప్రతికూల రివ్యూగా మారుతోంది. కొన్నిసార్లు వైద్యుల నియంత్రణలో లేని పరిస్థితులు కూడా విమర్శలకు కారణమవుతున్నాయి. పోటీ కారణంగా ఒక వైద్యుడి ప్రతిష్ఠను దెబ్బతీయడానికి నకిలీ ఖాతాల ద్వారా ప్రతికూల అభిప్రాయాలను పోస్ట్ చేయడం వంటి ఘటనలూ బయటపడుతున్నాయి. దీనివల్ల వైద్య వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఎలాంటి వైద్యులను నమ్మాలి, ఏ ఆసుపత్రిని ఎంచుకోవాలి అనే విషయంలో రోగుల్లోనూ అయోమయం పెరుగుతోంది. ఈ క్రమంలో కొన్ని ఆన్‌లైన్ వేదికలు నకిలీ రివ్యూలను గుర్తించి తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇలా కోట్ల సంఖ్యలో నకిలీ రివ్యూలను తొలగించినట్లు అనేక నివేదికలు చెబుతున్నాయి. అయినా సమస్య పూర్తిగా తొలగిపోలేదన్నది సుస్పష్టం. ఎందుకంటే, సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ నకిలీ పద్ధతులు కూడా మరింత పదును తేలుతుంటాయి.

నమ్మకమే మూలధనం


ఇలాంటి అగమ్యగోచర పరిస్థితిలో రివ్యూలు నిజంగా ఉపయోగకరంగా ఉండాలంటే వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలి. ఒక్క రివ్యూను చూసి నిర్ణయం తీసుకోవడం కాకుండా, అనేక వనరులను పరిశీలించడం మేలు. ఒకేవిధంగా కనిపించే రివ్యూలను, అతిశయోక్తి ఉన్న అభిప్రాయాలను సందేహంతో చూడాలి. అనుభవాలను సమగ్రంగా వివరించే రివ్యూలను గుర్తించే ప్రయత్నం చేయాలి. ఆన్‌లైన్ వేదికలూ తమవంతు బాధ్యతను గుర్తించాలి. నకిలీ రివ్యూలను అడ్డుకునే కఠినమైన విధానాలు అమలు చేయాలి. పారదర్శకతను పెంచాలి. వ్యాపార సంస్థలు నైతికతను పాటించాలి. తాత్కాలిక లాభాల కోసం నకిలీ రివ్యూలను ఉపయోగించడం చివరికి నష్టమే కలిగిస్తుంది. వినియోగదారుల నమ్మకం కోల్పోతే తిరిగి పొందడం చాలా కష్టం. ఈ సమస్యను మరో కోణంలో చూస్తే ఇదొక సామాజిక సంక్షోభంగా కనిపిస్తుంది. సమాచారం పెరిగిన కొద్దీ నిజమైనదాన్ని గుర్తించడం కష్టమవుతుంది. నేటి ప్రపంచంలో అత్యంత విలువైనది విశ్వసనీయమైన సమాచారమే. ఒక నిజమైన సమీక్ష వందల నకిలీ రివ్యూలకంటే గొప్పది. అందులో నమ్మకం ఉంటుంది. డిజిటల్ ప్రపంచంలో నమ్మకమే మూలధనం. అది కోల్పోతే వ్యవస్థలు నిలబడవు. రివ్యూలు నిజాలనే చూపాలి. కానీ అవే నకిలీ ప్రతిబింబాలను చూపించడం మొదలుపెడితేనే సమస్య తలెత్తుతుంది. ముఖ్యంగా మనం గుర్తుంచుకోవాల్సిన విషయం రివ్యూల సంఖ్య కాదు. నిజమైన గుణాత్మక రివ్యూలే ముఖ్యం. రివ్యూలను ఒకటికి రెండుసార్లు పరిశీలించిన తరవాతే నిర్ణయం తీసుకోవడం శ్రేయస్కరం.



డాక్టర్ మైలవరం చంద్రశేఖర్
సహాయ ఆచార్యులు,
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్

అనుక్షణం... అడుగు ముందుకే!

నన కొరోబి య ఒకి... ఇదొక జపనీస్ మంత్రం. 'ఏడుసార్లు కిందపడినా, ఎనిమిదోసారి లేచి నిలబడాలి' అని దానికి అర్థం. పిల్లలు పరీక్షలకో, జాబ్ ఇంటర్వ్యూకో వెళ్తుంటే 'బెస్టాఫ్ లక్' చెబుతాం కదా. పెద్దలు 'విజయోస్తు' అని దీవిస్తారు. వీటన్నింటి అర్థం- అదృష్టం కలిసి రావాలని కోరుకోవడమే. కానీ జపాన్ వాళ్లు అలా కాకుండా 'గాంబత్తె' అని చెబుతారు. దానికి అర్థం 'నీ ప్రయత్నం నువ్వు పూర్తిగా చెయ్యి' అని. అదొక పదం మాత్రమే కాదు, జీవన విధానం. అదృష్టమనేది మన చేతుల్లో ఉండదు. కానీ మనిషిలోని అంతర్గత శక్తులను, నిద్రాణంగా ఉన్న సామర్థ్యాలను మేల్కొలపడం మన చేతుల్లో పనే. అదే 'గాంబత్తె'- అంటే మీ శాయశక్తులా కృషిచేయండి, వెనకడుగు వేయవద్దు అని భుజం తట్టి ముందుకు నడిపించడం. అదృష్టం కన్నా ప్రయత్నమే ప్రధానమని చెప్పే ఈ విధానాన్ని నిత్యజీవితంలో అడుగడుగునా అన్వయించుకోవచ్చు. మనల్ని మనమే కాదు, మన చుట్టూ ఉన్నవారినీ ఉత్సాహపరిచేందుకు తోడ్పడుతుంది. జపనీయుల సుదీర్ఘ ఆయుర్దాయం, మనోనిబ్బరాలకు ఆధారం ఇదే. జీవితమన్నాక కష్టాలూ ఒడుదొడుకులూ సహజం. వాటిని తట్టుకుని నిలబడటమెలాగో పిల్లలకు చిన్నప్పటినుంచే నేర్పిస్తుంది. ఆల్బర్ట్ లీబర్‌మ్యాన్ రాసిన పుస్తకం 'గాంబత్తె- ది జాపనీస్ ఆర్ట్ ఆఫ్ ఆల్వేస్ మూవింగ్ ఫార్వర్డ్' ఈ కాన్సెప్ట్‌ని సోదాహరణంగా వివరిస్తుంది.



టోక్యో సబ్‌వేలో ఒక సుషీ రెస్టరెంట్. కేవలం పది మందికే చోటుండే ఆ చిన్న రెస్టరెంట్‌కి జపాన్ ప్రధాని- అమెరికా అధ్యక్షుణ్ని విందుకు తీసుకెళ్లారు. 94 ఏళ్ల జిరో ఒనో రెస్టరెంట్ అధిపతి. సుషీ వంటకాల తయారీలో దేశంలో ఆయనను మించినవారు లేరన్నది ప్రధానమంత్రి అభిప్రాయం. జిరో ఒనో జీవితాన్ని 'గాంబత్తె'కు చక్కని ఉదాహరణగా పేర్కొంటూ ఒక డాక్యుమెంటరీ కూడా వచ్చింది. 'నేను చేసే పనినే మళ్లీ మళ్లీ చేశాను, ప్రతిసారీ మరికాస్త మెరుగుపరుచుకుంటూ. అదెక్కడుందో తెలియదు కానీ ఉన్నత శిఖరాన్ని అందుకోవాలని ఒక్కో మెట్టూ ఎక్కుతూనే ఉన్నాను' అని చెబుతారు జిరో ఒనో. అంతేకాదు, వచ్చిన అతిథులది ఏ చేతివాటమో గమనించి మరీ తగిన విధంగా సీట్లు కేటాయిస్తారట. తాను వండిన వంటకాన్ని వాళ్లు సౌకర్యంగా కూర్చుని ఆరగించడం చూడటం ఆయనకు ఆనందం. తమ జీవనయానానికి 'గాంబత్తె'ను ఇంధనంగా మార్చుకున్న ఇలాంటి వ్యక్తుల గురించి ఎన్నో ఆసక్తికర అంశాలు ఈ పుస్తకంలో ఉంటాయి.

మన అభిరుచిని తెలుసుకోవడం, అందులో అత్యుత్తమ నైపుణ్యాన్ని సాధించడం... ఇదే 'గాంబత్తె' తాత్వికత. రెండో ప్రపంచయుద్ధం తరవాత ఛిద్రమైన జీవితాల్ని పునర్నిర్మించుకోవడానికి జపనీయులకు తోడ్పడిందీ, భూకంపంలో ధ్వంసమైన కోబె, తొహొకులాంటి నగరాల్ని నిలబెట్టిందీ ఈ విధానమే. విపత్తు ఏదైనా, సంక్షోభం ఎలాంటిదైనా ఎదుర్కొనే సాధనం... 'గాంబత్తె'. అది సమష్టి కృషికి అద్దంపడుతుంది, సమస్యను దాటి భవిష్యత్తు దిశగా ఆలోచింపజేస్తుంది. జపాన్ సందర్శించి, అక్కడి వారి జీవన విధానాన్ని సునిశితంగా అధ్యయనం చేశాక 'గాంబత్తె' స్ఫూర్తితోనే తానీ పుస్తకం రాయగలిగానని రచయిత చెబుతారు. అందుకే రచయితలకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, ఆరోగ్యానికి, చిరకాల ప్రేమకు... పదేసి 'గాంబత్తె' నియమాలను ఇందులో చెప్పారు. ప్రపంచంలో సుదీర్ఘకాలం వర్ధిల్లిన 5586 కంపెనీల్లో 3146 జపాన్‌కు చెందినవే కావడానికి కారణం 'గాంబత్తె' అని తేల్చి చెబుతున్నారు రచయిత.

– మిహిర

మానవత్వం లేని ప్రజాపీడకులు!

ఎన్ని పుటాలు పెట్టినా ఇత్తడి పుత్తడి కాదు. ఎవరెన్ని చెప్పినా, ఎన్ని చట్టాలు చేసినా, ఎన్నెన్ని సిటిజన్ చార్టర్లను తీసుకొచ్చినా మొద్దురాతి మనస్కులతో నిండిపోయిన అధికార యంత్రాంగంలో మచ్చుకైనా మానవత్వం కనిపించదు. 'దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ మాటకు సర్కారీ సిబ్బంది దృష్టిలో అసలు అర్థమే లేదు. ఎందుకంటే, వారిలో చాలామందికి మనుషులు అసలు మనుషులుగానే కనపడరు. సాయంకోసం తమ దగ్గరికి వచ్చేవాళ్లని ఫైళ్లుగా, కేసులుగా మాత్రమే చూస్తారు ఆ మహానుభావులు! అందుకే 'రూల్స్ కర్ర'ను పట్టుకుని జనాన్ని చావచితక్కొడుతూ ఉంటారు. నిబంధనలు ఉన్నది ప్రజల జీవితాలను కాస్త బాగుపరచడానికే తప్ప వాళ్లను వేధించడానికి, భయపెట్టడానికి, అణగదొక్కడానికి కాదని సాక్షాత్తూ న్యాయపాలికే తలంటు పోసినా అధికారగణాలు తలకెక్కించుకోవు. కాగితాల మీది రాతలే తప్ప కళ్ల ముందు కనిపిస్తున్న జనం బాధలేవీ ఆ పెద్దమనుషులకు పట్టవు! కాలంతో పాటు మారడానికి, కాస్త సహానుభూతితో పనిచేయడానికి ఏమాత్రం ఇష్టపడని అధికారుల మొండితనమే ప్రజల్లోంచి పుట్టే ప్రభుత్వాన్ని ఆ ప్రజలకే దూరంచేస్తోంది!

ఒడిశాలోని కియోంఝర్ జిల్లాకు చెందిన గిరిజనుడు జీతుముండా కన్నీటికథ ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరినీ కదిలిస్తోంది. తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లని భీష్మించుకుని కూర్చునే సర్కారీ యంత్రాంగంపై ఆగ్రహావేశాలను రగిలిస్తోంది. జీతు సోదరి కల్రాముండాకు స్థానిక గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉంది. ఆమె మరణించడంతో ఆ అకౌంట్‌లోని పందొమ్మిది వేల రూపాయలను తనకు ఇప్పించాలంటూ జీతు బ్యాంకుకు వెళ్లాడు. ఖాతాదారు మరణించినట్లు ఆధారాలు, ఇతరత్రా పత్రాలన్నీ తెస్తే తప్ప డబ్బు ఇవ్వమని సిబ్బంది తెగేసి చెప్పారు. ఎన్నిసార్లు తిరిగినా బ్యాంకు అధికారులు అదే పాట మళ్లీ మళ్లీ గట్టిగా పాడుతుండటంతో చేసేదేమీ లేక, తన సోదరి చనిపోయినట్లు ఎలా నిరూపించాలో అర్థంగాక ఆమె సమాధిని తవ్వి అస్థిపంజరాన్ని బయటికి తీసి నేరుగా బ్యాంకుకు తీసుకువెళ్లాడు. అతను అలా ఆ ఎముకలగూడును మోసుకువెళ్తున్న దృశ్యాలను ప్రసార మాధ్యమాల్లో చూసినవారందరి గుండెలూ కలుక్కుమన్నాయి. మరణ, వారసత్వ ధ్రువీకరణ పత్రాలేమీ లేకుండా డబ్బు ఎలా ఇస్తామని మహాగొప్ప నీతిమంతుల్లా సెలవిచ్చిన బ్యాంకు అధికారుల సంజాయిషీలు బండబారిన వ్యవస్థ మీద ఒకరకమైన ఏవగింపును కలిగించాయి. చట్టాలూ నిబంధనల గురించి అవగాహన లేని అతిసాధారణ మనిషికి చేతనైనంత సాయంచేయాల్సింది పోయి రూల్సును వల్లెవేసేవారు ప్రజాసేవకులు ఎలా అవుతారు? ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సొంత జిల్లాలో జరిగిన ఈ విషాద ఉదంతంపై యావద్దేశం మండిపడేసరికి ప్రభుత్వం విచారణ చేయించింది. తప్పంతా బ్యాంకు అధికారులదేనని తేల్చింది. జనం సొమ్మును జీతాలుగా తీసుకుంటూ, తప్పులు చేయడం మా జన్మ హక్కు అనుకునేవారిని చూసీచూడనట్లు వదిలేస్తుండటం మూలంగానే దేశం పరువు ఎప్పటికప్పుడు గంగపాలవుతోంది!

'నరుడు నరుడవుట యెంతో దుష్కరమ్ము లెమ్ము' అన్నాడు గాలిబ్. అంటే, మనిషి జన్మనెత్తినంత మాత్రాన అందరూ మనుషులైపోరు. మానవత్వం లేనివారు అలా పిలిపించుకోవడానికే అర్హులు కారన్నది కవివాక్కులోని అంతరార్థం. మామూలు వ్యక్తుల విషయంలోనే మార్పు అంత కష్టమైతే- ఇక అధికార దురహంకారంతో తామేదో దివి నుంచి భువికి దిగివచ్చిన దేవదూతలమన్నట్లుగా మిడిసిపడేవారు 'మనుషులు' ఎప్పటికి కావాలి? మొన్న జనవరిలో చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ముందు ఒకతను కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. తన భూమిని స్థానిక వైకాపా నాయకుడు కబ్జా చేశాడని, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆ పెత్తందారు అడుగులకే మడుగులొత్తుతున్నారని, తానెన్ని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవట్లేదన్న ఆవేదనతో బాధితుడు ప్రాణం తీసుకోబోయాడు. తన భూమిని ఇతరుల పేరిట బదిలీ చేశారంటూ సిద్దిపేట జిల్లాలోని ఓ తహసీల్దార్ కార్యాలయం ముందు ఓ మహిళా రైతు లోగడ ఇలాగే బలవన్మరణానికి పాల్పడబోయారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, దేశవ్యాప్తంగా చాలా సర్కారీ ఆఫీసుల ముందు ఇలాంటి బాధితులెందరో కనిపిస్తుంటారు. అర్జీలు పుచ్చుకుని సంవత్సరాల తరబడి న్యాయంకోసం కాళ్లరిగేలా తిరిగేవారితో మాట్లాడితే... సమస్యలను పరిష్కరించడం సంగతి దేవుడెరుగు, వారి గోడును ఆలకించడానికి కూడా అధికారులు ఇష్టపడని సంగతి అవగతమవుతుంది. ఇలా మానవత్వానికి ఫర్లాంగు దూరంలో నిలబడే సర్కారీ సిబ్బంది గురించే కాబోలు 'చీకటినీడలు' కవి బైరాగి- 'మా అనాథ జీవిత బాధలు, మీ అనంత వినోద గాథలు' అంటూ ఈసడించుకున్నారు!



పుణ్యభూమి

పింఛను కోసం వెళ్తే బతికి ఉన్నట్లు పత్రం తెమ్మనేవారు, సర్టిఫికెట్ లేదని చెప్పి దివ్యాంగులపైనా కనికరం చూపనివారు, ప్రకృతి విపత్తుల్లో నష్టపోయిన రైతులకు పరిహారం అందించడానికి చేతులు రానివారు అధికారశ్రేణుల్లో అడుగడుగునా పోగుపడ్డారు. అయినవారిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నవారిని లంచాలకోసం పీడించే ప్రబుద్ధులు, ఆసుపత్రి బల్ల నుంచి అంబులెన్స్ వరకు చెయ్యితడపనిదే మృతదేహాన్ని తీసుకెళ్లడానికి కూడా ఒప్పుకోనివారు... చెప్పుకొంటూ వెళ్తే జాతికే సిగ్గుచేటు! నాయకులు, వారి అనుచరులకు వంగి వంగి దండాలుపెట్టే కొంతమంది అధికారులు సామాన్యుల మీద అయితే ఎక్కడ లేని జులుం ప్రదర్శిస్తారు. చట్టాలన్నింటినీ చాపచుట్టేసి పక్కనపెట్టి పెద్దమనుషులకు సపర్యలు చేసే సిబ్బంది... అదే మామూలు మనుషుల దగ్గరికి వచ్చేసరికి ఎక్కడలేని నిబంధనలన్నింటినీ వల్లెవేస్తూ బతికి ఉండగానే పీక్కుతింటారు. రాబందులే నయం అనిపించే విధంగా తమ వికృత మనస్తత్వాలను బయటపెట్టుకుంటూ ఉంటారు.

ఆంగ్లేయుల ఏలుబడిలో వారి ప్రయోజనాల రక్షణకోసం పురుడుపోసుకున్న భారతీయ పాలనా వ్యవస్థలో మానవతా దృక్పథం ఎప్పుడూ కరిమింగిన వెలగపండే! సంరక్షణ కంటే నియంత్రణకు, కరుణ కంటే విధేయతకు ప్రాధాన్యమిచ్చిన వలసవాదుల వారసత్వాన్ని అధికారగణాలు నేటికీ అలాగే కొనసాగిస్తున్నాయి. అందుకే లాఠీలతో విరుచుకుపడే కొంతమంది పోలీసుల నుంచి పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులను సవరించడానికి ముప్పుతిప్పలు పెట్టే పలువురు రెవెన్యూ సిబ్బంది వరకు... సర్కారీ ఆసుపత్రులూ బ్యాంకులకు వెళ్లిన నోరులేనివారికి ప్రత్యక్ష నరకం చూపించేవారు మొదలు చిన్నచిన్న ధ్రువీకరణ పత్రాల మంజూరుకూ నానాకొర్రీలు వేసేవారి దాకా అందరూ ఆ అమానవీయ అవ్యవస్థలను ఆనందంగా కాపాడుకొస్తున్నవారే! తరాలు మారుతున్నా మారని జనభారతం తలరాత ఇది! ప్రజాసేవకోసం ప్రజలే నియమించుకున్న యంత్రాంగం చేతిలో అనునిత్యం అవమానాల పాలవుతున్న జనసామాన్య జీవన వెతలివి! జనం కోసమే బతుకుతున్నామని ఇరవై నాలుగ్గంటలూ ఉపన్యాసాలిచ్చే నాయకోత్తములకు ఇదంతా తెలియదనుకుంటే పొరపాటే! నిజమైన మార్పుకోసం ప్రయత్నించడంకన్నా మాటలతో మురిపించి ఓట్లు దండుకోవడమే వారికి సులువైన పనికదా మరి!

– శైలేష్ నిమ్మగడ్డ

పట్టుదలకు మారుపేరు

హాయ్! బుజ్జీ!!

ఏ రంగంలో రాణించాలన్నా.. అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చాలన్నా కఠోరమైన శ్రమ, పట్టుదల ఉండాలి. అప్పుడే అందులో గుర్తింపు సాధించగలం. ఇప్పుడో నేస్తం అలాగే అహర్నిశలు కష్టపడి స్విమ్మింగ్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు..

ఝార్ఖండ్‌కు చెందిన ఇషాంక్‌కు ఏడేళ్లు. ఇంత చిన్న వయసులో స్విమ్మింగ్‌లో రాణించాడంటే ఏదో పోటీలో పాల్గొని బహుమతి సాధించాడు అనుకుంటే పొరపడినట్లే! ఎందుకంటే తను శ్రీలంక, భారత్‌కు మధ్యలో ఉన్న పాక్ జలసంధిని ఈదాడు. ప్రపంచంలోని జలసంధుల్లో ప్రమాదకరమైన సముద్ర మార్గమది. దాన్ని సునాయాసంగా ఈదేశాడు. 29 కి.మీ. దూరాన్ని



కేవలం 9గంటల 50 నిమిషాల్లో పూర్తి చేశాడు. ఏప్రిల్ 30న ఉదయం 4గంటలకు శ్రీలంకలోని తలైమన్నార్‌లో ప్రారంభించి మధ్యాహ్నం ఒంటి గంటా 50 నిమిషాలకు తమిళనాడులోని ధనుష్కోటికి చేరుకున్నాడు. ఇషాంక్ స్విమ్మింగ్ చేస్తున్న సమయంలో మధ్యమధ్యలో అలలు ఎక్కువవడం, వాతావరణంలో మార్పులు రావడం లాంటి పరిస్థితులు ఎదురయ్యాయట. కానీ అవేం లెక్క చేయకుండా లక్ష్యాన్ని చేరుకున్నాడు. దాంతో ఈ ఘనత సాధించిన 'యంగెస్ట్ స్విమ్మర్' అవ్వడమే కాకుండా అతి వేగంగా ఈదిన వ్యక్తిగానూ నిలిచాడని యూనివర్సల్ రికార్డు ఫోరం సర్టిఫికెట్ అందించింది. 'ఇషాంక్ చిన్నప్పటి నుంచే స్విమ్మింగ్ మీద ఆసక్తి చూపేవాడు. క్రమం తప్పకుండా రోజూ తను చేసిన సాధన.. క్రమశిక్షణ, పట్టుదల.. స్విమ్మింగ్ మీదున్న ఇష్టమే ఈరోజు ఇంతటి మైలురాయిని చేరుకునేలా చేశాయి' అని చెబుతున్నారు వాళ్ల నాన్న. 'ఇషాంక్ పాక్ జలసంధి ఈదుతున్నప్పుడు మేమంతా చాలా కంగారుపడ్డాం. కానీ తను ధైర్యంగా ఉండటం చూసి మేమూ ధైర్యంగా ఉన్నాం. ఇంత గొప్ప రికార్డులు సాధించడం మాకు చాలా ఆనందంగా ఉంది. ఇంతకు ముందు కూడా ఇషాంక్ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు' అంటున్నారు వాళ్లమ్మ. మన ఇషాంక్ ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ప్రశంసలు సైతం అందుకున్నాడు. ★



భూగర్భ జల సిరి!

- రాష్ట్రంలో కిందటి వేసవి కన్నా ఎగువన మట్టాలు

ఈనాడు, అమరావతి: కిందటి ఏడాది మే ప్రారంభం నాటితో పోలిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు ప్రస్తుతం ఎగువకే ఉన్నాయి. అప్పటికంటే సగటున 0.61 మీటర్ల మేర ఎగువన భూగర్భజలాలు ఉన్నట్లు తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ప్రస్తుతం భూగర్భంలో.. కోస్తా జిల్లాల్లో 435.30 టీఎంసీలు, సీమ జిల్లాల్లో 189.57 టీఎంసీలు.. మొత్తం 624.87 టీఎంసీల జలాలు ఉన్నాయి. సాధారణంగా వర్షాకాలం పూర్తయ్యాక భూగర్భజలాలు ఎంతమేర పెరిగాయి.. తిరిగి రుతుపవనాలు ప్రారంభమయ్యేనాటికి ఏ స్థాయికి పడిపోయాయో పరిశీలిస్తారు. అదే సందర్భంలో కిందటి ఏడాది ఇదే సమయానికి ఏ స్థాయిలో ఉన్నాయి? తాజా పరిస్థితితో పోలిస్తే ఎగువన ఉన్నాయా? దిగువన ఉన్నాయా విశ్లేషిస్తారు. రీఛార్జి అయిన భూగర్భజలం కన్నా వినియోగించిన నీరు తక్కువ ఉంటే మట్టాలు ఎగువకు ఉంటాయి. రీఛార్జి అయిన నీటి కన్నా ఎక్కువ తోడేస్తే మట్టాలు అడుగుకు పడిపోతాయి. ప్రస్తుతం వేసవి మండుతోంది. చాలాచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. నీటి వాడకమూ ఎక్కువైంది.

జలధార–జలహారతి

భూగర్భజలాలు సగటున 3-8 మీటర్ల మధ్య ఉంటే పరిస్థితి బాగుందని అర్థం. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలమట్టాలు ఇదేస్థాయిలో ఉండేలా చూసుకోవాలనేది ప్రధాన ఉద్దేశం. ఇందుకు జలధార-జలహారతి వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. భూగర్భజలాలు ఎగువన ఉంటే వాటిని వినియోగించుకునేందుకు వెచ్చించే విద్యుత్ వ్యయం రూ.వేల కోట్ల మేర తగ్గుతుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 41.67% ప్రాంతంలో భూగర్భజలాలు 3-8 మీటర్ల మధ్యనే ఉన్నాయి.

✦ భూగర్భజలాలు సగటున 3 మీటర్ల కన్నా ఎగువన ఉన్న ప్రాంతం 19.33%. ఆ నేలల్లో నీరు పైకి ఊరుతూ ఉంటుంది. ✦ రాష్ట్రంలో సగటున 8-20 మీటర్ల మధ్య భూగర్భమట్టాలు ఉన్న ప్రాంతం 29.28%. ✦ సగటున 20 మీటర్ల కన్నా కిందకు నీటిమట్టాలు పడిపోయిన ప్రాంతం 9.72%.

రాష్ట్రంలో భూగర్భ జల మట్టాలు.. మీటర్లలో

ప్రాంతం	మే 1, 2025	మే 1, 2026	తేడా
కోస్తాంధ్ర	9.39	8.85	0.54
రాయలసీమ	11.48	10.69	0.79
రాష్ట్ర సగటు	9.99	9.38	0.61

(పూర్తి వివరాలు www.eenadu.net లో..)

ఎన్నికలు ముగియగానే గ్యాస్‌పై బాదుడు: సీపీఐ

ఈనాడు, అమరావతి: దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే మోదీ సర్కార్ వాణిజ్య సిలిండర్ ధర అమాంతంగా రూ.993 పెంచిందని, దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపించే ముందు ప్రజల భావోద్వేగాల్ని రెచ్చగొడుతూ పోలింగ్ ముగియగానే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను భారీగా పెంచడం పరిపాటిగా మారిందన్నారు.

నకిలీ జీఎస్టీ పత్రాలు.. ఆధార్ కార్డులతో రుణాలు

- పలు ఆర్థికసంస్థల నుంచి రూ.60 లక్షల అప్పు
- నయా మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు
- ఇలాగే గతంలో రూ.6 కోట్లు తీసుకున్న ప్రధాన నిందితుడు మోహన్

ఈనాడు, అమరావతి: నకిలీ జీఎస్టీ పత్రం, బోగస్ భాగస్వాముల పేర్లతో వివిధ ఆర్థికసంస్థల నుంచి భారీ రుణాలు తీసుకుని మోసగిస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్టుచేశారు. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారి.. తన ఉనికి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. అంతిమంగా అతని ఖాతాకు సొమ్మంతా బదిలీ కావడంతో దొరికిపోయాడు. ఇతనిపై గతంలో మోసపూరితంగా రూ.6 కోట్ల రుణాలు తీసుకుని మోసగించిన వ్యవహారంలో సీఐడీ కేసు నమోదు చేసింది. తాజా కేసులో విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసులు ముగ్గురు నిందితులు.. మారం మోహన్ (ఏ1), కొత్త శ్రీనివాసరావు (ఏ2), పవన్‌కుమార్ (ఏ3)లను అరెస్టు చేశారు. వీరిని శనివారం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా.. ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది.

బ్యాంకులో అనుభవంతో..

గుంటూరు జిల్లాకు చెందిన మారం మోహన్ డిగ్రీ చదివాడు. హైదరాబాద్ వెళ్లి.. ఐసీఐసీఐ బ్యాంకులో రుణాల మంజూరు విభాగంలో మేనేజర్‌గా పనిచేశాడు. తర్వాత విజయవాడ వచ్చి.. తన సోదరుడి పేరున షాపింగ్‌మాల్ పెట్టాడు. సరకును గవర్నర్‌పేట రాజ్ ఎంటర్‌ప్రైజెస్‌లో కొనేవాడు. ఆర్థిక ఇబ్బందులతో తేలికగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. రాజ్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన భాగస్వామ్య ఒప్పందం, జీఎస్టీ పత్రం, స్టేట్‌మెంట్ సంపాదించాడు. వన్‌టౌన్‌లో ఇదే పేరుతో ఓ దుకాణం పెట్టాడు. తనవద్ద పనిచేసే మణికంఠ ఆధార్, పాన్‌కార్డులను ఉపయోగించి లేబర్ లైసెన్స్ తీసుకున్నాడు. తన బంధువైన శ్రీనివాసరావుతో కలసి మణికంఠ పేరుతో వన్‌టౌన్‌లోని కొటక్ మహీంద్రా బ్యాంకులో రాజ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కరెంట్ ఎకౌంట్ తెరిపించాడు.

మృతుడు చందనబాబు ఆధార్‌కార్డుతో..

గతంలో తన దుకాణంలో పనిచేసి మృతిచెందిన చందనబాబు ఆధార్‌కార్డు తీసుకుని.. అందులో పవన్‌కుమార్ అనే వ్యక్తి ఫొటోతో నకిలీది తయారుచేశాడు. తర్వాత రాజ్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నకిలీ భాగస్వామ్య పత్రాన్ని సృష్టించారు. కినారా క్యాపిటల్స్‌లో రూ.30 లక్షల రుణం కోసం శ్రీనివాసరావు, మృతుడు చందనబాబు పేర్లతో దరఖాస్తు చేశారు. దీనికి వీరు రాజ్ ఎంటర్‌ప్రైజెస్ స్టేట్‌మెంట్‌ను, నకిలీ జీఎస్టీ సర్టిఫికెట్‌ను జతచేశారు. ఇలా టాటా క్యాపిటల్, హెచ్‌డీబీ ఫైనాన్స్, ఈపీఐ మనీ తదితర సంస్థల నుంచి రూ.60 లక్షల రుణాలు తీసుకున్నారు.

సిబిల్ స్కోర్ పతనం, నోటీసులతో గుర్తింపు

రాజ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ భాగస్వామి అయిన మధుసూదనరావు ఇటీవల తన సిబిల్ స్కోర్ చూసుకున్నారు. అమాంతం తగ్గినట్లు గుర్తించి.. దాని స్టేట్‌మెంట్ తీసుకున్నారు. తన సంస్థ పేరుతో శ్రీనివాసరావు, చందనబాబు భాగస్వాములుగా ఉన్నట్లు.. పెద్ద ఎత్తున రుణాలు తీసుకుని ఎగ్గొట్టినట్లు ఉంది. దీనిపై ఆయన విజయవాడలోని సైబర్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు పెట్టిన పోలీసులు.. బ్యాంకు స్టేట్‌మెంట్లు పరిశీలించగా.. మోహన్ ఖాతాకు నగదు బదిలీ అయినట్లు తేలింది. దాని ఆధారంగా పట్టుకున్నారు.

ఏపీజీబీ నికర లాభం రూ.1,836 కోట్లు

- 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,36,337 కోట్ల వ్యాపారం
- బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఏపీజీబీ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో హరీష్ బేతా, ఎస్.ఆర్.రఘునాథరెడ్డి

గుంటూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,36,337 కోట్ల వ్యాపారంతో రూ.1,836 కోట్ల నికరలాభం సాధించిందని బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బ్యాంకు మొదటి వార్షికోత్సవం సందర్భంగా గుంటూరులో శనివారం ఆయన మాట్లాడారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు విలీనమై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా ఏర్పడిన నేపథ్యంలో అన్ని సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసుకుని గత ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లలో 14.89 శాతం వృద్ధి సాధించామని చెప్పారు. ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనలో వంద శాతం లక్ష్యాలను సాధించామని వివరించారు. అటల్ పెన్షన్ యోజనలో 103.25 శాతం, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజనలో 227.34 శాతం వృద్ధిని పొందామన్నారు. సమావేశంలో బ్యాంకు మానవ వనరుల విభాగం జనరల్ మేనేజర్ ఎస్.ఆర్.రఘునాథరెడ్డి, విజిలెన్స్ ఇన్‌ఛార్జి హరీష్ బేతా పాల్గొన్నారు.

నువ్వంటే ఇష్టం.. ఐ వాంట్ యూ!

- అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థినితో సహాయ ప్రొఫెసర్ అసభ్య సంభాషణ

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థినితో అసభ్యకరంగా మాట్లాడాడు. 'రేపు సెలవు కదా.. ఇంటికి రా... ఇంకా ఎనిమిది సెమిస్టర్లు ఉంటావు.. వస్తే నీ ఇష్టం.. కలిసి ప్రయాణం చేద్దాం' అని సంభాషించాడు. అంతటితో ఆగకుండా.. 'రేపు వస్తావు కదా వచ్చాక చెప్తాను.. టైం వేస్ట్ చేయకుండా ఫేస్ టూ ఫేస్ చెప్పేస్తాను.. ఐ వాంట్ యూ. మన ప్రయాణంలో ఎలా ఉండాలి.. ఏమిటనేదీ షేర్ చేసుకుందాం.. అది పర్సనల్ అయినా ప్రొఫెషనల్ అయినా..' అని మాట్లాడాడు. 'ఎన్ని గంటలకు వస్తావో చెబితే శ్రీకాకుళం కాంప్లెక్స్ దగ్గరకు వచ్చి రిసీవ్ చేసుకుంటాను.. మా ఇంటికి వచ్చాక నీ ఇష్టం.. నన్ను సర్, సర్ అని పిలవొద్దు. అండి అని పిలువు' అని అంటూ విద్యార్థినితో అన్నాడు. దీనిపై బాధితురాలు.. యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సంభాషణ ఆడియో క్లిప్‌ను ఆధారంగా అందించారు. విషయం బయటకు పొక్కితే యూనివర్సిటీ ప్రతిష్ఠ దెబ్బతింటుందని భావించిన అధికారులు.. ఇరువురి మధ్యా రాజీ కుదిర్చారని సమాచారం. రాజీ కుదిర్చే సందర్భంలో.. 'నువ్వు ఎలా పాస్ అవుతావో చూస్తా' అంటూ విద్యార్థినిని ఆ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బెదిరించడం గమనార్హం. నిందితుడి సంభాషణతో కూడిన క్లిప్.. సోషల్ మీడియాలో వైరల్ అయింది.

భార్య మరొకరితో వెళ్లిపోయిందని పిల్లల్ని కడతేర్చి.. తండ్రి ఆత్మహత్య

బెంగళూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: భార్య మరొకరితో వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన భర్త.. ఇద్దరు పిల్లల్ని చంపేసి, ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలో చోటు చేసుకొంది. బెంగళూరు గ్రామీణ జిల్లా ఆల్కెరె గ్రామానికి చెందిన శివణ్ణ(40), కావ్య(36) దంపతులు. వీరికి జీవన్(10), ప్రాణేశ్(6) ఇద్దరు కుమారులు ఉన్నారు. కావ్య వారం రోజుల క్రితం శివణ్ణ అక్క కుమారుడు హేమంత్‌తో కలిసి వెళ్లిపోయింది. ఇరువైపులా కుటుంబ సభ్యులు రాజీ కుదిర్చి కావ్యను ఇంటికి పంపించారు. మూడు రోజుల క్రితం ఆమె ఇంట్లోని నగదు, నగలు తీసుకుని మళ్లీ పరారైంది. మానసికంగా కుంగిపోయిన శివణ్ణ శుక్రవారం రాత్రి ఇద్దరు పిల్లలను హత్య చేసి, ఆపై ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలుడు

ఛత్తీస్‌గఢ్‌లో ఇన్‌స్పెక్టర్ సహా నలుగురి మృతి

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లో ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) పేలిన ఘటనలో డీఆర్‌జీకి (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్) చెందిన నలుగురు జవాన్లు దుర్మరణం పాలయ్యారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్, కాంకేర్ ఎస్పీ నిఖిల్ రఖేచా శనివారం వివరాలు వెల్లడించారు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ ముగిసినప్పటికీ.. మావోయిస్టులు అడవుల్లో అమర్చిన మందుపాతరలను వెలికితీసేందుకు భద్రతా బలగాలు పెద్దఎత్తున అక్కడి అడవుల్లో డీమైనింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టు ప్రభావిత కాంకేర్-నారాయణ్‌పూర్ జిల్లా సరిహద్దులోని చోటాబేథియా పోలీసుస్టేషన్ పరిధిలో ఐఈడీ వెలికితీత, ఏరియా డామినేషన్ కోసం కాంకేర్ జిల్లా డీఆర్‌జీ బృందం శనివారం కొరోస్కోడ అడవులకు బయలుదేరి వెళ్లింది. అక్కడ మావోయిస్టులు అమర్చిన ఐఈడీని బలగాలు గుర్తించాయి. దానిని వెలికితీసే క్రమంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో డీఆర్‌జీ ఇన్‌స్పెక్టర్ సుఖ్‌రామ్ వట్టి, కానిస్టేబుళ్లు కృష్ణకుమార్ కోర్రమ, సంజయ్ గడ్పలే తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మరో కానిస్టేబుల్ పరమానంద్ కొర్రంను ప్రాథమిక చికిత్సల అనంతరం రాయ్‌పూర్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. నక్సల్స్ కోసం బలగాలు ఇప్పటివరకు చేపట్టిన ఆపరేషన్ ఒక ఎత్తయితే.. బస్తర్ అడవుల్లో మావోయిస్టులు అమర్చిన ఐఈడీల తొలగింపు బలగాలకు పెద్ద సవాల్‌గా మారింది.

స్వచ్ఛ రథాలతో గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు

- గత నెలలో 19 లక్షల కిలోల పొడిచెత్త కొనుగోలు అద్భుతం
- ప్రజల్లో అవగాహన పెరుగుతోంది
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: గత నెలలో స్వచ్ఛ రథాల్లో రికార్డు స్థాయిలో సుమారు 19 లక్షల కిలోల పొడిచెత్త కొనుగోలు చేసి రూ.3.23 కోట్ల విలువైన నిత్యావసరాలు అందించడం పరిశుభ్రత ఉద్యమంపై గ్రామీణ ప్రజల్లో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ప్రతి గురువారం స్వచ్ఛ రథాలు పాఠశాలల వద్దకు వెళ్లి పొడిచెత్తకు బదులు పుస్తకాలు, స్టేషనరీ ఇచ్చేలా చేసిన కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. 'ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ప్రారంభించిన స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలు సాధించేందుకు స్వచ్ఛ రథాలు ప్రారంభించాం. ఇవి గ్రామాల్లో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టి అనే యజ్ఞంలో ప్రజల్ని భాగస్వాములను చేస్తూ దూసుకుపోతున్నాయి' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు. స్వచ్ఛ రథాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అడగ్గానే సహకారం అందించిన సినీనటుడు నానికి పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛ రథాల ఆలోచన అద్భుతం: నాని

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో మిగతా దేశాలతో పోల్చిచూస్తే మనం వెనకబడి ఉన్నామని, దీన్ని అధిగమించేలా వ్యర్థాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్వచ్ఛ రథాల ఏర్పాటు అభినందనీయమని సినీనటుడు నాని అన్నారు.



ఏపీలో అమలుచేస్తున్న స్వచ్ఛ రథాలపై ఎక్స్ వేదికగా ఆయన వీడియో సందేశం ఇచ్చారు. 'స్వచ్ఛ రథాల ఆలోచన అభినందనీయం. తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజల్లో అవగాహన కల్పించడం గొప్ప విషయం. ఈ విషయంలో ఎంతో చొరవ తీసుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, అధికారులు, సిబ్బందికి అభినందనలు. కార్యక్రమం ఇంకా ఎంతో విజయవంతం కావాలి. ప్రజలంతా భాగస్వాములై ప్లాస్టిక్, ఐరన్, గాజు వస్తువులు, పుస్తకాలు, పేపర్లను స్వచ్ఛ రథాల్లో ఇచ్చి నిత్యావసరాలు తీసుకెళ్లాలి. దైనందిన జీవితంలో ప్రజలకు ఉపయోగపడే వస్తువులను ప్రభుత్వం తరఫున అందించడం గొప్ప ఆలోచన. ఇలాంటి వినూత్న ఆలోచనలు ఇంకెన్నో చేయాలని కోరుతున్నా. కార్యక్రమంలో నేనూ భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉంది' అని నాని అన్నారు.

కేసుల భారం తగ్గించేందుకే అదనపు కోర్టుల ఏర్పాటు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

మార్కాపురం, న్యూస్‌టుడే: కేసుల భారాన్ని తగ్గించేందుకే అదనపు కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా కేంద్రంలోని కోర్టు భవనాల సముదాయంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై. లక్ష్మణరావుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. జస్టిస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 'న్యాయ వ్యవస్థ సమాజానికి పునాది వంటిది. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేందుకు అదనపు కోర్టులు దోహదపడతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టుల అభివృద్ధికి సమర్థమైన సహకారం అందిస్తున్నాయి. న్యాయ సేవలు ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడంలో అదనపు కోర్టులు కీలకంగా మారుతాయి' అని చెప్పారు. ఈ సందర్భంగా మార్కాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్, కలెక్టర్ ఎం.విజయసునీత, ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వై.లక్ష్మణరావు. చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సత్యానంద్, మార్కాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి

ఎక్కడా విద్యుత్ కోతలు ఉండకూడదు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈనాడు, అమరావతి: వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో డిమాండ్ ఉన్నప్పటికీ ఎక్కడా విద్యుత్ కోతలు విధించొద్దని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అకాల వర్షాలు, అధిక వేడి వల్ల ఎక్కడైనా తాత్కాలికంగా సమస్యలు తలెత్తితే, వాటిని వెంటనేపరిష్కరించాలని పేర్కొన్నారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎండీలతో శనివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని అధికారులను మంత్రి అడిగారు. ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు, అధిక ఉష్ణోగ్రతలతో ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం వల్ల అంతరాయాలు ఏర్పడుతున్నట్లు అధికారులు తెలియజేశారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

తెలుగు రాష్ట్రాల్లో పాలు, పప్పుధాన్యాల వినియోగం తక్కువే

- ఐసీఎంఆర్ సిఫార్సుల కంటే వెనుకబడిన ఏపీ, తెలంగాణ
- ఎండు ఫలాల వాడకంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ టాప్

ఈనాడు, దిల్లీ: రోజువారీ ఆహార వినియోగంలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఐసీఎంఆర్ (భారతీయ వైద్య పరిశోధన మండలి) సిఫార్సుల కంటే తక్కువ స్థాయిలోనే పదార్థాలు తీసుకుంటున్నారు. చిరుధాన్యాలు, పండ్లు, వంటనూనెలు మాత్రమే ఐసీఎంఆర్ సిఫార్సుల కంటే ఎక్కువ వినియోగిస్తుండగా మిగతా పప్పుధాన్యాలు, పాలు, పాల ఉత్పత్తులు, కూరగాయలు, ఎండు ఫలాలు, మాంస ఉత్పత్తుల వ్యక్తిగత వినియోగం తక్కువగా ఉంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'సర్వేక్షణ' నివేదిక వెల్లడించింది. చిరుధాన్యాల వినియోగం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఐసీఎంఆర్ సిఫార్సుల కంటే అధికంగానే ఉంది. పాలు, పాల ఉత్పత్తుల వినియోగం చండీగఢ్, హరియాణా, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్‌లలో ఎక్కువగా ఉంది. అక్కడ ప్రతి వ్యక్తి సగటున నెలకు 10-14 కిలోల పాలు, పాల ఉత్పత్తులు వాడుతున్నారు. కూరగాయల వినియోగం ఏ రాష్ట్రంలోనూ ఐసీఎంఆర్ చేసిన సిఫార్సుల మేరకు లేదు. ఒక్క ఛత్తీస్‌గఢ్ ప్రజలు మాత్రమే ఐసీఎంఆర్ సిఫార్సుల్లో దాదాపు 50%కిపైగా వాడుతున్నారు. పండ్ల వినియోగం మాత్రం 14 రాష్ట్రాల్లో ఐసీఎంఆర్ సిఫార్సుల కంటే ఎక్కువ ఉంది. ఎండు ఫలాల వినియోగం సగటున 975 గ్రాములు ఉండాల్సి ఉండగా ఆంధ్రప్రదేశ్ సగటున 506 గ్రాముల వినియోగంతో మిగతా రాష్ట్రాల కంటే టాప్‌లో నిలిచింది. మాంసం వినియోగం కేవలం ఆరు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మాత్రమే ఐసీఎంఆర్ నిర్దేశిత ప్రమాణాల కంటే ఎక్కువగా ఉంది. వంటనూనె వినియోగం గుజరాత్‌లో అత్యధికంగా ఉంది. అక్కడ ప్రతి వ్యక్తి నెలకు కేజీకిపైగా నూనె వాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గుజరాత్, చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, మహారాష్ట్ర, పుదుచ్చేరి.. పట్టణ ప్రాంతాల్లో గుజరాత్, అస్సాం, బిహార్, చండీగఢ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మిజోరం, పుదుచ్చేరి, సిక్కిం, తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఒక్కొక్కరు నెలకు కేజీకి మించి వంటనూనె ఉపయోగిస్తున్నట్లు ఈ సర్వే నివేదిక వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క చిరుధాన్యాలు మినహాయిస్తే మిగిలిన అన్ని వస్తువుల వాడకం తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా ఉంది.



దేశంలో రోజువారీ ఆహార పదార్థాలు వివిధ రాష్ట్రాల్లోని ప్రజలు సగటున నెలవారీగా వినియోగిస్తున్న పరిమాణం (కిలోల్లో)

ఆహార పదార్థాలు	ఏపీ		తెలంగాణ		ఐసీఎంఆర్ సిఫార్సు		దేశంలో గరిష్ఠ వినియోగం			
	గ్రామీణ	పట్టణ	గ్రామీణ	పట్టణ	శాకాహారులకు	మాంసాహారులకు	రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	గ్రామీణ	రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	పట్టణ
చిరుధాన్యాలు	9.302	8.290	10.108	8.773	7.5	7.5	పశ్చిమబెంగాల్	11.230	త్రిపుర	11.206
పప్పు ధాన్యాలు	0.844	0.884	0.617	0.759	2.6	1.7	హిమాచల్‌ప్రదేశ్	1.327	హిమాచల్‌ప్రదేశ్	1.329
పాలు, పాల ఉత్పత్తులు	4.733	5.448	3.888	5.097	9.0	9.0	చండీగఢ్	14.195	చండీగఢ్	14.352
కూరగాయలు (ఆలు, నిమ్మ మినహాయించి)	5.509	5.545	4.811	5.058	12.0	12.0	ఛత్తీస్‌గఢ్	6.697	ఛత్తీస్‌గఢ్	8.251
తాజా పండ్లు	4.070	4.890	3.558	4.650	3	3	లక్షద్వీప్	10.513	లక్షద్వీప్	10.110
ఎండు ఫలాలు	0.499	0.513	0.306	0.428	1.05	0.9	ఆంధ్రప్రదేశ్	0.499	ఆంధ్రప్రదేశ్	0.513
గుడ్లు, చేపలు, మాంసం	1.512	1.401	1.403	1.387	–	2.1	లక్షద్వీప్	3.949	లక్షద్వీప్	4.068
వంటనూనె	0.999	0.961	0.921	0.922	0.81	0.81	గుజరాత్	1.200	గుజరాత్	1.422



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉపాధ్యాయుల బృందం

సింగపూర్ పర్యటనకు ఉపాధ్యాయుల బృందం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న 37 మంది ఉపాధ్యాయుల బృందం సింగపూర్ విద్యావ్యవస్థ అధ్యయనానికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం ఉదయం బయలుదేరి వెళ్లింది. గత ఏడాది పురస్కారాలు పొందిన వీరంతా ఈ నెల 2 నుంచి 9 వరకు సింగపూర్‌లో పర్యటిస్తారని విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఖర్చులతో ఈ పర్యటనకు వెళ్లడం ఎంతో సంతోషంగా ఉందని ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

టీచర్ అభివృద్ధి చెందితే తరగతి గది రూపాంతరం చెందుతుంది: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సింగపూర్ శిక్షణలో పాల్గొనేందుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 37 మంది శనివారం ఆ దేశం వెళ్లారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. "సింగపూర్‌లో ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. ఆధునిక బోధన పద్ధతులు, విమర్శనాత్మక ఆలోచన, విద్యార్థి కేంద్రంగా బోధన విధానాలపై లోతైన అవగాహన పొందనున్నారు. పాఠ్యప్రణాళిక రూపకల్పన నుంచి పాఠశాలల్లో ప్రత్యక్ష అనుభవం వరకు ప్రపంచ స్థాయి ఉత్తమ విధానాలను నేర్చుకుని, వాటిని తిరిగి మన ప్రభుత్వ పాఠశాల తరగతుల్లో అమలు చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ఉపాధ్యాయులు అభివృద్ధి చెందితే తరగతి గది రూపాంతరం చెందుతుందనే ఈ కార్యక్రమం చేపట్టాం" అని తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే ప్రతి నియోజకవర్గంలోనూ 'లేబర్ అడ్డా'

అమరావతిలో ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం: మంత్రి వాసంశెట్టి సుభాష్

ఈనాడు, అమరావతి: కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్న 'లేబర్ అడ్డా' పథకం విజయవంతమైతే... ప్రతి నియోజకవర్గంలోనూ వాటిని ఏర్పాటు చేస్తామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న 15 షెల్టర్లలో ఆధునిక పరికరాల వినియోగంపై శిక్షణ ఇప్పిస్తామని వివరించారు. యాజమాన్యాల కార్మిక అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని పని కల్పించేలా శిక్షణ కార్యక్రమాల్ని తీర్చిదిద్దుతామని వెల్లడించారు. రాజధాని అమరావతిలో ఈఎస్ఐసీ వైద్య కళాశాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "లేబర్ అడ్డాల్లో విశ్రాంతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పిస్తాం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తోంది. సుమారు 20 లక్షల మందికి పని దొరికింది. భవన నిర్మాణ కార్మికులకు వివాహ కానుకగా రూ.40 వేలు, ప్రసూతి సాయంగా రూ.20 వేలు అందిస్తున్నాం. కార్మికుడు సహజంగా మరణిస్తే రూ.60 వేలు, అంత్యక్రియల ఖర్చులకు రూ.20 వేలు ఇస్తున్నాం. ఈఎస్ఐ ఆసుపత్రుల్ని విస్తరిస్తున్నాం. శ్రీసిటీ, నెల్లూరుల్లో కొత్త ఆసుపత్రుల నిర్మాణానికి ఇప్పటికే భూములు గుర్తించాం. విశాఖపట్నంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కేంద్రం ఇప్పటికే అనుమతిచ్చింది" అని సుభాష్ తెలిపారు.

ఈశా ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు త్రోబాల్ ఉచిత శిక్షణ

పోటీల్లో పాల్గొని గెలిచిన వారికి... రూ.5 లక్షల వరకూ నగదు బహుమతులు

ఈనాడు, అమరావతి: ఈశా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామీణ మహిళలకు ఉచితంగా త్రోబాల్ శిక్షణ ఇవ్వనున్నారు. చిత్తూరు, నెల్లూరు, విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు సంస్థ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'చిత్తూరులోని బందపల్లి జడ్పీ హైస్కూల్, గుడిపాల సీఎస్ఆర్ పాఠశాలలో మే 27 నుంచి 31 వరకూ, నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం పూడిపర్తిలో మే 13 నుంచి 17 వరకూ, బుచ్చిరెడ్డిపాళెం మండలం కొత్తల్లులో మే 20 నుంచి 24 వరకూ శిబిరాలు నిర్వహించనున్నారు. విశాఖపట్నం, భీమవరాల్లోనూ శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిలో పాల్గొనే వారికి పోటీలు నిర్వహించి రూ.5 లక్షల వరకూ నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ఆసక్తి గలవారు isha.co/grm-camp లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సంస్థ కోరింది. చిత్తూరు- 73374 84259, నెల్లూరు-92464 24773, విశాఖపట్నం- 78425 74072, భీమవరం- 89858 23880 నంబర్లను సంప్రదించాలని కోరింది.

విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో డెంటిక్ వరల్డ్ సంస్థ ప్రారంభం

విశాఖపట్నం (పరవాడ), న్యూస్‌టుడే: దేశంలోనే మొట్టమొదటి డెంటల్ మెడ్‌టెక్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ హబ్ అయిన డెంటిక్ వరల్డ్ సంస్థను శనివారం విశాఖ మెడ్‌టెక్ జోన్ ప్రాంగణంలో ఏర్పాటుచేశారు. మెడ్‌టెక్ జోన్ సీఈఓ డాక్టర్ జితేంద్ర శర్మ, డెంటిక్ వరల్డ్ సీఈవో కృష్ణసాయి ఇంకోలు దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ దంతవైద్య రంగం ప్రస్తుతం భారీగా దిగుమతులపై ఆధారపడి ఉందని, దాదాపు 85-90% దంతవైద్య పరికరాలు విదేశాల నుంచి రావడంతో సామాన్యులకు అధునాతన దంతవైద్యం అందుబాటులో ఉండట్లేదని.. ఈ లోటు భర్తీ చేసేందుకు భారతదేశం సొంతంగా డెంటల్ టెక్నాలజీని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డెంటిక్ వరల్డ్‌ను స్థాపించామన్నారు. ఈ హబ్ స్టార్టప్‌లకు, దంత వైద్య కళాశాలలకు, పరిశోధకులకు, పరిశ్రమల భాగస్వాములకు మద్దతుగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలమంది దంతవైద్యులు సరికొత్త ఆవిష్కరణలను త్వరగా అందిపుచ్చుకోవడానికి ఇది సహాయపడుతుందని, ఈ హబ్ ద్వారా పరిశోధన, డెంటల్ డిజైన్ సేవల తయారీ, టెస్టింగ్, క్లినికల్ వాలిడేషన్ లాంటి అంశాల్లో సమగ్ర మద్దతు అందిస్తుందన్నారు. ప్రస్తుతం దిగుమతి అవుతున్న జిర్కోనియా డిస్కులు, నెక్స్ట్ జనరేషన్ డెంటల్ ఇంప్లాంట్ల లాంటి కీలక ఉత్పత్తులను ఇక్కడే తయారు చేయడంపై డెంటిక్ వరల్డ్ ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. అత్యాధునిక ఉత్పాదక సౌకర్యాలు ఉండడంతో కొత్తగా వచ్చే ఆవిష్కర్తలకు, స్టార్టప్‌లకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ఇది మేక్ ఇన్ ఇండియా దార్శనికతకు అనుగుణంగా ఉండడమే కాకుండా విశాఖను డెంటల్ టెక్నాలజీ తయారీకి ప్రధాన కేంద్రంగా మారుస్తుందన్నారు. అనంతరం ఆయా సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలు (ఎంఓయూ) చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




ఒప్పందపత్రాలు చూపిస్తున్న మెడ్‌టెక్, డెంటిక్ వరల్డ్ సంస్థల ప్రతినిధులు, చిత్రంలో మెడ్‌టెక్ జోన్ సీఈవో డాక్టర్ జితేంద్రశర్మ తదితరులు



ఈశ్వరయ్య దంపతులకు ఆటో తాళాలు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సీఎం హామీతో ఈశ్వరయ్య దంపతులకు వాహనం అందజేత

చిన్నమండెం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు హామీ మేరకు అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం దేవగుడిపల్లె రాజీవ్ కాలనీకి చెందిన ఈశ్వరయ్య, హేమలత దంపతులకు పీ-4 కింద నాలుగు చక్రాల (టిఫిన్ సెంటర్ వాహనం) ఆటోను మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అందజేశారు. 2025 నవంబరు 12న ఎన్టీఆర్ సామూహిక గృహ ప్రవేశాల ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు చిన్నమండెం మండలం వచ్చారు. ఆ సందర్భంగా ఈశ్వరయ్య, హేమలత దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని, వారి జీవనోపాధికి ప్రభుత్వం చేయూత ఇస్తుందని హామీ ఇచ్చారు. ఆ మేరకు బోడిరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో శనివారం ఆ దంపతులకు వాహనాన్ని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. ఈశ్వరయ్య, హేమలత దంపతుల కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ వాహనం దోహద పడుతుందన్నారు.



సులువైన పరిష్కారాన్ని కనుగొనడమే విజయసూత్రం

వ్యాపార రంగంలో విజయం సాధించిన వారంతా కొత్త ఆలోచనలతో ప్రారంభించినవారు కాదు. ఎక్కువ మంది ప్రజలకు ఎదురవుతున్న ఏదైనా ఓ సమస్యను ఎంచుకొని, దాన్ని లోతుగా అధ్యయనం చేసి, ఇతరుల కన్నా భిన్నమైన, సులువైన పరిష్కార మార్గాన్ని కనుగొన్నవారే విజేతలుగా నిలిచారు. ఈ సూత్రాన్ని పాటిస్తే మీరూ జీవితాన్ని గెలుస్తారు.

– మార్క్ రాండల్ఫ్, ఆంత్రప్రెన్యూర్

సర్పంచ్‌గా ఉంటూ రేషన్ డీలర్‌గా కొనసాగడం కుదరదు

ఏదో ఒకటి వదులుకోవాలి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: సర్పంచ్‌గా ఉంటూ చౌకధరల దుకాణం డీలర్‌గా కొనసాగడం చెల్లదని హైకోర్టు తేల్చిచెప్పింది. రెండింటిలో ఏదో ఒకదాన్ని వదులుకోవాలని స్పష్టం చేసింది. ఏకకాలంలో రెండు హోదాల్లో కొనసాగడం నిబంధనలకు విరుద్ధమని తేల్చిచెప్పింది. ప్రజాప్రతినిధులు ఎవరైనా రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా డీలర్‌షిప్ పొందేందుకు అనర్హులని 2018లో రాష్ట్రప్రభుత్వం జీవో 32 జారీచేసిందని గుర్తుచేసింది. ఓ సర్పంచ్ నిర్వహిస్తున్న రేషన్ దుకాణం డీలర్‌షిప్‌ను రద్దుచేస్తూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది. డీలర్‌షిప్‌ను రద్దుచేయడాన్ని సవాలు చేస్తూ సర్పంచ్ దాఖలుచేసిన పిటిషన్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

● కర్నూలు జిల్లా కల్లూరు మండలం కె.మార్కాపురంలో ఆర్జీ మద్దిలేటి చౌకధరల దుకాణం నిర్వహిస్తున్నారు. తహసీల్దార్, వీఆర్వో 2024 నవంబరు 26న తనిఖీకి వెళ్లినప్పుడు నిల్వల్లో తేడా ఉన్నట్లు గుర్తించారు. మద్దిలేటి సర్పంచ్‌గా ఎన్నికై, డీలర్‌గానూ కొనసాగుతున్నట్లు తేల్చారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. దీనిమీద మద్దిలేటి ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందలేదు. దాంతో కర్నూలు ఆర్డీవో 2024 డిసెంబరులో డీలర్‌షిప్‌ను రద్దుచేశారు. ఆ ఉత్తర్వులను సమర్థిస్తూ సంయుక్త కలెక్టర్ నిర్ణయం ప్రకటించారు. దీంతో మద్దిలేటి గతేడాది హైకోర్టును ఆశ్రయించారు. మరోవైపు రేషన్ వినియోగదారు దాసరి శేఖర్ ఈ వ్యాజ్యంలో ప్రతివాదిగా చేరారు. ఆయన తరఫున న్యాయవాది సాజిద్ వాదనలు వినిపిస్తూ.. మద్దిలేటి సర్పంచ్‌గా ఎన్నికయ్యాక, రేషన్ సరకులను సక్రమంగా సరఫరా చేయడం లేదన్నారు. డీలర్‌షిప్‌ను రద్దుచేస్తూ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనన్నారు. సహాయ ప్రభుత్వ న్యాయవాది అప్పసాని వినీత్ వాదనలు వినిపిస్తూ.. మద్దిలేటిని అధికారులు వివరణ కోరి, ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో డీలర్‌షిప్‌ను రద్దుచేశారని తెలిపారు. డీలర్.. సర్పంచ్‌గా ఎన్నికై, డీలర్‌షిప్‌ను పునరుద్ధరించుకోవాలంటే సర్పంచ్ పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుందన్నారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయమూర్తి.. మద్దిలేటి పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు ఇచ్చారు.

మనమిత్ర వాట్సప్‌లోనూ స్కానింగ్ జవాబుపత్రాలు

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 7 వరకు అవకాశం కల్పించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి చొప్పున ఫీజు చెల్లించాలని, వెబ్‌సైట్‌లో డెబిట్, క్రెడిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించొచ్చని తెలిపారు. రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి జవాబు పత్రాలను ఇప్పటి వరకు పాఠశాల లాగిన్‌లో మాత్రమే పెడుతుండగా ఈసారి జవాబు పత్రాల స్కాన్ చేసిన కాపీలను మనమిత్ర వాట్సప్ నంబరు 9552300009 ద్వారానూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు

ఈనాడు, అమరావతి: ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మహిళా శిశు సంక్షేమశాఖ వేసవి సెలవుల్ని మంజూరుచేసింది. మే ఒకటి నుంచి 15వ తేదీ వరకూ కార్యకర్తలు, 15 నుంచి మే నెలాఖరు వరకూ ఆయాలకు సెలవుల్ని ఇచ్చింది. కేంద్రాలు మాత్రం కొనసాగనున్నాయి. అయితే మే నెల మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం నేతలు కోరుతున్నారు.


కాంబోజ్ 3/32

జట్టు నిండా స్టార్ ఆటగాళ్లే. అన్ని విభాగాల్లోనూ బలమే. కానీ ఆట చూస్తే అంతంతమాత్రం. ఇదీ ముంబయి ఇండియన్స్ పరిస్థితి. ఈసారైనా పుంజుకుంటుందని.. ప్లేఆఫ్స్‌కు రేసులో ముందుకెళ్తుందిలే.. అని అభిమానులు ఆశిస్తూనే ఉన్నారు. కానీ ముంబయి ఆట మారలేదు. తొమ్మిదో మ్యాచ్ ఆడుతూ ఏడో ఓటమిని ఖాతాలో వేసుకున్న ఆ జట్టు.. ప్లేఆఫ్స్‌కు దాదాపుగా దూరమైంది. ఇక సాంకేతికంగా మాత్రమే ఆ జట్టు పోటీలో ఉన్నట్లు! ఇంకో మ్యాచ్ ఓడితే తన అవకాశాలు సంక్లిష్టమయ్యే స్థితిలో చెన్నై సూపర్‌కింగ్స్.. ముంబయిని ఓడించి ఉపశమనం పొందింది.

ముంబయి ఖేల్‌ఖతం!

ఖాతాలో ఏడో ఓటమి

చెన్నైకి నాలుగో విజయం


రుతురాజ్ 67 నాటౌట్

చెన్నై

ఐపీఎల్-19లో ముంబయి ఇండియన్స్ కథ దాదాపుగా ముగిసినట్లే! గత మ్యాచ్‌లో సొంతగడ్డపై 243 పరుగులు చేసి కూడా గెలవలేకపోయిన ఆ జట్టు.. శనివారం పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో మరో ఓటమిని ఖాతాలో వేసుకుంది. చెపాక్‌లో బంతితో, బ్యాటుతో అదరగొట్టిన చెన్నై 8 వికెట్ల తేడాతో ముంబయిని చిత్తు చేసింది. మొదట అన్షుల్ కాంబోజ్ (3/32), నూర్ అహ్మద్ (2/26), ఓవర్టన్ (1/23), రామకృష్ణ ఘోష్ (1/24)ల ధాటికి ముంబయి 7 వికెట్లు కోల్పోయి 159 పరుగులే


కార్తిక్ 54 నాటౌట్

చేసింది. నమన్ ధీర్ (57; 37 బంతుల్లో 4×4, 3×6), రికెల్టన్ (37; 24 బంతుల్లో 5×6) మినహా బ్యాటర్లు తేలిపోయారు. అనంతరం కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (67 నాటౌట్; 48 బంతుల్లో 5×4, 2×6)తో పాటు కార్తీక్ శర్మ (54 నాటౌట్; 40 బంతుల్లో 4×4, 3×6) కూడా రాణించడంతో చెన్నై 18.1 ఓవర్లలో 2 వికెట్లే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 9 మ్యాచ్‌ల్లో చెన్నైకిది నాలుగో విజయం.

కెప్టెన్ నిలిచాడు.. కుర్రాళ్లు దంచారు: తన మార్కు ఇన్నింగ్స్ ఆడడానికి తగ్గ ఒక మోస్తరు లక్ష్యం ముందుండడంతో చెన్నై కెప్టెన్ రుతురాజ్.. అవకాశాన్ని బాగా ఉపయోగించుకున్నాడు. మరో ఓపెనర్ సంజు శాంసన్ (11)ను బుమ్రా (1/20) త్వరగానే ఔట్ చేసినా.. రుతురాజ్ పట్టుదలతో నిలబడి జట్టును గెలుపు వైపు నడిపించాడు. యువ బ్యాటర్లు ఉర్విల్ పటేల్ (24; 12 బంతుల్లో 2×4, 2×6), కార్తీక్ శర్మల నుంచి అతడికి చక్కటి సహకారం అందింది. ఉర్విల్ ఉన్నంతసేపు మెరుపు షాట్లతో అలరించాడు. రెండో వికెట్‌కు 49 పరుగులు జోడించాక ఉర్విల్ ఔట్ కాగా, తర్వాత రుతురాజ్‌కు కార్తీక్ శర్మ జత కలిశాడు. ఇద్దరూ అలవోకగా ముంబయి బౌలర్లను ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. రూ.14.2 కోట్లకు చెన్నై సొంతమై, ఆరంభంలో కొన్ని మ్యాచ్‌ల్లో విఫలం కావడంతో తుది జట్టుకు దూరమైన కార్తీక్.. ఈ పోరులో సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఎండ్‌లో రుతురాజ్ చూడముచ్చటైన షాట్లతో ఆకట్టుకున్నాడు. ముందుగా రుతురాజ్, తర్వాత కార్తీక్ అర్ధశతకాలు పూర్తి చేసుకుని మరో వికెట్ ఇవ్వకుండా ఛేదనను పూర్తి చేశారు. అభేద్యమైన మూడో వికెట్‌కు ఈ జోడీ 98 పరుగులు జోడించింది.

పునాది పడ్డా..: తన సొంత గడ్డ వాంఖడేలో జరిగిన గత మ్యాచ్‌లో ఏకంగా 243 పరుగులు చేసిన ముంబయి ఇండియన్స్.. ఈసారి చెపాక్‌లో అతి కష్టం మీద 160కి చేరువైంది. ఇన్నింగ్స్ ప్రథమార్ధంలో మెరుగైన స్థితిలో ఉన్న ఆ జట్టు.. రెండో అర్ధంలో పేలవ ప్రదర్శనతో తక్కువ స్కోరుకు పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయికి ఆరంభంలోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ సీజన్లో తన తొలి మ్యాచ్‌లో మెరుపు ఇన్నింగ్స్ ఆడిన విల్ జాక్స్.. ఈసారి ఒక్క పరుగుకే వెనుదిరిగాడు. మ్యాచ్ ఆద్యంతం అద్భుతంగా బౌలింగ్ చేసిన అన్షుల్ కాంబోజ్.. జాక్స్‌ను ఔట్ చేసి ప్రత్యర్థిని తొలి దెబ్బ కొట్టాడు. అయితే ఫామ్‌లో ఉన్న రికెల్టన్‌తో పాటు నమన్ ధీర్ రాణించడంతో ముంబయి బలంగా పుంజుకుంది. రికెల్టన్ ఉన్నంతసేపు సిక్సర్ల మోత మోగించాడు. ఒక్క ఫోర్ కూడా కొట్టని అతను.. అయిదు సిక్సర్లు బాదేశాడు. ఏడో ఓవర్లో రికెల్టన్ ఔటయ్యే సమయానికి స్కోరు 59. ఓ ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న నమన్ ధీర్‌కు సూర్యకుమార్ (21) తోడవడంతో ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. 11వ ఓవర్లో 99/2తో పటిష్ఠ స్థితిలో కనిపించిన ముంబయి.. సూర్యకుమార్‌ను కొత్త బౌలర్ రామకృష్ణ ఘోష్ ఔట్ చేశాక తీవ్రంగా తడబడింది. పేసర్ ఓవర్టన్, స్పిన్నర్ నూర్ అహ్మద్ అద్భుత బౌలింగ్‌తో చెన్నైని కట్టిపడేశారు. 12-16 మధ్య 5 ఓవర్లలో ముంబయి కేవలం 24 పరుగులే చేసింది. ఈ మధ్యలో తిలక్ (5)ను నూర్ ఔట్ చేశాడు. అర్ధశతకం తర్వాత నమన్ ఔటైపోగా.. తర్వాత ముంబయి మరింత ఇబ్బంది పడింది. హార్దిక్ (23 బంతుల్లో 18) కూడా బ్యాట్ ఝళిపించలేకపోవడంతో ముంబయి ఒక మోస్తరు స్కోరుతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చివరి 10 ఓవర్లలో ఆ జట్టు 5 వికెట్లు కోల్పోయి 69 పరుగులే చేయగలిగింది.



పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	8	6	1	1	13	1.043
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	9	6	3	0	12	0.832
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	9	5	4	0	10	-0.192
చెన్నై	9	4	5	0	8	0.005
దిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	8	2	5	1	5	-0.751
ముంబయి	9	2	7	0	4	-0.803
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి

ముంబయి ఇన్నింగ్స్: జాక్స్ (సి) రామకృష్ణ (బి) కాంబోజ్ 1; రికెల్టన్ (సి) ఉర్విల్ (బి) నూర్ 37; నమన్ ధీర్ (సి) సర్ఫరాజ్ (బి) ఓవర్టన్ 57; సూర్యకుమార్ (సి) బ్రెవిస్ (బి) రామకృష్ణ 21; తిలక్ (సి) రుతురాజ్ (బి) నూర్ 5; హార్దిక్ (సి) బ్రెవిస్ (బి) కాంబోజ్ 18; మింజ్ (బి) కాంబోజ్ 5; క్రిష్ భగత్ నాటౌట్ 3; బౌల్ట్ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 5 **మొత్తం:** (20 ఓవర్లలో 7 వికెట్లకు) **159**; **వికెట్ల పతనం:** 1-1, 2-59, 3-99, 4-109, 5-134, 6-139, 7-151; **బౌలింగ్:** ముకేశ్ చౌదరి 3-0-25-0; అన్షుల్ కాంబోజ్ 4-0-32-3; ప్రశాంత్ వీర్ 2-0-25-0; నూర్ అహ్మద్ 4-0-26-2; రామకృష్ణ ఘోష్ 3-0-24-1; జేమీ ఓవర్టన్ 4-0-23-1

చెన్నై ఇన్నింగ్స్: శాంసన్ (సి) రికెల్టన్ (బి) బుమ్రా 11; రుతురాజ్ నాటౌట్ 67; ఉర్విల్ పటేల్ (బి) ఘజన్‌ఫర్ 24; కార్తీక్ శర్మ నాటౌట్ 54; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం:** (18.1 ఓవర్లలో 2 వికెట్లకు) **160**; **వికెట్ల పతనం:** 1-13, 2-62; **బౌలింగ్:** బౌల్ట్ 3.1-0-37-0; బుమ్రా 3-0-20-1; భగత్ 2-0-22-0; ఘజన్‌ఫర్ 4-0-40-1; రఘు శర్మ 4-0-24-0; హార్దిక్ 2-0-17-0

భారత్‌కు కాంస్యమే

- సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో ఓటమి
- థామస్ కప్ బ్యాడ్మింటన్


శ్రీకాంత్

హోర్సెన్స్ (డెన్మార్క్): ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో మరోసారి ఫైనల్ చేరాలన్న భారత్ ఆశ తీరలేదు. సెమీఫైనల్లో ఓడి కాంస్యంతో సరిపెట్టుకుంది. శనివారం భారత్ 0-3తో ఫ్రాన్స్‌కు తలొంచింది. స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్‌కు గాయం కావడం జట్టు అవకాశాలను దెబ్బ తీసింది. లక్ష్యసేన్ లేకపోవడంతో తొలి సింగిల్స్ ఆడిన స్టార్ షట్లర్ ఆయుష్ శెట్టి నిరాశ పరిచాడు. అతడు 11-21, 9-21తో పొపోవ్ చేతిలో చిత్తయ్యాడు. తొలి గేమ్‌లో ఆరంభంలో బాగానే ఆడిన ఆయుష్ ఆ తర్వాత లయ కోల్పోయాడు. వరుస తప్పిదాలతో గేమ్ పోగొట్టుకున్నాడు. రెండో గేమ్‌లోనూ ఆయుష్ తేలిపోయాడు. ఆరంభంలో 1-4తో వెనుకబడి ఆపై గేమ్‌తో పాటు మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. రెండో సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయాడు. అతడు 16-21, 18-21తో లానియర్‌కు తలొంచాడు. తొలి గేమ్‌లో 6-7తో కాస్త మెరుగ్గానే ఆడిన శ్రీకాంత్ తర్వాత తడబడ్డాడు. గేమ్‌ను ప్రత్యర్థికి కోల్పోయాడు. రెండో గేమ్‌లో శ్రీకాంత్ పుంజుకున్నా.. లానియర్ పట్టు వదల్లేదు. ఒక దశలో 14-16తో నిలిచిన శ్రీకాంత్.. తర్వాత కోలుకోలేకపోయాడు. దీంతో ఫ్రాన్స్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది. కచ్చితంగా గెలవాల్సిన మూడో సింగిల్స్‌లో అనుభవజ్ఞుడు ప్రణయ్ కూడా సత్తా చాటకపోవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో ప్రణయ్ 19-21, 16-21తో పొపోవ్ చేతిలో ఓడిపోయాడు. రెండు గేమ్‌లలో ప్రణయ్ బాగానే ఆడినా.. కీలక సమయాల్లో పట్టు కోల్పోయి ఓటమి చవిచూశాడు. 2022లో థామస్ కప్ విజేతగా నిలిచిన భారత్.. 1952, 1955, 1979, 2026లో కాంస్య పతకాలు నెగ్గింది.

టీ20 ప్రపంచకప్ జట్టులో చరణి, అరుంధతి

నందనికి నేరుగా అవకాశం


శ్రీ చరణి

ముంబయి: వచ్చే నెల 12 నుంచి ఇంగ్లాండ్ వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగే భారత జట్టులో తెలుగమ్మాయిలు శ్రీ చరణి, అరుంధతి రెడ్డిలకు చోటు దక్కింది. వీళ్లిద్దరూ కొంత కాలంగా భారత జట్టులో రెగ్యులర్ ప్లేయర్లుగా ఉంటున్నారు. నిరుడు వన్డే ప్రపంచకప్ గెలిచిన జట్టులోనూ వీళ్లు సభ్యులు. ఇప్పుడు పొట్టి ప్రపంచకప్‌లోనూ వీరికి అవకాశం దక్కింది. మరోవైపు అరంగేట్ర ఫాస్ట్‌బౌలర్ బౌలర్ నందని శర్మను నేరుగా ప్రపంచకప్‌కు ఎంపిక చేయడం విశేషం. ఆమె ఈ ఏడాది డబ్ల్యూపీఎల్‌లో నిలకడగా రాణించింది. కొంత కాలంగా భారత జట్టుకు దూరంగా ఉన్న యాస్తిక భాటియాను రెండో వికెట్ కీపర్‌గా సెలక్టర్లు జట్టులోకి ఎంపిక చేశారు. ప్రపంచకప్ కంటే ముందు ఈ నెల 28 నుంచి ఇంగ్లాండ్‌తో జరిగే మూడు టీ20ల సిరీస్‌లోనూ ఇదే జట్టు బరిలోకి దిగుతుంది. మరోవైపు ప్రపంచకప్ ముగిశాక జులై 10 నుంచి ఇంగ్లిష్ జట్టుతో జరిగే ఏకైక టెస్టుకు కూడా సెలక్టర్లు జట్టును ఎంపిక చేశారు. ఫామ్ కోల్పోయిన ఆల్‌రౌండర్ అమన్‌జ్యోత్ కౌర్‌కు ఈ రెండు జట్లలోనూ చోటు దక్కలేదు. ఓపెనర్ ప్రతీక రావల్ టెస్టు జట్టుకు మాత్రమే ఎంపికైంది.


అరుంధతి

ఇంగ్లాండ్‌తో టీ20లకు, టీ20 ప్రపంచకప్‌కు భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షెఫాలి వర్మ, జెమీమా రోడ్రిగ్స్, భార్తీ ఫుల్మాలి, దీప్తి శర్మ, రిచా ఘోష్, శ్రీ చరణి, యాస్తిక భాటియా, నందని శర్మ, అరుంధతి రెడ్డి, రేణుక సింగ్, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, రాధ యాదవ్.

ఇంగ్లాండ్‌తో ఏకైక టెస్టుకు భారత జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి, జెమీమా, ప్రతీక రావల్, రిచా, శ్రీచరణి, యాస్తిక, నందని, హర్లీన్ డియోల్, రేణుక, క్రాంతి, సయాలి సత్ఘారే, స్నేహ్ రాణా.

భువి మళ్లీ లేచాడు

వయసు మీద పడింది.. అంతర్జాతీయ క్రికెట్లో కనిపించి దాదాపుగా నాలుగేళ్లయింది.. కొత్త కుర్రాళ్లు వచ్చేశారు. ఐపీఎల్‌లోనూ ఆఖరి దశలో ఉన్నాడు.. తర్వాతి సీజన్లోనూ కనబడతాడో లేదో తెలియదు! ఇలాంటి స్థితిలో ఒక వెటరన్ అనూహ్యంగా విజృంభిస్తే? కుర్రాళ్లను వెనక్కి నెట్టి వికెట్ల వేటలో దూసుకెళ్తే! భువనేశ్వర్ కుమార్ అదే చేస్తున్నాడు. ఈ స్వింగ్ స్టార్ మళ్లీ లేచాడు. 36 ఏళ్ల భువి ఒకప్పటి పదునుతో ఐపీఎల్‌లో అదరగొడుతున్నాడు. ప్రస్తుత సీజన్లో ఇప్పటిదాకా అతడు 9 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి అగ్రస్థానంలో ఉన్నాడు.


భువనేశ్వర్

ఈనాడు క్రీడావిభాగం

2012లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై టీ20 అరంగేట్రంలోనే అదరగొట్టి ఎవరీ కుర్రాడు అని అంతా తనవైపు చూసేలా చేసుకున్నాడు భువనేశ్వర్. ఆ తర్వాత అన్ని ఫార్మాట్లలో భారత్‌కు ప్రధాన పేసర్లలో ఒకడిగా ఎదిగిన భువి.. గాయాల కారణంగా వెనుకబడ్డాడు. ఫిట్‌నెస్ సాధించి భారత జట్టులో పునరాగమనం చేసినా.. కొత్త కుర్రాళ్ల రాకతో అతడికి అవకాశం దక్కలేదు. 2022 నవంబరులో న్యూజిలాండ్‌తో టీ20 తర్వాత భువి టీమ్ఇండియా జెర్సీలో కనబడలేదు. ఐపీఎల్‌లోనూ అతడు పెద్దగా రాణించలేకపోయాడు. దీంతో 2024లో సన్‌రైజర్స్ భువిని వదిలేసింది. 2025 సీజన్ కోసం జరిగిన వేలంలో రూ.10.75 కోట్లు వెచ్చించి భువనేశ్వర్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సొంతం చేసుకుంది. ఆర్సీబీ తనపై ఉంచిన నమ్మకాన్ని అతడు నిలబెట్టుకున్నాడు. గత సీజన్లో 14 మ్యాచ్‌ల్లో 17 వికెట్లు తీసి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ఐపీఎల్‌లో భువి మరింత జోరు మీదున్నాడు. అతను 3 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన మ్యాచ్‌లు 5 ఉండడం విశేషం. దిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో అతడి బౌలింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. 4 ఓవర్లలో 15 డాట్ బాల్స్ వేసి.. కేవలం 5 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. చక్కటి ఇన్‌స్వింగర్లతో పాటు నకుల్ బాల్స్, యార్కర్లు, స్లో బంతులతో ఈ పేసర్ వికెట్లు రాబడుతున్నాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో బట్లర్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన బంతైతే అద్భుతం.

అతడిలాగే సాగితే..: షాట్లకు ఎక్కువ ఆస్కారం ఇవ్వని నియంత్రణతో కూడిన బౌలింగ్.. ఆరు బంతులను భిన్నంగా సంధించే నైపుణ్యంతో భువనేశ్వర్ సత్తా చాటుతున్నాడు. ముఖ్యంగా పవర్ ప్లేలో స్లో బంతులు, యార్కర్లతో బ్యాటర్లను కట్టడి చేస్తున్న తీరును చూడాల్సిందే. సుదీర్ఘమైన ఐపీఎల్ కెరీర్‌లో అతడు ఇప్పటిదాకా 199 మ్యాచ్‌ల్లో 215 వికెట్లు తీశాడు. ఈ లీగ్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన పేసర్ భువినే. బాదుడుకు చిరునామా అయిన ఐపీఎల్ లాంటి టోర్నీలో ఈ పేసర్ కేవలం 7.68 ఎకానమీని నమోదు చేయడం విశేషం. ''ఈ సీజన్లో పర్పుల్ క్యాప్ సాధించడం చాలా సంతోషంగా ఉంది. నేను ఈ వయసులోనూ రాణించడం గొప్పగా అనిపిస్తోంది. జట్టును గెలిపిస్తున్నప్పుడు, వ్యక్తిగతంగానూ అవార్డులు సొంతం చేసుకున్నప్పుడు కచ్చితంగా ఆనందం రెట్టింపు అవుతుంది. ఆర్సీబీ మేనేజ్‌మెంట్ నాకెంతో మద్దతు ఇచ్చింది'' అని భువి అన్నాడు. భువనేశ్వర్ ఊపు చూస్తుంటే ఈ సీజన్లో అతడి ఖాతాలో మరిన్ని వికెట్లు చేరడం ఖాయంగా కనిపిస్తోంది. దాదాపుగా నాలుగేళ్లుగా భారత జట్టులో చోటు దక్కించుకోలేకపోతున్న భువనేశ్వర్ తాజా ప్రదర్శనతో.. టీ20 ఫార్మాట్లోనైనా పునరాగమనం చేసే అవకాశాలను కొట్టి పారేయలేం. పేసర్ ఆశిష్ నెహ్రా సైతం ఐపీఎల్‌లో సత్తా చాటి లేటు వయసులో భారత జట్టులోకి పునరాగమనం చేశాడు అతడి బాటలో భువనేశ్వర్ కూడా నడుస్తాడా? వేచి చూడాలి.

స్వర్ణంతో మెరిసిన కుల్‌దీప్

భువనేశ్వర్: భారత ఇండోర్ ఓపెన్‌లో మధ్యప్రదేశ్ అథ్లెట్ కుల్‌దీప్ కుమార్ స్వర్ణంతో మెరిశాడు. శనివారం ఈ టోర్నీలో పోల్‌వాల్ట్ పోటీలో అతడు 5.41 మీటర్లు ఎత్తు ఎగిరి జాతీయ రికార్డు నెలకొల్పాడు. గత ఏడాది దేవ్‌కుమార్ మీనా (5.40 మీ.) నెలకొల్పిన రికార్డును కుల్‌దీప్ అధిగమించాడు. దేవ్ (5.20 మీ) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. రీగన్ (5.25) రజతం సాధించాడు.

నిరాశపరిచిన భారత రిలే జట్లు


నిత్య


గబోరన్: ప్రపంచ రిలే టోర్నీలో బరిలో ఉన్న అయిదు భారత జట్లు ఫైనల్ చేరడంలో విఫలమయ్యాయి. శనివారం, తొలి రోజు పురుషుల 4×400 మీటర్లలో ధరంవీర్, రాజేశ్, విశాల్, మనులతో కూడిన భారత జట్టు హీట్‌లో 3 నిమిషాల 0.32 సెకన్ల టైమింగ్‌తో నాలుగో స్థానంలో నిలవగా.. 4×100 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో భారత్ (నిత్య, తమిళరసు, అనిమేశ్, స్నేహ) బ్యాటన్‌ను అందుకోవడంలో తప్పు చేయడంతో అనర్హతకు గురైంది. 4×400 మీటర్ల మిక్స్‌డ్ టీమ్‌లో తీర్థేశ్, అన్నా, అమోజ్, రష్‌దీప్ కౌర్‌లతో కూడిన భారత్ 3 నిమిషాల 16 సెకన్లలో రేసును ముగించి ఆరో స్థానంలో నిలిచింది. పురుషుల 4×100 మీటర్ల రిలేలో భారత్ (హర్ష్, రాహుల్, అనిమేశ్, గురిందర్‌వీర్) 39.07 సెకన్ల టైమింగ్‌తో ఎనిమిదో స్థానం సాధించింది. 4×100 మీటర్ల మహిళల టీమ్ విభాగంలో ఈనాడు 'లక్ష్య' అథ్లెట్ నిత్య గందె, సుదేష్ణ, స్నేహ, తమన్నాలతో కూడిన భారత బృందం 43.97 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అయిదో స్థానాన్ని దక్కించుకుంది. తొలి రోజు 3 హీట్స్‌లో టాప్-2 జట్లు ఫైనల్ చేరాయి. అంతే కాక మొత్తంగా రెండు బెస్ట్ టైమింగ్ ఉన్న టీమ్స్ కూడా ముందంజ వేశాయి. ఈ జట్లు 2027 ప్రపంచ ఛాంపియన్‌షిప్ బెర్తులూ సంపాదించాయి.

హైదరాబాదుడుకు ఎదురుందా!

ఐపీఎల్‌లో ఈనాడు

హైదరాబాద్ × కోల్‌కతా
వేదిక: హైదరాబాద్, మ॥ 3.30

గుజరాత్ × పంజాబ్
వేదిక: అహ్మదాబాద్, రా॥ 7.30


ఇషాన్


రింకు

ఈనాడు, హైదరాబాద్: వరుసగా అయిదు విజయాలు.. మొదట బ్యాటింగ్ చేస్తే ప్రత్యర్థి హడలెత్తేలా లక్ష్యం ఉంచడం.. ఛేదించాల్సి వస్తే ఎంతటి లక్ష్యాన్నైనా అందుకోవడం ఇదీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తీరు..! వరుసగా అయిదు విజయాలతో ఊపుమీదున్న ఆరెంజ్ జట్టు ఆదివారం సొంతగడ్డపై కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఢీకొననుంది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ రాకతో రెట్టించిన ఉత్సాహంతో ఉన్న హైదరాబాద్‌ను కోల్‌కతా అడ్డుకోగలదా అన్నది సందేహమే. ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, తర్వాత ఇషాన్ కిషన్, క్లాసెన్‌లలో కనీసం ఇద్దరు మెరుపులు మెరిపిస్తుండడంతో హైదరాబాద్‌కు దూసుకెళ్తోంది. ముంబయితో గత మ్యాచ్‌లో 244 పరుగుల భారీ లక్ష్యాన్ని హైదరాబాద్ కేవలం 4 వికెట్లే కోల్పోయి.. మరో 8 బంతులు ఉండగానే కొట్టేసింది. ముఖ్యంగా ట్రావిస్ హెడ్, క్లాసెన్ మునుపటి స్థాయిలో రెచ్చిపోవడంతో జట్టు చాలా సంతోషంగా ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే ప్లేఆఫ్స్ దిశగా హైదరాబాద్ మరో అడుగు వేస్తుంది. విధ్వంసకారులతో నిండిన హైదరాబాద్‌ను ఆపాలంటే కోల్‌కతా అత్యుత్తమంగా రాణించాల్సిందే. ఈ సీజన్లో కేకేఆర్ 8 మ్యాచ్‌లు ఆడి రెండే గెలిచింది. గత రెండు మ్యాచ్‌ల్లోనే ఆ విజయాలు కూడా దక్కాయి. ముఖ్యంగా లఖ్‌నవూతో గత మ్యాచ్‌లో సూపర్ ఓవర్ వరకు పోరాడి గెలవడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచే ఉంటుంది. బౌలింగ్‌లో ఫర్వాలేదనిపిస్తున్నా.. బ్యాటింగ్‌లో స్థిరత్వం లోపించడం కోల్‌కతాను దెబ్బ తీస్తోంది. కెప్టెన్ రహానె, కామెరూన్ గ్రీన్, రోమన్ పావెల్ స్థాయికి తగ్గట్లు ఆడట్లేదు. రిజర్వ్ బెంచ్‌కే పరిమితం అవుతున్న ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర ఎస్‌ఆర్‌హెచ్‌పై బరిలోకి దిగే అవకాశాలున్నాయి. రాత్రి 7.30 నుంచి అహ్మదాబాద్‌లో ఆరంభమయ్యే మరో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌తో గుజరాత్ టైటాన్స్ తలపడనుంది. వరుస విజయాలతో జోరు మీదున్న పంజాబ్ కింగ్స్.. గత మ్యాచ్‌లో రాజస్థాన్ చేతిలో ఓడింది. మరోవైపు వరుసగా రెండు విజయాలు సాధించిన గుజరాత్ హ్యాట్రిక్‌పై గురి పెట్టింది. మరి పంజాబ్‌ను జీటీ ఓడించగలదా అన్నది ఆసక్తికరం.

డోప్ పరీక్షలంటే.. పారిపోతున్నారు

భారత్‌లో డోపింగ్ సమస్యపై ఐటీఏ డైరెక్టర్

న్యూయార్క్: భారత్‌లో డోపింగ్ సమస్య ఆందోళనకరంగా మారుతోంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల్ని దక్కించుకోవాలని పట్టుదలగా ఉన్న నేపథ్యంలో ఇది భారత్‌కు ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. భారత్‌లో పెరిగిపోతున్న డోపింగ్ కేసులు, పరీక్షలకు ముందే అథ్లెట్లకు సమాచారం అందడం వంటి విషయాలపై అంతర్జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) డైరెక్టర్ బెంజమిన్ కొహెన్ సైతం ఆందోళన వ్యక్తం చేశాడు. ''భారత్‌లో డోపింగ్ సమస్య ఆందోళనకరంగా ఉంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకోవాలంటే భారత్ నిర్మాణాత్మక సంస్కరణలు చేయాల్సివుంది. ముందస్తుగా నోటీసులు అందుతుండడంతో కొందరు అథ్లెట్లు డోపింగ్ పరీక్షల నుంచి తప్పించుకుంటున్నారనే వార్తల్ని కూడా విన్నాం'' అని కొహెన్ పేర్కొన్నాడు. భారత్, ఐటీఏ జతకట్టడం గురించి మాట్లాడుతూ.. ''ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌తో కలిసి పని చేస్తే ఆదొక వ్యవస్థాపరమైన వైఫల్యంగా మిగిలిపోతుందని వెనక్కి తగ్గుతున్నాం'' అని అతను చెప్పాడు.

కివీస్ విజయం

బంగ్లాతో సిరీస్ సమం

మిర్పూర్: బంగ్లాదేశ్‌తో మూడు టీ20ల సిరీస్‌ను న్యూజిలాండ్ 1-1తో ముగించింది. శనివారం ఆఖరిదైన మూడో మ్యాచ్‌లో ఆ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. మొదట బంగ్లా 6.4 ఓవర్లకు 50/3తో ఉన్న సమయంలో వర్షం ఆటకు ఆటంకం కలిగించింది. దీంతో మ్యాచ్‌ను 15 ఓవర్లకు కుదించారు. జోష్ క్లార్క్‌సన్ (3/9), నాథన్ స్మిత్ (2/14), బెన్ సీయర్స్ (2/12)ల ధాటికి బంగ్లా 14.2 ఓవర్లలో 102 పరుగులకే ఆలౌటైంది. తౌహిద్ హృదోయ్ (33; 24 బంతుల్లో 3×4, 2×6), కెప్టెన్ లిటన్ దాస్ (26; 17 బంతుల్లో 3×4, 1×6) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. లక్ష్యాన్ని కివీస్ 11.4 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి అందుకుంది. షోరిఫుల్ ఇస్లాం (3/19) విజృంభించడంతో ఒక దశలో న్యూజిలాండ్ 33/4తో తడబడింది. ఈ స్థితిలో బెవోన్ జాకబ్స్ (62 నాటౌట్; 31 బంతుల్లో 5×4, 3×6) పట్టుదలతో నిలిచి జట్టును గెలిపించాడు. టిమ్ రాబిన్సన్ (23), ఫాక్స్‌క్రాఫ్ట్ (15 నాటౌట్) అతడికి సహకరించారు. సిరీస్ తొలి మ్యాచ్‌లో బంగ్లా గెలవగా.. రెండో టీ20 వర్షం వల్ల రద్దయింది.

సెలవుల్లో సరదాగా!

మెమరీ బుక్ చేసేద్దాం

నేస్తాలూ.. నేడింబునే మళ్లీ వచ్చేశా. ఈ వేసవి సెలవుల్లో మీరు ఎన్నో కొత్త ప్రదేశాలకు వెళ్తారు కదూ! నచ్చిన ఊర్లకు వెళ్లడం, కొత్త స్నేహితులను కలవడం, అమ్మమ్మ ఇంటి దగ్గర ఆటలు ఆడటం.. ఇలా సెలవులంటేనే బోలెడన్ని జ్ఞాపకాలు. మరి ఈ సరదా క్షణాలన్నీ ఎప్పటికీ గుర్తుండిపోయేలా.. మనమే ఒక 'మెమరీ బుక్' తయారు చేసుకుందామా?

దీని కోసం ఒక నోట్‌బుక్ తీసుకోండి. ఈ సెలవుల్లో మీరు దిగే ఫొటోలను పేజీల్లో అతికించండి. ఆ ఫొటో దిగేటప్పుడు జరిగిన విషయాలను సొంతవాక్యాల్లో పక్కనే రాసుకోండి. అలాగే మీరు బస్సులోనో, రైల్లోనో వెళ్లినప్పుడు ఆ టికెట్లను పారేయకుండా మీ మెమరీ బుక్‌లో అతికించండి. ఒకవేళ మీరు పార్కుకు వెళ్తే.. అక్కడ దొరికే రంగురంగుల ఎండిన ఆకులు, పువ్వులను సేకరించండి. బీచ్‌కి వెళ్తే అక్కడ ఉన్న రకరకాల గవ్వలను తెచ్చుకుని మీ బుక్‌లో ఉంచండి. మీతో పాటు ఆడుకున్న స్నేహితుల సంతకాలు తీసుకోవడమే కాదు, వారి ఫోన్ నంబర్లు కూడా అందులో రాసుకోండి. మీరు స్కూల్‌కు వెళ్లిన తర్వాత ఈ మెమరీ బుక్‌ను మీ టీచర్లకు, ఫ్రెండ్స్‌కి చూపించవచ్చు.



పెద్దయ్యాక ఈ బుక్‌ను తీసి చూస్తే.. 'అరే! 2026 సెలవుల్లో నేనెంత ఎంజాయ్ చేశానో కదా!' అని భలేగా అనిపిస్తుంది. మన చిన్ననాటి జ్ఞాపకాలకు ఇదొక అందమైన నిధి లాంటిది.

పంచితే సూపర్‌హీరో!

ఖాళీగా ఉన్నాం కాబట్టి కార్టూన్లు చూస్తుంటాం ఈ సెలవుల్లో. అందులో సూపర్‌హీరోలు బోలెడు మంచి పనులు చేస్తుంటారు కదా! మరి మనమూ చేద్దామా.. ఎలా అంటారా..

ప్రతి ఏడాది మనకు పుట్టినరోజులకో, పండగలకో కొత్తబట్టలు, బొమ్మలు వస్తూనే ఉంటాయి. అలా ఎన్నో పాత బొమ్మలు, మనకు సరిపోని చిన్నప్పటి డ్రెస్‌లు పేరుకుపోయి ఉండి ఉంటాయి. వాటిని అవసరం ఉన్న వారికి ఇస్తే సంతోషపడతారు కదా! ఇందుకోసం ఏం చేయాలంటే..

- మనకు సరిపోని డ్రెస్‌లు, ఆడుకోని బొమ్మలను ఒక దగ్గరకు చేర్చాలి. వాటిలో మీరేం ఇవ్వాలి అనుకుంటున్నారో గుర్తించాలి.
- ఇందులో అమ్మానాన్నల సాయం తప్పకుండా తీసుకోవాలి. వారికి చెప్పే చేయాలి.
- ఆ తర్వాత అవసరంలో ఉన్నవారిని గుర్తించి.. స్వయంగా వారికి అందించాలి.



ఇలా మన వద్ద ఉన్న దాన్ని పంచితే.. మనమే సూపర్ హీరోస్!



మీ పిల్లల కోసమైనా పుస్తకాలు చదవండి

మీకు పుస్తక పఠనంపై ఆసక్తి లేకపోయినా మీ పిల్లల కోసమైనా దాన్ని అలవాటు చేసుకోండి. మీ చిన్నారులకు కథలు గట్టిగా చదివి వినిపించండి. అందులోని పాత్రలను మీ గొంతుతో అనుకరిస్తూ, అభినయించండి. దీనివల్ల మీ పిల్లలకు మూడు ప్రయోజనాలుంటాయి. 1.భాషపై పట్టు, చక్కటి కమ్యూనికేషన్ స్కిల్స్ సొంతమవుతాయి. 2.మానసిక ఆరోగ్యం బాగుంటుంది. 3.చదువులోనూ మెరుగ్గా ఉంటారు.

– లార్క్ డేవిస్, ఇన్వెస్టర్

కాలువల నిర్వహణ పనులకు రూ.397 కోట్లు

మంత్రి రామానాయుడు

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కాలువల నిర్వహణ మరమ్మతు పనులకు రూ.1,100 కోట్లు ఇచ్చినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈ సంవత్సరం కూడా కాలువల నిర్వహణ, తూడు, గుర్రపుడెక్క తొలగింపు, గేట్లు, షట్టర్ల మరమ్మతులు వంటి పనులు చేపట్టేందుకు రూ.397 కోట్లు మంజూరు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'మళ్లీ పంట కాలం మొదలయ్యే లోగా కాలువల పూడిక తీత, ఇతర అత్యవసర పనులన్నీ పూర్తి చేయాలి. ఆ మేరకు వెంటనే పనులు ప్రారంభించాలి. చీఫ్ ఇంజినీర్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. రూ.10 లక్షల లోపు పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో నామినేషన్ పద్ధతిలో అప్పగించాలి. రూ.10 లక్షలు దాటిన పనులకు స్వల్పకాల టెండర్లు పిలిచి పనులు అప్పగించాలి. గేట్లు, షట్టర్ల వంటి మెకానికల్ పనులు తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజినీర్ పరిశీలించి సక్రమంగా పని చేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని చీఫ్ ఇంజినీర్‌కు ఇవ్వాలి' అని మంత్రి పేర్కొన్నారు.


కొత్త జిల్లా కేంద్రాల్లో 16% హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలి

ఏపీ ఐకాస అమరావతి

ఈనాడు, అమరావతి: కొత్తగా ఏర్పాటు చేసిన మూడు జిల్లా కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులకు 16% ఇంటి అద్దె భత్యం చెల్లించాలని ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు కోరారు. "జిల్లా కేంద్రాలైన మదనపల్లె, మార్కాపురం, రంపచోడవరంలో పని చేస్తున్న ఉద్యోగులందరికీ 16% ఇంటి అద్దె భత్యం చెల్లించాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఈహెచ్‌ఎస్ అధికారిక కమిటీ సమావేశాన్ని నిర్వహించి, ప్రధాన సమస్యలపై ప్రభుత్వానికి వెంటనే నివేదిక అందజేయాలి. గతేడాది అక్టోబరు 18న ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో 60రోజుల్లో ఉద్యోగుల హెల్త్‌కార్డు సేవల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దీనిపై చర్యలు తీసుకోవాలి" అని పేర్కొన్నారు.

దళితులను ఇబ్బంది పెడితే ఊరుకోం

రఘురామ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం: మంద కృష్ణ మాదిగ



భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: దళితులను ఇబ్బంది పెట్టి, వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే వారు ఏ స్థాయిలో ఉన్నా ఉమ్మడిగా ఎదుర్కొంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ఆకివీడు పెదపేటలో రామాలయం నిర్మాణంపై హైకోర్టు తీర్పు తర్వాత మా స్పందన ఉంటుంది. ఈ వివాదం అంతా ఉపసభాపతి రఘురామకృష్ణరాజు చుట్టూ తిరుగుతోంది. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తాం. రఘురామకృష్ణరాజు మాటలు దళితులను అవమానిస్తున్నాయా, గౌరవిస్తున్నాయా అనేది తెలుగు నేల, దేశం చూస్తున్నాయి. ఆయన మాటలు దళిత సమాజాన్ని కూటమికి, ప్రభుత్వానికి దూరం చేసేలా ఉన్నాయి' అని చెప్పారు. ఎస్సీలు మతం మారితే రిజర్వేషన్లు పొందలేరని, ఎస్సీ హోదా ఉండదని సుప్రీంకోర్టు చెప్పడం రాజ్యాంగ విరుద్ధమని మంద కృష్ణ మాదిగ అన్నారు. దళితులకు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కొనసాగేలా తాను జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు.

ఇన్‌ఛార్జి డీఎంఈగా రాధికారెడ్డి

ఈనాడు, అమరావతి: వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ వ్యక్తిగత సెలవుపై అమెరికా వెళ్లారు. ఈ నెల 1 నుంచి 15 వరకు ఆయన సెలవు పెట్టారు. దీంతో ఇన్‌ఛార్జి డీఎంఈగా ఏడీఎంఈ డాక్టర్ రాధికారెడ్డికి ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. వైద్యారోగ్య శాఖలో ఓ ఉన్నతాధికారి ఒత్తిళ్లు తాళలేక రఘునందన్ సెలవుపై వెళ్లారనే ప్రచారం సాగుతోంది.

పనులు పునరుద్ధరించాల్సిందే!

- నీటి ప్రాజెక్టుల విషయంలో గుత్తేదార్లకు ప్రభుత్వం స్పష్టీకరణ
- ఒప్పందాల ముందస్తు రద్దు విషయంలో ససేమిరా
- గాడిన పడుతున్న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు



శ్రీకాకుళం జిల్లాలో నిలిచిపోయిన వంశధార-నాగావళి నదుల అనుసంధాన కాలువ లైనింగ్ పనులు

ఈనాడు, అమరావతి: ఉత్తరాంధ్ర నీటి ప్రాజెక్టులను గాడిన పెట్టే క్రమంలో కొన్ని అవాంతరాలను ప్రభుత్వం అధిగమిస్తోంది. పాత సర్కారు హయాంలో నిధుల్లేక బిల్లులు చెల్లించకపోయేసరికి కొందరు గుత్తేదారులు ఏళ్ల తరబడి పనులు చేపట్టలేదు. వారిలో కొందరు ఇప్పుడూ చేతులు ఎత్తేసి... పనుల్ని పట్టించుకోవడం లేదు. తమ ఒప్పందాలను ముందస్తుగా రద్దు చేసుకుంటామని ప్రతిపాదిస్తున్నారు. ప్రభుత్వం ఇందుకు అంగీకరించకుండా ఆయా పనులను పునరుద్ధరించాల్సిందే అని చెబుతోంది. 25%లోపు మాత్రమే పనులు పూర్తయిన ప్రాజెక్టులను.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్డీయే నిలిపివేసింది. ఆ ప్రాజెక్టుల్లో కొన్నింటిని ఆయా ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా ముందుకు తీసుకెళ్లాల్సి ఉంది. అలాంటి ప్రాజెక్టులకు సంబంధించి మళ్లీ ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది.

వంశధారలో ఆ గుత్తేదారు వినతికి నో

వంశధార రెండో భాగం రెండో దశ పనులు 93% పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు పూర్తికి మరో రూ.145.95 కోట్లు అవసరం. కాట్రగడ్డ వద్ద సైడ్ వియర్ నిర్మించి అక్కడి నుంచి వంశధార వరద జలాల్ని హిరమండలం జలాశయానికి మళ్లించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టారు. ప్యాకేజీ 87లో పనులు చేస్తున్న గుత్తేదారు.. తమ ఒప్పందాన్ని ముందుగానే ముగించుకుంటామని జలవనరుల శాఖకు తెలిపారు. ఆ ప్రతిపాదనను ముఖ్యమంత్రి తిరస్కరించారు. దీంతో పనులు పునరుద్ధరించాల్సిందేనని అధికారులు ఆ సంస్థకు నోటీసులు ఇచ్చారు. ఈ ప్యాకేజీలో ఇంకా 5,88,642 క్యూబిక్ మీటర్ల మట్టిపని, 24,293 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పని, 1,06,896 చదరపు మీటర్ల కాంక్రీటు లైనింగ్ చేయాలి.

అనుసంధాన పనులు చేయాల్సిందే

మరోవైపు వంశధార-నాగావళి అనుసంధాన ప్రాజెక్టు పనులు ఎప్పటినుంచో పెండింగులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టును పూర్తిచేస్తే హై లెవల్ కాలువ కింద 5,000 ఎకరాలు, నారాయణపురం ఆనకట్ట కింద 37,053 ఎకరాల స్థిరీకరణ సాధ్యమవుతుంది. 38 గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుంది. రూ.83 కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది. భూసేకరణ సమస్యలున్నాయి. నెల్లూరుకు చెందిన గుత్తేదారు కంపెనీ పనులు చేస్తోంది. ఇంకా 2,23,086 క్యూబిక్ మీటర్ల మట్టిపని, 35,767 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు పనులు చేయాలి. 30 కట్టడాలను నిర్మించాలి. ఈ గుత్తేదారూ.. పనిని ముందుగా రద్దు చేసుకుంటానని జలవనరుల శాఖను సంప్రదించారు. అందుకు అంగీకరించకుండా పనులను తక్షణమే ప్రారంభించాలని అధికారులు నోటీసులు ఇచ్చారు.

మరో 2 ప్రాజెక్టుల్లో అనుమతులు పెండింగ్

- గొట్టు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ పనులూ పెండింగులో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులో ఇప్పటికే కొంతమేర ప్రయోజనాలు సిద్ధించాయి. ఇతర పనులను రూ.1,250.79 కోట్లతో చేపట్టగా 25% లోపు మాత్రమే పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పనులు ఆగిపోయాయి. వీటిని పునరుద్ధరించేందుకు అనుమతివ్వాలని జలవనరుల శాఖ ప్రభుత్వాన్ని కోరింది.
- మడ్డువలస ప్రాజెక్టుకూ ఇదే పరిస్థితి. ఈ ప్రాజెక్టు ప్యాకేజీల్లో 25%లోపు పనులు చేసినందు వల్ల నిలిపివేశారు.

జీఎన్ నాయుడు పార్థివ దేహానికి చంద్రబాబు నివాళి



జీఎన్ నాయుడు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: పారిశ్రామికవేత్త, రీజెన్సీ గ్రూప్ అధినేత జీఎన్ నాయుడు పార్థివ దేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి అర్పించారు. హైదరాబాద్‌లోని జీఎన్ నాయుడు నివాసానికి శనివారం వెళ్లి ఆయన కుటుంబ సభ్యుల్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తెలుగు ప్రజలు ఓ మంచి పారిశ్రామికవేత్తను కోల్పోయారని, రీజెన్సీ స్థాపన ద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో జీఎన్ నాయుడు కీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు.

గంట మోగుతుంది.. అప్రమత్తమవ్వండి

నేడే 'నీట్'.. 180 కేంద్రాల్లో నిర్వహణ

ఈనాడు, అమరావతి: వైద్య విద్యలో ప్రవేశాల కోసం చేపట్టే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) దేశవ్యాప్తంగా ఆదివారం (ఈ నెల 3న) జరగనుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 లోపు పరీక్ష కేంద్రానికి చేరుకున్న అభ్యర్థులను మాత్రమే అనుమతిస్తారు. ఆ తర్వాత గేట్లు మూసేస్తారు. రాష్ట్రంలో నీట్ (యూజీ)-2026 పరీక్షలు 25 పట్టణాల్లో 180 కేంద్రాల్లో జరగనున్నాయి. 45 వేల మంది వరకు అభ్యర్థులు హాజరుకానున్నారు. అత్యధికంగా విజయవాడలో 32 కేంద్రాల్లో 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న నీట్ పరీక్షలపై కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాల అధికారులు శనివారం సమావేశాలు నిర్వహించి, యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, డ్రెస్ కోడ్, కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూ టూత్‌లు లాంటివి తీసుకెళ్లకూడని వస్తువులపై ఇప్పటికే ఎన్‌టీఏ స్పష్టత ఇచ్చింది.

నీట్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు బెల్ టైమింగ్ షెడ్యూలును ఎన్‌టీఏ విడుదల చేసింది: ◆ మధ్యాహ్నం 1.30 (లాంగ్ బెల్): పరీక్ష కేంద్రం గేటు మూసే సమయం ◆ 1.50 (సింగిల్ బెల్): ప్రశ్నపత్రాల బుక్‌లెట్ పంపిణీ ◆ 1.55 (డబుల్ బెల్): జవాబు పత్రాల్ని బయటకు తీయడానికి బుక్‌లెట్ సీల్ తెరవాలి ◆ 2.00 (లాంగ్ బెల్): పరీక్ష ప్రారంభం ◆ 3.00 (సింగిల్ బెల్): పరీక్ష మొదలై గంట పూర్తి ◆ 4.00 (సింగిల్ బెల్): రెండు గంటలు పూర్తి ◆ 4.30 (సింగిల్ బెల్): రెండున్నర గంటలు పూర్తి ◆ 4.45 (సింగిల్ బెల్): పరీక్ష గది తలుపులు మూసివేత ◆ 5.00 (లాంగ్ బెల్): పరీక్ష ముగింపు.

పశుసంతతి పరిశీలన పథకం అమలులో చిత్తూరు జిల్లాకు మొదటిస్థానం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: పశుసంతతి పరిశీలన పథకం అమలులో దేశంలోనే చిత్తూరు జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. జెర్సీ జాతి పశుసంతతి అభివృద్ధి, అధిక పాల దిగుబడులనిచ్చే జన్యు సామర్థ్యం కలిగిన కోడె దూడల పునరుత్పత్తే పశుసంతతి పరిశీలన పథకం(పీటీపీ) ముఖ్య ఉద్దేశం. జాతీయ పాడి అభివృద్ధి సంస్థ(ఎన్‌డీడీబీ) నిధులతో 2013 నుంచి జిల్లాలో ఈ పథకం అమలవుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా పథకం అమలును పరిశీలిస్తే జిల్లా 96.4 శాతం మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా పీటీపీ పథకం డీడీ వాసు తెలిపారు. పశువుల ఎంపిక, పేయదూడల పునరుత్పత్తి, పాల దిగుబడుల నమోదు, పేయ దూడల ప్రదర్శన, కోడె దూడల ఎంపిక తదితర అంశాల పరిశీలనలో అధిక శాతం మార్కులు సాధించినందుకు దేశ స్థాయిలోనే జిల్లాకు మొదటి స్థానం దక్కిందన్నారు. ఎన్‌డీడీబీ అధికారుల చేతుల మీదుగా జులైలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో శ్రీనివాసరావు, జిల్లా డీడీగా తాను అవార్డును అందుకోనున్నామని ఆయన తెలిపారు.

ఎయిడెడ్ మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలి: ఏపీ టీచర్స్ గిల్డ్

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులుగా తేలిన 850 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, ఎల్కే చిన్నప్ప కోరారు. 'రాష్ట్రంలో 702 ఎయిడెడ్ పాఠశాలల్లో 2,700 మంది బోధన, బోధనేతర సిబ్బంది ఉండగా.. జీఓ నంబరు-1 ప్రకారం 850 మందిని మిగులుగా తేల్చారు. ప్రస్తుతం 250 ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకే టీచర్ బోధన చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సీనియారిటీ జాబితా రూపొందించి మిగులు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి" అని పేర్కొన్నారు.

ఒక్కో విద్యార్థిపై రూ.19 వేల ఖర్చు

- పాఠశాల విద్యకు రాష్ట్రంలో తల్లిదండ్రుల వ్యయమిదీ
- జాతీయ సగటు రూ.13,051 కంటే అధికం
- కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పాఠశాల విద్య చదివించేందుకు ఒక్కో విద్యార్థిపై వారి తల్లిదండ్రులు చేస్తున్న వ్యయం జాతీయ సరాసరి కంటే ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కలిపి ఒక్కో విద్యార్థిపై సగటున రూ.19,344 ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో చదువుతున్న ఒక్కో విద్యార్థిపై చేస్తున్న వ్యయం జాతీయ సరాసరి రూ.13,051 ఉండగా.. రాష్ట్రంలో అంతకంటే రూ.6,293 అధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణాల్లో చదువుకు చేస్తున్న ఖర్చు ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చదివించేందుకు ఒక్కొక్కరిపై రూ.14,942 వ్యయం అవుతుండగా.. పట్టణాల్లో రూ.26,784 ఖర్చు చేస్తున్నారు. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన 'భారతదేశంలో మహిళలు, పురుషులు-2025 నివేదిక'లో విద్యపై చేస్తున్న వ్యయ వివరాలను వెల్లడించింది. గతేడాది సెప్టెంబరులో విడుదల చేసిన 'చిల్డ్రన్ ఇన్ ఇండియా' నివేదిక ప్రకారం ఏపీలో ఒక్కో విద్యార్థిపై చేస్తున్న వ్యయం 18,479 ఉండగా.. ఇది తాజా నివేదికకు వచ్చేసరికి రూ.865 పెరిగింది. ఏపీలో ఖర్చు చేస్తున్న దాంట్లో కోర్సు ఫీజుతో పాటు రవాణా, యూనిఫార్మ్, పుస్తకాల కొనుగోలు కోసం ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

దక్షిణాదిలో మూడో స్థానం

దక్షిణాది రాష్ట్రాల్లో పాఠశాల విద్యకు చేస్తున్న వ్యయంలో ఏపీ మూడో స్థానంలో ఉంది. తమిళనాడులో ఒక్కొక్కరిపై రూ.22,338 ఖర్చు చేస్తుండగా.. ఆ తర్వాత తెలంగాణలో రూ.21,652 వ్యయం చేస్తున్నారు. ఆ తర్వాత ఏపీలో రూ.19,344 వ్యయం చేస్తున్నారు. సరిహద్దు రాష్ట్రం ఒడిశాలో అతి తక్కువగా రూ.7,838 మాత్రమే ఖర్చు చేస్తున్నారు. అన్ని దక్షిణాదిరాష్ట్రాల్లోనూ విద్యపై చేస్తున్న వ్యయం జాతీయ సరాసరి కంటే అధికంగా ఉంది. రాష్ట్రంలో బాలికల కంటే బాలురపై చేస్తున్న వ్యయం ఎక్కువగా ఉంటోంది. బాలురను ఎక్కువగా ప్రైవేటు బడులకు.. బాలికలను ప్రభుత్వ బడులకు పంపిస్తున్నారు. దీంతో బాలురపై చేసే వ్యయం ఎక్కువగా ఉంటోంది.

ఒక్కో విద్యార్థిపై వ్యయం (రూ.ల్లో)

రాష్ట్రం	గ్రామీణ	పట్టణం	సరాసరి
ఆంధ్రప్రదేశ్	14,942	26,784	19,344
తెలంగాణ	14,802	31,633	21,652
కర్ణాటక	10,509	34,143	19,107
తమిళనాడు	15,009	29,332	22,338
కేరళ	14,076	19,045	16,518
జాతీయస్థాయి	8,725	23,898	13,051

- 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థుల ప్రవేశాలు పరిశీలిస్తే ప్రైవేటులోనే ఎక్కువ మంది పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ బడుల్లో 32.82లక్షలు ఉండగా.. ప్రైవేటులో 35.41లక్షల మంది పిల్లలు చదువుతున్నారు.
- 2025-26లో ప్రైవేటు బడుల్లో బాలురు 19,81,860 మంది ఉండగా.. బాలికలు 15,59,191మంది ఉన్నారు. ఈ గణాంకాలను పరిశీలించినా బాలికల కంటే బాలురపై చేస్తున్న వ్యయం అధికంగానే కనిపిస్తోంది.
- చాలా ప్రైవేటు పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యకే ఎక్కువ ఖర్చవుతోంది. కొన్ని సీబీఎస్ఈ గుర్తింపు ఉన్న విద్యా సంస్థలు రూ.35వేల నుంచి రూ.50వేలకుపైగా డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. ఇది కాక ఫీజులు అధికంగా ఉంటున్నాయి. పాఠ్యపుస్తకాలను ఆయా విద్యా సంస్థల్లోనే కొనుగోలు చేయాలనే నిబంధనతోనూ అధికంగా వసూలు చేస్తున్నాయి. ఏకరూప దుస్తుల నుంచి బూట్ల వరకు అన్నీ విద్యా సంస్థలే సమకూర్చుతున్నాయి.
- పాఠశాలల పునఃప్రారంభంలో రూ.కోట్లలో విద్యా సంస్థలు వ్యాపారం చేస్తున్నాయి. తల్లిదండ్రుల్లోనూ చదువుపై అవగాహన పెరగడంతో పిల్లల చదువుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో విద్యపై చేసే ఖర్చు క్రమంగా పెరిగిపోతోంది.

సీఐ చిన్నమల్లయ్య సస్పెన్షన్

మహిళపై అత్యాచారం నేరారోపణల నేపథ్యంలో చర్యలు



చిన్నమల్లయ్య

వినుకొండ/రూరల్, న్యూస్‌టుడే: ఓ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారన్న నేరారోపణలు ఎదుర్కొంటున్న పల్నాడు జిల్లాకు చెందిన సీఐ చిన్నమల్లయ్యపై గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం సస్పెన్షన్ వేటు వేశారు. ఇంట్లో ఒంటరిగా ఉండగా చిన్నమల్లయ్య తనపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధితురాలు గత నెల 29న వినుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రాథమిక ఆధారాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. కొన్నాళ్ల క్రితం వరకు సీఐడీలో పని చేసి, ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న చిన్నమల్లయ్య.. 2024లో కారంపూడిలో ఓ తెదేపా నాయకుడిని తుపాకీతో బెదిరించారు. తర్వాత మరోసారి వాట్సప్ కాల్ చేసి హెచ్చరించారనే విమర్శలున్నాయి. వినుకొండలో ప్రతిపక్ష పార్టీల నాయకులను అసభ్య పదజాలంతో దూషించి.. భయభ్రాంతులకు గురిచేశారని, 2024 సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు స్వీపర్‌కాలనీ యువకులను అకారణంగా కొట్టారనే ఆరోపణలున్నాయి. మరోవైపు చిన్నమల్లయ్య వేరొక మహిళతో రాసలీలలు సాగిస్తున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

పారిపోయేందుకు పోలీసులే ఉప్పందించారా?

ఓ మహిళ మీపై కేసు పెట్టిందని, ఉన్నతాధికారులు మిమ్మల్ని అరెస్టు చేయాలని ఆదేశించారనే.. కీలక సమాచారాన్ని వినుకొండ పట్టణ పోలీసు స్టేషన్‌లోని కిందిస్థాయి సిబ్బంది చిన్నమల్లయ్య దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో నిందితుడు తనపై కేసు నమోదైన వెంటనే పరారయ్యాడు. గతంలో రెండేళ్లు సైబర్‌క్రైం విభాగంలో పనిచేసిన అనుభవం ఉండడంతో ప్రస్తుతం ఫోను వాడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో చిన్నమల్లయ్య ఆచూకీ కనిపెట్టడం పోలీసులకు సవాలుగా మారింది. మరోవైపు అతని కుమారుడు ఇటు వినుకొండ పోలీసులను, అటు బాధితురాలిని ఫోన్‌లో బెదిరిస్తుండటం గమనార్హం. అందరి సంగతి కోర్టులో తేలుస్తానని సందేశాలు పంపిస్తున్నాడని తెలిసింది.

అక్రమాల 'వామన'కు లైన్ క్లియర్!

- గత ప్రభుత్వ హయాంలో సిలికా శాండ్ దందా చేసిన సంస్థలు
- తవ్వకాలు, విక్రయాల్లో వాటిదే హవా
- ఇప్పుడు జరిమానాల రద్దుతో పాత నిల్వల విక్రయాలకు అవకాశం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తిరుపతి జిల్లాలో సిలికా శాండ్ దందా చేసిన వామన సంస్థలు.. అప్పట్లో విక్రయించలేకపోయిన 2 లక్షల టన్నుల నిల్వలకు ఇప్పుడు లైన్ క్లియరైంది. వామన సంస్థలకు గతంలో జరిమానాలు విధిస్తూ ఇచ్చిన డిమాండ్ నోటీసులను, ఉల్లంఘనలకు పాల్పడ్డారంటూ ఇచ్చిన షోకాజ్ నోటీసులను క్లియర్ చేశారు. జరిమానాలు లేకుండా చేశారు. గాజు, రంగుల పరిశ్రమల్లో ఎక్కువగా వినియోగించే సిలికా శాండ్ తిరుపతి జిల్లా చిల్లకూరు, కోట మండలాల్లో పెద్దఎత్తున లభిస్తుంది. ఈ ప్రాంతంలో 76 లీజులు ఉండగా, వాటిలో ఉల్లంఘనలు ఉన్నాయంటూ లీజుదారులకు, మినరల్ డీలర్ లైసెన్స్‌దారుల(ఎండీఎల్స్)కు వైకాపా హయాంలో నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత చెన్నై మైనింగ్ వ్యాపారికి చెందిన వాళ్లు.. శ్రీవామన ఎంటర్‌ప్రైజెస్, వామన ఫ్యూచర్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, గామా ఎంటర్‌ప్రైజెస్, వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పేరిట.. సిలికా శాండ్ వ్యాపారం కోసం ఎండీఎల్స్ లైసెన్స్ తీసుకున్నారు. ఈ ప్రాంతంలో తవ్విన సిలికా శాండ్ అంతా తమకే ఇచ్చేలా హుకుం జారీచేశారు. పాత ఎండీఎల్స్‌దారులు కావాలంటే.. ఈ సంస్థలు చెప్పిన ధరకే కొనేలా చూశారు. అప్పట్లో టన్ను రూ.1,450కి విక్రయించి, సగం సొమ్మునే ఆన్‌లైన్‌లో తీసుకొని, మిగిలినది నగదు రూపంలో వసూళ్లు చేసి భారీగానే దందా చేశాయి. ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారం తవ్వేసిన సిలికా శాండ్‌ను వామన సంస్థల యార్డుల్లో నిల్వ చేసి, విక్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పట్లో ప్రభుత్వ పెద్దలకు ప్రతినెలా భారీ మొత్తమే సమర్పించేవారు. ఇటువంటి సంస్థలకు చెందిన పాత నిల్వలు అమ్ముకునేందుకు అవకాశం కల్పించడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

జరిమానాలు లేకుండా..

వామన సంస్థల ఎండీఎల్స్ యార్డుల్లో 2 లక్షల టన్నులకు పైగా నిల్వలు ఉండగా.. అప్పటి వైకాపా పెద్దలతో వివాదం ఏర్పడింది. దీంతో 2022-24 మధ్య నిల్వలు విక్రయించకుండా ఆపేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక అన్ని లీజులు, ఎండీఎల్స్ యార్డుల్లో అధికారులు తనిఖీలు చేశారు. ఉల్లంఘనలపై షోకాజ్ నోటీసులు, జరిమానాతో డిమాండ్ నోటీసులు జారీచేశారు. వామన సంస్థలకూ ఇచ్చారు. వీటిపై ఆ సంస్థలు గనులశాఖ మంత్రి వద్ద రివిజన్‌కు పెట్టుకుంటే.. కొద్ది రోజుల కిందటే క్లియరెన్స్ లభించింది. వామన యార్డుల్లో నిల్వల కంటే.. ఆ సంస్థ వద్ద పర్మిట్ల పాసులు ఎక్కువగా ఉన్నాయని చూపించి.. జరిమానాలు లేకుండా చేశారు. వాస్తవానికి వామన సంస్థ గతంలో చేసిన ఉల్లంఘనలపై జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో 2 కేసులు ఉన్నాయి. గ్రీన్ సొసైటీ కోస్టల్ కారిడార్ వేసిన కేసుల్లో.. ఈ సంస్థలనూ పార్టీలుగా చేసింది. అయినా సరే వాటి ఎండీఎల్స్ యార్డుల్లోని నిల్వల అమ్మకాలకు రంగం సిద్ధం చేసుకుంటోంది.

టర్న్‌కీదే.. వామన

వైకాపా హయాంలో రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలను జేపీ పవర్ వెంచర్స్ సంస్థ చేపట్టగా, ఉప గుత్తేదారుగా తమిళనాడుకు చెందిన టర్న్‌కీ సంస్థ రంగప్రవేశం చేసింది. తిరుపతి జిల్లాలో సిలికా శాండ్ వ్యాపారం చేసిన వామన సంస్థలు.. టర్న్‌కీ నేతలకు చెందినవే. కొందరు డైరెక్టర్లు ఈ రెండింట్లోనూ ఉన్నారు.

వైకాపా కార్యకర్త ఆధ్వర్యంలో గంజాయి అమ్మకాలు

- ఆరుగురిని అరెస్టు చేసిన పోలీసులు
- 9.8 కిలోల గంజాయి స్వాధీనం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గంజాయి అమ్మకాలకు సంబంధించి పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన వైకాపా కార్యకర్త గుంజి రామాంజనేయులుతోపాటు మరో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 9.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం పిడుగురాళ్ల పట్టణ పోలీసుస్టేషన్‌లో గురజాల డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 'గుంజి రామాంజనేయులు ఆధ్వర్యంలో తంగెడ గ్రామానికి చెందిన బాలుడు, అమరావతి మండలం అత్తలూరు గ్రామానికి చెందిన బత్తుల హృదయరాజు ఒడిశా సరిహద్దులోని సీలేరులో గంజాయిని కిలో రూ.5 వేల చొప్పున కొనుగోలు చేసేవారు. దాన్ని తీసుకొచ్చి పిడుగురాళ్ల పట్టణానికి చెందిన బాగం పిచ్చయ్య, కొమెర శివబాలాజీ, సన్నాయిల కుమారస్వామిలకు కిలో రూ.10వేల చొప్పున విక్రయించేవారు. వీరు దాన్ని 10 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి అమ్మేవారు. పిడుగురాళ్లలోని డ్రైవర్స్ కాలనీ సమీపంలో పట్టణ సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్సై డి.శివనాగరాజులు ఆధ్వర్యంలో ఆరుగురినీ అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుంజి రామాంజనేయులు గత ఎన్నికల సమయంలో తంగెడలోని తెదేపా వారికి చెందిన దుకాణాలపై పెట్రోలు బాంబులు వేశారని, అక్రమంగా మద్యం రవాణా చేశారని దాచేపల్లి, మాచవరం పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. అతనిపై రౌడీషీట్ ఉంది' అని డీఎస్పీ వివరించారు.

వసుంధర

vasundhara@eenadu.in

నవ్వొచ్చుగా... అందంగా ఉంటావ్!



అందంగా కనిపించాలి... ఆరోగ్యకరమైన చర్మం కావాలని ప్రతి అమ్మాయీ కోరుకుంటుంది. కాబట్టే కదా ఎన్నెన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఖరీదైన క్రీములు రాయడానికీ వెనకాడరు. వీటి అవసరం లేకుండా సహజంగా మెరవాలా? అయితే నవ్వమంటారు నిపుణులు. నవ్వినప్పుడు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. దీంతో ఆక్సిజన్ సరఫరా చర్మానికి బాగా జరుగుతుంది. టాక్సిన్లు బయటకు పోయి... పోషకాల సరఫరా జరుగుతుంది. చర్మమూ మెరుస్తుంది. చుట్టూ ఏం జరుగుతోందన్న బెంగ లేకుండా ఆనందంగా పకపకా నవ్వేయండి. ముఖంలోని 43 ఎముకలకీ వ్యాయామంలా పనిచేస్తుంది. కొల్లాజెన్ ఉత్పత్తి అవ్వాలన్నా... వృద్ధాప్యఛాయలు త్వరగా దరిచేరొద్దన్నా ఇదే మందు. చర్మం నిర్జీవంగా కనిపించడం, ముఖమ్మీద మొటిమలకు సగం కారణం... ఒత్తిడే! నవ్వు ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్‌ని తగ్గిస్తుంది. ఈ సమస్యలకీ చెక్ అన్నమాట. నవ్వు శరీరానికి సహజ డీటాక్సిఫికేషన్‌గానూ పనిచేస్తుంది. ఇవన్నీ కాకపోయినా ముఖానికి వన్నె తెచ్చేది... అందమైన చిరునవ్వే! అందుకే దాన్ని మీ పెదాల మీద ఎప్పుడూ ఉండేలా చూసుకోండి... సరేనా?

గుడ్లు, టొమాటోలతో కొట్టరన్న ధీమాతో!

'నవ్వడం ఒక భోగం... నవ్వించడం ఒక యోగం... నవ్వకపోవడం ఒక రోగం...' టెకీగా తన జీవితాన్ని కొనసాగిస్తున్న సుష్మా చిట్టాను ప్రభావితం చేసిన మాటలివి. స్టాండప్ కమెడియన్‌గా రాణిస్తున్న ఆమెను 'వసుంధర' పలకరించగా తన ప్రయాణాన్ని చెప్పుకొచ్చారిలా...



స్టాండప్ కామెడీనే ఎందుకు...

వేడుకలు, గెట్ టు గెదర్ పార్టీలు, పుట్టిన రోజులు... ఇలా ఏదైనా అమ్మ లక్ష్మీ సుజాత మైక్ అందుకునేది. వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలైనా... ఒక్కసారి మైక్ పట్టుకుందంటే నవ్వుల పువ్వులు పూయించాల్సిందే. ఇతరుల్ని ఇమిటేట్ చేయడం, స్పాంటేనియస్‌గా జోకులు వేయడం చూస్తూ పెరిగానేమో... నాకూ ఆ కళ అబ్బింది.

కమెడియన్‌గా కాకుండా...

మాది విజయవాడ. నాన్న నాగ సుందర దేవ్, ఎన్‌టీపీసీ ఉద్యోగి. దాంతో రామగుండం, విశాఖల్లోని టౌన్‌షిప్స్‌లో గడిచింది బాల్యమంతా. బీటెక్‌ని హైదరాబాద్‌లోనే పూర్తిచేశా. తర్వాత మూడేళ్లు బెంగళూరులో ఐటీ ఉద్యోగం చేశా. ఈ క్రమంలోనే 2017లో ఒక కామెడీ షోకి వెళ్లాను. అది చూశాకే నేనూ ఇలా చేస్తే బాగుణ్ను అనిపించింది. కానీ పెళ్లి, పాప పుట్టడం, తర్వాత కొవిడ్ రావడం ఇలా ఏళ్లు గడిచిపోయాయి.

మొదటి అవకాశం...

2022లో అనుకుంటా... మా కంపెనీలో చిన్న పార్టీ ఏర్పాటు చేశారు. 'పాడేవాళ్లు, డ్యాన్స్ చేసే వాళ్లు ఉన్నారా... వేదికంతా మీదే' అంటూ పిలిచారు. అప్పుడే... నేను జోక్స్ చెప్పాలి అనుకున్నా. నవ్వించగలను అన్న నమ్మకం లేదు కానీ... ఒక్కసారి నా అదృష్టాన్ని పరీక్షించుకుందామనే వేదిక మీదకు వెళ్లా. పైగా, అందరూ మా వాళ్లే... బాగోకపోయినా టొమాటోలు, గుడ్లు విసిరే అవకాశం లేదన్న ధీమా.

ఇంతకీ నవ్వించారా...

మామూలుగా కాదు... 10 నిమిషాలే టైమ్ అని చెప్పి మైక్ ఇచ్చిన వాళ్లు 45 నిమిషాలైనా 'ఆపు, చాలు' అనలేదు. ఆ రోజు నేను చెప్పిన జోక్స్ అన్నీ పేరెంటింగ్ సాధకబాధకాల మీదే. అప్పటికి మా పాపకు మూడేళ్లు. కొత్తగా తల్లైన అనుభవం తోడై... డైపర్లు మార్చడం నుంచి చుట్టుపక్కల వాళ్ల సూటిపోటి మాటల వరకూ ప్రతిదీ నా స్క్రిప్ట్‌కి అనుకూలంగా మార్చుకున్నా. ఆరోజు మోగిన చప్పట్లు, మెచ్చుకోళ్లే... ఈ రంగం మీద ఆసక్తిని మరింత పెంచాయి.

మిగతా వాళ్లకీ మీకూ తేడా...

ఆ షో తర్వాత ఓపెన్ మైక్స్‌కి వెళ్లడం మొదలుపెట్టా. అదనపు నైపుణ్యాలు సంపాదించుకోవాలనే నా ప్రయత్నం. కానీ, రెండుమూడు చూశాక విసుగొచ్చింది. అంతా డార్క్, అడల్ట్ కామెడీనే. కుటుంబమంతా కలిసి సరదాగా సమయం వెచ్చించే ఒక్క షో కూడా కనిపించలేదు. ఒక విధంగా ఇది నాకు ప్లస్ పాయింట్ అయ్యింది. షోలు ఇవ్వడం మొదలుపెట్టా. ఉదయం కాచే టీ నుంచి ట్రాఫిక్ కష్టాలు, మండిపోతున్న ఎండలు, ఎన్నారైలు ఇండియాకి వస్తే వాళ్ల పరిస్థితి... ఇవే నా కంటెంట్. పైగా, మ్యూజికల్ కామెడీ చేయడంలో దిట్ట నేను. పాటల లిరిక్స్‌ని పరిస్థితులకు అనుకూలంగా మార్చి... హాస్య గీతాలు పాడుతుంటా.

మరచిపోలేని షో...

రెండేళ్ల క్రితం పీరియడ్ పావర్టీ మీద కామెడీ చేసే అవకాశం వచ్చింది. ఎంత క్లిష్టమైన అంశం? నావల్ల కాదు అన్నా. కానీ సంబంధిత కార్యక్రమం నిర్వహించింది నా స్నేహితురాలే. దాంతో షో చేయాల్సిందే అని పట్టుబట్టింది. మూడు రోజులు కష్టపడి స్క్రిప్ట్ రాసుకుని వెళ్లా. తీరా చూస్తే... అక్కడున్న డెలిగేట్స్‌కి ఇది ఏ మాత్రం రుచించదు అనిపించింది. కానీ, అది పెద్ద హిట్. పరిశుభ్రత, భయం, సంప్రదాయాల పేరుతో తలా తోక లేని పద్ధతుల వల్ల నేను ఎదుర్కొన్న ఇబ్బందుల్నే కంటెంట్‌గా చేశా. అప్పట్నుంచే నా ప్రతి షో చివరిలో మహిళల కష్టాలు, అమ్మల బాధ, ఉనికి పట్ల సందేశం ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నా.

మీ విజయాలు...

ప్రస్తుతం సర్వీస్ నౌలో సీనియర్ మేనేజర్‌గా పనిచేస్తున్నా. ఉద్యోగం చేస్తూనే స్టాండప్ కమెడియన్‌గానూ రాణిస్తున్నా. నా భర్త, అమ్మానాన్నలు అందించే ప్రోత్సాహం చాలానే. ఇంట గెలిచి రచ్చ గెలవమంటారుగా అందుకే. పురస్కారాల విషయానికొస్తే... 2025లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ స్త్రీశక్తి అవార్డు ఇచ్చింది. 2026 మార్చిలో ఇన్‌ఫ్లుయెన్సర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నా.

మీ లక్ష్యం...

చిన్నా పెద్దా తేడా లేకుండా కుటుంబ సమేతంగా అందరూ స్టాండప్ కామెడీషోస్‌కి వచ్చి నవ్వుకోవాలి. బాధలన్నీ కొన్ని నిమిషాలైనా మరచిపోగలగాలి. భారమైన మనసుతో వచ్చినవాళ్లంతా హాయిగా నవ్వుకుంటూ ఇంటికి వెళ్లాలి.

మహిళలు ఎక్కువగా నవ్వుతారా?

మహిళల అందమైన నవ్వు వెనక ఎన్నో ఆసక్తికరమైన విషయాలు, మరెన్నో ఆరోగ్య రహస్యాలు ఉన్నాయి. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా...

- మహిళల మెదడులోని 'లింబిక్ సిస్టమ్', ముఖ్యంగా భావోద్వేగాలను నియంత్రించే భాగాలు, పురుషుల కంటే కాస్త భిన్నంగా, చురుగ్గా పనిచేస్తాయట. అందుకే మహిళలు భావోద్వేగాలను (నవ్వు లేదా ఏడుపు) వ్యక్తపరచగలరని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధన చెబుతోంది.
- న్యూరో సైంటిస్ట్ రాబర్ట్ ప్రొవైన్ తన 'లాఫర్ ఏ సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్' పుస్తకంలో మహిళలు... పురుషుల కంటే ఎక్కువగా నవ్వుతారు. ఇది హాస్యం కోసమే కాకుండా, ఎదుటివారితో సత్సంబంధాలను ఏర్పరచుకోవడానికే అని చెప్పారు.
- నవ్వు వల్ల రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ పరిశోధనల ప్రకారం, తరచుగా నవ్వడం వల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. రోజూ హాయిగా నవ్వేసే మహిళలకు గుండెపోటు వచ్చే అవకాశం 40శాతం తక్కువట.
- ఓ స్లీప్ రిసర్చ్ జర్నల్ ప్రకారం నవ్వడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు, సెరటోనిన్ వంటి ఫీల్ గుడ్ హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి ఒత్తిడిని తగ్గించి, మంచి నిద్ర పట్టేలా చేస్తాయి. అంతేకాదు, నవ్వే మహిళలకు నిద్రలేమి తక్కువేనట.
- తల్లి సంతోషంగా ఉన్నప్పుడు విడుదలయ్యే హార్మోన్లు ప్లాసెంటా ద్వారా బిడ్డకు చేరతాయి. తల్లి నవ్వినప్పుడు అందే ఆక్సిజన్, సానుకూల హార్మోన్లు బిడ్డ ఎదుగుదలకు, ముఖ్యంగా వాళ్ల నాడీ వ్యవస్థ అభివృద్ధికి మేలు చేస్తాయని చెబుతోంది ఓ అధ్యయనం. అంతేకాదు, రోజూ పదిహేను నిమిషాల పాటు మనస్ఫూర్తిగా నవ్వడం వల్ల దాదాపు 40 కెలొరీల వరకూ శక్తి ఖర్చవుతుంది.
- నవ్వు నిజంగానే అంటువ్యాధి వంటిది. మెదడులోని మిర్రర్ న్యూరాన్లు ఎదుటివారు నవ్వినప్పుడు మనల్ని కూడా తెలియకుండానే నవ్వేలా చేస్తాయి. మహిళల్లో సామాజిక స్పందన ఎక్కువగా ఉండటం వల్ల ఈ ప్రభావం మరింత వేగంగా కనిపిస్తుంది. అందుకే, నవ్వేద్దాం... అందరినీ ఆరోగ్యంగా ఉంచుదాం. ఏమంటారు?



చిన్నారి వ్యాపారి

సమ్మర్ ఛాలెంజ్...

పిల్లల్లో ఎన్ని విభిన్నమైన నైపుణ్యాలు ఉంటే వాళ్ల ఎదుగుదలకు అంత మేలు. చదువుకు సంబంధించిన నైపుణ్యాలు ఏడాదంతా నేర్చుకునేవే. ఈ సెలవుల్లో ఇంకా ప్రత్యేకమైనవి నేర్పే ప్రయత్నం చేయండి. వాటిలో వ్యాపార నైపుణ్యం చాలా కీలకం. పిల్లలకా అని సందేహించొద్దు. ఇప్పుడు టీనేజర్లూ సొంత ఆలోచనలతో వ్యాపార సంస్థల్ని పెడుతున్నారు. సమస్య, అవసరాల్ని గుర్తించి వాటికి పరిష్కారం చూపడం దీన్లో ముఖ్యం. ఆ దిశగా మీ పిల్లల్ని ప్రోత్సహించండి. దీనికోసం ముందు వాళ్లలో ఉండే ప్రత్యేక లక్షణాల్ని గుర్తించండి. ఉదాహరణకు వేసవిలో శీతల పానీయాలకు డిమాండ్ ఉంటుంది. దాహార్తిని తీర్చుకోవడానికి నిమ్మకాయ షర్బత్, రాగిజావ, మజ్జిగ లాంటి వాటికోసం చూస్తారంతా. కుట్లు, అల్లికలు లాంటివి వస్తే కుట్టిన వాటిని అమ్మకానికి పెట్టొచ్చు. లేదు, ఇంట్లోనే మీరు చిరుతిళ్లు, పిండివంటలు లాంటివి తయారుచేసిచ్చి... వాటిని అమ్మమనండి. ఉత్పత్తిని ఎంపికచేసుకున్నాక అది ఎక్కడ అమ్మితే బావుంటుందో ఆలోచించమనండి. సాధ్యమైనంతవరకూ ఇంటికి దగ్గర్లోని ప్రాంతాన్ని ఎంపిక చేసుకోండి. పార్కులు లేదంటే, మీ అపార్ట్‌మెంట్, కాలనీ, ఊరు... ఇలా ఏదైనా కావొచ్చు. అవసరమైతే ఉత్పత్తుల గురించి అందరికీ ముందే స్పష్టంగా తెలిసేలా జాగ్రత్తపడండి. పరోక్షంగా మీరూ అన్నీ గమనిస్తుండండి. ఇలా చేస్తే పిల్లలకు వ్యాపారంలో ప్రాథమిక అంశాలైన.. పెట్టుబడి, అమ్మకం, కొనుగోలు, లాభనష్టాలాంటివి అనుభవపూర్వకంగా తెలుస్తాయి. వీటితో ఆత్మవిశ్వాసం, డబ్బు విలువ, ఓపిక, కొత్తవాళ్లతో బెరుకులేకుండా మాట్లాడటం... లాంటి లక్షణాలు పెంపొందుతాయి. ఎంత వెచ్చించినా దొరకని నైపుణ్యాలివి. ఒక రోజు, వారం, నెల... వీలుని బట్టి చేయమనండి.



మీ పిల్లలు ఈ వేసవిలో చేపట్టిన ప్రాజెక్టు వివరాలు, ఫొటోతో సహ పంపిస్తే వాటిని వసుంధర.నెట్‌లో పెడతాం.

మెయిల్ ఐడీ: vasundhara@eenadu.in, వాట్సాప్: 9154091911కు పంపవచ్చు.

పాప రంగు పెరిగేదెలా?

డియర్ వసుంధర

మా అమ్మాయి వయసు 10 ఏళ్లు ఛాయ తక్కువ. తను రంగు రావాలంటే ఏం చేయాలి? పిల్లలకు చిన్న వయసులోనే లైటనింగ్ క్రీములు, సబ్బులు వాడొచ్చా? వాటి వల్ల భవిష్యత్తులో ఏమైనా సమస్యలు వచ్చే అవకాశం ఉందా? - శ్రీప్రియ, కరీంనగర్



- నూరవనేని పద్మావతి, డెర్మటాలజిస్ట్

చర్మ రంగు అనేది అనువంశికం. అంటే తల్లిదండ్రులు లేదా తాతముత్తాతల చర్మఛాయే పిల్లలకూ వస్తుంది. సాధారణంగా మన భారతీయుల చర్మం గోధుమ వర్ణంలో ఉంటుంది, కాబట్టి మీ అమ్మాయి కొంచెం రంగు తక్కువగా ఉండి ఉండొచ్చు. తను తెల్లగానే కనిపించాలని మీరు కోరుకోవాల్సిన అవసరం ఏమీ లేదు. శరీరవర్ణం ఎలా ఉన్నా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. ఇందుకోసం వయసుకి తగ్గట్లు మంచి పౌష్టికాహారం ఇవ్వాలి. అంటే పండ్లు, కూరగాయలు, మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహారం, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు ఉన్న నట్స్, సీడ్స్, ఫిష్ వంటివి తన డైట్‌లో ఉండేలా చూసుకోండి. దీంతో చర్మం లోపలి నుంచి ఆరోగ్యంగా ఉండి మెరుస్తుంది. శరీరమంతా ఒకే రంగులో ఉంటుంది. ఇక, మన వాతావరణంలో ఎండ ఎక్కువగా ఉంటుంది కాబట్టి దానివల్ల చర్మం నల్లబడవచ్చు. దీనికోసం పిల్లల చర్మానికి సరిపడే సన్‌స్క్రీన్స్ వాడవచ్చు. ఇందులో ఫిజికల్ బ్లాకర్స్ అంటే, రసాయనాలు లేని ఎస్‌పీఎఫ్ 30-50 ఉన్న జింక్ ఆక్సైడ్, టైటానియం డయాక్సైడ్ ఆధారిత సన్‌స్క్రీన్ లోషన్‌లను ఎంచుకోవడం మంచిది. చిన్నారుల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి, ఈ వయసులో స్కిన్‌లైటనింగ్ క్రీములు రాయడం, చికిత్సలు చేయించడం అంత మంచిది కాదు. రంగు గురించి చింతించకుండా పాప చర్మం ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడం మంచిది. ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని నింపండి.

నాన్నకోసం... ట్రాక్టర్ డ్రైవింగ్!



అమ్మాయిలు బైక్ రేసుల్లో కార్ రేసుల్లో పాల్గొంటున్నారు. విమానాలు నడుపుతున్నారు. అంతరిక్షనౌకల్లోనూ ప్రయాణిస్తున్నారు. కానీ నేటికీ కొన్ని వాహనాలు పురుషులు మాత్రమే నడపగలరు అనుకుంటారు. వాటిల్లో ఒకటి ట్రాక్టర్. దాన్ని ఛాలెంజింగ్‌గా తీసుకుని ట్రాక్టర్ నడుపుతోంది హరియాణాకు చెందిన ముస్కాన్. సాగులో తండ్రికి చేదోడువాదోడుగా ఉంటోంది!

ముస్కాన్‌ది జింద్ జిల్లాలోని దూమర్‌ఖా కలన్ గ్రామం. తండ్రి ప్రవీణ్ గర్గ్. ఆయనకు నలుగురు కూతుళ్లు. సాగుతోపాటు కుటుంబ బాధ్యతలన్నీ ఇంటి పెద్దగా ఆయనే చూసుకునేవారు. తమ్ముడు సహాయంగా ఉండేవాడు. ఉన్నట్టుండి అతను చనిపోవడంతో అన్ని పనులూ ప్రవీణే చూసుకోవాల్సి వచ్చేది. అది చూసిన పెద్ద కూతురు ముస్కాన్... చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలను భుజానకెత్తుకుంది. ఆడపిల్లలు ఏ విషయంలోనూ పురుషులకు తీసిపోరని నిరూపించింది. అలా అని చదువును నిర్లక్ష్యం చేయలేదు. ప్రస్తుతం 12వ తరగతి చదువుతోంది. తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారి ట్రాక్టర్ స్టీరింగ్‌ను పట్టుకుంది. తర్వాత డ్రైవింగ్‌లో పూర్తి ప్రావీణ్యం సంపాదించింది. బాబాయ్ కోరిక మేరకు పోలీస్ ఉద్యోగాన్ని సాధించేందుకూ కష్టపడుతోంది. చదువునూ సాగునూ సమన్వయం చేసుకుంటూనే పోలీసు నియామక పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ట్రాక్టర్‌తో పొలాలను దున్నడం నుంచి పశువుల కోసం ఎండుగడ్డిని సిద్ధం చేసే పనుల్నీ సునాయాసంగా చేస్తోంది ముస్కాన్. స్కూల్ నుంచి ఇంటికి రాగానే పొలం వెళ్లి కష్టపడుతోన్న ముస్కాన్‌ని చూసి గ్రామీణులూ ఆశ్చర్యపోతున్నారట. ఆ వీడియోల్ని సోషల్‌మీడియాలో అప్‌లోడ్ చేయడంతో అవి కాస్తా వైరల్ అయ్యాయి. నెటిజన్లూ ఆమె మీద ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు నిరాశకు గురయ్యే వేలాది మంది బాలికలకు, ముస్కాన్ ప్రేరణ' అంటున్నారు.

'నాన్నకు కొడుకు లేని లోటు తెలియకూడదు. అందుకే ఏ పని చేయాల్సి వచ్చినా నేను ముందుంటా' అని ముస్కాన్ అంటే, 'నిజానికి అబ్బాయిల కంటే ఎక్కువగా కష్టపడుతుంద'ని ఆమె తండ్రి ప్రవీణ్ చెబుతుంటారు. 'నేను 30 ఎకరాల్లో గోధుమ సాగు చేస్తున్నా. పంట వ్యర్థాలను పశువుల మేతగా మార్చే పని ముస్కాన్‌కే అప్పగిస్తా. ఆమె కోసం ఎన్నిరోజులైనా వేచి ఉంటా. ప్రతి పనీ ఆమె ఎంతో శ్రద్ధగా చేస్తుంది. శారీరక శ్రమతో కూడిన ఈ పనుల్లో అమ్మాయిలు అరుదు. అలాంటిది మా ముస్కాన్ సాధించింది. ఆమె మా గ్రామానికే కాదు, హరియాణాకే గర్వకారణం' అని స్థానిక రైతు సూరజ్‌మల్ చెబుతున్నారు. అబ్బాయిలు, అమ్మాయిల పని అన్న తేడా లేకుండా ఎవరైనా ఏదైనా చేయగలరు అన్నదాన్ని ముస్కాన్ నిజం చేస్తోంది కదూ!

ఈటీవీ భారత్

కామెడీ క్వీన్ తరగతిలో జోకర్!

జోకులు వినడాన్నీ, ఆస్వాదించడాన్నీ అందరూ ఇష్టపడతారు. కానీ తమపై తాము వేసుకోవడానికి ముందుకొస్తారా? తమ బాధలతో ఇతరులు నవ్వేలా ఎవరైనా చేస్తారా? ఉరూజ్ అష్ఫాఖ్ చేయగలరు. జీవితంలో అన్ని దశలూ సహజం... వాటిన లాగే స్వీకరిస్తే సరి అన్నది ఈమె తత్వం. ఆ తీరుతోనే దేశవిదేశాల్లో అభిమానుల్ని సంపాదించుకున్నారీమె.

'ఇతరులను నవ్విస్తే చాలు... ఎన్ని సమస్యలకు చెక్ పెట్టొచ్చో' అంటారు ఉరూజ్. చిన్నప్పట్నుంచీ అదే నమ్మేవారామె. అందుకే జోకులు వేస్తూ అందరినీ నవ్వించేవారు. అప్పుడే బోలెడు మంది స్నేహితులొస్తారంటారీమె. ఎక్కడ చదివినా తన క్లాస్‌లో తనే జోకర్. పన్నెండేళ్లవరకూ దుబాయ్‌లో పెరిగారు ఉరూజ్. తరవాత ముంబయిలో స్థిరపడ్డారు. సైకాలజీలో డిగ్రీ చేశారీమె. తరవాత పీజీ చేద్దామంటే వైఫల్యాలు వరుసకట్టాయి. దీంతో ఏడాది గ్యాప్ తీసుకోక తప్పని పరిస్థితి. ఆ సమయంలో ఏదైనా చేద్దామనుకున్న ఆమెకు స్టాండప్ కామెడీ పరిచయమైంది. టాక్‌షోలు, స్టాండప్ కామెడీ పోటీల్లో పాల్గొన్నారు. విజేతగానూ నిలిచారు. అయితే ఆమె కెరియర్‌ని మలుపు తిప్పింది మాత్రం 'క్వీన్స్ ఆఫ్ కామెడీ'. దానిలో ఫైనలిస్టుల్లో ఒకరిగా నిలిచారు ఉరూజ్. అది మొదలు దేశవిదేశాల్లో టూర్‌లెన్నో చేశారు. రైటర్‌గా అవకాశాలు దక్కించుకోవడమే కాదు... కొన్ని వెబ్‌సిరీస్‌ల్లోనూ పనిచేశారు.

2023లో యూకేలో 'ఓహ్ నో' పేరుతో షోలు చేశారు ఉరూజ్. అది అక్కడివాళ్లని బాగా మెప్పించడమే కాదు... ఎడిన్‌బర్గ్ కామెడీ అవార్డ్స్ నుంచి 'బెస్ట్ న్యూ కమర్' అవార్డునీ తెచ్చిపెట్టింది. దక్షిణాసియా నుంచి 1997 తరవాత దీన్ని అందుకున్న తొలి వ్యక్తి ఉరూజ్. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయురాలు కూడా. కామెడీ రైటర్‌గా రాణిస్తూనే దేశవిదేశాల్లో టూర్స్ కొనసాగిస్తున్నారు. కామెడీ క్వీన్‌గానూ పేరుతెచ్చుకున్నారు ఉరుజ్. పీరియడ్, బామ్మతో సంభాషణ, మెంటల్ హెల్త్... ఇలాంటి రోజువారీ, సామాజికాంశాల చుట్టూనే తిరుగుతాయి ఈమె కామెడీ టాపిక్‌లన్నీ. సైకాలజీ తెలుసు కాబట్టి, ప్రేక్షకుల నాడినీ బాగా పట్టారీమె. ఇందుకు ఆమె ఎదుర్కొన్న ఇబ్బందులూ, అవమానాలూ చాలానే! చిరునవ్వుతో వాటిని దాటుకొచ్చారు ఉరుజ్. తన ఉద్దేశం ఒక్కటే! నవ్వించడంతో పాటే ఆలోచింపజేయాలని. అందుకే తను ఎదుర్కొన్న ఇబ్బందులు, అమ్మానాన్నల విడాకులు, ఒత్తిడి, ఆందోళనలను జనాలు చూసే తీరు వంటివాటికీ చోటిస్తారు. 'ఎదుటివారి ముఖమ్మీద నవ్వులు పూయించడం పెద్ద టాస్క్. అలా చేయడమంటే వాళ్ల సమస్యల్ని సగం తీర్చినట్లే. అయితే అది వాళ్లలో సానుకూల ఆలోచనల్నీ రేకెత్తించాలని చూస్తా. అప్పుడే నేను విజయవంతమైనట్లు భావిస్తా' నంటోన్న ఉరుజ్ సామాజికమాధ్యమాల్లోనూ చురుకే! తనకి యూట్యూబ్, ఇన్‌స్టాల్లో పదిలక్షల మందికిపైగా ఫాలోయర్లున్నారు.



నవ్వు... మహమ్మారి!

టాంజానియాలోని కషాషా గ్రామంలో జరిగిందీ వింత సంఘటన... అక్కడ ఓ బోర్డింగ్ స్కూల్‌లో 1962లో జనవరి 31న ముగ్గురు బాలికలు ఉన్నట్టుండి బిగ్గరగా నవ్వసాగారు. అది చూసి మరికొందరు... క్రమంగా ఆ నవ్వు పాఠశాలలో మూడింట రెండొంతుల మంది విద్యార్థులకి అంటుకోవడంతో స్కూలు మూసేయాల్సి వచ్చింది. ఇళ్లకు వెళ్లిన విద్యార్థుల నుంచి ఆ నవ్వు అనేక ఊళ్లకు వ్యాపించి ఎంతోమందిలో శ్వాసకోశ సమస్యలు, మూర్ఛ... వంటి ఇబ్బందులకు కారణమైంది. ఈ నవ్వుల మహమ్మారి పద్దెనిమిది నెలల తరవాతగానీ తగ్గలేదట. దీనివల్ల 14 స్కూళ్లు మూయాల్సి వచ్చింది. ఒత్తిడి వల్ల తలెత్తిన మాస్ హిస్టీరియా అని కొందరు నిపుణులు చెప్పినప్పటికీ, దీనికి కచ్చితమైన కారణం ఏమిటనేది నేటికీ తెలియలేదు!



బంగారం - వెండి



2న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,54,350	1,38,750	2,54,000
విజయవాడ	1,49,275	1,38,350	2,56,500
ప్రొద్దుటూరు	1,52,100	1,39,930	2,49,000
రాజమహేంద్రవరం	1,50,930	1,38,350	2,70,000
విశాఖపట్నం	1,50,930	1,38,350	2,54,000
తమిళనాడు	-----	1,40,000	2,70,000

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

మనమే తయారుచేసి ఇవ్వొచ్చు!

కిడ్స్ కార్నర్

ఇప్పటి పిల్లలకు ఆటలు అనగానే... గ్యాడ్జెట్లు, ఫోన్లు, టీవీలు, గేమింగ్ జోన్లే గుర్తుకు వస్తాయి కదా! అలా కాకుండా మనం కాస్త శ్రమిస్తే వాళ్లకు కావాల్సిన బోర్డు గేమ్స్‌ని, ఇంటి దగ్గరే తయారుచేసి ఇవ్వొచ్చు ఇలా...

బేసి, సరి సంఖ్యలను చెబుతూ...



లెక్కలంటేనే భయపడతారు కదా పిల్లలు. అలాంటి వాళ్లకి ఆటల రూపంలోనే బేసి, సరి సంఖ్యలను నేర్పిస్తే... ఆడుతూ పాడుతూ గుర్తుపెట్టుకుంటారు. ఈ ఆట ఆడటానికి డైస్, కాగితం, పెన్నులు ఉంటే చాలు. కాగితం మీద జెడ్ ఆకారాన్ని గీయండి. గీతకు రెండు వైపులా మొదలు నుంచి చివరి వరకూ సున్నాలు చుట్టండి. అంతే బోర్డ్ తయారైపోతుంది. ఇద్దరు కూర్చొని ఆడుకోవచ్చు ఈ ఆట. సరి సంఖ్యలు ఒకరు, బేసి ఒకరు ఎంపిక చేసుకోవాలి. డైస్ వేసి వచ్చిన సంఖ్యను బట్టి సున్నాల్ని నింపాలి. ఉదాహరణకు మూడు వస్తే బేసి సంఖ్య కాబట్టి... దాన్ని ఎంచుకున్న వాళ్లు మూడు సున్నాలని నింపాలి. అలా చివరి వరకూ ఎవరైతే పూర్తిచేస్తారో... వాళ్లే విజయం సాధించినట్లు.



బొమ్మల్ని గీసి...

ఒక కాగితాన్ని చిన్న చిన్న ముక్కలుగా చించండి. వాటిపై పండ్లు, కూరగాయలు, ఐస్‌క్రీమ్, చాక్లెట్ వంటి నచ్చిన బొమ్మల్ని వేయండి. వాటన్నింటినీ ఒక బాక్స్‌లో ఉంచండి. ఇద్దరు లేదా ముగ్గురు ఆడొచ్చు ఈ ఆటని. బాక్స్‌లో ఉండే ఆరు చిత్రాల్ని తీసి, వరసగా పెట్టి.. రెండు నిమిషాలు గమనించమని చెప్పండి. తర్వాత వాటిని మూసేసి, చూసిన వాటిని గీయమనండి. ఎన్ని కరెక్ట్‌గా వేస్తే అన్ని మార్కులు. ఇలానే రెండుమూడు సార్లు చేశాక... మార్కుల్ని లెక్కించమనండి. ఎవరికి ఎక్కువ స్కోర్ వస్తే వాళ్లే గెలిచినట్లు.


గమ్యాన్ని చేరితేనే...

ఒక కాగితం, లేదా బోర్డుపై చిత్రంలో చూపించిన విధంగా పెద్ద బాక్సుని గీయండి. మధ్యలో రెండు గీతలు పెట్టి ఎగ్జిట్ పాయింట్ అని రాయండి. ఆ పాయింట్‌కి అవతలి వైపు ఎనిమిది, ఇవతలవైపు ఎనిమిది బాక్సుల్ని గీయాలి. చివరి బాక్సులో అటూ ఇటూ ఫైనల్ అని రాయాలి. తర్వాత ఎగ్జిట్ పాయింట్‌లో పావుని పెట్టి, డైస్ వేయాలి. వచ్చే సంఖ్యను బట్టి పావును కదపాలి. అలా ఎవరైతే ముందుగా గమ్యాన్ని చేరుకుంటారో వాళ్లే విజయం సాధించినట్లు.



ద్విశతమానం భవతి!

- 200 ఏళ్ల ఆయుష్షు మూలం దొరికింది
- తిమింగలాల్లో కీలక ప్రొటీన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు



శతమానం భవతి! నిండు నూరేళ్లు హాయిగా జీవించాలని పెద్దలు ఆశీర్వదిస్తుంటారు. ఆరోగ్యకరంగా సుదీర్ఘ ఆయుష్షు.. ఎవరికైనా గొప్పవరమే! తమ లక్ష్యాలు, కలలను నెరవేర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ సుదీర్ఘకాలం జీవించాలనుకోవడం సహజం. అయితే ఆధునిక జీవన శైలి.. ఆరోగ్యంపై పెను ప్రభావం చూపుతున్నాయి. నూరేళ్ల ఆరోగ్యకర జీవనం.. ఎక్కువమందికి అందని ద్రాక్ష అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా మానవుల సగటు ఆయుష్షు 73.8 ఏళ్లుగా ఉంది. అది కూడా వ్యాధులతో బాధపడుతూ బలవంతంగా బతుకుతున్నవారే ఎక్కువ. ఈ నేపథ్యంలో అమెరికాలోని రోచెస్టర్ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కీలక ఆవిష్కారం చేశారు. 200 ఏళ్ల పాటు జీవించే బౌహెడ్ తిమింగలాల సుదీర్ఘ ఆయుష్షు వెనుక గుట్టును వెలుగులోకి తెచ్చారు. వాటిలో పుష్కలంగా ఉన్న ఒక ప్రొటీన్.. ఇందుకు ప్రధాన కారణమని తేల్చారు. దీని ఆధారంగా మానవుల్లోనూ ఆరోగ్యకర ఆయుష్షును పెంచడానికి ఆస్కారం ఉందని వారు చెబుతున్నారు.

ఏమిటీ జీవి?

బౌహెడ్ తిమింగలం అతిపెద్ద సముద్రజీవుల్లో ఒకటి. క్షీరదాల జాతికి చెందిన ఈ జీవి 200 ఏళ్ల వరకూ ఆరోగ్యకరంగా జీవిస్తుంది. దీనికి వ్యాధుల నుంచి అసాధారణ రక్షణ ఉంది. దీర్ఘాయుష్షుపై పరిశోధనలు చేస్తున్న శాస్త్రవేత్తలకు ఇది ఆసక్తికరంగా మారింది.



ఏమిటీ ప్రొటీన్?

బౌహెడ్ తిమింగలాల సుదీర్ఘ ఆయుష్షు వెనుక సీఐఆర్‌బీపీ అనే ప్రొటీన్ ముఖ్యభూమిక పోషిస్తున్నట్లు రోచెస్టర్ వర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. డీఎన్‌ఏలో దెబ్బతిన్న జంట పోగుల మరమ్మతులో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. దెబ్బతిన్న పోగుల వల్ల వ్యాధులు తలెత్తుతాయి. ఆయుర్దాయం తగ్గిపోతుంది.

- ఇతర క్షీరదాలతో పోలిస్తే బౌహెడ్ తిమింగలాల్లో సీఐఆర్‌బీపీ ఏకంగా 100 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ప్రయోగాల్లో ఫలితం..



ప్రయోగాల్లో భాగంగా.. బౌహెడ్ తిమింగలం నుంచి సేకరించిన సీఐఆర్‌బీపీని మానవ, ఈగల కణాల్లో ప్రవేశపెట్టారు. దీనివల్ల డీఎన్‌ఏ మరమ్మతు సామర్థ్యం మెరుగైంది. పైగా ఈగల జీవితకాలం కూడా పెరిగింది.

- ఈ నేపథ్యంలో సీఐఆర్‌బీపీ భారీ పరిమాణంలో ఉత్పత్తి చేసేలా మానవ కణాలను ప్రేరేపిస్తే మనుషుల్లోనూ ఆయుర్దాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

'చల్లగా' క్రియాశీలం



శీతల ఉష్ణోగ్రతలు సీఐఆర్‌బీపీ ప్రొటీన్లను పెంచుతాయని పరిశోధనలో తేలింది. బౌహెడ్ తిమింగలాలు గడ్డకట్టే ఆర్కిటిక్ జలాల్లో నివసిస్తుంటాయి. అక్కడి చల్లటి వాతావరణం సహజసిద్ధంగానే ఈ ప్రొటీన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తోంది.

- మానవుల్లోనూ సీఐఆర్‌బీపీ అధిక ఉత్పత్తికి ఈ 'శీతల కీలుక'ను ఎలా ప్రయోగించాలన్నదానిపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు.
- మనుషుల్లో 200 ఏళ్ల జీవితకాలం వాస్తవ రూపం దాల్చడానికి ఇంకా సమయం పడుతుంది. అయితే వార్ధక్య ప్రక్రియ ఆరోగ్యకరంగా సాగడానికి సంబంధించి ఈ పరిశోధన ఎన్నో ఆశలు రేకెత్తిస్తోంది.

క్యాన్సర్ దూరం.. దూరం..



50 ఏళ్లు దాటాక మానవులకు క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది. మనుషుల కన్నా చాలా పెద్దగా, అదీ 200 ఏళ్లు పాటు జీవించగలుగుతున్నా.. బౌహెడ్ తిమింగలాల్లో క్యాన్సర్ కేసులు నామమాత్రమే. ఇది కూడా శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షించింది.

- శరీరంగా చూస్తే.. బౌహెడ్ తిమింగలంలో మానవుల కన్నా ఎక్కువ కోట్ల కణాలు ఉంటాయి. ఈ లెక్కన జీవితకాలంలో వాటికి మనుషుల కన్నా ఎక్కువ వ్యాధులు రావాలి. అయినా అలాంటి అనర్థాలేవీ వాటిలో లేవు.
- ఈ జీవుల కణాల్లో అంతర్గత వైవిధ్యం.. తీవ్రమైన డీఎన్‌ఏ విచ్ఛిన్నాలను అడ్డుకుంటూ సరిచేస్తున్నందువల్లే క్యాన్సర్ కారక ఉత్పరివర్తనాలు పేరుకుపోవడంలేదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇందుకు అనేక ప్రొటీన్లు దోహదపడుతున్నా.. సీఐఆర్‌బీపీ మాత్రం కీలక పాత్ర పోషిస్తున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిపై మరిన్ని పరిశోధనల ద్వారా మానవుల్లోనూ క్యాన్సర్‌ను అరికట్టొచ్చని భావిస్తున్నారు.


- ఈనాడు ప్రత్యేక విభాగం

నీతి ఆయోగ్ సభ్యులుగా మరో ఇద్దరు

ఈనాడు, దిల్లీ: నీతి ఆయోగ్ పూర్తికాల సభ్యులుగా డాక్టర్ ఆర్.బాలసుబ్రమణ్యం, డాక్టర్ జోరం అనియా నియమితులయ్యారు. దీంతో అత్యున్నత విధాన రూపకల్పన వ్యవస్థ సభ్యుల సంఖ్య ఏడుకు పెరిగింది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఐదుగురు సభ్యులను నియమించింది. నూతన సభ్యుల్లో బాలసుబ్రమణ్యం కర్ణాటకకు చెందిన వారు కాగా, జోరం అనియా అరుణాచల్ ప్రదేశ్ వాసి. నీతి ఆయోగ్ సభ్యురాలిగా ఈశాన్య రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన మహిళను నియమించడం ఇదే తొలిసారి. విద్యావేత్త అయిన అనియా అరుణాచల్‌ప్రదేశ్ ప్రైవేటు విద్యాసంస్థల నియంత్రణ కమిషన్ సభ్యురాలిగా పనిచేస్తున్నారు.



జోరం అనియా



ఆర్.బాలసుబ్రమణ్యం

■ కర్ణాటకకు చెందిన బాలసుబ్రమణ్యం హార్వర్డ్ విశ్వవిద్యాలయం జాన్ ఎఫ్.కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ పూర్తిచేశారు. మైసూరు వైద్యకళాశాల నుంచి ఎంబీబీఎస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 24న నీతి ఆయోగ్ సభ్యులుగా నియమించిన వారిలో కె.వి.రాజు, ఎం.శ్రీనివాస్ కర్ణాటక వాసులు. ఇప్పుడు బాలసుబ్రమణ్యం నియామకంతో నీతి ఆయోగ్ సభ్యులుగా ముగ్గురు కర్ణాటక వాసులకు అవకాశం దక్కినట్లయింది.

రేపే ఉత్కంఠకు తెర

4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో కౌంటింగ్‌కు సిద్ధం



దిల్లీ: పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతోపాటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతంలో ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఈ ఫలితాల ద్వారా కీలక రాష్ట్రాలైన పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ముఖ్యమంత్రులు మమతా బెనర్జీ, స్టాలిన్, విజయన్‌ల భవితవ్యం తేలనుంది. గతానికి భిన్నంగా ఆయా రాష్ట్రాల్లో ఈసారి భారీగా పోలింగ్ నమోదైంది. ఎగ్జిట్ పోల్స్ మిశ్రమ ఫలితాలను అందించడంతో ఈ రాష్ట్రాల్లో ఎవరు గెలుస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఫలితాల ప్రభావం జాతీయ రాజకీయాలపై ఉంటుందని అంచనా!


15 కేంద్రాల్లో రీపోలింగ్

బెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో 15 కేంద్రాల్లో శనివారం రీపోలింగ్ పూర్తయింది. సాయంత్రం 5 గంటల సమయానికి 87% పోలింగ్ నమోదైంది.

కేంద్ర ఉద్యోగులపై మమత అభ్యంతరాల తిరస్కరణ

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు విధుల్లో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులనే నియమిస్తున్నారంటూ తృణమూల్ ఛైర్‌పర్సన్ మమతా బెనర్జీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. కౌంటింగ్ సిబ్బందిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎవరైనా ఉండవచ్చని, సిబ్బంది కూర్పుపై నిర్ణయాధికారం ఎన్నికల సంఘానిదేనని (ఈసీ) జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం శనివారం స్పష్టం చేసింది.

ప్రసార భారతి ఛైర్మన్‌గా ప్రసూన్ జోషి



ఈనాడు, దిల్లీ: ప్రసారభారతి ఛైర్మన్‌గా ప్రముఖ సినీ గీత రచయిత, కమ్యూనికేషన్ నిపుణుడు ప్రసూన్ జోషి నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర సమాచార, ప్రసారశాఖ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర సెన్సార్‌బోర్డ్ ఛైర్‌పర్సన్‌గానూ సేవలందించారు. 2015లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

భార్య వేధింపులతో జడ్జి ఆత్మహత్య!



దిల్లీ: జిల్లా కోర్టు న్యాయమూర్తిగా దిల్లీలో పని చేస్తున్న అమన్ కుమార్ శర్మ (30) ఆత్మహత్యకు పాల్పడ్డారు. బాత్‌రూమ్‌లో ఆయన ఉరి వేసుకొని ప్రాణాలు తీసుకున్నట్టు పోలీసులు శనివారం వెల్లడించారు. ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఆయన భార్య కూడా న్యాయాధికారేనని తెలిసింది. కొన్నాళ్లుగా భార్యాభర్తల మధ్య వివాదం నెలకొందని, కోడలి సోదరి అయిన ఐఏఎస్ అధికారి జోక్యం చేసుకోవడంతో తన కుమారుడు వేదనకు గురయ్యాడని అమన్ తండ్రి వెల్లడించారు. భార్య వేధింపుల వల్లే బలవన్మరణానికి పాల్పడ్డాడని ఆరోపించారు.

'మోదీ తత్వం'పై విశ్వవిద్యాలయ పాఠ్యాంశం



వడోదరా: గుజరాత్‌కు చెందిన మహారాజా సాయాజీరావ్ విశ్వ విద్యాలయం- 'సోషియాలజీ ఆఫ్ పేట్రియాటిజం' (దేశభక్తికి సంబంధించిన సామాజిక శాస్త్రం) అనే రెండేళ్ల కోర్సును ప్రవేశపెట్టింది. ఇందులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజాకర్షక నాయకత్వాన్ని విశ్లేషించే పాఠ్యాంశంతో పాటు ఆరెస్సెస్ చరిత్రను కూడా చేర్చామని విశ్వవిద్యాలయ అధికారి ఒకరు తెలిపారు. "మోదీ తత్వాన్ని వైజ్ఞానికంగా విశ్లేషించడంతోపాటు ఈ కోర్సు ద్వారా సామాజిక సంస్కర్తలైన ఛత్రపతి శివాజీ మహారాజ్, శివ గైక్వాడ్ వంటివారు చేసిన పనులపై అవగాహన కల్పిస్తాం" అని విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీరేంద్ర సింగ్ తెలిపారు. "మీకు నచ్చినా నచ్చకపోయినా ప్రధానమంత్రి మోదీ నేతృత్వాన్ని, రాజకీయ రంగంలో ఆయనకున్న ప్రజాకర్షణను చర్చించక తప్పని పరిస్థితి ఉంది. మోదీ ఒక రాజకీయ శక్తిగా దీర్ఘకాలం నిలిచిపోతారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సామాజిక శాస్త్ర పితామహుడు మ్యాక్స్ వెబర్‌లోని ప్రజాకర్షక నాయకత్వ లక్షణాలు మహాత్మా గాంధీలో, మార్టిన్ లూథర్ కింగ్‌లో కూడా కనిపిస్తాయి. ప్రధాని మోదీలోనూ అదే తరహా ప్రజాకర్షణ కనిపిస్తుంది. దీనిపై శాస్త్రీయ విశ్లేషణ అవసరం" అని వీరేంద్రసింగ్ అన్నారు. మోదీ తత్వంపై ప్రవేశపెట్టిన పాఠ్యాంశంలో డిజిటల్ జాతీయతావాదం - మీడియా, పౌరసత్వం - అసమ్మతి, ప్రపంచీకరణ - వేర్పాటు రాజకీయాలు వంటి విషయాలు ఉంటాయని ఆయన వివరించారు.

మూడు దశాబ్దాలు వెంటాడిన 'పశ్చాత్తాపం'

ఈటీవీ భారత్: ఆత్మశుద్ధికి పశ్చాత్తాపం తొలి మెట్టు అంటారు. మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లాకు చెందిన పంచాయతీ అధికారి సాకిర్ హుసేన్‌ను ఓ పశ్చాత్తాపం దాదాపు మూడు దశాబ్దాలు వెంటాడి మనశ్శాంతిని దూరం చేసింది. 1993 ఆగస్టు 8న యువకుడైన సాకిర్ తన స్నేహితుడితో కలిసి రత్లాం నుంచి జావరాకు ప్రయాణం చేశారు. అప్పుడు దారిలో వారికి ఒక బ్యాగు దొరికింది. అందులో రూ.8,000 నగదు, ఏవో రసీదులు ఉన్నాయి. ఆ వయసులో వారిద్దరికీ అది జాక్‌పాట్‌లా అనిపించి డబ్బుతో జల్సా చేశారు. కొంతకాలం గడిచాక స్నేహితుడు చనిపోయాడు. సాకిర్‌లో ఆ డబ్బు గురించి పశ్చాత్తాపం మొదలైంది. దొరికిన సంచిలోని కాగితాలు అప్పటికే పూర్తిగా చిరిగిపోయి ఉన్నాయి. డబ్బు పోగొట్టుకున్నవారి ఆచూకీ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. చివరకు.. రసీదుపై ఉన్న ఓ సంస్థ పేరు పట్టుకొని ఇటీవల ఆచూకీ కనుగొన్నారు. ఆ బ్యాగు మెడికల్ ఏజెన్సీ యజమాని బాలకృష్ణ రాఠోడ్‌కు చెందినదిగా తెలియగానే.. సాకిర్ ఆయనను కలుసుకొని డబ్బును తిరిగి ఇచ్చి, క్షమాపణ కోరారు. ఆ బ్యాగు పోగొట్టిన తన మేనల్లుడు అప్పట్లో ఆత్మహత్యాయత్నం చేసినట్లు బాలకృష్ణ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

పదవీ విరమణ చేసిన అమ్మకు అపూర్వకానుక



ఈటీవీ భారత్: పదవీ విరమణ అనేది ఉద్యోగి జీవితంలో తుది మజిలీ. మది నిండా తీవ్ర భావోద్వేగాలు.. మరెన్నో జ్ఞాపకాలు ఉంటాయి. అలాంటి అపురూపమైన క్షణాలు తన తల్లి మనసులో ఎప్పటికీ నిలిచిపోయేలా హరియాణాలో ఓ కుమారుడు చేసిన ప్రయత్నం ప్రశంసలు అందుకుంటోంది. జీంద్ జిల్లా జులానా ప్రాంతంలోని జైజైవంతీ పీహెచ్‌సీలో నర్సింగ్ అధికారిగా సేవలందిస్తున్న శాన్ దేవి 39 ఏళ్ల ఉద్యోగ బాధ్యతల అనంతరం పదవీ విరమణ చేశారు. కష్టకాలంలో అందించిన సేవలకు 'కరోనా వారియర్'గా పొందిన గుర్తింపు ఆమె వృత్తి నిబద్ధతకు నిదర్శనం. సహోద్యోగుల వీడ్కోలు ముగించుకొని బయటకు వచ్చిన శాన్ దేవి తన కుమారుడు సిద్ధం చేసిన ప్రత్యేక బహుమతిని చూసి అవాక్కయ్యారు. పూర్తిగా పది రూపాయల నోట్లతో అలంకరించిన కొత్త కారు అక్కడ సిద్ధంగా ఉంది. కారు అద్దంపై శాన్ దేవి ఫొటో అతికించారు. "నా కుమారుడు, కోడలు నన్ను ఆశ్చర్యపరిచారు. ఈ బహుమతి గురించి ముందుగా చెప్పలేదు" అంటూ ఆమె తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. కారును శాన్ దేవి స్వయంగా నడుపుతూ వెళ్తున్న వీడియో వైరల్‌గా మారింది.

నాదెండ్ల భాస్కరరావుకు ఘన నివాళి

సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ఉభయ రాష్ట్రాల ప్రముఖులు



హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు సంస్మరణ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. పార్టీలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, సినీ ప్రముఖులు, ఉన్నతాధికారులు, విశ్రాంత అధికారులు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. నాదెండ్ల భాస్కరరావుతో ఉన్న పరిచయాలు, స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఆయన కుమారుడు ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తాపీ కార్మికుడిపై పోలీసుల కర్కశత్వం!

మానసికంగా, శారీరకంగా వేధించారని బాధితుడి ఆవేదన



వైద్యశాలలో బాధితుడు ఇస్మాయిల్ పక్కన ఆయన తల్లి

నందిగామ, న్యూస్‌టుడే: 'బంగారు బ్రాస్‌లెట్ నీకే దొరికింది.. ఎక్కడ దాచావో చెప్పు' అంటూ పోలీసులు తనను చిత్రహింసలు పెట్టారని బాధితుడు ఇస్మాయిల్ ఆవేదన చెందుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఎన్టీఆర్ జిల్లా వత్సవాయికి చెందిన మాధవ్ పెళ్లి గతనెల 26న మక్కపేటలో జరిగింది. తిరిగి వస్తూ దారిలో ఆగారు. ఇంటికి వెళ్లి చూసుకోగా బ్రాస్‌లెట్ లేదు. వెంటనే వచ్చి వెతికినా దొరకలేదు. డబ్బాకుపల్లికి చెందిన తాపీ కార్మికుడు సయ్యద్ ఇస్మాయిల్ రోడ్డుపై ఆగి ఏదో దొరికితే జేబులో వేసుకున్నాడని స్థానికులు చెప్పడంతో వత్సవాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇస్మాయిల్‌ను, అతని తల్లిని స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. వారు తనను హింసించారని ఇస్మాయిల్ ఆరోపిస్తున్నారు. బాధితుడి ఆచూకీ తెలియక బంధువులు శుక్రవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఇది తెలిసి పోలీసులు అతడిని తమవద్ద వదిలిపెట్టారని బాధితుడి బంధువులు చెబుతున్నారు. పోలీసులను కోర్టు వివరాలు అడగగా.. ఇస్మాయిల్‌ను విచారించి పంపించామని తెలిపారు. అతన్ని కొట్టలేదని, కావాలనే ఆరోపణలు చేస్తున్నారని పోలీసులు అంటున్నారు. అయితే, బాధితుడి కాళ్లు వాచిపోయాయి. విచారణ మాత్రమే చేస్తే గాయాలెలా అయ్యాయని బాధితుడి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు ప్రస్తుతం జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

శంకుస్థాపన చేసిన నెలకే ఉపాధి అవకాశాలు!

- క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఆర్సెలార్ మిత్తల్ స్టీల్స్
- తొలుత 54 మంది విద్యార్థులను ఎంపిక చేసిన సంస్థ
- రూ.8.5 లక్షల వార్షిక ప్యాకేజీతో యువతకు ఉద్యోగాలు

ఈనాడు, కాకినాడ- న్యూస్‌టుడే, గాంధీనగర్: ఒకప్పుడు ఇంజినీరింగ్ పట్టా చేతికి వచ్చిందంటే యువత చూపులు మెట్రో నగరాల వైపు మళ్లేవి. ఉన్న ఊరిని, కన్నవారిని వదిలి చెన్నై, బెంగళూరు, పుణె లాంటి మహానగరాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన నెలరోజుల్లోనే స్థానిక యువతకు అందులో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సదరు సంస్థ ఇటీవల క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లు నిర్వహించి, 54 మంది ఇంజినీరింగ్ విద్యార్థులను ఎంపికచేసింది.

ఎంపిక ఇలా..

జేఎన్టీయూ కాకినాడ నుంచి 200 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు పోటీపడ్డారు. ఆన్‌లైన్ పరీక్ష తర్వాత 60మంది ఇంటర్వ్యూలకు అర్హత సాధించారు. వీరిలో 17 మందిని సంస్థ ఎంపిక చేసింది. ఒక్కొక్కరికి రూ.8.5 లక్షల చొప్పున వార్షిక ప్యాకేజీ దక్కింది.

- కాకినాడ సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ నుంచి 11 మందిని తీసుకుంది. వీరికి రూ.6.7 లక్షల చొప్పున ప్యాకేజీ ఇచ్చింది.
- విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇటీవల నిప్పన్ స్టీల్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టింది. ఏయూతో పాటు సమీప ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చిన 26 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది. రూ.6.7 నుంచి రూ.8.5 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఆఫర్ చేసింది.

> 'ఉత్తరాంధ్ర అంటే ఒకప్పుడు నిరుద్యోగం, వలసలు, వెనుకబాటుతనమే గుర్తుకొచ్చేది. ఇప్పుడు పరిశ్రమల రాకతో ఈ ప్రాంతం ముఖచిత్రం మారుతోంది. ఇక్కడి నుంచి వలసలు వెళ్లే రోజులు పోయి ఇక్కడికే వలసలు వచ్చే రోజులు వస్తున్నాయి. టాలెంట్ మైగ్రేషన్ ముగిసింది. టాలెంట్ డెస్టినేషన్ మొదలైంది.'
> – ఇటీవల గూగుల్ డేటాసెంటర్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు

నైపుణ్య శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు

నక్కపల్లిలో ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్‌ప్లాంట్‌కు మార్చి 23న సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. సాధారణంగా భారీ పరిశ్రమలు ఏళ్లతరబడి నియామకాల జోలికిపోవు. కానీ ఈ ప్లాంటు మాత్రం తొలిదశలోనే మానవవనరుల సమీకరణపై దృష్టిపెట్టింది. కొందరిని క్యాంపస్ ఇంటర్వ్యూలతో ఎంపిక చేయగా.. మరి కొందరికి తమకు అవసరమైన విధంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.



ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్స్‌లో కొలువులు సాధించిన కాకినాడ జేఎన్టీయూ విద్యార్థులు

ఐటీఐకి అనుసంధానం

మరోవైపు విశాఖపట్నం ప్రభుత్వ ఐటీఐ హబ్‌గా అవతరించబోతోంది. ప్రధానమంత్రి స్కిల్లింగ్ అండ్ ఎంప్లాయబులిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ త్రూ అప్‌గ్రేడెడ్ ఐటీఐ (పీఎం సేతు) పథకంలో ఆర్సెలార్ మిత్తల్ నిప్పన్ స్టీల్స్‌ను యాంకర్ ఇండస్ట్రీగా ఐటీఐకి అనుసంధానం చేశారు. దీనిద్వారా ఈ పరిశ్రమకు తగ్గ కొత్త కోర్సులను అందుబాటులోకి తేనున్నారు. ఇక్కడ కోర్సులు పూర్తిచేసిన వారికి మిత్తల్ స్టీల్స్‌లో కొలువులు సులువుగా దక్కే అవకాశాలున్నాయి.

ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తూ... గొలుసు చోరీలు


- అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచర్‌గా మారిన విద్యుత్‌శాఖ ఉద్యోగి



నిందితుడు రమేశ్ నాయక్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: అతను విద్యుత్‌శాఖలో ఉద్యోగి.. షేర్ మార్కెట్‌లో నష్టపోయాడు.. పైగా చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అందినకాడికి అప్పులు చేశాడు. వాటిని తీర్చాలంటూ రుణదాతల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో గొలుసు దొంగతనాలకు పాల్పడుతూ.. పోలీసులకు చిక్కాడు. శ్రీసత్యసాయి జిల్లా కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి కథనం ప్రకారం.. కదిరిలో విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేశ్‌నాయక్.. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి రూ.1.50 కోట్లకుపైగా నష్టపోయాడు. దీనికితోడు చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. చేసిన అప్పులు తీర్చేందుకు చోరీల బాటపట్టాడు. ఆఫీసు డ్యూటీ పూర్తయ్యాక... రాత్రి 7 గంటల సమయంలో స్కూటీపై వెళ్తూ మహిళల మెడల్లోని బంగారు గొలుసులను లాక్కుపోయేవాడు. గత నెల 29న అనంతపురం రోడ్డులో వెళ్తున్న ఓ మహిళ మెడలోని గొలుసును లాక్కోబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో దాడికి యత్నించాడు. స్థానికులు రావడంతో పారిపోయాడు. బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా రమేశ్‌నాయక్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2 లక్షల విలువైన బంగారు గొలుసులు, కత్తి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు.

'పవనన్నా.. నన్ను చంపేస్తారన్నా.. ప్లీజ్ కాపాడండన్నా'



రోదిస్తున్న షానల్

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: మస్కట్‌లో పని కోసం వెళ్తే.. అక్కడి సేఠ్ తనను నిత్యం వేధిస్తూ కొడుతున్నాడని, చంపేస్తారని భయమేస్తోందని.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నే తనను కాపాడాలంటూ ఓ మహిళ రోదించారు. తన బాధలను చెప్పుకొంటూ ఆమె ఒక వీడియో చేసి, సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన షానల్‌కు ముగ్గురు పిల్లలు. బతుకుదెరువు కోసం, బిడ్డలను చదివించాలన్న తపనతో ఒక ఏజెంట్ ద్వారా కొద్దిరోజుల క్రితం అప్పులు చేసి ఆమె మస్కట్‌కు వెళ్లారు. అక్కడ సేఠ్ తనను ఒక గదిలో బంధించి నిత్యం అన్నం, నీళ్లు ఇవ్వకుండా వేధిస్తూ కొడుతున్నాడని రోదిస్తూ శనివారం రాత్రి సామాజిక మాధ్యమాల్లో వీడియో పెట్టారు. తనకు మాట్లాడే సమయం కూడా లేదని, ఫిట్స్ వచ్చి చనిపోయేలా ఉన్నానని.. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్న తనను కాపాడాలని కోరారు. తాను చనిపోతే ముగ్గురు పిల్లలను పోషించే దిక్కు కూడా లేదని రోదించారు. బాత్రూంలో ఈ వీడియో చేశానని, సేఠ్‌కు తెలిస్తే తనను చంపేస్తాడని వాపోయారు. తనను కాపాడి, తన ముగ్గురు బిడ్డలకు రక్షణ కల్పించాలని కంటతడి పెట్టారు.

ఇతరులను అయస్కాంతంలా ఆకర్షించాలంటే..



ఎదుటి వ్యక్తుల్లో ఎక్కువగా ఆకర్షించే లక్షణం అందమో, సంపదో, హోదానో కాదు. వారిలోని శక్తి. ఏ పని చేస్తున్నా అందులో మీరు ఎనలేని ఉత్సాహం, అమితమైన ఆసక్తి, కుతూహలం ప్రదర్శిస్తుంటే, ఉన్నత హోదాల్లో ఉన్న వ్యక్తులను అయస్కాంతంలా ఇట్టే ఆకర్షిస్తారు. శక్తి అనేది ఓ మంచి వైరస్ లాంటిది. ఒకరినుంచి ఒకరికి పాకుతూ బృందం మొత్తాన్ని ఉత్సాహపరుస్తుంది.

– సాహిల్ బ్లూమ్, రచయిత

విద్యార్థినులను లైంగికంగా వేధించిన ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్‌పై వేటు

ప్రిన్సిపల్, మరో ప్రొఫెసర్ ప్రభుత్వానికి సరెండర్

ఈనాడు, అమరావతి: విజయవాడలోని నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలోని విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన వారిపై వైద్య ఆరోగ్య శాఖ వేటు వేసింది. కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.మౌళినాయక్, ల్యాబ్ టెక్నీషియన్ కె.వి.సుబ్రహ్మణ్యంలను సస్పెన్షన్ చేసినట్లు ఆయుష్ ఇన్‌ఛార్జి కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ శనివారం వెల్లడించారు. విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నిర్మలాజ్యోతీబాయి, ప్రొఫెసర్ కె.విజయకుమారిలను ప్రభుత్వానికి సరెండర్ చేస్తున్నట్లు తెలిపారు. లైంగిక వేధింపులకు సంబంధించి కళాశాలలో అంతర్గత విచారణ కొనసాగుతోందని పేర్కొన్నారు. దీంతోపాటు స్వతంత్ర కమిటీ ద్వారా విచారణ జరిపించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు లేఖ రాసినట్లు వెల్లడించారు. ఆయుర్వేద కళాశాలలో లైంగిక వేధింపులకు సంబంధించి విద్యార్థినులు రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఈమెయిళ్ల ద్వారా ఫిర్యాదులు చేశారు. దీంతో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ ఆధ్వర్యంలో కళాశాలలో విచారణ చేసి, వైద్య ఆరోగ్య శాఖకు నివేదిక అందజేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేస్తూ.. ఆదేశాలు జారీ అయ్యాయి.

యూజీసీ నెట్‌కు మరో రెండు సబ్జెక్టులు

జూన్ నుంచే అమలు

ఈనాడు, హైదరాబాద్: యూజీసీ జాతీయ అర్హత పరీక్ష(నెట్)లో కొత్తగా స్టాటిస్టిక్స్, ఫారెస్ట్రీ సబ్జెక్టులు చేరాయి. అంటే ఆ సబ్జెక్టుల్లో పీజీ చేసిన వారు కూడా నెట్‌కు పోటీపడవచ్చు. 2026 జూన్ 22-30 తేదీల మధ్య జరిగే నెట్‌కు ఈ సబ్జెక్టుల్లో పరీక్షలు రాయొచ్చు. ఇప్పటివరకు 85 సబ్జెక్టుల్లో పరీక్షలు జరుపుతుండగా.. ఈసారి వాటి సంఖ్య 87కి పెరిగింది. జాతీయస్థాయిలో జరిగే ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు పీహెచ్‌డీలో చేరొచ్చు.

EENADU Vol: 31, Issue: 27 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఈనాడు
అమరావతి
గుంటూరు
ఆదివారం మే 3, 2026

పదో తరగతి జవాబుపత్రాల.. రీవెరిఫికేషన్ దరఖాస్తు గడువు 7 వరకు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల పునర్మూల్యాంకనం కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి సంబంధిత పాఠశాల లాగిన్ల ద్వారా దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి చెల్లించాలని తెలిపారు. రుసుమును www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న గేట్‌వే ద్వారా మాత్రమే చెల్లించాలని తెలిపారు. రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జవాబు పత్రాలు కేవలం పాఠశాల లాగిన్‌లో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవడానికి వీలుంటుందన్నారు. జవాబు పత్రాల స్కానింగ్ కాపీలు వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర సేవ 95523 00009 ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.



మురుగుపాలైన బాల్యం

బంగారు బాల్యం మురుగునీటితో సహవాసం చేస్తోంది. తోటి పిల్లలతో ఆడిపాడాల్సిన వయసులో.. చిట్టి చేతులతో చెత్తాచెదారం తీయాల్సి వస్తోంది. బాలలతో పని చేయించడం నేరమని చట్టం చెబుతోంది. మురుగు వ్యర్థాల పనులైతే మనుషులతో కాదని యంత్రాలు, పరికరాలతో చేయాలన్న నిబంధనలున్నాయి. కానీ.. గుంటూరు నగరపాలక సంస్థ మురుగుకాలువల పనుల్లో ఇవేమీ అమలు కావడం లేదు. భయంకరమైన దుర్వాసన వచ్చే డ్రెయిన్లో బాలుడితో వ్యర్థాలు తీయిస్తున్న ఉదంతమిది.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

రాక్రీట్ దోపిడీ రూ.10.65 కోట్లు

పేదల ఇళ్ల నిర్మాణంలో భారీ స్కామ్

ఈనాడు – అమరావతి

పేదల ఇళ్ల నిర్మాణం పేరుతో రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రజాధనాన్ని అడ్డంగా దోచేసింది. చేసిన పని కొంతైతే.. తప్పుడు నివేదికలతో రూ.10.65 కోట్ల ప్రజాధనం అడ్డంగా నొక్కేసింది. నాడు వైకాపా ప్రభుత్వ అండతో చెలరేగిపోయిన సంస్థకు డైరెక్టర్ అనంతపురం జిల్లాకు చెందిన తోపుదుర్తి అమర్‌నాథ్‌రెడ్డి. ఈయన రాప్తాడు వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనుచరుడు. సంస్థ డైరెక్టర్లు నమ్మకద్రోహం, మోసం వంటి నేరాలకు పాల్పడినందున, చేసిన పని కంటే అదనంగా సొమ్ము కాజేసినందుకు గృహనిర్మాణ సంస్థ డీఈ బాబూరావు ఫిర్యాదు మేరకు మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



పేరేచర్ల లేఔట్

- పనులు ప్రారంభించనివి : 23
- పునాది స్థాయిలో ఉన్నవి : 713
- పునాది స్థాయి పూర్తయినవి : 3,618
- సగం వరకు గోడలు పూర్తయినవి : 17
- స్లాబు వరకు గోడల నిర్మాణం : 120
- స్లాబు నిర్మాణం పూర్తయినవి : 9

అదనపు చెల్లింపులు ఇలా....

విభాగం	రూపాయల్లో
గుంటూరు పశ్చిమ	6,39,07,548
గుంటూరు నగరం	2,32,35,118
గుంటూరు గ్రామీణం	1,94,35,708
మొత్తం	10,65,78,374

4,504 ఇళ్లకు నాలుగే పూర్తి

పేరేచర్ల లేఔట్‌లో గుంటూరు గ్రామీణ, గుంటూరు పశ్చిమ, గుంటూరు నగరపాలకసంస్థలోని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందులో 4,504 ఇళ్ల నిర్మాణానికి రాక్రీట్ సంస్థకు అప్పగించగా డిసెంబరు 2024 నాటికి 4 ఇళ్లు మాత్రమే పూర్తికావడం గమనార్హం.

అసంపూర్తి పనులు...
అందినకాడికి దోపిడీ

★ గుంటూరు నగరంలోని పేదలకు మేడికొండూరు మండలం పేరేచర్ల లేఔట్‌లో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇళ్లు నిర్మించుకోలేని పేదలకు ఆప్షన్-3 కింద నాటి వైకాపా ప్రభుత్వం నిర్మించే బాధ్యత తీసుకుంది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చెల్లించి 4,504 ఇళ్ల నిర్మాణ బాధ్యతను రాక్రీట్ సంస్థకు అప్పగించింది. ఈ సంస్థ చేసిన పని కంటే ఎక్కువ మొత్తంలో చేసినట్లు తప్పుడు నివేదికలు ఇచ్చి అధికంగా డబ్బు తీసుకుని పనులను అర్ధాంతరంగా ఆపేసింది. దీనిపై లబ్ధిదారులు ఫిర్యాదు చేయడంతో జిల్లా గృహనిర్మాణసంస్థ విచారణ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీ చేయించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందాలు రాక్రీట్ చేసిన పని కంటే రూ.10,65,78,374 అదనంగా సొమ్ము తీసుకున్నట్లు తేల్చాయి.

★ ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీతకాలంలో పూర్తి చేస్తామని నమ్మించిన సదరు సంస్థ పనులను 2024 డిసెంబరులో వదిలేసింది. అవి నివాసానికి యోగ్యంగా లేక పేదలు మనోవేదనకు గురవుతున్నారు.

★ దశలవారీగా పనులు నిర్వహించాల్సిన ఏజెన్సీ తప్పుడు నివేదికలిచ్చింది.

★ అధికారులు పనులను పరిశీలించి ధ్రువీకరించాక.. జియో ట్యాగింగ్ తరువాతే చెల్లింపులు చేయాల్సి ఉండగా.. నాటి వైకాపా నేతల ఒత్తిడి మేరకు సొమ్ము చెల్లించేశారు.

★ ప్రభుత్వం నుంచి స్టీల్, సిమెంట్ తీసుకుని నిధులు దుర్వినియోగం చేసింది.

★ రూ.10.65 కోట్ల సొమ్మును రికవరీ చేసి పేద లబ్ధిదారులకు న్యాయం చేయాల్సి ఉంది.

★ 105 మంది లబ్ధిదారులు రాతపూర్వకంగా గృహనిర్మాణ సంస్థకు ఫిర్యాదు చేయడంతో తీగ లాగితే డొంక కదిలినట్లు విచారణలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.

నీళ్లు రాక.. నీడ లేక..!

- జీజీహెచ్‌లో రోగులు, సహాయకులకు ఇబ్బందులు
- ఫ్యాన్లు, ఏసీలు పనిచేయక ఉక్కపోతతో అవస్థలు

ఈనాడు – అమరావతి

నీళ్లు లేవు.. నిలువ నీడ లేదు.. ఆసుపత్రిలో ఏ మూలకెళ్లినా రోగులు, వారి సహాయకులకు తీవ్ర ఇబ్బందులే. ఫ్యాన్లు, ఏసీలు పని చేయకపోవడం మరో సమస్య. గత నాలుగు రోజులుగా 42 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వస్తున్న అభాగ్యుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. సర్వీస్ బ్లాక్ అందుబాటులోకి రావడానికి కొన్ని నెలల సమయం పట్టనుంది. దీంతో రోగులు, వారి సహాయకులు చెట్ల కింద సైతం ఉండలేకపోతున్నారు. కనీసం కారిడార్లలో కునుకు తీద్దామనుకుంటే వేడి గాలుల తీవ్రతను తట్టుకోలేకపోతున్నారు. దాదాపు 1,500 మంది ఇన్‌పేషెంట్లు ఉంటున్నందున అధికారులు తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.



చెట్ల కింద వాహనాలు

సమస్య ఎక్కడంటే...

★ జీజీహెచ్‌లో తాగడానికి అనేక ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. అందులో నీరు నింపడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. అన్నీ మాన్యువల్‌గా నిర్వహించాల్సి రావడంతో నీరు ఎప్పుడు నిండుకుందో సిబ్బందికి తెలియడం లేదు. దీంతో చాలా మంది ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు ధరలు పెంచి అమ్ముతున్నారు. కొందరు దాతలు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తుండగా.. కొంతమంది రోగులకు మాత్రం ఉపశమనం దొరుకుతోంది.

★ మరుగుదొడ్లకు నీటి సరఫరా సరిగా ఉండడం లేదు. కొన్ని వార్డుల్లో ఉదయం 11 గంటలకే నీటి నిల్వలు నిండుకుంటున్నాయి. దీంతో మహిళలు, శస్త్రచికిత్స చేయించుకున్న రోగుల పాట్లు అన్నీఇన్నీ కావు. అధికారులు మాత్రం నీటి సరఫరా పక్కాగా ఉంటోందని చెబుతున్నారు.

ఇలా చేయొచ్చు..

- బ్లాక్‌ల మధ్య ఖాళీ స్థలంలో గ్రీన్ మ్యాట్స్ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలి. రోగులు, సహాయకులు కూర్చోడానికి అనువుగా బల్లలు వేయించాలి.
- బ్లాక్‌ల మధ్య ఖాళీ స్థలంలో కొన్ని చెట్ల కింద నీడగా ఉంటోంది. మురుగుకాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి అక్కడ కూర్చోలేని పరిస్థితి. దీన్ని వెంటనే తొలగించాలి. ఇక్కడ వాహనాలు పార్కింగ్ చేయకుండా కట్టడి చేయాలి.
- యాంపీ థియేటర్ ముందు భాగంలో ఉన్న స్థలంలో కొన్ని టెంట్లు ఏర్పాటు చేసి.. మంచినీటి సౌకర్యం కల్పించాలి.
- ఆర్వో ప్లాంట్లలో నీరు సమృద్ధిగా ఉండేలా ప్రత్యేక సిబ్బందిని కేటాయించి పర్యవేక్షణ పెంచాలి. మరుగుదొడ్లలో నీటి సరఫరా ఆగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- సూపరింటెండెంట్ కార్యాలయం సహా ప్రధాన విభాగాల వద్ద స్వచ్ఛంద సంస్థల సహాయంతో మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ చేసేలా చూడాలి.

లక్ష్యం.. రూ.58.83 కోట్లు

పంచాయతీల్లో పన్నుల వేట
నెలాఖరులోగా చెల్లిస్తే 5% రాయితీ

ఈనాడు – అమరావతి

గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న బకాయిలతోపాటు ఈ ఏడాది నిర్దేశించిన పన్నుల లక్ష్యాన్ని చేరుకోవడమే ధ్యేయంగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ ఏడాది పన్నుల వసూళ్ల కోసం యంత్రాంగం భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

ప్రముఖ సంస్థలపై దృష్టి..

జిల్లాలో పెద్దఎత్తున ఉన్న విద్యాసంస్థలు, ప్రైవేటు సంస్థలు భారీగా పన్ను బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ మొత్తాలను వసూలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. వెంటనే చెల్లించాల్సిందిగా సదరు యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తూనే.. ప్రత్యేక డ్రైవ్ ద్వారా వసూళ్లను ముమ్మరం చేశారు. తాజాగా కొన్ని విద్యాసంస్థల నుంచి రూ.1.30 కోట్లకు పైగా వసూలు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

- పాత బకాయిలు (అరియర్స్): రూ.14.74 కోట్లు
- ప్రస్తుత ఏడాది లక్ష్యం: రూ.44.09 కోట్లు
- మొత్తం వసూలు చేయాల్సింది: రూ.58.83 కోట్లు

ముందస్తు చెల్లింపుదారులకు 5% రాయితీ.. పన్ను చెల్లింపుదారులకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోపు తమ ఆస్తిపన్నును చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయికుమార్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పాత బకాయిలకు ఇది వర్తించదని చెప్పారు.

ఎత్తిపోతలు.. ఎట్టకేలకు కదలిక

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – పొన్నూరు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అర్ధాంతరంగా ఆగిపోయిన ఎత్తిపోతల పథకాల నిర్మాణాలను పట్టాలెక్కించడానికి ఆంధ్రప్రదేశ్ సాగునీటి అభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఐడీసీ) కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. 2019కు ముందు అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు వైకాపా అధికారంలోకొచ్చాక నిలిచిపోయాయి. ఐదేళ్లపాటు ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం, అప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు పనులాపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వారితో చర్చలు జరిపి ఆగిపోయిన పనులు పునఃప్రారంభించడానికి కసరత్తు చేసింది.



సుద్దపల్లె ఎత్తిపోతల పథకం

2018–19లో పనులు ప్రారంభమై అర్ధాంతరంగా ఆగిపోయిన పథకాల వివరాలు..

పథకం	ఆయకట్టు ఎకరాల్లో	అంచనా రూ.కోట్లలో
సుద్దపల్లి	400	4.65
ములుకుదురు	760	3.78
ములుకుదురు-2	849	4.91
వడ్డిముక్కల	1,420	9.40
నండూరు	1,875	10.84
నిడుబ్రోలు	1,999	11.38
మన్నవ	1,764	6.55
అన్నవరం	1,400	7.20
మొత్తం	10,467	58.71

కొలిక్కి వచ్చిందిలా....

2017-18 ఎస్ఎస్ఆర్ ప్రకారం ఒప్పందాలు చేసుకున్నందున ఏడేళ్ల తరువాత అవే ధరలకు చేయడం సాధ్యం కాదని, ప్రస్తుత ఎస్ఎస్ఆర్ ప్రకారం చెల్లించాలని గుత్తేదారులు.. ఉన్నతాధికారులను కోరారు. దీనిపై పలుమార్లు చర్చించి కొన్ని పనులను పాత ధరలకే చేసేలా ఒప్పించారు. ఈ నేపథ్యంలోనే మన్నవ, అన్నవరం పథకాల పనులు ప్రారంభమయ్యాయి. మన్నవను జూన్ నాటికి, అన్నవరాన్ని డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యం.

- నండూరు ఎత్తిపోతల పనులను ఒప్పందంలోని ఎస్ఎస్ఆర్ ప్రకారమే చేయడానికి గుత్తేదారు ముందుకొచ్చారు.
- సుద్దపల్లి పథకానికి కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం చెల్లించాలని ప్రతిపాదించారు. మిగిలిన పథకాలపై మరోసారి సమీక్షించి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారు.
- సుద్దపల్లి, ములుకుదురు ఎత్తిపోతలను అప్పట్లో ఆర్ఐడీఎఫ్ నిధులతో చేపట్టారు. ఈ పథకం 2023 నాటికి పూర్తికావడంతో నిధులు వచ్చే పరిస్థితి లేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు.
- ములుకుదురు-2, వడ్డిముక్కల, నిడుబ్రోలు ఎత్తిపోతల పథకాలకు 2025-26 ఎస్ఎస్ఆర్ ప్రకారం చెల్లించాలని కోరారు.

ఇద్దరు హెచ్‌సీలు, ఒక కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

తాడేపల్లి, గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అవినీతి ఆరోపణలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్‌పై ఎస్పీ వకుల్ జిందాల్ చర్యలు తీసుకున్నారు. రాత్రి సమయాల్లో మట్టి తరలిస్తున్న లారీల నుంచి తాడేపల్లి హెడ్ కానిస్టేబుల్ ఏవీ రమణ, కానిస్టేబుల్ రాము అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో గత నెల 27న వీరిద్దరినీ వీఆర్‌కు పంపించారు. అనంతరం సస్పెండ్ చేశారు. తెనాలి రూరల్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తూ విధుల దుర్వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన హెడ్ కానిస్టేబుల్ చెంగల రాయుడిని కూడా సస్పెండ్ చేశారు.

కాలువకు నీటి విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వైపు తాగునీటి అవసరాల విజ్ఞప్తులపై ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు శనివారం 316 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత నెల 30న నీటిని నిలిపేసిన విషయం తెలిసిందే. వేసవి కాలం కావడంతో మళ్లీ నీటిని విడుదల చేశారు.

1280 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లాలో 1280 చేనేత కార్మిక కుటుంబాలకు ఉచిత విద్యుత్తు అమలు చేస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ సి.హెచ్.సాయిప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారుల కుటుంబాలకు, పవర్ లూమ్ యూనిట్లకు ఉచిత విద్యుత్తు హామీ నెరవేర్చడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. హామీ ఇచ్చిన మేరకు 2026 ఏప్రిల్ 1 నుంచి అర్హులైన చేనేత కళాకారుల కుటుంబాలకు రెండు వందల యూనిట్ల మేర, పవర్ లూమ్ యూనిట్లకు 5 వందల యూనిట్ల మేర ఉచిత విద్యుత్తుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసిందని, ఈ పథకం రాష్ట్ర చేనేత జౌళి శాఖ, ఎనర్జీ డిపార్ట్‌మెంట్ సమన్వయంతో అమలు అవుతుందన్నారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.720, సంవత్సరానికి రూ.8,640 వరకు చేనేత కళాకారుల కుటుంబాలకు, పవర్ లూమ్ యూనిట్లకు నెలకు రూ.1,800, ఏడాదికి రూ.21,600 వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. జిల్లాలో చేనేత కార్మికుల నుంచి ఉచిత విద్యుత్తుకు 1,358 దరఖాస్తులు రాగా, వాటిలో 1,280 అర్హమైనవని తెలిపారు.

4 నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: 2025-26 వార్షిక పదో తరగతి పరీక్షల్లో తప్పిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 4 నుంచి 25 వరకు శిక్షణ నిర్వహించనున్నారు. బాలురకు గుంటూరు నగర శివారు అడవితక్కెళ్లపాడు బాలుర గురుకులంలో, బాలికలకు పల్నాడు జిల్లా రామకృష్ణాపురం బాలికల గురుకులంలో తరగతులు ఉంటాయి. బాల, బాలికలను రప్పించి నిర్ణయించిన షెడ్యూల్‌కు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన తరగతులు నిర్వహించాలని సొసైటీ అధికారులు ఆదేశించారు.

జీజీహెచ్‌లో వైద్యుల వివాదంపై విచారణ కమిటీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు సర్వజనాసుపత్రి(జీజీహెచ్)లో శుక్రవారం ఇద్దరు వైద్యుల మధ్య నెలకొన్న వివాదంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. విచారణ కోసం శనివారం ప్రత్యేకంగా ముగ్గురు డాక్టర్లతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ ప్రియంవద, జీఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్‌తో కూడిన ఈ కమిటీ ప్రాథమిక విచారణ చేపట్టింది. వివాదం జరగడానికి కారణం ఏమిటి? ఒక వైద్యుడు రీల్స్ చేసిన విషయంపై రెండో వైద్యుడు ఏం మాట్లాడారు?..ఆ సమయంలో అక్కడ ఎవరున్నారు అన్న అంశాలను విచారించారు. అనంతరం ప్రత్యక్ష సాక్షులను ఒక్కొక్కరిని వేరువేరుగా పిలిచి వాంగ్మూలం నమోదుచేశారు. దీనిపై మరింత సమగ్ర విచారణ కోసం ఉన్నతాధికారులు కూడా దృష్టిపెడుతున్నారు. ఒకటి రెండురోజుల్లో విచారణ పూర్తి చేసి ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

అన్నీ కట్టకథలేనా..!

- అధ్వానంగా కాలువల నిర్వహణ
- ముందే మేల్కొకుంటే రైతులకు వెతలే

న్యూస్‌టుడే–దుగ్గిరాల, మంగళగిరి గ్రామీణం

మరో నెలలో ఖరీఫ్ మొదలుకానుంది. కానీ కాలువల కట్టలు బలహీనంగా మారి పరిస్థితి దయనీయంగా ఉంది. ఈమని, మంచికలపూడి, పెదకొండూరు తదితర బ్రాంచి కాలువల కట్టల్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈమని బ్రాంచి కాలువ కింద సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఛానల్ మొదట్లోనే దుగ్గిరాల వద్ద గోడలు పగిలిపోయాయి. రాళ్లు బయటకు వచ్చి చిందరవందరగా పడిపోయాయి. దుగ్గిరాల సెంట్రల్ సబ్ డివిజన్‌లో ఈ ఛానల్ పెద్దది. దీని కింద మూడు బ్రాంచి కాలువలున్నాయి. దుగ్గిరాల, కొల్లిపర మండలాలకు సాగునీరు వీటి ద్వారా వెళుతుంది. కట్ట కొన్నిచోట్ల కోతకు గురై, మరికొన్ని చోట్ల గడ్డి పెరిగి కనిపించడం లేదు. దీనికి తోడు తూటాకు, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో నీటి మట్టం పెరిగిన సమయంలో ప్రవాహానికి అవరోధం ఏర్పడి చేలల్లోకి నీరు చేరి పంట దెబ్బతింటోంది. ఈ సమస్యపై రైతులు గడిచిన రబీలో గగ్గోలు పెట్టినా ప్రయోజనం లేకపోయింది.



దుగ్గిరాల-ఈమని మధ్య ఛిద్రమైన కాలువ గోడ

ఆక్రమించేశారు.. ఈమని, పెదకొండూరు, చినపాలెం, పేరుకలపూడి తదితర బ్రాంచి కాలువల కట్టలు ఆక్రమణకు గురయ్యాయి. కొలతలు వేసి సరిచేస్తే రెండు వాహనాలు వెళ్లేంత జాగా వచ్చే అవకాశం ఉంటుంది.



ఈమని ఛానల్‌లో మధ్యలో డామ్ వద్ద కట్టపై పెరిగిన గడ్డి

నీటి సంఘాల పర్యవేక్షణ కరవు..

ప్రభుత్వం నీటి యాజమాన్య సంఘాల ఛైర్మన్లు, సభ్యులు కాలువల పర్యవేక్షణ చేయడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఎక్కడెక్కడ ఇబ్బంది ఉందో గమనించి, రైతుల్ని అడిగి వివరాలు తెలుసుకుని అధికారులకు చెప్పి బాగు చేయించాల్సిన బాధ్యత నీటి సంఘాలదే. ఇందుకోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేయాల్సిన బాధ్యత వీటిపైనే ఉంటుంది. తమ సంఘ ఆయకట్టు పరిధిలోని రైతులతో మమేకమవడం, వారితో మాట్లాడడం అనేదే లేకుండాపోయింది. అసలు సంఘాల సమావేశాల సమాచారం తమకు తెలియడం లేదని పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం – లక్ష్మీనారాయణ, ఏఈ, మెయిన్ కెనాల్, దుగ్గిరాల

ఈమని ఛానల్‌లో మరమ్మతుల విషయమై ప్రతిపాదనలు పంపాం. రాగానే పనులు చేస్తాం. కట్టలను బలోపేతం చేస్తాం. రైతుల సహకారమూ అవసరమే.

EENADU eClassifieds

AUTO

VEHICLES FOR SALE

Force Traveller Delivery Van T1(11ft) 2020Year మంచి కండీషన్‌లో అమ్మకానికి. చౌదరి స్పిన్నర్స్, తణుకు. 91820 23495

ERTIGA VXI, పెట్రోల్, 2020మోడల్ 57000 KMS తిరిగి మంచి కండీషన్‌లో ఉన్నది. 8 లక్షలు. నెట్రోకార్స్, ✆ 99631 33466, 82973 88595

BUSINESS SERVICES

BUSINESS OFFER

Finance on Property, Project, Startup, Takeover. All type files Direct Client/ Consultants. Ct: 90429 77305.

గుంటూరు GTరోడ్డులో బాగా రన్నింగ్‌లో ఉన్న పేరొందిన ఫ్రాంఛైజ్ రెస్టారెంట్ అమ్మకమునకు కలదు. Contact: 96039 69990.

A.I ద్వారా 90 ని.లు తెలుగు సినిమా లేదా 5 భాగాలు సీరియల్స్ లక్ష రూపాయలలో తీసివ్వబడును. కథ, మాటలు, నటులు, డైరెక్షన్‌తో కలిపి చిన్న నిర్మాతలకు మంచి అవకాశం. 9392791151

SAREES

లక్ష్మి కంచిశిల్క్స్. మీసాలపూర్ జరీచీరలు కంచిపట్టు, బెనారస్, గద్వాల్, వెంకటగిరి, కంచి మిల్లు ధరకు కొనబడును. 500 నుంచి 20వేల వరకు. 9703192182

BUILDING CONSTRUCTION

TDR
AP & TELANGANA BONDS BUY & SALE
KAMESH
92 92 15 15 15

కోటి పాత బిల్డింగ్స్, పెంకుటిల్లు రేకుల షెడ్లు పగలకొట్టి నేలమట్టం చేయబడును. పాతదర్వాజాలు, కిటికీలు, కలప,ఐరన్ కొనబడును. సెల్లార్‌తీయబడును. 9949760367

EDUCATION

SUMMER CAMP

300రూ.లకే 30రోజుల కొరియన్ కరాటే సమ్మర్ శిబిరం. ఉ.6am-7am, సా. 5pm-6pm, TJPSకాలేజ్, గుంటూరు. కోచ్: P.చైతన్య మాస్టర్. 9440241440.

FINANCIAL SERVICES

TAX CONSULTANCY

పార్ట్‌టైం/ ఫుల్‌టైం అకౌంటింగ్ వర్క్ చేయబడును. GST రిటన్స్ @99/- మాత్రమే. ఇన్‌కంటాక్స్ రిటన్స్ @999/- ✆ 9848018386.

HOME NEEDS

PEST CONTROL

చెద పురుగుల నివారణ 10 సంవత్సరాల గ్యారంటీ ISO సంస్థ యూనివర్సల్ పెస్ట్ కంట్రోల్ ITC దగ్గర, గుంటూరు 90305 09880, 77021 27789

INTERIOR DECORATORS

ఇంటీరియర్ వర్క్స్. మీ ఇల్లు / అపార్ట్మెంట్ / ఆఫీస్ / స్లాబ్ లీకేజ్ వంటి ఏ వర్క్ అయినా మీ బడ్జెట్‌లో చేసి ఇవ్వబడును. గుంటూరు 9247945779.

INDUSTRY

MACHINERY FOR SALE

1సం క్రితం కొన్న క్రొత్త ఆధునాతన టెక్నాలజీతో 100 టన్నుల కెపాసిటీతో వేబ్రిడ్జి (లారీ కాటా) అమ్మకమునకు కలదు. ✆ 6301435338.

REAL ESTATE

GENERAL

గుంటూరు చిలకలూరిపేట హైవేలో యనమదల సర్వే నం.441/1, చినకొండ్రుపాడుకు సమీపంలో సెంటు రూ.2,00,000/-లకు కన్వర్షన్‌తో "40,30" రోడ్లులు, Open ప్లాట్లు అమ్మకానికి కలవు. Contact: 83310 95126

రాజధాని CRDA పరిసర ప్రాంతాలలో ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, ఖాళీస్థలాలు, పొలాలు రీజనబుల్ ధరలో కొనాలన్నా/ అమ్మాలన్నా సంప్ర. KRM డెవలపర్స్ 93469 46556, 0863-2976557.

Gntసిటీలో గోరంట్ల, లాం, JKC రోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మేవారు 9399955545.

గుంటూరుసిటీ MG ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేస్-1, ఫేస్-2, ఫేస్-3 & జనచైతన్య ప్లాట్స్, గోరంట్ల లాంనందు ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు అమ్మాలన్నా కొనాలన్నా ✆ 8978056257.

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ-గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలిచిన ✆ 7794912324

FLAT FOR SALE

AMARAVATHI ROAD

అమరావతిరోడ్డు ఆలా హాస్పిటల్ దగ్గరలో S.Lగ్రాండ్ 3rdఫ్లోర్ 2BHK N/Eకార్నర్ 46.2చ॥గ॥. కార్ పార్కింగ్,మున్సిపల్ వాటర్@45L స్పాట్ రిజి॥లోన్ 9491187347.

గుంటూరు ఇన్నర్‌రింగ్‌రోడ్డు టైటానిక్ బాష్యండగ్గర శ్రీబాలాజీ నిలయం 4thఫ్లోర్ 2B/R ఫ్లాట్ 1000SFT (38చ.గ) కార్‌పార్కింగ్ W/Fఅమ్మకం. 7382320611.

CHUTTUGUNTA

Chuttugunta Circle 3BHK, Dlx. Flat 1770 sft, Sri Sai Villa Apts. A-Block N/E corner 2side 100ft Rd. ✆ 8885385354.

GUJJANAGUNDLA

గుంటూరు JKCకాలేజ్ రోడ్డు వెంకటాద్రిటవర్స్‌లో 3BHK N/E 2000 sft ఫ్లాట్ 4thఫ్లోర్ అమ్మకం. మెయిన్‌రోడ్ ఫేసింగ్. 98664 20179, 77801 91753

TENALI

తెనాలి పాండురంగపేట గుంటావారివీధిలో కళ్యం రెసిడెన్సీ నందు 3BHK డీలక్స్ ఫ్లాట్లు అమ్మకమునకు కలవు. ✆ 88862 09575, 94409 24300.

VIDYANAGAR

శ్రీశ్రీనివాసమ్ 1/8 విద్యానగర్ 2300sft తూర్పు ప్రైమ్‌లొకేషన్ ప్రీమియం క్వాలిటీ సూపర్ డీలక్స్ రెడీ టు మూవ్ ✆98857 00115, 97041 39333.

1/8 విద్యానగర్ శ్రీహరి వాసమ్ 1225sft పడమర 102, 502 ప్రీమియం క్వాలిటీ సూపర్ డీలక్స్ రెడీటు మూవ్. ✆ 98857 00115, 97041 39333

GENERAL

గుంటూరు బ్రాడీపేటలోని 6/13Aలో అపార్ట్‌మెంట్స్ నందు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఫుల్లీ ఫర్నిష్ 3BHK ఫ్లాట్స్ అమ్మకం. NO GST ✆ 91546 27939.

గుంటూరు, చౌడవరం, sbi బిల్డింగ్ దగ్గర, మారుతి అపార్ట్మెంట్స్ నందు తూర్పు ఫేసింగ్ గల ఫ్లాట్ (202) అమ్మబడును. సంప్రదించండి: 9007546645.

గుంటూరు అమరావతిరోడ్డు విల్లీస్ రెస్టారెంట్ వెనుక గల శ్రీరామ్ నగర్ 1వలైన్‌లోని 1100sft పడమర ఫేస్ ఫ్లాట్ అమ్మకానికి కలదు ✆ :73864 49340.

గుంటూరు హౌసింగ్‌బోర్డు దగ్గర శ్రీసాయి ఫార్చ్యూన్ హైట్స్‌లో 2BHK, 1155 sft E/F ఫుల్ ఫినిష్, 3ACతో కలిపి ఫ్లాట్ అమ్మకం 52లక్షలు. 8897012593

గుంటూరు శ్యామలానగర్ 12thరోడ్ క్రిపాల్స్‌కాంట్రీ అపార్ట్‌మెంట్ నందు 100% వాస్తు W/F, ఫుల్లీఫర్నిష్ 1151 Sq.Ftతో 2BHK అమ్మకం. Sq.Ft. 3500/-. 9396272999, 9248713999

గుంటూరు 6/18 బ్రాడీపేట న్యూ కన్‌స్ట్రక్షన్స్ భవ్య ఓరియన్ అపార్టుమెంట్ నందు N/F 100% వాస్తు ప్రతి ఫ్లోరు 2000 S.Ft. ఫుల్లీఫర్నిష్ 1st & 5th ఫ్లోర్స్ అమ్మబడును. ✆ 93962 72999, 92487 13999.

Gnt, వెంకటరమణకాలనీ 3వలైను Extn., కృష్ణదీపిక ఎన్‌క్లేవ్‌లో 2BHK - 1040 SFT, ఫ్లాట్-205 కార్ & బైక్ పార్కింగ్‌తో అమ్మకం. 8688297269

HOUSE FOR SALE

AMARAVATHI ROAD

గుంటూరుసిటీ గోరంట్ల కొత్తగా నిర్మించిన ఇండిపెండెంట్ గృహము 215 చ.గ. సిద్ధముగా ఉన్నది. మున్సిపల్ వాటర్, బ్యాంక్‌లోన్, 2కార్ల పార్కింగ్ 9849510021.

అమరావతిరోడ్ విజయదుర్గా కాలనీ 134చ॥గ॥ G+1 అప్రూవ్డ్ Indp. హౌస్‌లు అమ్మకం. @72L ఆఫీస్ & గెస్ట్‌హౌస్‌లకు అనుకూలమైనవి. ✆ 9490251794.

A.T.AGRAHARAM

గుంటూరు, A.T.అగ్రహారం 14వలైను ఎదురుగా ఉన్న శాంతినగర్ 4వలైనులో 230చ॥గ॥ నిర్మించిన డాబా ఇల్లు అమ్మకం 9493506133 & 9441492042

BRODIPET

బ్రాడీపేట్ గుంటూరు 3rd లైను మాస్టర్ మైండ్స్ ఎదురుగా అర్బన్ బ్యాంక్ దగ్గర, G+1, 2 పోర్షన్స్, 217 చ॥గ॥లు గల ఇల్లు అమ్మకము. 9909052299, 9948566389

LAKSHMI PURAM

గుంటూరు, పండరీపురం 6/2 D.No:5-78-56లో 278చ॥గ॥ నిర్మించిన 1850 SFT సౌత్ ఫేసింగ్ అన్ని సౌకర్యాలుకల్గిన బిల్డింగ్ అమ్మకం 9959953695

TENALI

తెనాలి నాజరుపేట మహాలక్ష్మిచెట్టు బజారు చివర 601గ.స్థలంలో 9పోర్షన్ల రేకులషెడ్లు, 3షాపులు గలది అమ్మకం. (అద్దె 30వేలు వస్తుంది) ✆ 9246440525.

GENERAL

గుంటూరువారితోటలో, కొత్తపేటలో, ప్రకాష్‌నగర్‌లో తక్కెళ్ళపాడులో, ఇల్లు, స్థలాలు మరియు పొలాలు ఎక్కడైనా కొనాలన్నా/ అమ్మాలన్నా తక్కువ ధరకు ఇప్పించబడును. పాలబూత్ మస్తాన్‌వలి రామిరెడ్డితోట 1వ, 2లైను, కారుమూరి హాస్పటల్ ఎదురు, ఓల్డ్ క్లబ్‌రోడ్ 9866668822

VJA: కేదారేశ్వరపేట 2వ లైన్‌లో చ.గ. 200ల నందు కన్‌స్ట్రక్షన్ జరుగుచున్న GF, 1st, 2nd ఫ్లోర్స్ గల న్యూ బిల్డింగ్ అమ్మబడును. ✆ 98683 31389

గుంటూరుసిటి పొన్నూరురోడ్ కరెంటు ఆఫీసు ఎదురు వనమాన్ బొమ్మరిల్లు అపార్టుమెంట్ ప్రక్కన 109గ. పాత2BHK గ్రౌండ్, ఫస్ట్‌ఫ్లోర్ ఇల్లు అమ్మకం. 9704049199

2పోర్షన్స్ RCC రేకుల ఇల్లు నెలకు 7000/- అద్దె వచ్చును. కొ॥ 12x48=64గ॥ తూర్పు మరియు పడమర 20 అ॥రోడ్డు, స్వాధీనం 9848018386.

LAND FOR SALE

NARASARAOPETA

నరసరావుపేటకి 7KM దూరములో పాలపాడు నల్లగార్లపాడు మధ్యలో ఎకరాల 3.25సెంట్లు మాగాణి పొలం అమ్మకానికి కలదు. 8686812799.

GENERAL

ఫిరంగిపురం(మం), బేతపూడి(గ్రా) డాక్టర్ పొలం సర్వే నెం.243/A, 249/A, 250లో 4 ఎకరాల 96 సెంట్లు మెట్ట మాగాణి పొలం అమ్మకం. ✆ 8500570760

బోయపాలెం -కొండవీడు వెళ్ళే రోడ్డు ప్రక్కన 2.59సెంట్లు వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. ఈ భూమికి ఆనుకొని ఉత్తరం హద్దుగా 350 ఎకరాల CRDA Approved గల మెగా వెంచర్ కలదు. ఎకరం రేటు 60 లక్షలు. 9000040400.

గుంటూరు జిల్లా- తెనాలి టౌన్‌కి 5km దూరం, చినపరిమి విలేజ్‌లో మాగాణి భూమి ఎ 1.24 సెంట్లు, భవిష్యత్తులో ప్లాట్లు వేసేది. @ ఎ40 లక్షలు. ✆ 9989311311

PLOT FOR SALE

TADEPALLI

గుంటూరు - విజయవాడ హైవేకి 1Km మంగళగిరి తెనాలి ఫ్లైఓవర్ వద్ద అక్షయపాత్ర ముందు ఉడా లేఅవుట్ సౌత్‌ఫేస్ 200 గజాల ప్లాటు. గజం: 26000/-లకే ✆ 92907 63488.

AMARAVATHI ROAD

గుంటూరు అమరావతిరోడ్, మెడికల్ హాస్టల్ వెనుక కొండయ్య కాలనీ ప్రక్కన, ఎంప్లాయిస్ కాలనీ 706 చ.గ. ఈస్ట్‌ఫేస్ స్థలం అమ్మకం. ✆ 8500570760.

అమరావతి రోడ్డు చలపతి కాలేజీకిదగ్గరలో పడమర 60ft, దక్షిణం 40ft. 2రోడ్ల కార్నర్‌లో (27x53) 159చ.గ. ఓపెన్ ప్లాట్ అమ్మకం. 9398251099

గుంటూరు - అమరావతిరోడ్ లాం గ్రామంలో R.R.వెంచర్‌లో L.P.No 41 CRDAప్లాట్ నెం:3, 389 చ॥గ॥, ప్లాట్ నెం.16 396 చ॥గ॥ 2ప్లాట్లు ప్రక్కప్రక్కనే ఉన్నవి అమ్మబడును. ✆ 9885212809.

KOTHAPETA

గుంటూరు పాత్త ఆఫ్‌సిటీ కొత్తపేట మెయిన్‌రోడ్ గాంధీబొమ్మ సెంటర్, బావన ఋషి ప్రక్క సందులో 120 చ॥గ॥ ఖాళీ స్థలం అమ్మబడును. ✆ 9032901929.

MANGALAGIRI

మంగళగిరి డిలైట్ దాబా ప్రక్క సందులో 22 చ.గ. ఉత్తరంఫేస్ ఖాళీస్థలం అమ్మకం. ఇల్లు/ గోడౌన్‌కు అనుకూలము. ✆ 79894 27931, 98490 73671.

INNER RING ROAD

మీపెట్టుబడికి ఇదే సరైన సమయం. గుంటూరు, గోరంట్ల, ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేసింగ్‌లో కమర్షియల్ ప్లాట్స్ తక్కువధరలో కలవు. 9704852952, 9394101817

PALAKALURU ROAD

పెదపలకలూరు JLE సినిమాస్ ఎదురురోడ్డు & ఫేస్-3కి 2వ బిట్ 500 చ.గ. (ఎ80xలో57) ఈస్ట్‌ఫేస్ స్థలం అమ్మకానికి కలదు. ✆ 93939 22448.

TENALI

తెనాలి సిద్ధార్థ కాలనీలో ఇళ్ళ మధ్యలో కాంపౌండ్‌వాల్ కట్టినది W/F 125 చ॥గ॥ స్థలం అమ్మకం. ✆ 9849143309, 7780598846.

తెనాలి RTC బస్టాండ్ అవుట్‌గేట్ ఎదురు, VSR కాలేజ్ రోడ్ మొదట్లో పడమర ఫేస్ 990 గ.ల స్థలం అమ్మకానికి కలదు. ✆ 9491133331.

GENERAL

గుంటూరు ఇన్నర్‌రింగ్ రోడ్డుకి 3వ బిట్ అగతవరప్పాడు - (V) (66X40)- 288గ॥ల తూర్పు ఫేస్-ఖాళీస్థలం అమ్మబడును చ॥గ॥ 37,000/-. ✆ 94943 96969 / 94944 76303.

గుంటూరు సిటీకి అతిసమీపంలో NRI కాలేజ్ ప్రక్కన విశదలORRకి లోపల 60% బ్యాంక్ లోన్ సదుపాయంతో APCRDAప్లాట్లు కలవు. సంప్ర॥ 9959127008

30Ft Road 355 Sqyds ఖాళీస్థలం అమ్మకానికి కలదు. గజం రూ. 37,000/- నాగార్జున యూనివర్సిటీ దగ్గర. ✆ 9441326568.

తెనాలి టు బుర్రిపాలెం మెయిన్ రోడ్డుకు దగ్గరలో తూర్పు ఫేసింగ్ 30 అడుగుల వెడల్పు, సిమెంటు రోడ్డులో చ.గ. 192-3లు స్థలము అమ్మబడును. ఫోన్: 9666188103

కొప్పురావూరు & నల్లపాడు రోడ్డులో ప్లాట్స్ కలవు. కొప్పురావూరులో చ.గ.14000/- & నల్లపాడు రోడ్డులో చ.గ. 17000/- డైరెక్ట్ పార్టీస్ సంప్ర॥ 9347815466.

తక్కువ ధరలో రాజధానిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. CRDA & RERA అప్రూవ్డ్ వెంచర్ 70% బ్యాంకులోన్ సౌకర్యం కలదు. 9701486924

గుంటూరునగరంలో గుజ్జనగుండ్ల ఏరియాలో ఉత్తరం ఫేసింగ్ 112 చ.గ.స్థలం రెసిడెన్సియల్ ఏరియాలో అమ్మకానికి కలదు. 9652369676, 8125906036.

గోరంట్ల గ్రామము - గుంటూరు (నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ దగ్గర) 184 గజాల ప్లాటు అమ్మకము. W/F, రెడీ ఫర్ కన్‌స్ట్రక్షన్, నో బ్రోకర్స్ ✆ 9849155001.

గుంటూరుసిటీ ఆర్టీసీ బస్టాండ్‌దగ్గర షాప్ ఎంప్లాయిస్ కాలనీలో 8,9 లైన్లలో 1700గజాలు స్థలము తక్కువ ధరకు లభించును. పాలబూత్ మస్తాన్‌వలి.9866668822.

NH-216 (బాపట్ల జిల్లా) కనగాల బైపాస్ దాటాక గూడవల్లి మొదట్లో 707 చ॥గ॥ (14.5 సెంట్లు) కమర్షియల్ ప్లాట్ అమ్మకమునకు కలదు. గజం రూ.11,000/- మాత్రమే. సంప్ర: 70133 78115.

గుంటూరు కిమ్స్ హాస్పటల్‌కి 1KM దూరం కొ॥ 33x43=157గ॥ అమ్మబడును. పడమర ఫేస్, 20 అ॥ రోడ్డు గ॥ 27,000/- ✆ 9848018386.

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఆనుకొని అన్ని లేడీస్ హాస్టల్స్ మధ్యలో 412గజాల (70x53) పడమర ఫేసింగ్ కమర్షియల్ సైట్ అమ్మకం. 9652131115.

నంబూరు(గ్రా) పెదకాకాని (మం), గుంటూరుజిల్లా ఊరిమధ్యలో రోడ్డు ఫేసింగ్ గల 21సెంట్లు స్థలం అమ్మకం. సెంటు : 9 లక్షలు. ✆ 8143321331.

రాజధాని దగ్గరలో ప్లాట్స్
సత్తెనపల్లి రోడ్డు ఆనుకొని (భీమనేని వారి పొలం దగ్గర) 1100 గజాలు
నంబూరు రేడియోస్టేషన్ ఉత్తరం గోడ ఆనుకొని 500 గజాలు
పందివెలుగు రోడ్డు వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురు రోడ్డులో వస్తలత ప్లాట్స్ ఆనుకొని 150 గజాలు
సుద్దపల్లి డొంక 80 అడుగుల రోడ్డు ఆనుకొని, యన్.హెచ్.-5కి చాలా దగ్గరగా 6 ప్లాట్స్ (2000 గజాలు)
నాగరాజు- 9398869188
భూపాల్ : 9409403839

COMMERCIAL SPACE FOR SALE

GENERAL

గుంటూరు-CH పేట, వెళ్ళే రోడ్డులో, మిర్చియార్డు తరువాత హోటల్ అట్లాంటిస్ ప్రక్కన 936 చ॥గ॥ "గోడౌను" అమ్మకము ✆ 85002 23385, 92464 21336.

గుంటూరు, బ్రాడీపేట 3/1 విమల్ విహార్ కాంప్లెక్స్ 2nd ఫ్లోర్ 450sft, కమర్షియల్ స్పేస్ అమ్మకం. మంచి రెంటల్ ఇన్కం. సంప్ర: 9985018999.

Commercial Space
Mill / Godown for Sale
Vijayawada - Machilipatnam Highway Facing
22.5 Cents with recently constructed Godown / Mill is available for Sale
Phone 98661 23491
WhatsApp 81252 60540

LEASE/ RENT

GENERAL

Guntur -Vijayawada HighWay 10000sft (4-Sheds) Opp. Nambur Rly. Station, Near Srikaali Gardens with Compound Wall&Open Space. 98481 32095, 96033 86444

Sankarvilas Centre 2500sft. Ground Floor, 1st & 2nd Floor for Lease or Rent. Call: Dr. Ranga: 94402 64541, Sivaprasad: 93465 73583

PROPERTY FOR SALE

GENERAL

700 గ. స్థలంలో 5ఫ్లోర్స్ హాస్టల్ &బ్యాంక్ బిల్డింగ్ Sale. ఫ్లోర్-4000sft 2 ఫ్లోర్స్‌లోరూమ్స్ gnt- cpt హైవే sbi దగ్గర, చౌడవరం 9885611116

LEASE/ SALE

GENERAL

Donka Road Guntur (650 SFT) SVR Empire 1st Floor Shop No F-6 Available Sale / Lease Immediately Cont : 7032185262.

గుంటూరు అమరావతి రోడ్‌లో ప్రముఖ రెస్టారెంట్ లీజు/సేల్‌కి కలదు. 1st & 2nd ఫ్లోర్ 4000 Sft, స్టాఫ్ రూమ్ ఉన్నది. Cont. Cell: 99081 88946.

TO LET

Guntur, Krishna Nagar 2nd Line D.No:585, beside UBI 3B/R (2000SFT) Ground Floor Tolet for Residence / Commercial. 9885063595.

3BHK Muthylareddy Nagar, Gnt 7th in, EF, House 1stFlr Marble attached POP Celing, C Boards, Car Parking, D Water.7842166726

గుంటూరు హౌసింగ్ బోర్డు కాలనీలో MIG 253లో పై పోర్షన్ ఇండివిడ్యువల్ 3 BHK అద్దెకు కలదు. (వెజిటేరియన్స్‌కు మాత్రమే) ✆ 98851 11549.

3BHK ఓన్లీ ఫ్యామిలీస్ N/F 3ఫ్లోర్ లిఫ్ట్, కార్ పార్కింగ్, A/c నాగార్జున ఎంక్లేవ్ 2/14 బ్రాడీపేట opp SBI Gnt 98490 13688, 81421 49141.

గుంటూరు, కొత్తపేట, బాస్కర్‌డీలక్స్ రోడ్, రాములవారి గుడి ఎదురు, కొంజేటి కాంప్లెక్స్, 1st ఫ్లోర్, 1B/R పోర్షన్ ఫర్నిచర్‌తో అద్దెకు 9392077638.

పాతగుంటూరు బాలాజీనగర్ 7/13లైను పుట్టఎదురు 2B/R G.ఫ్లోర్ & 1B/R, 2nd ఫ్లోర్ ఫ్లాట్స్ 24గం॥లు మంచినీరు, ఓన్లీ Govt ఎంప్లాయిస్. 8019460820.

చీరాల ముంతవారి సెంటర్ చైతన్య స్కూల్ దగ్గర గ్రౌండ్ ఫ్లోర్ ఇల్లు బాడుగకు కలదు. బాడుగ: 9000/- సెల్ నెం.80740 06060కు మెసేజ్ చేయగలరు.

COMMERCIAL

Office space for Rent - 2 Halls, 2Wash Rooms, 1 Parking, CC TV, Power Backup, 2725 Sft @ 35/- Rs. in Lakshmi Vijay's Elite, 1st Floor, 6th line, CM Nagar, GNT. ✆ 9849662231.

Doctors Plaza Kothapet Guntur 3000 SFT Main Road Facing 2 Cars Parking Available October 1st Cont : 7032185262.

గుంటూరు సిటీ అరండల్‌పేట 10/2లో 1000 చ॥అ॥ & రామన్నపేట 1/3లో కమర్షియల్‌కు అనువైన బిల్డింగ్స్ అద్దెకు 94402 41366, 97004 64914.

గుంటూరు, బ్రాడీపేట 4వలైను కొత్తమాసు కాంప్లెక్స్, పాత స్వీట్ మ్యాజిక్ బిల్డింగ్ నందు గ్రౌండ్ + 3ఫ్లోర్‌లు మొత్తంగా కాని, విడివిడిగా కాని కమర్షియల్ షోరూమ్‌లు, ఆఫీసులు, కోచింగ్ సెంటర్‌లు, హాస్టల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. ✆ 9849112255.

తెనాలి బాలాజీరావుపేట రైల్వే స్టేషన్ రోడ్‌లో G+3 బిల్డింగ్ (11000 Sft) స్కూల్స్/కాలేజిలకు అనువైనది. పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు కలదు. ✆ 6305704148.

గుంటూరు చుట్టుగుంట సర్కిల్‌కి దగ్గరలో నల్లపాడు రోడ్డులో మెయిన్‌రోడ్‌కి 2వ బిట్టు E/F 420 గ॥లు (2600 SFT) గోడౌన్ అద్దెకు కలదు. 8639665877.

JKC కాలేజీరోడ్డు, తియర గోల్డ్‌షాపు ఉన్న బిల్డింగ్‌పైన 3వ అంతస్థులో 20x12అ॥ హాల్ కమర్షియల్/ ఉద్యోగ /వ్యాపారస్థులు / బ్యాచులర్స్‌కు అద్దెకు ✆ 94402 07669.

WANTED

గుంటూరు మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థ వారికి 2027 విద్యా సంవత్సరానికిగాను పలకలూరు లేదా పరిసర ప్రాంతాలలో 50000 నుండి 60000 చదరపు అడుగుల బిల్డింగ్ నిర్మించి అద్దెకు ఇవ్వదలచిన సొంత స్థలం యజమానులు లేదా బిల్డర్స్ సంప్ర॥ 9154152894.

JOBS

Wanted ITI/ Dip/ B.Tech (ECE/EEE/Mec) Freshers For Electronic & Solar Industries, Hyd. Saketh HR # 96250 64269/ 95051 82931.

Wanted Senior & Junior Network Administrators (Salary: 15,000/- to 35,000/-). Contact: Amrita Sai Engineering College, Autonomous, Paritala. Mail: marketing@amritasai.org.in ✆ 99482 30222

Wanted Faculty: Pre Primary School level mother Teachers, Telugu & Hindi (only Ladies) Primary School level 3rd to 5th (all Subjects) including Computers (only Ladies) High School Level: 6th to 10th (all Subjects) including Computers (only Ladies) IIT & NEET Teachers Maths, Physics, Chemistry & Biology, Physical Education Teacher, Front Office: 1) Receptionists (only Ladis) 2) DTP Operators (only Ladies) 3) Record Assistants 4) Hostel Wardens with minimum 2 yrs experience with good spoken English is must for all Posts. Good Computer skills are preferred. Salary is based on performance. ✆ 8712618895, GNT

Wanted Wardens & Teachers. Qual: B.Sc, BA, B.Ed, D.E.D, Sal: 10k to 15k, NTR U.R Vidya Mission, Guntur. Cell: 9642394248.

Wanted Qualified and Experienced Teachers to Teach 8th, 9th and 10th Class -Full Time for all Subjects. Sumedha High School, Guntur. 9440884154.

Wanted Teachers. Pre-primary, Primary & High School for all Subjects, Principals, Incharges, Hostel Wardens M/F and PET's Contact Immediately. Guntur. Cell: 94946 78607, 99123 77669.

MNC Company opportunity House Wife's / Retired Employees Full/Part Time, Monthly, Income:30,000/- above. ✆ 8121009396.

Wanted Female Tele Callers. Salary: 10K - 15K Qualification: B.Tech, MBA, MCA & Any Degree. Contact: 8019167289.

Wanted Collection Executives, Team Leaders, Managers& Telecallers for Job in Banking Sectors in Vijayawada Location. ✆ 9550032303, 6303051636.

Wanted Faculty for RTC Colony Pre-Primary School level Mother Teachers, Telugu & Hindi (Only Ladies), Primary School Level: 3rd to 5th (all subjects) including Computers (only Ladies), High School Level 6th to 10th (all Subjects) including Computers (only Ladies) IIT & NEET Teachers, Maths, Physics, Chemistry & Biology, Physical Education Teachers with minimum 2 yrs experience with good Spoken English is must. Salary based on performance. 9908507923, GNT

Wanted a Female Office Clerk. Qul: Graduation, Fast Typing skill. MB GST Consultancy, Devi Chowk, Tenali. ✆ 9959137184.

GCKVN Degree College, Guntur requires Lecturer in Computers send your Resume to : 7780434600. Contact: 9440307749.

Hotel Vijaya Residency Anakapalli requires Front Office Managers and F and B Managers Previous Hotel Experience Compulsory. 76719 95507/ 77999 25975.

Wanted Doctors - MD General Medicine, MS OBG and Duty Doctors for 50 bedded Multi Specialty Hospital, GBC Road, Ponnur. Contact : 96527 83684, 99895 49230.

Wanted qualified & experienced Teacher to Teach Science & Social for the Classes 3rd to 6th & Montessori Trained Teacher for LKG Gemini smart kids School, 2/12 Brodipet. Ph. 6304559033.

Wanted Lady Clerk, Teachers for Lower Classes (LKG to VII) all Subjects. GKR H. School, Pattabhipuram, 1st lane. 8897682399

Wanted B.Tech, Diploma, IN EEE (or) C.T.I in Electrical with complete knowledge in Theroy and Practical for Lecturers in Sri Ram I.T.I, Dharani kota, Amaravathi, and M.P.R.M I.T.I, Nadikudi. 80083 37053, 70135 68106.

గుంటూరు, ఆటోనగర్ Hyundai కార్ షోరూమ్ వెనక ప్లాస్టిక్ కంపెనీలో పని చేయుటకు అనుభవమున్న అకౌంటెంట్ కావలెను. 93479 76411, 94419 01119

లాం గ్రామంలో HP పెట్రోల్ బంకులో పంపు బాయ్స్ & గర్ల్స్ కావలెను. జీతం: 15000/- ఫ్రీ అకామిడేషన్ కలదు. ✆ 99123 18216, 99669 77288.

TATA కంపెనీలో లైఫ్&హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీము లీడర్లు కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. ✆ 9490866938.

గుంటూరు, తెనాలిలో ప్రముఖ విద్యాసంస్థలో డిగ్రీ అర్హతతో అనుభవమున్న లేడి టెలికాలర్స్ - 15No's కావలెను. జీతం + ఇన్సెంటివ్స్. ✆ 7989345455.

చేబ్రోలులోని ప్రముఖ ఇంగ్లీష్ మీడియం స్కూలు నందు నర్సరీ - 5th వరకు మ్యాథ్స్, ఇంగ్లీష్, తెలుగు సబ్జక్టుకు లేడీ టీచర్స్ 5th క్లాస్ - 10th మ్యాథ్స్, ఇంగ్లీష్ టీచర్స్ కావలెను. సెల్: 9966422909.

USA వీసా కలిగి ఉండి కిచెన్ / ఫ్రంట్ డెస్క్ పనికి సహాయము చేయువారు మరియు ప్రయాణమునకు సిద్ధముగా ఉన్నవారు సంప్రదించగలరు. ✆ 9182695378

ప్రముఖ గార్మెంట్స్ కంపెనీలో పనిచేయుటకు (షర్ట్స్ కుట్టుటకు) టైలర్స్ కావలెను స్త్రీ/పు) జీతం: 15000/- బుడంపాడు, గుంటూరు. 8309104551, 9963938656

ప్రకృతి వ్యవసాయ సూపర్‌వైజర్స్: విశాఖకి దగ్గర ఉన్న గోశాల దానికి అనుబంధంగాఉన్న వ్యవసాయ క్షేత్రంలో అన్నిరకాల పంటలు వేయుటకు, ప్రకృతి వ్యవసాయంలో అనుభవం ఉన్నవారు కావలెను. 5 లేయర్ ఫార్మింగ్ చేయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. అర్హతగల వారికి తగిన జీతం, భోజనం, నివాసం ఏర్పాటు చేయబడును 73996 64499

ప్రకృతి ఆశ్రమంలో ఉద్యోగం చేయుటకు BNYS న్యూట్రిషన్స్, మేనేజర్లు, మార్కెటింగ్ సిబ్బంది, టెలికాలర్స్ సోషల్ మీడియా ప్రమోటర్స్ కావలెను. సంప్ర: 9392216369.

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60 రోజుల ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ:18-28. 9063817157

కావలెను
గుంటూరు లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ అయిన 'శ్రీ అనూష రియల్ ఎస్టేట్' నందు పనిచేయుటకు అనుభవజ్ఞులైన మార్కెటింగ్ సిబ్బంది కావలెను. అనుభవము మరియు వ్యాపారాన్ని బట్టి ఆకర్షణీయమైన అలవెన్స్‌లు ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించగలరు.
✆7207758589

ఇంట్లోనే ఉండి వంటపని చేయుటకు 50 సం.లోపు వయస్సు ఒంటరి మహిళ కావలెను. నరసరావు పేట, సత్తెనపల్లి ప్రాంతాల వారికి ప్రాధాన్యత. 9398181873.

విజయవాడలోని ప్రముఖ A/C, కూలర్ రెంటల్ కంపెనీకి డ్రైవింగ్ కమ్ హెల్పర్ అండ్ A/C టెక్నీషియన్స్ కావలెను. జీతం: 20వేలు- 25వేలు + రూము, ఫుడ్ ఫ్రీ. ఫ్రీ ట్రైనింగ్. 90300 44622

GST, TDS ఫైలింగ్ కొరకు సీనియర్ అకౌంటెంట్ & అకౌంటెంట్ కావలెను. సెల్: 9010525588.

గుంటూరులో డెంటల్ క్లినిక్‌లో పనిచేయుటకు P.R.O కావలెను (మార్కెటింగ్ పర్సన్) గుంటూరు లోకల్, టూవీలర్ తప్పనిసరి. జీతం 18K+ఇన్సెంటివ్. 6302243437.

తెనాలి పరిసరప్రాంతాలలో పని చేయుటకు బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ: 25,000 + (పెట్రోలు అలివెన్స్ + ఇన్సెంటివ్స్) కలదు. ✆79979 71119, 9666331616

పిడుగురాళ్ళలో ప్రముఖ విద్యా సంస్థలో పని చేయుటకు మెన్ సూపర్‌వైజర్స్, మెన్ ఇంచార్జ్‌లు, వంటవారు (కుక్స్), టిఫిన్ మాస్టర్, కర్రీమాస్టర్, రైస్ మాస్టర్ కావలెను. సెల్ 8885670754.

శ్రీ వసుధ డెవలపర్స్ రియల్ ఎస్టేట్స్ సంస్థలో పనిచేయుటకు సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్స్, GM, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అనుభవమును బట్టి మంచి జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. MBA ఫ్రెషర్స్ కూడా. సంప్ర: 7997795599, 7207610057.

వర్కర్స్ కావలెను. తెనాలి దగ్గర పెదరావూరులోని చెప్పుల ఫ్యాక్టరీకు 40 సం.లోపు ఆడ & మగ వర్కర్స్ కావలెను. మంచి జీతం. ✆ 9553383555.

మంగళగిరిలో పనిచేయుటకు Saketh HRకి సూపర్వైజర్లు/ సెక్యూరిటీ సూపర్వైజర్లు/ హెల్పర్లు కావలెను. PF + ESI, (రూమ్ + భోజనం ఉచితం) 7097873362.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజీలో ఉద్యోగ ఖాళీలు: SR బ్యాచ్ ఇన్‌ఛార్జిలు, లింగం: పురుషులు మాత్రమే, విద్యా అర్హతలు: ఇంటర్ నుండి డిగ్రీ వరకు, వయస్సు: 25 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల మధ్య ఉండవలెను. నెలకు జీతము 16000/- వరకు ఇవ్వబడును. వివరములకు సంప్ర॥ 9248722246.

గుంటూరు కొత్తపేటలోని డాక్టర్‌గారు నిర్మిస్తున్న నిర్మాణ స్థలంలో పనిచేయుటకు భార్యభర్తలు కావలెను. ఉచిత వసతి కలదు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు: 91334 30333, 80195 59657, 99491 25425.

మా రియల్ ఎస్టేట్ కంపెనీకి మార్కెటింగ్ మేనేజర్స్, లీడర్స్, గృహిణులు, Govt/ Pvt & Rtd, LIC/ చిట్స్ & ఇన్సూరెన్స్ వారు కావలెను ✆ 9502822335.

డెలివరీ బాయ్స్-2 కావలెను. శ్రీ వెంకటేశ్వర రైస్ ట్రేడింగ్ కంపెనీ, 2/18 బ్రాడీపేట, గుంటూరు. లోకల్‌వారికి ప్రాధాన్యత. 92464 84356, 0863-2222647.

త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను/ పేషెంట్స్ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ: 18K to 20K. 96404 00073, 9848571888.

గుంటూరు ప్రముఖ సంస్థకు MBAగల (M) అభ్యర్థులు (జీతం 15K-20K) & డిగ్రీ - బి.టెక్ గల లేడీ టెలికాలర్స్ కావలెను. అనుభవం బట్టి జీతం. 20K-30K వరకు. ✆ 9394667788.

గుంటూరు ఆటోనగర్‌లో మోడ్యులర్ ఇండస్ట్రీ కంపెనీలో పనిచేయుటకు * టెక్నీషియన్ (మగ) (Pansaw కట్టర్) & కోల్డ్ ప్రెస్సింగ్ ఎడ్జిబెండింగ్ మెషిన్‌లపై అవగాహన కలిగి ఉండాలి. * టెక్నీషియన్ అసిస్టెంట్ (మగ) 10వ తరగతి పాసై ఉండాలి, ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 90596 81212, 9059631212

ప్రముఖ దాల్‌మిల్‌లో పని చేయుటకు సూపర్‌వైజర్ cum అకౌంటెంట్ 3 సం.రాలు అనుభవం కలిగివున్న వారు కావలెను. గుంటూరు. సంప్ర॥ 9030206999.

సేల్స్‌మెన్ కావలెను. ఆటోమొబైల్స్ (ఏ బోల్ట్స్) షాపుకు అనుభవం గల సేల్స్‌మెన్ కావలెను. గుంటూరు లోకల్ వారికి ప్రాధాన్యత. M.S. ఏజెన్సీస్, భారత్ పెట్రోల్‌బంకు ప్రక్కన, ఆటోనగర్, గుంటూరు.

అకౌంటెంట్ జీ20k-28K మరియు ఆఫీస్‌బాయ్ కావలెను. జీ: 15K-20K లోకల్ వారికి ప్రాధాన్యత. KK డిస్ట్రిబ్యూటర్, GNT ✆ 9393922448.

గుంటూరు కొత్తపేట శివ మెడికల్ హోల్‌సేల్ షాపులో పని చేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్ & సేల్స్‌గర్ల్స్ కావలెను. టైం: 10am-7pm, జీ: 15k-20k. 9000812161

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారికి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి అనుభవం ఉన్న కారుడ్రైవర్ కావలెను. అనుభవమును బట్టి జీతం. ✆ 9391526523.

లేడి రిసెప్షనిస్ట్ కావలెను. డిగ్రీ చదివిన 25-40 సం॥లోపు వారు ట్రావెల్స్ ఆఫీసు కొరకు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 99519 99100, తెనాలి.

మోడ్యులర్ ఫర్నిచర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ నందు పని చేయుటకు 2సం॥ల అనుభవంగల పురుషులు / మహిళలు కావలెను. ఆకర్షణీయమైన జీతం సామర్థ్యాన్ని బట్టి ఇవ్వబడును. స్థలం: విజయవాడ న్యూఆటోనగర్. ఫోన్: 9866267599

గుంటూరుసిటిలోని ప్రముఖ బార్ & రెస్టారెంట్‌లో పార్ట్‌టైం పని చేయుటకు సప్లయర్స్ కావలెను. టైమింగ్స్: 6pm - 12pm 7093687150.

కాశీలో గుంటూరువారి సత్రంలో అకౌంటెంట్‌గా (కంప్యూటర్) వర్క్ చేయుటకు అనుభవం కలిగిన వారు కావలెను. తగు శాలరీ ఇవ్వబడును. 98662 28989, 94406 18808.

గుంటూరు జిల్లా కాకుమాను మండలం, బి.కే.పాలెం గ్రామంలో గల గోడౌన్‌లో పని చేయుటకు అకౌంటెంట్ కంప్యూటర్ నాలెడ్జి గల ఆఫీస్ క్లార్క్, వాచ్ మెన్ (భార్యాభర్తలు) కావలెను. ✆ 9849066516

గుంటూరు శాకాహార రెస్టారెంట్‌లో పనిచేయుటకు ఉదయం 4 గంటలకు లేచే అనుభవంగల కిచెన్ సూపర్‌వైజర్, క్యాషియర్, వెయిటర్స్, క్లీనింగ్ బాయ్స్/గర్ల్స్ కావలెను. ✆ 6305054647.

గుంటూరు, లక్ష్మీపురం LG సర్వీస్ సెంటర్ నందు పని చేయుటకు Stores Persons & CCO's కావలెను. సంప్ర॥ 9059738104.

గుంటూరు ప్రముఖ సంస్థనందు B.Com Tally చదివినవారు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, MBA చదివినవారు సేల్స్ మేనేజర్‌గా అర్జెంటుగా కావలెను. 8977744644

ప్రముఖ రియల్‌ఎస్టేట్ గుంటూరు నందు పని చేయుటకు మార్కెటింగ్ ఎంప్లాయిస్ (టెలికాలర్స్) కావలెను. అర్హత: 7th-10th, జీతం: పార్ట్‌టైమ్ 6000, ఫుల్‌టైమ్ 12000+ ఇన్సెంటివ్స్. ✆ 9644669999, 9908686363.

త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను / పేషెంట్స్‌ను/ పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి. భోజనం. జీ: 20K. ✆ 8520980099, 8520874499

గుంటూరులోని ప్రముఖ కాలేజీలో క్యాంటీన్ నిర్వహించుటకు అనుభవము కల్గి ఆసక్తిగల వారు సంప్రదించండి ✆ 8520999560.

ప్రముఖ టాటాలైఫ్ & హెల్త్ ఇన్సురెన్స్ కంపెనీలో పని చేయుటకు అడ్వయిజర్స్ & టీం లీడర్స్ కావలెను. Q: 10th-డిగ్రీ, వ: 25పైన మంచి ఆదాయం 9848083351.

గుంటూరులోని ప్రముఖ కళాశాల ఉమెన్స్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో పని చేయుటకు "లేడీ రెసిడెన్షియల్ వార్డెన్" కావలెను. వివరాలకు ✆ 8520999560.

గుంటూరు, బ్రాడీపేట, మా మ్యారేజ్ బ్యూరో ఆఫీసులో పనిచేయుటకు లేడీస్-2 కావలెను. జీ: 10వేలు & టైం: 10AM - 6PM సంప్ర॥ గోపిశర్మ ✆ 9298801428.

గుంటూరు, బ్రాడీపేట 4/18లో ఉమెన్స్ షాపీలో పనిచేయుటకు సేల్స్‌గర్ల్స్ కావలెను. టైమింగ్స్: 9.30AM - 8.30PM, జీతం: 10K. ✆ 9502949743.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు క్లాస్ ఇన్‌ఛార్జ్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14000/- నుండి 23000/- వరకు ఇవ్వబడును. అర్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు, వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యిఉండాలి. వివరములకు 8978480429

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్‌గా పనిచేయుటక పురుషులు కావలెను. జీతము : 13000/- ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: 10th మరియు ఇంటర్, వయస్సు 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు 91546 93478.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజినందు మెటీరియల్ డిజైనర్స్‌గా పనిచేయుటకు 40 wpm టైపింగ్ స్పీడ్, మెథమేటిక్స్ ఫార్ములాస్, తెలుగు టైపింగ్, M.S Wordలో మంచి నైపుణ్యం కలిగిన గుంటూరు లోకల్ పురుషులు కావలెను. జీతము: 16000/- వరకు ఇవ్వబడును. విద్యార్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సంవత్సరముల పైన ఉండవలెను. 8978480429

సీసీటీవీ కెమెరా వర్క్ కి ఫ్రెషర్స్ కావలెను (ఫీల్డ్ వర్క్) శాలరీ 15000/ & etc- ఆఫీస్ (చెన్నై / హైదరాబాద్) ✆ 9959328876 / 9731722666

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు Construction Site Inchargesగా పని చేయుటకు పురుషులు కావలెను. విద్యార్హతలు : Civil Diploma మరియు Civil Engineering, వయస్సు : 30 నుండి 50 సంవత్సరముల మధ్య ఉండవలెను. జీతము : 20000/-, 25000/-, 30000/-, 35000/-లలో విద్యా అర్హత, Job Experience ఆధారంగా జీతము నిర్ణయించ బడును. వివరములకు 8978480430.

75సం॥ మహిళను చూసుకొనుటకు మాఇంటి వద్దనే వుండి ఏ బాదరాబందీలేని 45 సం॥ ఒంటరి మహిళ కావలెను. భోజనం, వసతి కలదు. GNT 9866806061.

గుంటూరు, మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు వార్డెన్స్, హాస్టల్ ఇన్‌చార్జ్‌గా పని చేయుటకు స్త్రీలు కావలెను. జీతము : 11000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు : ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు : 20 సంవత్సరములపైన ఉండవలెను. వివరములకు సంప్రదించగలరు. 9100024059

రామా డ్రెస్సెస్‌నందు పని చేయుటకు అనుభవం గల సేల్స్‌గరల్స్ & సేల్స్‌బాయ్స్ & ఇన్నర్ వేర్, నైట్పీవేర్‌కి కూడా కావలెను. రఘు మాన్షన్ 5/1 బ్రాడీపేట. 9347790038.

షాపులో వివరంగా సర్దుటకు 3 సం.పైన పని చేయదలచుకున్న బాయ్స్ కావలెను. జీ:22000/- భారత్ స్టేషనరీ, 15/1 అరండల్‌పేట, గుంటూరు. ✆ 9292959595

గుంటూరులో ప్రముఖ సంస్థ ఈజీ లోన్స్ నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (లేడీస్) కావలెను. అర్హత: ఏదైనా డిగ్రీ, అనుభవంకి అనుగుణంగా జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. ✆9491667046, 8886600064.

మా కంపెనీ నందు మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా స్త్రీలు/పురుషులు, లీడర్లు, హౌస్ వైఫ్స్, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. (నో క్వాలిఫికేషన్). ✆ 8919569669.

గుంటూరు, కృష్ణనగర్‌లో మా ఇంట్లో వుంటూ 2సం॥ పాపను చూసుకొనుటకు ఆడమనిషి కావలెను. 93933 33444, 97011 22555.

చీరాల వెంకట రమణ జ్యూవలరీ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ మరియు అకౌంట్ కావలెను. ✆ 9696294942.

SHO సంస్థకు MLT / DMLT / BSc MLT / ANM / GNM చేసినవారు కావలెను. శాలరీ 10 వేలు. 8గంటల డ్యూటీ, సంప్ర॥ SHO, 2/1 బ్రాడీపేట, గుంటూరు. సెల్ 9848391212

WANTED
A boys' hostel in Guntur requires **RESIDENT WARDEN** (Single) preferably a graduate with knowledge of accounts.
- Age: 30 to 50 years.
- Salary: 22,000/- (Per Month).
- Lodging and boarding free.

Suitable candidates may send their resume to Mail Id: officejobs999@gmail.com
✆ 9492154634

MARKETING/ SALES

సేల్స్‌మెన్ అండ్ హెల్పర్స్ కావలెను. KBS Dairy and milk products, నంబూరు, గుంటూరు. ఫోన్: 9912170666.

FACULTY/ TEACHERS

Wanted Teachers for KG to 10th, PET, Academic Incharges (All Subjects)For the Year 26-27, For a School in GNT. 8096970673

SECRETARIAT- OFFICE STAFF

విజయవాడలో- Wanted Female పి.ఏ.-18K; టెలికాలర్స్ -10K; ఆఫీస్ స్టాఫ్ -10K; కుక్-12K; ఫోన్: 99121 55566.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

తెనాలి

● తెనాలి ● పొన్నూరు

ప్రతిభావంతులకు ఉపకార వేతనాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతిభావంతులు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు రూ.30 లక్షల విలువైన ఉపకార వేతనాలను ఫీజు రాయితీ రూపంలో అందించనున్నట్లు తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఉన్నత పాఠశాల యాజమాన్య ప్రతినిధులు శనివారం తెలిపారు. హైస్కూల్ విద్యార్థులు ఉపకార వేతనాల కోసం ఈ నెల 15వ తేదీలోగా ఏ పని దినంలోనైనా పాఠశాలకు హాజరై పరీక్ష రాయవచ్చని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లలో 73311 59919 సంప్రదించాలని చెప్పారు.

నాదెండ్ల భాస్కరరావుకు నివాళి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు దశదిన కర్మ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లో జరగగా తెనాలి నుంచి కూటమి పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు హాజరై నివాళులు అర్పించారు. మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

కార్యదర్శులుగా బాధ్యతల స్వీకరణ

కొల్లిపర: మండల పరిధిలోని అన్నవరం పంచాయతీ కార్యదర్శిగా ఎం.మౌళేశ్వరరావు, చక్రాయపాలెం కార్యదర్శిగా కాజా రమేష్, పిడపర్రు కార్యదర్శిగా వి.రామకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. మౌళేశ్వరరావు కొల్లూరు పంచాయతీ కార్యదర్శిగా, రమేష్ తుళ్లూరులో, వి.రామకృష్ణ భట్టిప్రోలు పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని.. బదిలీపై కొల్లిపర మండలానికి కేటాయించారని ఇన్‌ఛార్జి ఎంపీడీవో భార్గవ తెలిపారు.

తెనాలి మార్కెట్ యార్డులో..

నిమ్మకాయల ధరలు రూ.. (క్వింటా)



అత్యధికం: 8,500
అత్యల్పం: 4,500
సగటు: 6,500

- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? మండలంలోని కొలకలూరులో గత కొన్ని రోజుల నుంచి తరుచుగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. - **సుబ్బారావు, స్థానికుడు** ✔ ఈ లైనులో కొత్త ఫీడర్ పనులు జరుగుతున్నాయి. వాటి వల్ల కొంత సమయం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. రెండు రోజుల్లో పనులు పూర్తి అయిపోతాయి. - **రాజశేఖర్, డీఈ, విద్యుత్తు విభాగం** ? తెనాలి మారీసుపేట బలిజేపల్లి వారి రోడ్డులో వారం రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. - **శ్రీనివాసరావు, స్థానికుడు** ✔ సత్వరం మరమ్మతులు చేయిస్తాం. - **రామఅప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్**

స్పందన: ● తెనాలిలోని నెహ్రూ రోడ్డులో వాణిజ్య సముదాయం వద్ద కుళాయి నుంచి తాగునీరు వృథా అవుతుందన్న ఫిర్యాదుతో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది సంబంధితులతో మాట్లాడి నీటి వృథా అరికట్టారు. ● తెనాలిలోని ఇస్లాంపేటలో మురుగు కాలువలు, దోమల సమస్యలపై అందిన ఫిర్యాదులతో మున్సిపల్ సిబ్బంది పూడికలు తొలగించి, దోమల నివారణ చర్యలు తీసుకున్నారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

? పొన్నూరు పట్టణ పరిధిలోని పాత పొన్నూరులో వీధి దీపం వెలగడం లేదు. మరమ్మతులు చేయాలి. -**ఎన్.తిలక్ స్థానికుడు** ✔ వీధి దీపం బాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. -**షేక్ హసీనా, సహాయ ఇంజినీర్**


స్పందన: ●మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని డీవీసీ కాలనీలో మూడు రోజులుగా పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ● పట్టణ పరిధిలోని బాలాజీ నగర్‌లో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు తొలగించాలని దుర్వాసన వస్తున్నదని స్థానికుడు నాగరాజు ప్రజారోగ్యశాఖాధికారి పోతురాజుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వ్యర్థాలను తొలగించి వివరాలు తీసుకుంటామని తెలిపారు. - **న్యూస్‌టుడే, పొన్నూరు**

? గొడవర్రు మహిళల కేంద్రం వద్ద వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో దుర్వాసనతో కూడిన పొగ వ్యాపిస్తుంది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంటుంది. వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా చూడాలి. - **అంకమ్మరావు, స్థానికుడు** ✔ వ్యర్థాలకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. - **దివాకర్, ఈవోపీఆర్డీ, చేబ్రోలు**

స్పందన: చేబ్రోలు సుదర్శన నగర్‌లో కాల్వలో మురుగు పూడిపోయి నీరంతా రోడ్డుపైకి చేరుతుందని ఈనాడులో ప్రచురించిన సమస్యను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. కాల్వల్లో పూడిక తీయించి సమస్యను పరిష్కరించారు. - **న్యూస్‌టుడే, చేబ్రోలు**

ప్రభుత్వ పాఠశాలల్లో..
పెరిగిన ఉత్తీర్ణత శాతం

తెనాలి టౌన్, చేబ్రోలు, న్యూస్‌టుడే



పురబడుల్లో తొలి స్థానంలో నిలిచిన బాలికోన్నత పాఠశాల

ప్రభుత్వ బడుల పదో తరగతి విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధిక మార్కులు సాధించారు. పరీక్షలకు ముందు నూరు రోజుల ప్రణాళిక వల్ల ప్రతిభావంతులైన విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు పొందారు. తెనాలి పురపాలక పాఠశాలల్లో 79 శాతం ఉత్తీర్ణతతో బాలికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్తు పాఠశాలల్లో 91 శాతం ఉత్తీర్ణతతో ఖాజీపేట పాఠశాల తొలి స్థానాల్లో నిలిచాయి. ఉపాధ్యాయులు సప్లిమెంట్ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు. తెనాలి పురపాలక బాలికోన్నత పాఠశాల విద్యార్థిని షేక్ సాజిదా 590 మార్కులు పొంది తెనాలి ప్రభుత్వ పాఠశాలల పరిధిలో తొలి స్థానంలో నిలిచింది. దాదాపు అన్ని పాఠశాలల విద్యార్థులు 555 మార్కులకు అధిగమించారు.

పాఠశాల	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
అంగలకుదురు జిల్లా పరిషత్తు	84	73	87
బుర్రిపాలెం	22	18	82
ఖాజీపేట	32	29	91
కొలకలూరు	64	41	64
కఠెవరం	37	26	70
నందివెలుగు	30	25	83
పెదరావూరు	80	47	59
సంగంజాగర్లమూడి	111	67	60
కొగంటి శివయ్య పురపాలక ఉన్నత పాఠశాల	96	71	74
బాలురోన్నత	148	93	63
బాలికోన్నత	150	118	79
ఎన్‌సీఆర్	165	99	60
ఎన్ఎస్ఎస్	86	67	77
టీఎస్ఆర్	55	35	64

చేబ్రోలు మండలంలో..

చేబ్రోలు మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలల్లో పలువురు విద్యార్థులు పది పరీక్షలు రాశారు. వేజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో షేక్ సమీరా 584 మార్కులు, చేబ్రోలు ఎస్ఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కె.వర్షిణి 575, నారాకోడూరు జడ్పీలో పి.మానస దివ్య 573 మార్కులు సాధించి ఆయా స్కూళ్లలో టాపర్లుగా నిలిచారు.

పాఠశాల పేరు	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులు	శాతం
ఎస్ఎన్ ప్రభుత్వ పాఠశాల	72	48	67
నారాకోడూరు జడ్పీ	158	144	91
వేజండ్ల జడ్పీ	137	125	88
శేకూరు జడ్పీ	52	31	60

తులసీదళాలతో లక్ష్మీనరసింహస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తులు



ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల భాగంగా ఈనెల 15న కల్యాణం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కె.చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో స్వామివార్లకు తులసీ దళాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

ఘనంగా పేరంటాలమ్మ తిరునాళ్లు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ ఐతానగర్‌లోని వెంకయ్య గౌరమ్మ పేరంటాలమ్మ తిరునాళ్లు శనివారం వైభవంగా ముగిశాయి. శుక్రవారం పట్టణంలో చేపట్టిన పొంగళ్లు, గండ దీపాలు, పసుపు బండ్లు, విద్యుత్తు ప్రభలు, మేక సిడి, గంప సిడులతో రాత్రంతా ప్రదర్శన సాగింది.

కనులపండువగా చక్రస్నానం



పొన్నూరు, న్యూస్‌టుడే: పొన్నూరు పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చక్రస్నానం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

13 మందికి పింఛన్ల విడుదల



లబ్ధిదారుకు నగదు అందజేస్తున్న ఎంపీడీవో ఉషారాణి

చేబ్రోలు, న్యూస్‌టుడే: పింఛన్ పొందుతూ భర్త మృతి చెందిన 13 మందికి వితంతు పింఛన్లు మంజూరు అయ్యాయి. వీరికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో ఉషారాణి, తెదేపా నాయకులు కలిసి పింఛన్ సొమ్ము అందజేశారు.

స్పందించారు.. పనులు ప్రారంభించారు



చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు నుంచి గుండవరం వెళ్లే రోడ్డులో ఏళ్లుగా మురుగు రోడ్డు పైనే ప్రవహిస్తుంది. దీంతో గొడవర్రు, గుండవరం గ్రామస్థులు, గాయత్రీ శక్తిపీఠం వద్దకు వెళ్లే భక్తులు ఆ నీటిలో నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఏప్రిల్ 30న 'ఈనాడు'లో 'మురుగు పారదు... దోమ వదలదు' శీర్షికన ప్రచురితమైన చిత్ర వార్తకు అధికారులు స్పందించారు. మురుగు చెరువులోకి వెళ్లేలా రోడ్డు తవ్వి పైపులైను వేసే పనులను శనివారం ప్రారంభించారు.



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: నియోజకవర్గానికి చెందిన 22 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.11.11 లక్షల విలువైన మంజూరు పత్రాలను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు తెదేపా నాయకులు అందించారు. తెనాలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కేసన కోటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, అశోక్‌వర్ధన్, నాగేశ్వరరావు, విజయ్, జోగేంద్ర, వెంకటేశ్వరరావు, డాక్టర్ శేషగిరిరావు, బుజ్జి, ఆరిఫ్, సంసోను తదితరులు పాల్గొన్నారు.

నీట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న డాక్టర్ గోపీకృష్ణ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ మేరకు శనివారం పరీక్షల పరిశీలకులతో సమన్వయకర్త డాక్టర్ గోపీకృష్ణ సమీక్షించి, పరీక్షల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని అయిదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. సుమారు 2,972 మంది విద్యార్థులు ఏఎన్‌యూలో పరీక్ష రాయనున్నారు. ప్రతి 12 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్, ప్రతి సెంటర్‌కు ఇద్దరు పరిశీలకులతో పాటు ఇద్దరు తహసీల్దార్లు, ఇద్దరు పోలీసులను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద పలు ఏర్పాట్లు చేశామని సమన్వయకర్త డాక్టర్ గోపీకృష్ణ చెప్పారు. మెయిన్ గేట్ నుంచి విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లేందుకు లోపల బస్సులు ఏర్పాటు చేశామన్నారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ఒక గంట అదనంగా కేటాయించామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల కోసం ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద మంచినీరు, మజ్జిగ ఏర్పాటు చేశామన్నారు.

యోగా ఉచిత శిక్షణ తరగతులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: యోగా ఉచిత శిక్షణ తరగతులను కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు హ్యాపీ హెల్త్ కేర్ సైన్సెస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ పావని ప్రియాంక పేర్కొన్నారు. ఆమె శనివారం పట్టణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జాతీయ క్రీడ యోగాసోపాన్ రికార్డ్స్ వ్యవస్థాపకులు చెప్పారు. ఉచిత యోగా తరగతులు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఆమె గోల్డెన్ బ్రీత్ యోగ అధిష్ఠానదారు. డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రియాంక, వేదికపై ఇతర అధికారులు

జనగణన ప్రక్రియ వేగవంతం

కొల్లిపర, న్యూస్‌టుడే: జనగణన ప్రక్రియ వేగవంతం చేశామని ఎంపీవో మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన 28వ బ్లాక్‌లో పని తీరుపై పర్యవేక్షించారు. కొల్లిపర మండల పరిధిలో 15 మంది పర్యవేక్షకులు, 97 మంది ఎన్యూమరేటర్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. మండల పరిధిలో 21,500 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉందని చెప్పారు. ఎన్యూమరేటర్లకు 200 కుటుంబాలను కేటాయించామని పేర్కొన్నారు. గృహ యజమానులు వాస్తవాలు వెల్లడించాలని కోరారు. పర్యవేక్షకులు నస్రత్, హేలీన్, బీఆర్‌వో బాషా తదితరులు పాల్గొన్నారు.

బాలసాహితీ పురస్కారానికి ఎంపిక

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : తెలంగాణ రాష్ట్రంలో అందించనున్న బాల సాహితీ మూర్తి పురస్కారానికి తనను ఎంపిక చేసినట్లు రచయిత కె.నారాయణమూర్తి శనివారం తెలిపారు. నిర్వాహకుల నుంచి ప్రత్యేక ఆహ్వానం అందిందని ఆయన పేర్కొన్నారు.

ఇతర పనులకు తాగునీరు వినియోగం

పట్టించుకోని అధికారులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే



గాంధీపార్కు రిజర్వాయరు నుంచి తాగునీటిని ట్యాంకర్లో నింపుతూ..

మున్సిపల్ అధికారులు నిర్మాణ పనులకు భూగర్భ జలాలకు బదులు శుద్ధి చేసిన కృష్ణా నదీ జలాల విక్రయిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే.. ఫంక్షన్‌కు ఇస్తున్నామని చలానా కట్టారని బదులిస్తున్నారు. ఫంక్షన్ ముసుగులో నిర్మాణ పనులకు తాగునీటి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ అమ్మకాలపై ఉన్నతాధికారులు నిలదీస్తే పొరపాటు అయిందని సంజాయిషీ ఇస్తున్నారు.

తెలిసినా స్పందన కరవు

పట్టణ గాంధీపార్కు, పాత రిజర్వాయర్‌లోని తాగునీటిని నేరుగా పైపు ద్వారా బయట వారి ట్యాంకర్లో నింపారు పురపాలక సిబ్బంది. ఇంటి శ్లాబు కోసం నీటిని తీసుకెళ్తున్నట్లు ఆ ట్యాంకర్ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలోనూ ఇలానే పలుమార్లు తీసుకెళ్లినట్లు బదులిచ్చారు. పురపాలక సిబ్బంది మున్సిపల్ ఖజానాలో చలానా తీసి ఇచ్చాక తాగునీటిని ట్యాంకర్లో నింపినట్లు చెబుతున్నారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసి విస్తుపోయారు. తాగునీటి విక్రయాలు నిలిపి వేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణ పనులకు భూగర్భ జలాలు పంపిణీ చేయాలన్నారు. ఇటీవల మున్సిపాలిటీకి సీఎస్ఆర్ కార్యక్రమాల కింద ఇచ్చిన వాటర్ ట్యాంకర్లో నిర్మాణ పనులకు నీటిని సరఫరా చేశారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసి ఇంజినీర్లను నిలదీశారు. తమకు తెలీదని బదులిచ్చారు సదరు ఇంజినీర్లు. ఉన్నతాధికారులకు తెలియకుండా తాగునీటి విక్రయాలు జోరుగా జరుగుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

చలానా కడుతున్నారు...

తాగునీటిని తీసుకెళ్తున్న ట్యాంకర్ వారు చలానా కట్టి తీసుకెళ్తున్నారు. నిర్మాణ పనులకు తీసుకెళ్తున్న విషయం తెలీదు. పొరపాటు జరగకుండా చూసుకుంటాం. **- బాషా, ఇన్‌ఛార్జి ఏఈ, పురపాలక సంఘం.**

25 వారాలుగా భక్తులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న చంద్రరావు దంపతులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: మండలం పరిధి నందివెలుగులోని శ్రీకనకదుర్గ అమ్మవారి దర్శనం కోసం వస్తున్న భక్తులకు గ్రామానికి చెందిన విశ్రాంత రోడ్లు భవనాల శాఖ అధికారి తోటకూర చంద్రరావు ప్రతి శుక్రవారం ఉచితంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 2009 సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేసిన ఆయన.. ఆ తర్వాత స్వగ్రామంలో వచ్చి స్థిరపడ్డారు. అప్పటి నుంచి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, ఇంటింటికి చెత్త సేకరణ డబ్బాలు పంపిణీ, అన్న, వస్త్ర దానాలు, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత ఇవ్వడం వంటి సేవలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆలయానికి వచ్చే భక్తులకు సేవలు అందించాలన్న తలంపుతో 2025 సంవత్సరంలో గ్రామంలోని మరి కొందరితో కలిసి 'శ్రీకనకదుర్గా అన్నదాన సేవ కమిటీ'ని ఏర్పాటు చేసి తాను ఛైర్మన్‌గా ప్రతి శుక్రవారం భక్తులకు ఉచితంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. 25 వారాల నుంచి ప్రతి వారం సుమారు 150 మంది భక్తులకు చంద్రరావు, కమిటీ ప్రతినిధులు భోజనం వడ్డిస్తున్నారు. తనకు అవకాశం ఉన్నంత కాలం సేవలను కొనసాగిస్తానని, కమిటీ ప్రతినిధులు, గ్రామస్థులు కూడా చొరవ చూపుతున్నారని చంద్రరావు వివరించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన అన్నమయ్య పాటల పోటీల్లో విజేతలు 60 మందికి ముఖ్య అతిథులు చేతుల మీదుగా



జ్ఞాపికలు అందుకున్న వారితో అతిథులు

బహుమతులు ప్రదానం చేశారు. శనివారం స్థానిక గీతా మందిరంలో విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులు ఈదర వెంకట పూర్ణచంద్, డాక్టర్ కటకం పురుషోత్తమరావు, రామానుజ స్వామి ప్రసంగించారు. ఈ సందర్భంగా నృత్య గురువు నిర్మల రమేష్, ఆంజనేయ శాస్త్రి, కె.ఎస్.పూర్ణచంద్రికను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరం



శిబిరంలోని క్రీడాకారులతో గురువులు, అతిథులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి ఇండోర్ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్, హ్యాండ్ బాల్ క్రీడల వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, సీఈవో బత్తుల వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకటపూర్ణచంద్, గురువులు వినయ్‌కుమార్, నాగరాజు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుంచి 8:30 గంటల వరకు, సాయంత్రం 4:30 గంటల నుంచి 6:30 గంటల వరకు శిక్షణ ఉంటుందని క్రీడాకారులు, ఆసక్తి ఉన్న విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శిక్షకులు కోరారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న స్థానికులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం అంగలకుదురులో రాత్రి సమయంలో ఇంటిపై దాడి చేసి వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని శనివారం సాయంత్రం రాస్తారోకో నిర్వహించారు. అంగలకుదురు కూడలిలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, బాధితుడి బంధువులు నినాదాలు చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న సీఐలు నాయబ్‌రసూల్, మల్లికార్జునరావు, ఇతర సిబ్బంది నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో నిరసన విరమించారు. దాదాపు రెండు గంటల పాటు కొనసాగిన రాస్తారోకో వల్ల ఈ మార్గంలో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ కేసులో పలువురు నిందితులు ఇప్పటికే పోలీసుల అదుపులో ఉన్నారని సమాచారం.

ఎండలో బయట తిరగొద్దు



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు నేహా

కొల్లిపర: ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యవసాయ పనులు చేపట్టాలని మున్నంగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి గంటా నేహ సూచించారు. శనివారం దావులూరు గ్రామంలో పర్యటించారు. వేసవికాలం, వడగాలులు వీస్తున్నాయని, పని వేళల్లో మార్పులు చేసుకోవాలని మహిళలకు, వ్యవసాయ కూలీలకు సూచించారు. తాగునీరు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామస్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పర్యటనలో వైద్యశాఖ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- పాస్ ద్వారానే విక్రయాలు నిర్వహించాలి

చేబ్రోలు: ఆధార్, ఈ-పాస్ యంత్రాల ద్వారానే రాబోయే ఖరీఫ్ సీజన్లో యూరియా, డీఏపీ, విత్తనాల విక్రయాలు నిర్వహించాలని ఏవో ప్రియదర్శిని అన్నారు. శనివారం చేబ్రోలులోని పలు ఎరువుల దుకాణాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. సీజన్‌కు సరిపోయే ఎరువులు ఉన్నాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దుకాణాల నిర్వాహకులు నిబంధనలను ఉల్లఘించి విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంధనం విక్రయిస్తూ.. పంక్చర్లు వేయిస్తూ..

పురపాలక అధికారుల నిర్వాకం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే



పంక్చర్ వేయిస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

పురపాలకలోని పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల నడుమ సమన్వయ లోపం వల్ల పురపాలిక వాహనాలకు కొట్టించే ఇంధనంలో కొంత బహిరంగంగా అమ్మి ఆ నగదును వాహనాలకు పంచర్లు వేయిస్తున్నారు. ఈ అనధికార తంతు గురించి తెలిసిన ఉన్నతాధికారులు ఇరు విభాగాల అధికారులతో మాట్లాడి సరి దిద్దకుండా చోద్యం చూస్తున్నట్లు కార్మికులు వాపోతున్నారు.

☛ పట్టణ పరిధి ప్యాడిసన్‌పేటలోని పురపాలక వాహనాలకు ఏదైనా చిన్నచిన్న పనులు ఉంటే ఇంజినీరింగ్ అధికారులు చేయిస్తుంటారు. అయితే ఏళ్ల నుంచి పొక్లెయిన్లు, ట్రాక్టర్ల పంక్చర్లు వేయించకుండా కేవలం మరమ్మతులు చేయిస్తున్నట్లు సమాచారం. మున్సిపల్ అధికారుల సూచన మేరకు ఓ పొరుగు సేవల కార్మికుడు పొక్లెయిన్‌కు కొట్టించే ఇండెంట్ 70 లీటర్ల ఇంధనంలో 5 లీటర్లు తక్కువ కొట్టిస్తున్నారు. ఆ ఐదు లీటర్లకు బదులు రూ.500 నగదు తీసుకుని తన వద్ద ఉంచుకుంటున్నారు. ఆ నగదును ట్రాక్టర్లు, పొక్లెయిన్‌లకు పంచర్లు పడినప్పుడల్లా వేయించేందుకు వాడుతున్నారు. వాహనాలకు ఇంజినీరు పంక్చర్లు వేయిస్తుంటారు. వారికి కుదరకుంటే ముందస్తు నగదు ఇచ్చి పంక్చర్లు వేయించాలి. కానీ ఇక్కడ సిబ్బందే ఆ పని చేస్తున్నారు.

☛ మున్సిపాలిటీ పరిధిలో ట్రాక్టర్లు 15, ట్యాంకర్లు రెండు, పొక్లెయిన్‌లు రెండు, గల్పర్ 1, కాంపాక్టర్లు ఏడు, బాబ్ కార్టు, లాడర్ ఉన్నాయి. వీటి మరమ్మతుల బాధ్యత ఇంజినీర్లదే. ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ల పంచర్ల పనులను సంబంధిత అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకపోవడమే దీనికి కారణమని తెలిసింది. గత వైకాపా ప్రభుత్వ హయంలో వాహనాల షెడ్డులో మరమ్మతులు చేసేందుకు ఇద్దరిని మెకానిక్‌లుగా తీసుకున్నారు. పంక్చర్లు వేసే వారిని తీసుకోలేదు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. తీసుకోవాల్సిన జాగ్రత్తలు

చేబ్రోలు, న్యూస్‌టుడే: వేసవి ఆరంభమైంది. రోజురోజుకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పల్లెల్లో తాగునీటి ఎద్దడి, విద్యుత్తు కోతలు, అగ్ని ప్రమాదాలు, దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏదైనా జరిగితే వాటి పరిష్కారానికి ఎవరికి చెప్పుకోవాలో తెలియక చాలా మంది ఇబ్బందులు పడుతుంటారు. సమస్య సంభవించిన వెంటనే నేరుగా ఆయా శాఖల అధికారి దృష్టికి తీసుకు వెళ్లాల్సి ఉంటుంది.

అగ్ని ప్రమాదం ఏర్పడితే... వేసవిలో ఎక్కువగా గ్రామాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. గడ్డి వాములు, మొక్కజొన్న వ్యర్థాలు తగలపెట్టడం వల్ల ఏర్పడే ప్రమాదాలు, విద్యుత్తు ఘాతాలు ఏర్పడితే వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాలి. చేబ్రోలు, పొన్నూరు అగ్నిమాపక కేంద్రం ఫోన్ నంబర్ 99637 13302 సంప్రదించాలి.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో సాధ్యమైనంత వరకు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలి. పనులపై బయటకు వెళ్లే సమయంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెల్లని వస్త్రాలు ధరించడం తరుచుగా తాగునీటిని తీసుకుంటూ ఉండాలి. వడదెబ్బ, డీహైడ్రేషన్ సమస్యలు తలెత్తితే వెంటనే సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు గానీ, 108 ద్వారా సమీపంలోని వైద్యశాలకు తరలించి వైద్యసాయం అందించాలి.

విద్యుత్తు సమస్యలు ఏర్పడితే..

వేసవి కాలంలో ఈదురు గాలులు కారణంగా స్తంభాలు పడిపోవడం, తీగలు తెగిపోవడం, సరఫరా నిలిచిపోవడం, లో ఓల్టేజీ సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. సకాలంలో అధికారులకు సమాచారం అందిస్తే మరమ్మతులు చేసేందుకు అవకాశం ఉంటుంది. విద్యుత్తుశాఖ అధికారుల ఫోన్ నంబర్లకు సంప్రదించాలి.

చేబ్రోలు మండలం: 94408 12304,
పెదకాకాని మండలం: 94408 12286

తాగునీటి ఇబ్బందులు ఎదురైతే...

చేబ్రోలు మండలంలో 13 పెదకాకానిలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎక్కడ తాగునీటి సమస్య ఎదురైనా, సరఫరా ఆగిన, కలుషిత నీరు సరఫరా అవుతున్నా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు సమాచారం అందించి పరిష్కరించుకోవచ్చు.

నీటి సరఫరా విభాగం అధికారుల నంబర్లు చేబ్రోలు: 91001 21492,
పెదకాకాని: 88868 33996

దొంగతనాలతో జాగ్రత్త

వేసవి సెలవుల్లో చిన్నారులతో విహార యాత్రలకు వెళుతూ ఉంటారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఎక్కువ మంది ఇంటికి తాళాలు వేసి వెళ్లిపోతారు. కొంతమంది ఉక్కపోత కారణంగా రాత్రి వేళల్లో డాబాలపై నిద్రిస్తారు. ఇదే అదనుగా చూసుకుని దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తారు. దొంగతనాలు జరిగిన వెంటనే 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

పోలీస్ అధికారుల ఫోన్ నంబర్లు
చేబ్రోలు: 86888 31384
పెదకాకాని: 86888 31350

మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం నందివెలుగు జాషువానగర్ వద్ద శనివారం ప్రమాదవశాత్తు మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పు అంటుకుంది. మంటలు చెంతనే ఉన్న పొలాల వైపు వస్తూ ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. తెనాలి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది మంటలు విస్తరించకుండా అదుపు చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు వేసవి సెగ

కేంద్రాలు నిర్వహిస్తుండటంతో అవస్థలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోవటంతో జనాలు ఠారెత్తిపోతున్నారు. ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఎండ వేడిని తట్టుకోవటానికి పెద్దలే ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారుల పరిస్థితి మరింత ఇబ్బందిగా మారింది.

◆ అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వకుండా మే 1 నుంచి 15 వరకు అంగన్‌వాడీ కార్యకర్త.. 16 నుంచి 31 వరకు అంగన్‌వాడీ సహాయకురాలికి సెలవులిచ్చి ఒంటి పూట కేంద్రాలను నిర్వహించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో అంగన్‌వాడీ సిబ్బంది సర్దుబాటు చేసుకుని కేంద్రాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 1,480 అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య కోసం 3 నుంచి 6 సంవత్సరాల్లోపు బాలలు 17,746 మంది పేర్లు నమోదు చేసుకున్నారు. శుక్రవారం 14,519 మంది విద్యార్థులు హాజరయ్యారు. వేసవి కాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇవ్వకుండా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒంటి పూట కేంద్రాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఎండ వేడి తీవ్రంగా ఉండటంతో జనాలు బయటకు వచ్చేందుకు వెనుకాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన బాలలు ఇబ్బందులు పడ్డారు. వడగాల్పులు బారిన పడితే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. రానున్న రోజుల్లోనూ ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు బయటకు రావొద్దని జిల్లా కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. వేసవి తీవ్రత (హీట్ ఇండెక్స్) అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించినందున అత్యవసర పనులు మినహా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని సూచించారు. ఈ పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు బాలలను పంపేందుకు తల్లిదండ్రులు అనాసక్తి చూపుతున్నారు. తరగతులు నిర్వహించకుండా కేవలం పోషకాహారం కోసం కేంద్రాలకు రమ్మనడంతో తల్లిదండ్రులు వెనకాడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోమని చెప్పాం



అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు లేకపోవటం ప్రభుత్వ విధాన నిర్ణయం. ఎండలను దృష్టిలో పెట్టుకుని బాలలు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోమని అధికారులు, సిబ్బందికి చెప్పాం. రానున్న రోజుల్లోనూ ఎండ వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రకటించినందున జిల్లా యంత్రాంగం సూచనలకు అనుగుణంగా కేంద్రాల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటాం. - **ప్రసూన, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారి**

రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

గుంటూరు క్రీడలు, న్యూస్ టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల అయిదు నుంచి జరగనున్న ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొనే గుంటూరు జిల్లా అథ్లెటిక్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను గుంటూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నాలుగో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు తమ వయసు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని బీఆర్ స్టేడియంలో కోచ్ వెంకటేశ్వరరావును కలవాలన్నారు.

ఎంపికైన పురుషుల జట్టు: డి.మణికంఠ, పి.వి.భరత్‌కుమార్, ఎ.వి.జి.కృష్ణంనాయుడు, ఎస్.కె.హమీద్, ఎస్.కె.నూర్, అబ్దుల్లా, ప్రసన్నకుమార్, ప్రవీణ్‌కుమార్, ఆల్మోస్ట్, యశ్వంత్‌కుమార్, ఎ.విజయ్, ఎస్.అనిల్‌కుమార్, వి.గోవిందనాయక్, ఎ.ప్రేమ్‌చంద్, డి.ప్రవీణ్‌కుమార్, బి.సిద్ధార్థ, వి.అశోక్, యం.మదన్‌మోహన్‌రావు, ఎం.డి.ముజఫర్, వి.శ్రీనివాసరాజు, ఎం.నరేంద్ర, ఎం.రవికిరణ్ పి.వి.లక్ష్మణబాబు.

మహిళల విభాగం : ఎస్‌కే షాజహాన్, బి.ఎస్.కె.ఆషా, కె.ఆదిలక్ష్మి, పి.ఇందుమతి, ఎల్.వి.ధనలక్ష్మి, బి.నాగవిహారిక, పి.మౌనిక, వి.మధుబాల, రూపాలిక పాత్ర, టి.అనంతలక్ష్మి, పీకే నాగమణి, షేక్ సిమ్రాన్‌అస్మిన్ కాళీ ఎంపికయ్యారు. కోచ్‌లుగా కె.రవికుమార్, కె.వెంకటేశ్వరరావు, ఎస్.శివారెడ్డి, మేనేజర్ కే.శరత్‌చంద్ర వ్యవహరిస్తారు.

13 నుంచి నిరుద్యోగ యువతకు రెండో బ్యాచ్ శిక్షణ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణలో ఇప్పటికే కోచింగ్ పూర్తి చేసుకున్న మొదటి బ్యాచ్ అభ్యర్థులు పోటీ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మరింత మంది యువతకు లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో రెండో బ్యాచ్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ఆలపాటి ప్రకటించారు. దీనికి సంబంధించిన గోడ పత్రికలను క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఆలపాటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాల కోసం జరిగే పోటీ పరీక్షలను మరింత సమర్థంగా ఎదుర్కొనేలా రెండో బ్యాచ్ శిక్షణ ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ ఉచిత శిక్షణకు ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న అభ్యర్థులందరూ అర్హులు. దరఖాస్తులను ఈనెల 5 నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు. శిక్షణలో చేరాలనుకునే వారు 10న నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. రెండో బ్యాచ్ శిక్షణ ఈనెల 13 నుంచి గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ పక్కన ఉన్న ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ప్రారంభమవుతుంది. ఇతర సమాచారం కోసం 73374 59888, 95536 81118లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో విజయసాధన కోచింగ్ సెంటర్ అధినేత కిషోర్, ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలపాటి తదితరులు

కమనీయం.. కార్తికేయుని కల్యాణం

నాగులపాడు(పెదనందిపాడు) న్యూస్‌టుడే: నాగులపాడులోని శృంగేరి శారద పీఠపాలిత వల్లీదేవసేన సమేత స్వామి సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజైన శనివారం స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో శర్మ గల సత్యనారాయణశర్మ, చిట్టా పవన్‌కుమార్‌శర్మ, వేద పండితుల బృందం స్వామివారి కల్యాణ క్రతువును 48 మంది దంపతులతో శాస్త్రోక్తంగా నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణం తిలకించి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో స్వామి, అమ్మవార్లు



హాజరైన భక్తులు

స్వామివారిని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఆయనను స్వామి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. కార్యక్రమాన్ని ప్రారంభించగా.. అన్నదాన ఎమ్మెల్యే వేలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ◆ వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నాగులపాడుకు చెందిన గురవయ్య, తన తండ్రి, సోదరుడు సూర్యనారాయణ, వెంకటసుబ్బారావుల జ్ఞాపకార్థం మజ్జిగ, తాగునీరు సరఫరా చేశారు. విఘ్నేశ్వర యూత్ సభ్యులు మాదల మల్లికార్జునరావు చౌదరి పేరిట శీతలపానీయాలు యాత్రికులకు అందజేశారు.

అరసం కథలు.. కవితల పోటీల ఫలితాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అరసం 20వ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో ఈనెల 23, 24 తేదీల్లో జరుగుతున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం(అరసం), మువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు, పెదపరిమి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కథలు, కవితలు పోటీల ఫలితాలను అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ శనివారం పత్రికలకు విడుదల చేశారు.

కథల్లో..: బహుశా వేణుగోపాల్(జంగారెడ్డిగూడెం) కథానిక 'తెల్లపాము', పర్కపెల్లి యాదగిరి(సిద్ధిపేట) కథానిక 'బతుకు సాక', ఒర్సు బ్రహ్మాంజలి(గుంటూరు) కథానిక 'పెళ్లి ఫొటోలు' వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు అర్హమైనవిగా ప్రకటించారు. ఎ.ఉషారాణి (తిరుపతి) కథానిక 'నటిత్తానై'..కన్సలేషన్ బహుమతి పొందిందని ప్రకటించారు.

కవితల్లో..: ఎం.డి. అబ్దుల్లా(విశాఖపట్నం) కవిత 'వాడు శాంతి ఒడి చేరాడు', డాక్టర్ మల్లిపూడి రవిచంద్ర(అనంతపురం) కవిత 'గచ్చపొద', పొత్తూరి వికాస్ ఆదిత్య వర్ధన్ వర్మ(కాకినాడ) కవిత 'వేకువ పూల యుద్ధం' వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపికైనట్లు ప్రకటించారు. సహస్ర సతీష్(భూపాలపల్లి) కవిత 'ఇంకా గుర్తుంది'కి కన్సలేషన్ బహుమతి ప్రకటించారు. విజేతలకు అరసం రాష్ట్ర మహాసభల్లో బహుమతులు అందజేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఆర్యవైశ్య విద్యార్థినులకు ఉపకార వేతనాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరంలో సీనియర్ ఇంటర్‌లో 95 శాతంపైన మార్కులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థినులు 50 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఉపకార వేతనాలు అందించనున్నట్లు తెనాలి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య విద్యా నిధి కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు శనివారం తెలిపారు. గుంటూరు జిల్లా పరిధిలో అర్హత ఉన్న వారు తమ ధ్రువపత్రాలతో ఈ నెల 31వ తేదీ లోగా తెనాలి బస్టాండ్ రోడ్డులోని కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు. మొదటగా వచ్చిన 50 దరఖాస్తులకు అవకాశం ఉంటుందని వివరించారు.

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షల వాయిదా

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల్లో ఈ నెల రెండో వారంలో జరగాల్సిన రెండో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశామని సీఈ ఆలపాటి శివప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో వారంలో జరగాల్సిన పరీక్షలను జూన్ 22కి వాయిదా వేశామని చెప్పారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక బృందావన గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదిక మీద గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య జయంతి మహోత్సవం వైభవంగా జరిగింది. 200 మంది స్థానిక కళాకారులు సప్తగిరి సంకీర్తనల మహాగోష్ఠి గానం చేశారు. కార్యక్రమంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల విద్యార్థులు నాదస్వర కచేరీ చేశారు. పులికొండ పిచ్చయ్య, శ్రీవల్లి దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాచారి కొమండూరికి సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, డాక్టర్ టి.చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మస్తానయ్య తదితరులు సన్మానించారు. డాక్టర్ రామాచారి కొమండూరి బృందం అన్నమయ్య సంకీర్తన గానం చేశారు. సంస్థ ప్రధానకార్యదర్శి ఎంవైశేషు రాణి, ఉపాధ్యక్షులు డాక్టర్. రాజరాజేశ్వరి, పాటిబండ లలిత, మాధవపెద్ది మీనాక్షి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి తదితరులు అతిథులు, కళాకారులను సత్కరించారు.



రామాచారిని సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

ఆధునిక పరిశోధనా పద్ధతులపై దృష్టిసారించండి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ఆధునిక పరిశోధనా పద్ధతులు అధ్యాపకుల భవిష్యత్తుకు కీలకమని క్వాలిటీ అష్యూరెన్స్ అండ్ ర్యాంకింగ్స్ నిపుణులు డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో టీటీసీ, ఐఐసీ, ఆర్‌అండ్‌డీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో రీసెర్చ్, ఎఫెక్టివ్ రైటింగ్, జర్నల్ పబ్లికేషన్ స్ట్రాటజీస్ అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిశోధనలో నూతన ఆలోచనలు, ప్రామాణిక విధానాలు, నైతిక విలువల ప్రాధాన్యతలు గుర్తించాలన్నారు. జర్నల్ ప్రచురణలో సరైన జర్నల్ ఎంపిక, ఇంపాక్ట్ ఫ్యాక్టర్ వంటి ప్రమాణాలను పరిశీలించటం ఎంతో అవసరమని సూచించారు. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, జగదీష్, రాయపాటి గోపాలకృష్ణ, కొండబోలు కృష్ణప్రసాదు, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్

క్రమశిక్షణ తప్పితే కఠిన చర్యలు

సిబ్బందికి ఎస్పీ హెచ్చరిక

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిజాయతీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఇటీవల పోలీసులపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో శనివారం ఎస్పీ తన కార్యాలయంలో జిల్లా పోలీసులతో సమావేశం నిర్వహించారు. సిబ్బందిపై ఆరోపణలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దారి తప్పితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నా, ఫిర్యాదులపై సరిగా స్పందించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పోలీసుస్టేషన్ పరిధిలోని గ్రామ, వార్డుల వారీగా పోలీసు సిబ్బందిని కేటాయించి వారంలో కనీసం రెండు రోజులు పర్యటించి సమాచారం సేకరించాలన్నారు. రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ చెప్పారు.

వేసవిలో కార్మికుల రక్షణపై దృష్టిసారించండి

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు చేపట్టిన అన్ని గుత్తేదారు సంస్థలు ఎండ వేడిమి కారణంగా కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తప్పని సరిగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఏపీ సీఆర్డీఏ పర్యావరణ సామాజిక పర్యవేక్షణ విభాగం అధికారులు అనిత భూపతి, పీజీఎంసీ అధికారి డా. సూర్యనారాయణ ఆదేశించారు. శనివారం రాజధానిలోని సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వడదెబ్బకు గురైతే అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలు, ప్రథమ చికిత్స అందించే పద్ధతులను నిపుణులు వివరించారు. పని ప్రదేశంలో అందుబాటులో తగినంత తాగు నీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలను కల్పించాలని సూచించారు. సురక్షితంగా నిర్మాణ పనులు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, రక్షణ పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.ప్రభు, వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత విభాగం (ఓహెచ్ఎస్) అధికారులు పాల్ సుధాకర్, వి.ప్రదీప్, శ్రీధర్, డా.గంగాధరి, పీఎంసీ, పీజీఎంసీ, ఏడీసీఎల్, సీఆర్డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన సీఆర్డీఏ, ఏడీసీ, పీఎంసీ, ఏజీఎంసీ అధికారులు

పదిలో ప్రతిభావంతులను విహారయాత్రకు తీసుకెళతా

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వ పాఠశాలలు ఏ మాత్రం తీసిపోవని విద్యార్థులు నిరూపించారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గతంలో తాను ప్రకటించినట్లుగానే అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను త్వరలో విహారయాత్రకు తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధించిన ఫలితాలు ఎంతో గర్వకారణమన్నారు. గుంటూరు పశ్చిమలో 600 మార్కులకుగాను 585, 586 వరకు మార్కులు సాధించిన విద్యార్థులు ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలు ఇంతటి ప్రతిభ కనబరచడం రాష్ట్ర విద్యారంగంలో వచ్చిన సానుకూల మార్పునకు నిదర్శనమన్నారు. ఈ విజయానికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రధాన కారణమన్నారు. బెంచీలు, పుస్తకాలు, బ్యాగులు మార్చడం మాత్రమే కాదు..పిల్లల భవిష్యత్తును మార్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. అదే నిజమైన విద్యా సంస్కరణ అని ఎమ్మెల్యే అన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

విశ్రాంత కార్మికుడు.. ఆన్‌లైన్‌లో ఉద్యోగి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ చేసినా ఇంకా ఆన్‌లైన్‌లో ఉద్యోగిగా పేరు కొనసాగుతుండడంతో ప్రభుత్వం నుంచి దక్కాల్సిన సంక్షేమ పథకాలను కోల్పోతున్నట్లు విశ్రాంత పురపాలక పారుగు సేవల కార్మికుడు వాపోతున్నారు. తెనాలి మండలం బుర్రిపాలానికి చెందిన దోమ కోటయ్య పురపాలక పారిశుద్ధ్య విభాగానికి చెందిన నాలుగో డివిజన్‌లో కార్మికుడిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. సదరు కార్మికుడు ఎన్టీఆర్ సామాజిక పింఛన్ కోసం దరఖాస్తు చేసేందుకు స్వర్ణ గ్రామ సచివాలయానికి వెళ్తే.. మీరు ఇంకా ఉద్యోగిగా ఆన్‌లైన్‌లో చూపుతున్నట్లు గ్రామ సచివాలయ ఉద్యోగులు ఆయనకు వివరించారు. ఈ సమస్యను పురపాలక అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయాలని కోరారు. సుమారు 5 నెలలు గడుస్తున్నా సమస్యకు సరైన పరిష్కారం చూపలేదు. దీంతో ఇంటికి విద్యుత్తు రాయితీ కూడా వర్తించట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యని ఆన్‌లైన్‌లో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయాలని కోరినట్లు మున్సిపల్ ఉద్యోగులు బదులిచ్చారు. త్వరలోనే మార్పు చేస్తారని తెలిపారు.



కోటయ్య

సీడీఈ యూజీ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యాకేంద్రం (సీడీఈ) ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ పరీక్షల ఫలితాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ శనివారం విడుదల చేశారు. బీఏ, బీబీఏ, బీకాం జనరల్ అయిదో సెమిస్టర్, కంప్యూటర్ సైన్స్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని సీడీఈ సంచాలకులు ఆచార్య వెంకటేశ్వర్లు తెలిపారు. జవాబు పత్రాల పునఃమూల్యాంకన కోసం ఈ నెల 13వ తేదీలోపు ఒక్కో పేపర్‌కు రూ.1200 చెల్లించాలని సంచాలకులు సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఐసీటీ సంచాలకులు ప్రభాకర్, పరీక్షల విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, సహాయ రిజిస్ట్రార్ కోదండపాణి, సూపరింటెండెంట్ టంకశాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, అధ్యాపకులు

ఆర్ట్స్, సైన్స్ పరీక్షల..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ కళాశాలల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ శనివారం విడుదల చేశారు. ఎంటీఏ ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగంలో 25 మంది పరీక్ష రాయగా 23, ఎంఏ ఆర్కియాలజీలో పరీక్ష రాసిన 13 మంది, చరిత్రలో పరీక్ష రాసిన 22 మంది, సైన్స్‌లో ఎమ్మెస్సీ ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీలో 21 మంది పరీక్ష రాయగా 20, బయోటెక్నాలజీలో 27 మంది పరీక్ష రాయగా 24, ఫారెస్ట్రీలో 11 మందికి 10, గణాంకాలలో 22 మంది పరీక్ష రాయగా 16 మంది, ఎమ్మెస్సీ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో పరీక్ష రాసిన నలుగురు, ఎన్విరాన్‌మెంట్ సైన్స్‌లో పరీక్ష రాసిన 9 మంది, ఒకేషనల్ హార్టికల్చర్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్‌లో పరీక్ష రాసిన 15 మంది ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. జవాబు పత్రాల పునఃమూల్యాంకన కోసం ఈ నెల 13వ తేదీలోపు ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలని సీఈ చెప్పారు.

మీ విజయం స్ఫూర్తిదాయకం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు విజయం ముందు విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం కలెక్టరేట్‌లో సత్కరించారు. కలెక్టర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల పట్ల ఉన్న అపోహలు అన్నింటికీ సమాధానం మీరేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రైవేట్ పాఠశాలలను దాటి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలనే ఉద్దేశంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. పిల్లలు విజయాలు సాధించడంలో తోడ్పాటు అందించిన తల్లిదండ్రులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులకు ఆయన సెల్యూట్ చేశారు. మా అమ్మ ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయ వృత్తి పట్ల ఎంతో గౌరవం ఉందని, విద్యార్థులు సాధించిన దానికి ఉపాధ్యాయులు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈవో షేక్ సలీంబాషా, మండల విద్యా శాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ సాయి కాంత్ వర్మ

ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొలకలూరి నాటక కళా పరిషత్తు, శ్రీసాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో, ఏపీ రాష్ట్ర సృజనాత్మకత.. సంస్కృతి సమితి సహకారంతో తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపరాజు రమణ, విజయ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కళా పండగలో హైదరాబాద్‌కు చెందిన రంగ స్థల నటి దాసరి రమాదేవికి గోపరాజు బాలత్రిపుర సుందరమ్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఆర్.వెంకటదుర్గాప్రసాద్, జడ నాగమల్లేశ్వరరావు, మురళీధర్, వెంకటపూర్ణచంద్, కాంతారావు, శ్రీనివాసరావు, సుబ్బారావు, మల్లేశ్వరరావు, స్వామి తదితరులతో పెద్ద సంఖ్యలో కళాభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి.



రమాదేవికి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు, అతిథులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -123 రిటైల్ ధర 150 చికెన్ విత్ స్కిన్ - 218 చికెన్ స్కిన్‌లెస్ - 248.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం ఓ హాలులో జరిగింది. జిల్లా అధ్యక్షులుగా రెహమాన్, కార్యదర్శిగా రాఘవరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రవికుమార్, జిల్లా కోశాధికారిగా రాజు, సభ్యులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు, ప్రధాన కార్యదర్శి చాంద్‌బాషా అభినందనలు తెలిపారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.2.70 కోట్లు


ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శనివారం లెక్కించారు. 17 రోజుల్లో సమర్పించిన కానులను లెక్కించగా రూ.2,70,22,242 ఆదాయం వచ్చింది. కానుకలతోపాటు 329 గ్రాముల బంగారం, 3.800 కిలోల వెండి వస్తువులను భక్తులు మొక్కుల రూపంలో చెల్లించారు. ఇవే కాక 707 యుఎస్ఏ డాలర్లు, 6500 ఇండోనేషియా రుపియా, 60 యూఏఈ దిర్హామ్స్, 231 సౌదీ రియాల్స్ విదేశీ కరెన్సీ వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఎస్పీఎఫ్, సెక్యూరిటీ బందోబస్తు మధ్య దేవస్థానం, సేవా సిబ్బంది కానుకలను లెక్కించారు.

ఆ మృతదేహం మా నాన్నదే..

అంత్యక్రియల తర్వాత వచ్చిన కుమార్తె

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల తెనాలి-గుంటూరు వంతెన ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు మృతి చెంది ఉండగా గుర్తించిన పోలీసులు ఆయన గురించి స్థానికంగా ఆరా తీశారు. కొన్ని నెలలుగా ఆయన ఇక్కడే తిరుగుతూ, ఫుట్‌పాత్‌లపై నిద్రపోతూ ఉంటాడని చెప్పడంతో అనాథగా నమోదు చేసుకుని అంత్యక్రియల నిమిత్తం ఒక స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. వారు మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేసి ఆ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. దానిని చూసి ఒక మహిళ సంస్థ వారిని సంప్రదించారు. ఆయన తన నాన్నేనని, గత కొంత కాలంగా ఇంటికి రాకుండా రోడ్లపై తిరుగుతున్నారని ఆయన పేరు జాన్‌సైదా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ శ్మశాన వాటికలో ఖననం చేసిన ప్రాంతాన్ని చూసుకుని ఆమె కన్నీటితో వెనుదిరిగారు.

కరెంట్ అఫైర్స్



★ ఏ ప్రముఖ బాలీవుడ్ నటుడు 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్–2026' లో తొలిసారిగా చోటు దక్కించుకున్నారు? జ: షారుక్ ఖాన్ (హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026 ప్రకారం 1.3 బిలియన్ డాలర్ల నికర సంపదను షారుక్ కలిగి ఉన్నారు.)

★ అస్సాంకు చెందిన జీఐ–ట్యాగ్ పొందిన కర్బీ ఆంగ్లాంగ్ అల్లాన్ని ఇటీవల తొలిసారిగా ఏ నగరానికి ఎగుమతి చేశారు? జ: లండన్ (అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్ జిల్లాలోని సింహాసన్ కొండల్లో పండే ప్రసిద్ధ వ్యవసాయ ఉత్పత్తి కర్బీ ఆంగ్లాంగ్ అల్లం 2015లో జీఐ ట్యాగ్‌ను పొందింది.)

మాదిరి ప్రశ్నలు

★ బ్రాండ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ 500 రిపోర్ట్ 2026 ప్రకారం ప్రపంచంలో అత్యంత విలువైన బ్యాంకుగా ఏది నిలిచింది?
జ: ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా (చైనా కన్‌స్ట్రక్షన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ చైనా, అగ్రికల్చరల్ బ్యాంక్ ఆఫ్ చైనా, బ్యాంక్ ఆఫ్ అమెరికాలు వరుసగా రెండు నుంచి ఐదు స్థానాల్లో నిలిచాయి.)

మరింత సమాచారం

★ సీఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: మార్చి 10 (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) స్థాపనకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 1968 నాటి సీఐఎస్ఎఫ్ చట్టం ప్రకారం దీనిని 1969లో స్థాపించారు.)

దరఖాస్తు చేశారా?



- ఎన్ఎండీసీలో జూనియర్ ఇంజినీర్ ఉద్యోగాలు
  చివరి తేదీ: 06.05.2026
- ఎన్ఐటీ కాలికట్‌లో ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టులు
  చివరి తేదీ: 06.05.2026


విశ్వసనీయ ప్రగతి దారులు!

దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థల ప్రగతి, పరిణామక్రమంలో రైల్వేలు విడదీయలేని భాగం. సుదూర ప్రాంతాలను అనుసంధానించి దేశ సమగ్రతకు దోహదపడుతూ, ప్రాంతాల మధ్య సంబంధాలను పెంచుతూ, వాణిజ్య వృద్ధికి అండగా నిలుస్తోంది. ప్రారంభం నుంచి నేటికీ సామాన్యులకు అత్యంత చౌకైన, నమ్మదగిన రవాణా సాధనంగా స్థిరపడింది. ముఖ్యంగా సరకు రవాణాకు జీవనాడిగా మారి, పారిశ్రామిక ప్రగతిని పరుగులు తీయిస్తోంది. అతిపెద్ద నెట్‌వర్క్‌తో అత్యంత రద్దీగా ఉండే భారతీయ రైల్వే సంపూర్ణ స్వరూపం, దాని చరిత్ర, ప్రాధాన్యం, పురోగతికి సంబంధించిన అంశాలన్నీ పోటీ పరీక్షార్థులకు తెలిసి ఉండాలి. రైల్వే గేజ్‌లో జరిగిన మార్పులు, రైల్వే జోన్ల ఏర్పాటు, విస్తరణతో పాటు రైల్వేల ఆధునికీకరణ, ప్రస్తుతం అమలులో ఉన్న ప్రాజెక్టులు, ప్రత్యేకంగా నడిచే రైళ్ల వివరాలన్నింటినీ గుర్తుంచుకోవాలి.

జనరల్ స్టడీస్
ఇండియన్ జాగ్రఫీ

రైలు మార్గాలు

అధిక జనాభా, విశాల భూభాగం ఉన్న భారత దేశంలో ప్రయాణికులను, సరకులను ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి అధిక మొత్తంలో తరలించడానికి అనువైన మార్గం రైలు రవాణా. ఇది చౌకైనది, సులువైనది, సమయం ఆదా అవుతుంది. దేశంలో మొదటిసారిగా రైల్వేలు బ్రిటిష్ సైనికుల అవసరాల కోసం ఏర్పాటయ్యాయి. ఆ తర్వాత వనరులు, సరకు రవాణా కోసం వినియోగించారు. దేశంలో పారిశ్రామికాభివృద్ధి త్వరితగతిన జరగడానికి రైల్వేలు దోహదపడ్డాయి.


బోరి బందర్

భారత్‌లో రైలు సేవలు తొలుత 1830లో ప్రతిపాదించినప్పటికీ మొదటిసారిగా సరకు రవాణా 1851లో ఉత్తరాఖండ్‌లో మొదలైంది. ఇక ప్రజారవాణా కోసం ప్రారంభించిన తొలి రైలు 1853లో బోరి బందర్ నుంచి థానే వరకు నడిచింది. తెలంగాణాలో మొదటి రైలు 1874లో సికింద్రాబాద్ నుంచి వాడి మధ్య ప్రయాణించింది. మొదటి విద్యుత్తు రైలు బొంబాయి - కుర్లా మధ్య 1925లో తిరిగింది. ప్రపంచంలో అతిపెద్ద రైలు నెట్‌వర్క్ ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉంది. అమెరికా, రష్యా, చైనా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. మొదట్లో రైలు మార్గాలను ప్రైవేటు వారు ప్రారంభించగా, తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం వాటిని స్వాధీనం చేసుకుంది. స్వాతంత్ర్యానంతరం రైల్వే వ్యవస్థ అంతా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది. 2025, మార్చి నాటికి దేశంలో సుమారు 69,439 కి.మీ. రైల్వే వ్యవస్థ ఉంది. ఇందులో 99.6% బ్రాడ్‌గేజ్‌గా మార్చారు. దేశంలో ఏటా సుమారు 750 కోట్ల ప్రయాణాలు రైల్వేలో జరుగుతున్నాయి. సరకులు, ప్రయాణికుల ద్వారా సుమారు రూ.80 వేల కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం రోజూ సుమారు 25 వేల రైళ్లు నడుస్తున్నాయి. వీటికి ప్రత్యేక రైళ్లు అదనం. రైల్వేలో సుమారు 1.2 మిలియన్ల ఉద్యోగులు పనిచేస్తున్నారు.




రైల్వే గేజ్: దేశంలో రైలు పట్టాల మధ్య దూరాన్ని సూచించేది గేజ్. ఈ దూరం రైలు వేగం, స్థిరత్వం, మోసే సామర్థ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది.

బ్రాడ్ గేజ్: దీని వెడల్పు 1,676 మి.మీ.లు. అధిక సామర్థ్యం, స్థిరత్వం ఉంటుంది.

మీటర్ గేజ్: వెడల్పు 1,000 మి.మీ.లు. గతంలో భారత్‌లో ఎక్కువగా మీటర్ గేజ్‌లు ఉండేవి.

నారో గేజ్: 762 మి.మీ. లేదా 610 మి.మీ. వెడల్పుతో ఎక్కువగా కొండ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో ఉంటాయి.

యునిగేజ్ ప్రాజెక్టు: దేశంలోని వివిధ రకాల గేజ్‌లను ఒకేరకమైన గేజ్ (బ్రాడ్‌గేజ్ 1.67 మీ.)గా మార్చే ప్రాజెక్టు. ఒకే గేజ్ ప్రమాణాన్ని అవలంబించడం ప్రయాణ వేగాన్ని పెంచి సమయాన్ని ఆదా చేస్తుంది.



రైల్వే జోన్లు

రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే నెట్‌వర్క్‌ను నిర్వహణ అవసరాలు, ప్రయోజనం కోసం భౌగోళిక జోన్లుగా విభజించింది. మొదటగా 1951లో చెన్నై కేంద్రంగా దక్షిణ రైల్వే జోన్ ప్రారంభమవగా, చివరగా 2019లో విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ తీర (సౌత్ కోస్టల్) రైల్వే జోన్ ఏర్పాటైంది. దేశంలో అతిపెద్ద రైల్వే జోన్ నార్తెర్న్ రైల్వే జోన్, దిల్లీ కేంద్రంగా పనిచేస్తుంది. దేశంలో అత్యంత పొడవైన రైలు మార్గం ఉన్న రాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్ (8566 కి.మీ.). రైలు మార్గం లేని రాష్ట్రం సిక్కిం. అధిక రైల్వేలైన్ సాంద్రత ఉన్న రాష్ట్రం పశ్చిమ బెంగాల్ (1000 చ.కి.మీ.లకు 47.46 కి.మీ.). తర్వాతి స్థానాల్లో పంజాబ్ (44.97 కి.మీ.), బిహార్ (40.30 కి.మీ.), హరియాణా (38.32 కి.మీ.), ఉత్తర్‌ప్రదేశ్ (36.32 కి.మీ.) ఉన్నాయి. దేశంలో అతి పురాతన రైలు ఫెయిరీ క్వీన్. ఇది న్యూదిల్లీ - ఆల్వార్ (రాజస్థాన్) మధ్య నడుస్తుంది. వేగవంతమైన రైలు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (గంటకు 180 కి.మీ). రెండో వేగవంతమైన రైలు గతిమాన్ ఎక్స్‌ప్రెస్. ఇది నిజాముద్దీన్-ఆగ్రా మధ్య గంటకు 160 కి.మీ. వేగంతో నడుస్తుంది. ఎక్కువ దూరం ప్రయాణిస్తూ ఎక్కువమంది ప్రయాణికులను చేరవేసే రైలు వివేక్ ఎక్స్‌ప్రెస్. ఇది అస్సాం (దిబ్రూగఢ్) - తమిళనాడు (కన్యాకుమారి) మధ్య 4,273 కి.మీ.ల దూరం, ప్రయాణిస్తుంది. ప్రస్తుతం అతిపొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్ గోరఖ్‌పూర్ (ఉత్తర్‌ప్రదేశ్)- 1,367 మీ. రైల్వేలోగో 'బోలు' (లాంతరు పట్టుకున్న ఏనుగుపిల్ల కార్టూన్ బొమ్మ).


ఫెయిరీ క్వీన్

మల్టీ రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం

వీటినే మెట్రోరైల్ అంటారు. దేశంలో మొదట 1984లో కోల్‌కతాలో ప్రారంభమయ్యాయి. మెట్రో రైల్ పితామహుడు శ్రీధరన్. దిల్లీలో 2002లో మెట్రో సేవలు ప్రారంభించారు. బెంగళూరులో 2011లో, హైదరాబాద్‌లో 2017, నవంబరు 29న ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దేశంలో 18 నగరాలకు మెట్రో సేవలు విస్తరించాయి.

వందే భారత్: స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన 'సెమీ - హైస్పీడ్' రైలు. దీని అసలు పేరు 'ట్రెయిన్ - 18'. 'మేక్ ఇన్ ఇండియా' చొరవతో చెన్నైలోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీలో రూపొందించారు. 2019 ఫిబ్రవరిలో ప్రారంభించారు. దీని వేగం గంటకు 180 కి.మీ.

డైమండ్ క్వాడ్రిలేటరల్

దీనినే 'వజ్రపు చతుర్భుజి' అంటారు. రహదారుల కోసం బంగారు చతుర్భుజి (గోల్డెన్ క్వాడ్రిలేటరల్) హైవేల మాదిరిగా, రైల్వేల కోసం డైమండ్ క్వాడ్రిలేటరల్ చేపట్టారు. దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయిలను కలుపుతూ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ప్రణాళికను 2014-15లో ప్రకటించారు.

హైస్పీడ్ రైలు ప్రాజెక్టులు: 2016లో 'నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్' స్థాపించారు. ఈ సంస్థ అధిక వేగంతో (గంటకు 250-350 కి.మీ.) నడిచే హైస్పీడ్ రైలు కారిడార్లు, రైల్వే లైన్లు నిర్మించి నిర్వహిస్తుంది.

గుర్తించిన హైస్పీడ్ రైల్వే కారిడార్లు:
- ముంబయి- పుణె
- పుణె - హైదరాబాద్
- హైదరాబాద్ - బెంగళూరు
- హైదరాబాద్ - చెన్నై
- చెన్నై- బెంగళూరు
- దిల్లీ- వారణాసి
- వారణాసి - సిలిగురి

దేశంలో ప్రస్తుతం 19 రైల్వే జోన్లు ఉన్నాయి. ఈ జోన్లు దేశవ్యాప్తంగా విస్తారమైన రైల్వే నెట్‌వర్క్‌ను నిర్వహిస్తాయి.

రైల్వే మండలాల జాబితా
మధ్య రైల్వే - ముంబయి
తూర్పు రైల్వే – కోల్‌కతా
తూర్పు మధ్య రైల్వే - హాజీపూర్
తూర్పు తీర రైల్వే – భువనేశ్వర్
కొంకణ్ రైల్వే - నవీ ముంబయి
ఈశాన్య సరిహద్దు రైల్వే – గువాహటి
ఉత్తర రైల్వే - న్యూదిల్లీ
ఉత్తర మధ్య రైల్వే – ప్రయాగ్‌రాజ్
ఈశాన్య రైల్వే - గోరఖ్‌పూర్
వాయవ్య రైల్వే – జైపూర్
దక్షిణ మధ్య రైల్వే - సికింద్రాబాద్
ఆగ్నేయ మధ్య రైల్వే – బిలాస్‌పూర్
ఆగ్నేయ రైల్వే - కోల్‌కతా
నైరుతి రైల్వే – హుబ్బళ్లి
దక్షిణ రైల్వే - చెన్నై
పశ్చిమ మధ్య రైల్వే – జబల్‌పూర్
పశ్చిమ రైల్వే - ముంబయి
మెట్రో రైల్వే – కోల్‌కతా
దక్షిణ తీర రైల్వే - విశాఖపట్నం

ప్రస్తుతానికి ఆమోదించినవి:
దిల్లీ-పట్నా (991 కి.మీ.), దిల్లీ - అమృత్‌సర్ (450 కి.మీ.), చెన్నై -బెంగళూరు-త్రివేండ్రం (649 కి.మీ.), తిరువనంతపురం - మంగళూరు (585 కి.మీ.), పుణె - ముంబయి - అహ్మదాబాద్ (650 కి.మీ.).



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

Coordinate Geometry

Class 10th Bridge Course Maths


To master Coordinate Geometry in Class 10, a student needs a rock–solid foundation from the Class 8 and Class 9 CBSE syllabi. These basics act as the building blocks for more complex formulas like the Distance Formula and Section Formula.

Here is a detailed breakdown of the essential concepts:

1. Basics (from Class 8): The Cartesian Plane

Before jumping into geometry, the student must understand how to represent data on a grid.

- **The Number Line:** Understanding that every point on a line corresponds to a unique real number.
- **Introduction to Axis:** Recognizing the horizontal line as the X–axis and the vertical line as the Y–axis.
- **Origin:** The point where the two axes intersect, denoted as O(0, 0).
- **Ordered Pairs:** Learning that a point is always written in the form (x, y), where 'x' is the distance from the Y–axis and 'y' is the distance from the X–axis.



2. Detailed Coordinate System:

Class 9 introduces the formal vocabulary and positioning rules that Class 10 takes for granted.

A. Terminology

The Cartesian Plane is a two–dimensional surface defined by two perpendicular number lines. • **The Abscissa(x):** This is the horizontal position. If x is positive, you move right from the origin; if negative, you move left. • **The Ordinate (y):** This is the vertical position. If y is positive, you move up; if negative, you move down. • **The Origin (0, 0):** It is the reference point. Every measurement starts here. • **Quadrants:** The axes divide the plane into four regions:

- Quadrant I: (+, +),
- Quadrant II: (–, +)
- Quadrant III: (–, –),
- Quadrant IV: (+, –)

B. Plotting and Locating Points

- **Points on Axes:** ❏ Any point on the X–axis has a y–coordinate of 0, written as (x, 0). ❏ Any point on the Y–axis has an x–coordinate of 0, written as (0, y).
- **Perpendicular Distance:** Understanding how to find the distance of a point from either axis (e.g.: The distance of point (3, 4) from the X–axis is 4 units).

For more Concepts

Writer: T.S.V.S.Suryanarayana Murty




పదార్థాన్ని అంతకంటే సూక్ష్మంగా విభజించ లేకపోతే..!

పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం సహా విశ్వంలో ఉన్న ప్రతీది మూలకాలతో, మూలకాల సంయోగాలతో ఏర్పడినవే. ఈ పదార్థాల లక్షణాలు తెలియాలంటే మూలకాల ధర్మాలపై అవగాహన ఉండాలి. ఇప్పటి వరకు కనుక్కున్న సుమారు నూట పద్దెనిమిది మూలకాలతో అనేక మిలియన్ల సమ్మేళనాలు ఏర్పడుతున్నాయి. ఈ మూలకాలను, ధర్మాలన్నింటినీ సులభంగా అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు వాటిని క్రమపద్ధతిలో వర్గీకరించారు. డాబరీనర్ మూలకాలను త్రికాలుగా అమరిస్తే, న్యూలాండ్స్ అష్టక నియమంతో మూలకాల సారూప్యతను తెలియజేశాడు. మెండలీఫ్ పరమాణు భారం ప్రధానంగా, మోస్లే పరమాణు సంఖ్య ఆధారంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. ఈ వర్గీకరణలు, మూలకాల భౌతిక, రసాయన ధర్మాల గురించి పోటీ పరీక్షార్థులకు తగిన పరిజ్ఞానం ఉండాలి.



జనరల్ స్టడీస్ - రసాయన శాస్త్రం

మూలకాల వర్గీకరణ - ఆవర్తన పట్టిక

1. 'భౌతిక, రసాయన మార్పుల ద్వారా ఒక పదార్థాన్ని అంతకంటే సూక్ష్మ పదార్థంగా విభజించలేకపోతే దాన్ని మూలకం అంటారు' అని నిర్వచించిన శాస్త్రవేత్త?
   1) లెవోయిజర్ 2) రాబర్ట్ బాయిల్ 3) డాబరీనర్ 4) బెర్జీలియస్
2. రాబర్ట్ బాయిల్ కాలం (1661) నాటికి తెలిసిన మూలకాల సంఖ్య?
   1) 13 2) 24 3) 32 4) 63
3. 1865 నాటికి తెలిసిన మూలకాల సంఖ్య?
   1) 13 2) 32 3) 24 4) 63
4. నిశ్చితం–(ఎ): జోసెఫ్ లూయిస్ ప్రౌస్ట్ కాలంలో అన్ని మూలకాల పరమాణు భారాలు పూర్ణాంకాలని తెలిపారు.
   కారణం–(ఆర్): హైడ్రోజన్ పరమాణు భారం '1' గా తీసుకున్నారు.
   
   లూయిస్ ప్రౌస్ట్
   1) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది; ఆర్ సరైంది కాదు.
   4) ఎ సరైంది కాదు; ఆర్ సరైంది.
5. మూలకాల పరమాణు భారాలకు, వాటి ధర్మాలకు మధ్య సంబంధాన్ని గుర్తించి, వాటిని వర్గీకరించిన మొదటి శాస్త్రవేత్త?
   1) న్యూలాండ్స్ 2) లూథర్ మేయర్ 3) డాబరీనర్ 4) జోసెఫ్ ప్రౌస్ట్
6. 18వ శతాబ్దం చివరకు (లెవోయిజర్ కాలానికి) తెలిసిన మూలకాల సంఖ్య?
   1) 20 2) 24 3) 63 4) 56
7. 'హైడ్రోజన్ పరమాణువు ఒక నిర్మాణాత్మక ప్రమాణమని, మిగిలిన అన్ని మూలకాల పరమాణువులు హైడ్రోజన్ పరమాణువుల కలయిక వల్ల ఏర్పడినవే' అని ప్రతిపాదించినవారు?
   1) లెవోయిజర్
   2) రాబర్ట్ బాయిల్
   3) జోసెఫ్ లూయిస్ ప్రౌస్ట్
   4) బెర్జీలియస్
8. క్యాల్షియం, బేరియం సాంద్రతలు వరుసగా 1.55 గ్రా./సెం.మీ.^{3}, 3.51 గ్రా./సెం.మీ.^{3} అయితే త్రిక సిద్ధాంతం ఆధారంగా స్ట్రాన్షియం సాంద్రత సుమారుగా?
   1) 1.96 గ్రా./సెం.మీ.^{3} 2) 5.06 గ్రా./సెం.మీ.^{3} 3) 2.53 గ్రా./సెం.మీ.^{3} 4) 0.45 గ్రా./సెం.మీ.^{3}
9. త్రికంలో మధ్య మూలకం పరమాణు భారం, మిగిలిన రెండు మూలకాల పరమాణు భారాల..... కు సమానం.
   1) మొత్తం 2) భేదం 3) లబ్ధం 4) సగటు
10. త్రిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
    1) న్యూలాండ్స్ 2) మెండలీఫ్ 3) డాబరీనర్ 4) మోస్లే
11. కింది వాటిలో డాబరీనర్ త్రికం కానిది?
    1) Li, Na, K 2) S, Se, Te 3) Mn, Cr, Fe 4) C, N, O
12. కింది వాటిలో డాబరీనర్ త్రిక సిద్ధాంత పరిమితి కానిది?
    
    డాబరీనర్
    1) ఆ కాలం నాటికి తెలిసిన మూలకాలన్నింటినీ త్రికాలుగా అమర్చలేదు.
    2) పరమాణు ద్రవ్యరాశులు కచ్చిత విలువలకు ఈ సిద్ధాంతం నిలువలేదు.
    3) అత్యధిక, అత్యల్ప ద్రవ్యరాశులున్న మూలకాలకు ఈ సిద్ధాంతం వర్తించదు.
    4) ఈ సిద్ధాంతం కేవలం 15 మూలకాలకు (5 త్రికాలు) మాత్రమే చెందుతుంది.
13. వాక్యం–(ఎ): న్యూలాండ్స్ మొత్తం మూలకాలను 7 గ్రూపులుగా ఏర్పరిచాడు.
    వాక్యం–(బి): న్యూలాండ్స్ పట్టికలోని మొత్తం మూలకాల సంఖ్య 56.
    
    న్యూలాండ్స్
    1) ఎ, బి సత్యం
    2) ఎ సత్యం, బి అసత్యం
    3) ఎ అసత్యం, బి సత్యం
    4) ఎ, బి అసత్యం
14. న్యూలాండ్స్ అష్టక నియమం ఏ మూలకం వరకు సరిగ్గా పనిచేస్తుంది?
    1) Na 2) K 3) Zn 4) Ca
15. న్యూలాండ్స్ వర్గీకరణ ప్రకారం మూలకాలను పరమాణు భారాల ఆరోహణ క్రమంలో ఉంచితే ప్రతి మూలకం నుంచి దాని తదుపరి ఎన్నో మూలకం సమాన ధర్మాలు కలిగి ఉంటుంది?
    1) 5 2) 3 3) 7 4) 8
16. మూలకాల భౌతిక ధర్మాలకు, పరమాణు ద్రవ్యరాశికి మధ్య ఆవర్తన క్రమాన్ని గుర్తించిన జర్మన్ శాస్త్రవేత్త, మెండలీఫ్ సమకాలికుడు...
    
    లూథర్ మేయర్
    1) డాబరీనర్
    2) లూథర్ మేయర్
    3) మోస్లే
    4) న్యూలాండ్స్
17. మెండలీఫ్ ఆవర్తన నియమం ప్రకారం మూలకాల భౌతిక, రసాయన ధర్మాలు వాటి... ల ఆవర్తన ప్రమేయాలు.
    1) పరమాణు భారం 2) పరమాణు సంఖ్య 3) ఎలక్ట్రాన్ విన్యాసం 4) న్యూట్రాన్‌ల సంఖ్య
18. మొదటి ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించినవారు?
    
    మెండలీఫ్
    1) మోస్లే
    2) న్యూలాండ్స్
    3) డాబరీనర్
    4) మెండలీఫ్
19. వాక్యం–(ఎ): ఒకే గ్రూపులో ఉండే మూలకాల రసాయన ధర్మాలు సారూప్యత కలిగి ఉంటాయి.
    వాక్యం–(బి): ఒకే పీరియడ్‌లో ఉండే మూలకాల భౌతిక ధర్మాలు సారూప్యత కలిగి ఉంటాయి.
    1) ఎ, బి సత్యం
    2) ఎ సత్యం, బి అసత్యం
    3) ఎ అసత్యం, బి సత్యం 4) ఎ, బి అసత్యం
20. కింది వాటిని జతపరచండి.
    ఎ) ఏకా - బోరాన్ 1) గాలియం
    బి) ఏకా - అల్యూమినియం 2) స్కాండియం
    సి) ఏకా - సిలికాన్ 3) జెర్మేనియం
    1) ఎ-1, బి-2, సి-3 2) ఎ-2, బి-1, సి-3 3) ఎ-1, బి-3, సి-2 4) ఎ-3, బి-2, సి-1
21. మెండలీఫ్ ఆవర్తన పట్టికలో ఉన్న అసంగత మూలకాల జతకానిది?
    1) Ar, K 2) Co, Ni 3) Th, Pa 4) Fe, Co
22. మెండలీఫ్ కింది మూలకాల పరమాణు భారాలను సరిచేశాడు.
    1) Be, Ln, Au 2) B, Au, Ag 3) Be, Lr, Au 4) Au, Ag, Pt
23. నాణెపు లోహాలైన **Cu, Ag, Au** మూలకాలను మెండలీఫ్ ఆవర్తన పట్టికలో ఏ గ్రూపులో ఉంచారు?
    1) IB 2) IA 3) IIB 4) IIA
24. 1879లో నిల్సన్ కనుక్కున్న మూలకం?
    

    1) గాలియం
    2) రుబీడియం
    3) జెర్మేనియం
    4) స్కాండియం
25. పరమాణు సంఖ్య (Z)కు ఆ పరమాణువును కాథోడ్ కిరణాలతో తాడనం చెందించినప్పుడు విడుదలైన X- కిరణ పౌనఃపున్యానికి (υ) మధ్య సంబంధంలో ఏది సత్యం?
    1) $\sqrt{\upsilon} \propto z$ 2) $\upsilon \propto z$ 3) $\sqrt{\upsilon} \propto \frac{1}{z}$ 4) $\upsilon \propto \sqrt{z}$
26. వాక్యం–(ఎ): ఆధునిక ఆవర్తన నియమాన్ని ప్రతిపాదించింది మోస్లే.
    వాక్యం– (బి): మూలకాల ఎలక్ట్రాన్ విన్యాసం ఆధారంగా విస్తృత ఆవర్తన పట్టిక రూపొందించింది నీల్స్‌బోర్.
    1) ఎ, బి సత్యం 2) ఎ సత్యం, బి అసత్యం 3) ఎ అసత్యం, బి సత్యం 4) ఎ, బి అసత్యం
27. కింది వాటిలో సరికానిది?
    1) నవీన ఆవర్తన పట్టికలో అత్యంత పొట్టి, అత్యంత పొడవు పీరియడ్‌లు వరసగా ఉంటాయి.
    2) నవీన ఆవర్తన పట్టికలో గ్రూపులు, పీరియడ్‌ల సంఖ్య 7, 18
    3) నవీన ఆవర్తన నియమం ప్రకారం మూలకాల భౌతిక, రసాయన ధర్మాలు పరమాణు సంఖ్యల ఆవర్తన ప్రమేయాలు.
    4) 5వ పీరియడ్‌లో ఉపశక్తి స్థాయులు 5s,5p, 5d
28. కింది వాటిని జతపరచండి.
    ఎ) క్షారలోహాలు 1) Ca, Sr, Ba
    బి) క్షార మృత్తిక లోహాలు 2) Cl, Br, I
    సి) చాల్కోజన్‌లు 3) S, Se, Te
    డి) హాలోజన్‌లు 4) Li, Na, K
    1) ఎ-4, బి-1, సి-2, డి-3
    2) ఎ-4, బి-1, సి-3, డి-2
    3) ఎ-1, బి-4, సి-3, డి-2
    4) ఎ-1, బి-4, సి-2, డి-3
29. నిశ్చితం–(ఎ): 17వ గ్రూపు మూలకాలను 'హాలోజన్‌లు' అంటారు.
    కారణం–(ఆర్): సముద్ర లవణాల నుంచి లభిస్తాయి కాబట్టి 17వ గ్రూపు మూలకాలను 'హాలోజన్‌లు' అంటారు.
    1) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ.
    2) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్ సరైన వివరణ కాదు.
    3) ఎ సరైంది, ఆర్ సరైంది కాదు.
    4) ఎ సరైంది కాదు, ఆర్ సరైంది.
30. పరమాణు సంఖ్య 120గా ఉన్న మూలకం **IUPAC** సంకేతం?
    1) Ubn 2) Unb 3) Unh 4) Uub
31. కింది వాటిని జతపరచండి.
    ఎ) s, p-బ్లాక్ మూలకాలు 1) అంతర పరివర్తన మూలకాలు
    బి) d-బ్లాక్ మూలకాలు 2) ప్రాతినిధ్యపు మూలకాలు
    సి) f-బ్లాక్ మూలకాలు 3) పరివర్తన మూలకాలు
    1) ఎ-1, బి-2, సి-3 2) ఎ-2, బి-1, సి-3 3) ఎ-2, బి-3, సి-1 4) ఎ-3, బి-1, సి-2
32. లోహాలు, అలోహాలు అర్ధలోహాలు అన్నింటిని కలిగిన బ్లాక్?
    1) s - బ్లాక్ 2) p - బ్లాక్ 3) d - బ్లాక్ 4) f - బ్లాక్



33. లాంథనైడ్, ఆక్టినైడ్ శ్రేణి మూలకాలు ఏ గ్రూపునకు చెందుతాయి?
    1) IB 2) IIB 3) IIIB 4) IVB
34. పరివర్తన మూలకాలకు సంబంధించి కింది వాటిలో సరికానిది?
    1) వీటి సాధారణ ఎలక్ట్రాన్ విన్యాసం $(n-1)d^{0-10}\ ns^2$
    2) ఇవన్నీ లోహాలే. విభిన్న ఆక్సీకరణ స్థితులు ప్రదర్శిస్తాయి.
    3) పారా అయస్కాంత ధర్మాన్ని ప్రదర్శిస్తాయి.
    4) ఆవర్తన పట్టికలో 3 నుంచి 12 గ్రూపులకు చెందుతాయి.
35. కింది వాటిలో రేడియోధార్మిక శ్రేణి...
    1) 4d శ్రేణి 2) 5d శ్రేణి 3) 4f శ్రేణి 4) 5f శ్రేణి

సమాధానాలు

1-2; 2-1; 3-4; 4-1; 5-3; 6-2; 7-3; 8-3; 9-4; 10-3; 11-4; 12-4; 13-1; 14-4; 15-4; 16-2; 17-1; 18-4; 19-2; 20-2; 21-3; 22-2; 23-1; 24-4; 25-1; 26-1; 27-4; 28-2; 29-1; 30-1; 31-3; 32-2; 33-3; 34-1; 35-4.

సెలవుల్లో సరదాగా!

మంట లేకుండా వంట



సెలవులొచ్చాయంటే చాలు.. వంటగదిలో అమ్మ చేసే వంటలు చూసి 'నేను వంట చేస్తానమ్మా' అంటూ మనం రెడీ అయిపోతుంటాం. కానీ స్టవ్ దగ్గరకు వెళ్లడం మనలాంటి చిన్న పిల్లలకు రిస్క్ కదా! మరి ఆ ఇబ్బంది లేకుండా, పొయ్యి వెలిగించే పని లేకుండానే చేసే వంటకాలను ఈ సమ్మర్‌లో నేర్చుకుందాం. దీన్ని ఫైర్‌లెస్ కుకింగ్ అని కూడా అంటారు.

రంగుల 'ఫ్రూట్ సలాడ్'

ఈ సలాడ్ తయారు చేయడానికి పుచ్చకాయ, అరటిపండు, ద్రాక్ష, యాపిల్, దానిమ్మగింజలు.. ఇలా రకరకాల పండ్లను ముక్కలుగా కోసి కొంచెం తేనె, నిమ్మరసం కలపాలి. ఓ 10-15 నిమిషాలు ఫ్రిజ్‌లో పెట్టుకుని చల్లచల్లగా ఇంట్లో వారికి అందించవచ్చు.

వెజిటబుల్ శాండ్‌విచ్

రెండు బ్రెడ్ ముక్కలు తీసుకుని ఆ రెండింటికీ ఒక్కోవైపు వెన్న పూయాలి. కీరదోస, క్యారెట్, టమాటా, ఉల్లిపాయలను గుండ్రంగా కట్ చేసుకుని బ్రెడ్ ముక్కల మధ్యలో పెట్టుకోండి. సరిపడా సాస్‌తో సీజనింగ్ చేసుకుంటే హెల్తీ శాండ్‌విచ్ రెడీ!



మొలకల చాట్

ఒక గిన్నెలో మొలకెత్తిన పెసలు, శెనగలు, పల్లీలు తీసుకోండి. అందులో ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర వేసి కాస్త ఉప్పు, కారం, చాట్ మసాలా, నిమ్మరసం కలపండి. మొలకల చాట్ రెడీ అయిపోతుంది.

అయితే బుజ్జి షెఫ్‌లు.. మీరు ఇవేవీ అమ్మకు చెప్పకుండా చెయ్యొద్దేం. కత్తి ఉపయోగించడంలో పెద్దల సాయమే తీసుకోవాలి సుమా!

చెప్పుకోండి చూద్దాం



సుజాతకి 4 ఏళ్లు ఉన్నప్పుడు ఆమె చెల్లి వయసు తనలో సగం. ఇప్పుడు సుజాతకి 40 ఏళ్లయితే, తన చెల్లి వయసెంత?

ఒక బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. తర్వాత స్టాప్‌లో 30 మంది, ఆ తర్వాత స్టాప్‌లో 20 మంది దిగారు. ఇంకా ఆ బస్సులో ఎంత మంది ఉంటారు?

ఈ పుట్టగొడుగు.. ధూమపానానికి చివరి అడుగు!



ధూమపానం అలవాటు ఉన్నవారు ఆ వ్యసనాన్ని వదిలించుకోవడం చాలా కష్టం. పొగాకులోని నికోటిన్ కూడా మెదడు వ్యసన కారకమవుతుంది. అయితే మ్యాజిక్ మష్రూమ్ అనే ఒక రకం పుట్టగొడుగులో ఉన్న సైలోసైబిన్ అనే పదార్థం.. ధూమపానాన్ని వదిలించుకోవడానికి సాయపడుతుందని పరిశోధనల్లో వెల్లడైంది. సైలోసైబిన్ అనేది ఒకరకం సైకెడెలిక్ డ్రగ్. ఇది భావన, భావోద్వేగం వంటివాటిని మారుస్తుంది. గతంలో శతాబ్దాల పాటు దీన్ని మతపరమైన కార్యక్రమాల్లో ఉపయోగించేవారు. ఇప్పుడు ఆధునిక మానసిక రుగ్మతలకు చికిత్స కోసం, వ్యసనాలను మాన్పించడానికి దీన్ని ఉపయోగించే అంశంపై పలు పరిశోధనలు జరుగుతున్నాయి.

సైలోసైబిన్ వాడకం వల్ల ధూమపానం అలవాటు తగ్గడం కానీ పూర్తిగా మానేయడం కానీ జరిగినట్లు 781 మందితో జరిగిన ఒక పరిశోధనలో వెల్లడైంది.

ఈ ఏడాది మార్చిలో అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన మాధ్యూ జాన్సన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తలు ఒక అధ్యయనాన్ని ప్రచురించారు. అందులో సైలోసైబిన్ ప్రభావంపై గట్టి ఆధారాలు లభించాయి. ధూమపానప్రియులకు ఈ పదార్థానికి తోడు నిపుణుల కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల మెరుగైన ప్రయోజనాలు ఉంటాయని వెల్లడైంది. కేవలం నికోటిన్ ప్యాచ్‌తో చికిత్స పొందిన వారితో పోలిస్తే.. వీరు పొగతాగడాన్ని వదిలేసే అవకాశం ఆరు రెట్లు ఎక్కువని తేలింది.

● పొగతాగడాన్ని మాన్పించడానికి సాయపడే మందులేవీ గత 20 ఏళ్లలో అమెరికాలో రాలేదని, అందువల్ల తాజా పరిశోధనలో వెల్లడైన అంశాలు ఆసక్తికరమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

–ఈనాడు ప్రత్యేక విభాగం

టీ గ్లాసులో హరివిల్లు!



బంగ్లాదేశ్‌లోని శ్రీమంగళ్ పట్టణానికి చెందిన రొమేశ్ గౌర్ అనే వ్యక్తి ఏడు రంగుల టీ తో అద్భుతం సృష్టించారు. ఒకే గ్లాసులో ఇంద్రధనుస్సులా ఏడు రంగులు వరుసగా పేర్చినట్టుగా ఉండే ఈ టీ ఒక్కో వరుసలో ఒక్కో రుచి కలిగి ఉండటం విశేషం. 2002లో తొలి సారి ఒకే గ్లాసులో రెండు రంగుల టీ తయారు చేసిన రొమేశ్.. కాలక్రమంలో రంగులు, రుచులు, వరుసల సంఖ్యను పెంచుకుంటూ పోయారు. రొమేశ్ తయారుచేసిన ఈ వింత పానీయం ప్రపంచం నలుమూలల నుంచి బంగ్లాదేశ్ సందర్శించే పర్యాటకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2004లో జపాన్ నిపుణులు ఈ టీని విశ్లేషించి ఇందులో ఎలాంటి హానికర రసాయనాలూ వాటం లేదని నిర్ధారించారు. - ఢాకా

రావి చెట్టుకు మామిడికాయలు!



రావిచెట్టుకు మామిడి కాయలు వేలాడుతున్నాయేంటా అని అనుకుంటున్నారా.. ఇదంతా వినియోగదారులను ఆకర్షించడానికి ఓ చిరు వ్యాపారి వేసిన ఆలోచన. కోల్‌కతా-చెన్నై ఎన్‌హెచ్‌పై విజయవాడ సమీపంలో రామవరప్పాడు వద్ద పాదచారుల బాటపై రావిచెట్టు ఉంటుంది. దాని కొమ్మలకు తాడుతో ఇలా మామిడికాయలను కట్టి విక్రయిస్తున్నాడా వ్యాపారి. ఇది వింతగా కనిపించడంతో అటుగా వెళ్తున్నవారంతా ఆగి కొంటున్నారని ఆయన వివరించారు. – ఈనాడు అమరావతి

వచ్చిందండీ.. పుస్తకాల బండి!



మురికివాడల్లోని చిన్నారుల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు విశాఖలో 'సంచార గ్రంథాలయం' తిరుగుతోంది. వందల పుస్తకాలతో నడుస్తున్న ఈ వాహనాన్ని రోజూ ఉదయం ఒకచోట, సాయంత్రం మరొకచోట అందుబాటులో ఉంచుతారు. సమీప బాలలు ఇందులో కూర్చొని పుస్తకాలు చదువుకోవచ్చు. డబ్ల్యూఎన్ఎస్ కేర్ ఫౌండేషన్, పాల్వీ ఎడ్యుకేషన్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధులతో ఈ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నామని ఇన్‌ఛార్జి బొబ్బిలి శ్రీను తెలిపారు. శనివారం ఫిషింగ్ హార్బర్ ప్రాంతానికి ఈ వాహనం రాగా చిన్నారులు ఎంచక్కా లోపలికి వెళ్లి చదువుకున్నారు. – ఈనాడు, విశాఖపట్నం

ఐయామ్ ద కింగ్‌కోబ్రా!



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం మావుడి కొత్తవలసలో శనివారం కింగ్ కోబ్రా హల్‌చల్ చేసింది. 12 అడుగులున్న ఆ పామును చూసి గ్రామస్థులు పరుగులు తీశారు. అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని దానిని చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం అడవిలో విడిచిపెట్టారు. – న్యూస్‌టుడే, సాలూరు, గ్రామీణం

సంద్రంలో... మన జెండా శిఖరంపై..



సముద్ర గర్భంలో భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి అండమాన్ నికోబార్ యంత్రాంగం గిన్నిస్ రికార్డు సాధించింది. స్వరాజ్ దీవిలోని రాధానగర్ బీచ్ శనివారం దీనికి వేదికైంది. 60:40 మీటర్ల త్రివర్ణ పతకాన్ని నౌకాదళ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది కలిసి విజయవంతంగా సముద్ర నీటి అడుగున ఆవిష్కరించాయి. గజ ఈతగాళ్లు కూడా దీనిలో పాల్గొన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు దీన్ని నమోదుచేసి, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ డి.కె.జోషికి ధ్రువపత్రం అందజేశారు. ఈ ఘనత ఇక్కడ అభివృద్ధి చెందుతున్న సాహస పర్యాటకానికి దోహదపడుతుందని జోషి పేర్కొన్నారు. ఇదే దీవిలో ఆదివారం మరో గిన్నిస్ రికార్డు కోసం అండమాన్ యంత్రాంగం ప్రయత్నించనుంది. మనుషులతో అత్యంత ఎత్తైన పిరమిడ్‌లాంటిది ఏర్పాటు చేయనుంది. – శ్రీ విజయపురం



పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన మహిపాల్‌రెడ్డి, 15 ఏళ్ల తన కుమారుడు వివేకానందరెడ్డితో కలిసి ఆస్ట్రేలియాలోని అత్యున్నత శిఖరం మౌంట్ కోసియస్కో (2,228 మీటర్లు)ను అధిరోహించారు. ఏప్రిల్ 30న ప్రయాణం ప్రారంభించి మే 2 (శనివారం) సాయంత్రం 6.30 గంటలకు శిఖరాన్ని చేరుకొని జాతీయ జెండా ఎగురవేశారు. గతంలో వీరు యూరప్‌లోని అత్యున్నత శిఖరం మౌంట్ ఎల్‌బ్రస్‌ను అధిరోహించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలనే నినాదంతో పర్వతారోహణ చేస్తున్నట్లు మహిపాల్‌రెడ్డి తెలిపారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడా అధికారి సురేష్ వీరిని అభినందించారు. –న్యూస్‌టుడే, కమాన్‌పూర్

సోయాలో చక్కటి ప్రొటీన్-క్యాలరీ నిష్పత్తి



వంద గ్రాముల ఉడికించిన సోయా(అంటే సుమారు 25-30 గ్రాముల డ్రై సోయా చంక్స్)లో 100-110 గ్రాముల క్యాలరీలు, 15-18 గ్రాముల ప్రొటీన్ ఉంటాయి. ఇది చక్కటి ప్రొటీన్-క్యాలరీ నిష్పత్తి. వీటిలో ఉండే ఐసోఫ్లేవోన్స్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

– మన్సాఫా బేపారి, వైద్యురాలు



జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ఇన్‌కాయిస్ డైరెక్టర్ బాలకృష్ణన్ నాయర్

ఇన్‌కాయిస్‌కు సుభాష్ చంద్రబోస్ ఆపదా ప్రబంధన్ పురస్కారం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విపత్తు నిర్వహణ, సముద్ర ప్రమాద హెచ్చరిక సేవల్లో విశేషంగా కృషి చేసిన హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)కు ప్రతిష్ఠాత్మక 'సుభాష్ చంద్రబోస్ ఆపదా ప్రబంధన్ పురస్కార్-2025' అవార్డు దక్కింది. దిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఇన్‌కాయిస్ డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణన్ నాయర్ అందుకున్నారు.

భాజపా 'నారీ వందనం' ముసుగు తొలగిపోయింది: రాహుల్ గాంధీ

దిల్లీ: ఎంపీ గెనిబెన్ ఠాకూర్‌పై గుజరాత్ రాష్ట్ర భాజపా అధ్యక్షుడు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. నారీమణులకు వందనాలంటూ ప్రకటనలు గుప్పించే భాజపా ముసుగు తొలగిపోయి, మహిళా వ్యతిరేక, మనువాద దృక్పథం బహిర్గతమైందని సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. '30 ఏళ్ల తర్వాత కాంగ్రెస్ ఎంపీ చీర కొంగు నుంచి జిల్లా పంచాయతీని విడిపించుకోగలిగాం' అంటూ భాజపా అధ్యక్షుడు జగదీశ్ విశ్వకర్ బనస్కాంఠలో గత గురువారం చేసిన వ్యాఖ్యలకు స్పందనగా రాహుల్ ఈ ప్రకటన వెలువరించారు.

పన్నెండు జిల్లాల్లో నిప్పులు కక్కిన సూరీడు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో 12 జిల్లాలపై శనివారం సూరీడు నిప్పులు కక్కాడు. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం ఠారెత్తారు. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మెండోరాలో 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ జిల్లా అనుముల హాలియా, నిర్మల్ జిల్లా ఖానాపూర్, సిద్దిపేట జిల్లా తొగుట మండలాల్లో 45.9, ఆదిలాబాద్ అర్బన్, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లలో 45.8, కామారెడ్డి జిల్లా బాన్సువాడ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలలో 45.7, జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో 45.6, సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో 45.5, ఖమ్మం జిల్లా బోనకల్లులో 45.2, మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో 45.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. మిగిలిన జిల్లాల్లో 42.6 నుంచి 44.6 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.

పంట మార్పిడి అవశ్యం... పాటించాలి పకడ్బందీ వ్యూహం!

- ఐదేళ్లలో దశలవారీగా 25 లక్షల ఎకరాలు లక్ష్యం
- పప్పులు, నూనెగింజలు, ఉద్యానపంటలకు బోనస్
- తెలంగాణ ప్రభుత్వానికి అగ్రివర్సిటీ నివేదిక

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో వ్యవసాయాన్ని సుసంపన్నం చేయడానికి ఐదేళ్లలో 25 లక్షల ఎకరాల పంట మార్పిడి జరగాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దానికోసం క్రమబద్ధమైన ఆర్థిక ప్రోత్సాహకాలతో, సంస్థాగత మద్దతు ద్వారా మార్కెట్ ఆధారిత వ్యూహం అవలంబించాలని సిఫార్సు చేసింది. రాష్ట్రంలో పంటల మార్పిడికి కొత్త విధానం చేపట్టాలని భావిస్తున్న నేపథ్యంలో దీనికి అవసరమైన నివేదికను ఇవ్వాలని ప్రభుత్వం అగ్రివర్సిటీని ఆదేశించింది. ఈ మేరకు అగ్రివర్సిటీ వైస్‌ఛాన్సలర్ అల్దాస్ జానయ్య, సుస్థిర వ్యవసాయ కేంద్రం వ్యవస్థాపక సంచాలకుడు సమరేందు మహంతి, వ్యవసాయ ఆర్థిక విభాగం సహాయ ప్రొఫెసర్ డీఏ రజనీదేవిల బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న విధానాలను అధ్యయనం చేసి నివేదికను రూపొందించింది. ఈ నెల నాలుగో తేదీన జరిగే మంత్రిమండలి సమావేశంలో దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.



క్రమబద్ధమైన వ్యూహాలతో..: తెలంగాణలో సాగునీటి వనరుల లభ్యత, భూగర్భజలాల పెరుగుదల, ధరల ప్రోత్సాహకాలు, ప్రభుత్వ పంట సేకరణ విధానాల కారణంగా వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. కానీ ఇది పంటల సరళిలో తీవ్ర అసమతౌల్యతకు దారి తీసింది. గత దశాబ్దంలో 8 లక్షల ఎకరాల పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు నుంచి రైతులు వరి వైపు మళ్లారు. ఏక పంట విధానంతో నేల సారం క్షీణించడం, వాతావరణ, మార్కెట్ సమస్యలతో పాటు సేకరణకు భారీగా ఆర్థిక వ్యయం, భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పంట మార్పిడి అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. క్రమబద్ధమైన ప్రోత్సాహకాలతో మార్కెట్ ఆధారిత వైవిధ్యీకరణ వ్యూహం అనుసరించాలని చెబుతున్నారు. వాళ్లు చేసిన సూచనలివి..

- వ్యవసాయ-వాతావరణ అనుకూలత, నీటి సామర్థ్యం, మార్కెట్ డిమాండ్ ఆధారంగా పంటల ఎంపిక జరపాలి.
- కొన్ని జిల్లాల్లో సమూహాలను (క్లస్టర్లు) ఏర్పాటు చేయాలి. మొదటి ఏడాది ఐదు లక్షల ఎకరాలు, రెండో ఏడాది పది, మూడో సంవత్సరం 15, నాలుగో ఏడాది 20, ఐదో సంవత్సరం 25 లక్షల ఎకరాల్లో పంటలు వేయించాలి.
- పప్పు దినుసులు, నూనెగింజలు, చిరుధాన్యాలు, ఉద్యాన పంటలకు పంట మార్పిడి చేసే రైతులకు నగదు బదిలీ ద్వారా ఎకరాకి రూ.8 వేల ప్రోత్సాహకం అందించాలి. రిమోట్ సెన్సింగ్ క్షేత్రస్థాయి ధ్రువీకరణ తర్వాతే ఈ చెల్లింపులు జరపాలి.
- పంటల సాగుకు వరికి మించి ఆర్థిక భారం పడకుండా నివారించడం, మార్కెట్ ధరల స్థిరత్వం, సేకరణకు భరోసా, ఉత్పత్తుల శుద్ధి, విలువ ఆధారిత వ్యవస్థల అభివృద్ధి జరగాలి.

యోగా.. మానవాళికి ఆరోగ్య కానుక: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నందిగామ, న్యూస్‌టుడే: యోగా యావత్తు మానవాళికి భారత్ అందించిన అమూల్యమైన ఆరోగ్య కానుక అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో ఆయుష్ మంత్రిత్వ శాఖ, మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ సహకారంతో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 50 రోజుల కౌంట్‌డౌన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్, ఎంపీ డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కిషన్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దాదాపు ఏడు వేల మంది అభ్యాసకులు యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశ జీవన విధానం, సంస్కృతి, ప్రాచీన విద్యను ప్రపంచానికి బలంగా వినిపించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమలేష్ డి పటేల్‌తో కలిసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2026 పుస్తకాన్ని ఆయన విడుదల చేశారు.



యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న కిషన్‌రెడ్డి

ఎప్‌సెట్ అగ్రికల్చర్‌కు సీనియర్ విద్యార్థుల పోటీ

- 25 శాతం మంది 2020-2025 మధ్య ఇంటర్ పాసైన వారే
- వారిలో అధిక శాతం నీట్ అభ్యర్థులే
- రేపటి నుంచి పరీక్షలు.. పూర్తికాగానే కంప్యూటర్‌పై మార్కులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలకు గతంలో ఇంటర్‌మీడియట్ పాసై.. మెడికల్ సీట్లే లక్ష్యంగా సన్నద్ధమవుతున్న వారు భారీ సంఖ్యలో పోటీపడుతున్నారు. ఈనెల 4 నుంచి పరీక్షలు ప్రారంభమవుతుండగా.. ఈసారి మొత్తం 90,958 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో సీనియర్ విద్యార్థులు 22,999 మంది ఉండటం గమనార్హం. అంటే 25 శాతానికిపైగా సీనియర్లే ఉన్నారు. నీట్‌కు దీన్ని నమూనా పరీక్షగా భావించి.. దరఖాస్తు చేసుకుంటున్నారు. కాకపోతే ఈసారి నీట్ ఒక రోజు ముందుగా జరుగుతున్నందున వారి హాజరు శాతం కొంత తగ్గవచ్చని భావిస్తున్నారు. సీనియర్లలో అత్యధికంగా 2025, 2024లో ఇంటర్ పాసైన వారే ఉన్నారు. అంటే ఎంబీబీఎస్ సీటు లక్ష్యంగా ఇంటర్ పూర్తయిన తర్వాత ఎక్కువ మంది రెండేళ్లపాటు వేచి చూస్తున్నారని స్పష్టమవుతోంది. ఆ తర్వాత ఆ సీటు రాకుంటే నీట్ ద్వారా ఏది వస్తే దాంట్లో చేరటం లేదా ఎప్‌సెట్ అగ్రికల్చర్ ర్యాంకుతో బీఎస్సీ అగ్రికల్చర్, బీఫార్మసీ తదితర కోర్సుల్లో సీట్లు పొందుతున్నారు.

గంటన్నర ముందుగా అనుమతి...

ఈనెల 4న ఉదయం(9 నుంచి 12 గంటల వరకు), మధ్యాహ్నం(3 నుంచి 6 వరకు), 5న ఉదయం షిఫ్ట్‌లో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 90,958 మంది కోసం 106 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్షకు 7.30 గంటలు, మధ్యాహ్నం పరీక్షకు 1.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభమయ్యాక ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. ఏదైనా సమస్యతో కంప్యూటర్ పనిచేయకపోతే... ఇన్విజిలేటర్‌కు చెప్పాలి. సమస్య వెంటనే పరిష్కరించలేకపోతే మరో కంప్యూటర్‌పై పరీక్ష రాయడానికి అనుమతిస్తారు. కోల్పోయిన సమయాన్ని ఇస్తారు.

వెంటనే మార్కులు.. వెబ్‌సైట్‌లో ర్యాంకు

ఈసారి పరీక్ష పూర్తి కాగానే.. ప్రాథమిక కీ ఆధారంగా ఎన్ని మార్కులు వస్తాయో కంప్యూటర్‌పై ప్రత్యక్షమవుతుందని ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య కె.విజయకుమార్‌రెడ్డి చెప్పారు. ఆ మార్కులకు 2024, 2025లో ఎంత ర్యాంకు వచ్చిందో(ఉదాహరణకు 30 వేల నుంచి 40 వేల మధ్యలో) తెలుసుకోవచ్చని, ఆ వివరాలను ఎప్‌సెట్ వెబ్‌సైట్లో ఉంచినట్లు ఆయన తెలిపారు.

సీనియర్ విద్యార్థుల దరఖాస్తులు ఇలా..

ఇంటర్ పాసైన సంవత్సరం	దరఖాస్తు చేసిన వారు
2025	14,653
2024	4,980
2023	2,194
2022	728
2021	318
2020	126
మొత్తం	22,999

ప్రేమ జంటను బెదిరించి బాలికపై అత్యాచారం

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రేమ జంటను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ గ్రామీణ సీఐ గాంధీనాయక్ కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలానికి చెందిన యువకుడు, బాలిక(17) మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల పరిధిలోని పిల్లిగుండు తండా వద్ద ఉన్న అటవీ ప్రాంతానికి శుక్రవారం వచ్చారు. వీరు అటవీ ప్రాంతంలోకి వెళ్లగానే అక్కడ కూలి పనులు చేస్తున్న అశోక్‌కుమార్(26), లక్ష్మణ్(27) గమనించారు. కొద్దిసేపటి తర్వాత వారిని పట్టుకొని బెదిరించారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ యువకుడు తన వద్ద డబ్బులు లేవని చెప్పినా వినలేదు. బెదిరించడంతో తన స్నేహితుడికి ఫోన్ చేసి రూ.6,500 నిందితులకు ఫోన్‌పే చేయించాడు. తర్వాత యువకుడి ముందే బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని బాధితురాలు తల్లికి చెప్పగా ఆమె హన్వాడ పోలీసులను ఆశ్రయించడంతో నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పిండం అభివృద్ధిలో రహస్యాల ఛేదన!

కీలకపాత్ర పోషించే జన్యువును గుర్తించిన సీసీఎంబీ పరిశోధన

ఈనాడు, హైదరాబాద్: జీవుల పెరుగుదల, పిండం అభివృద్ధి వెనక ఉన్న రహస్యాలను ఛేదించడంలో శాస్త్రవేత్తలు మరో ముందడుగు వేశారు. క్షీరదాలలో కణాల కదలికలను నియంత్రించే ర్యాప్‌జెఎఫ్1 అనే జన్యువుపై సీసీఎంబీ శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. జీబ్రా చేపలపై నిర్వహించిన ప్రయోగం ద్వారా మెదడు, వెన్నెముక నిర్మాణంలో ఈ జన్యువు కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు గుర్తించారు. మానవ జన్యువులతో పోలిక ఉండే జీబ్రా చేపల్లో ర్యాప్‌జెఎఫ్1ఏ, ర్యాప్‌జెఎఫ్1బీ అనే రెండు రకాల జన్యువులను విశ్లేషించారు. ర్యాప్‌జెఎఫ్1బీ జన్యువును తొలగించి పరిశీలించగా పిండం పెరుగుదలతో మార్పులు గమనించారు. చేప పిల్లల్లో మెదడు ఎదుగుదల సరిగ్గా లేకపోవడం, కణజాల నిర్మాణంలో లోపాలు ఏర్పడ్డాయి. కణాల పెరుగుదలలో అంతరాయం ఏర్పడి... ముఖం, తల నిర్మాణంపై ప్రభావం చూపింది. ఈ జన్యువు లేకపోవడంతో కణ విభజన సమయంలో క్రోమోజోమ్‌ల అమరిక సైతం దెబ్బతింది. ఈ పరిశోధన ఫలితాలు భవిష్యత్తులో మానవులలో తలెత్తే పురిటి లోపాలకు చికిత్సను కనుగొనడానికి ఎంతో దోహదపడతాయని పరిశోధన బృందం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ వివరాలు తాజాగా స్ప్రింజర్ నేచర్ లింక్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.



పైపులు.. హెచ్చరిస్తున్న ప్రమాదాలు!

చిత్రంలో కనిపిస్తున్న ఇలాంటి పైపులే రాజధాని పరిధిలో ఇటీవల మూడు సార్లు అగ్నికి బూడిదయ్యాయి. ఆ ఘటనల తర్వాత కూడా గుత్తేదారు సంస్థలు అప్రమత్తం కావడం లేదు. హైకోర్టు సమీపంలో వేసిన పైపుల చుట్టూ ఎండిన కంపచెట్లు, పొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పోగయ్యాయి. ఏ మాత్రం నిప్పురవ్వ పడినా వెంటనే అగ్గి రాజుకునే ప్రమాదం ఉంది. పైపుల భద్రతకు చుట్టూ కంచె వేయలేదు. సీసీ కెమెరా నిఘా కూడా లేదు. ప్రమాదం జరగకముందే మేల్కొనాలని స్థానికులు కోరుతున్నారు. – ఈనాడు, అమరావతి

ఈనాడు సినిమా

బ్లాక్ ఫారెస్ట్‌లో..
మహేశ్ ట్రెక్కింగ్ శిక్షణ

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతోన్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఇది ఇటీవలే ఓ కీలక షెడ్యూల్ పూర్తి చేసుకోగా.. ఆ వెంటనే మహేశ్ జర్మనీకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన ఎప్పటిలాగే వేసవి విహారయాత్రకి వెళ్లారని అంతా భావించారు. కానీ, తాజాగా ఆయన నెట్టింట పంచుకున్న ఫొటోలతో.. ప్రస్తుతం తను 'వారణాసి' కోసం ప్రత్యేక శిక్షణ తీసుకునేందుకు అక్కడికి వెళ్లినట్లు అర్థమవుతోంది. మహేశ్ ప్రస్తుతం జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్‌లో ఉన్నారు. అక్కడ ఆయన ఫిట్‌నెస్, వెల్‌నెస్ నిపుణులు డాక్టర్ హ్యారీ కోనిగ్ పర్యవేక్షణలో ట్రెక్కింగ్ ట్రైనింగ్ తీసుకుంటున్నట్లు తెలియజేశారు. దీంతో ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ప్రపంచంతో పాటు కాలాన్ని చుట్టేసే సాహసికుడి కథతో ఎపిక్ యాక్షన్ అడ్వెంచర్ సినిమాగా ఇది ముస్తాబవుతోంది. దీంట్లో ట్రెక్కింగ్‌తో ముడిపడిన యాక్షన్ ఘట్టాలు చాలానే ఉండనున్నట్లు గతంలో విడుదలైన ప్రచార చిత్రంతోనే స్పష్టత వచ్చింది. దాని కోసమే ఇప్పుడు మహేశ్ ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో ఆయన రుద్రగా, శ్రీరాముడిగా రెండు భిన్నమైన పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్ర కొత్త షెడ్యూల్ తిరిగి జూన్‌లో మొదలయ్యే అవకాశముంది. ఇక ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న థియేటర్లలోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రానికి ఎంఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. కేఎల్ నారాయణ, ఎస్ ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు.


మహేశ్ బాబు

రామ్‌చరణ్ ఆ మాటే పెద్ద ప్రశంస

- లావణ్య

'సతీ లీలావతి'గా సినీ ప్రియుల్ని అలరించనుంది నటి లావణ్య త్రిపాఠి. ఆమె టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని తాతినేని సత్య తెరకెక్కించారు. నాగమోహన్ నిర్మాత. దేవ్ మోహన్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 8న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే కథానాయకుడు రామ్‌చరణ్ శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ.. ట్రైలర్ విడుదల చేసిన తన బావ రామ్‌చరణ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్పందన గురించి చెబుతూ.. "ట్రైలర్ బాగుందన్నారు. నేను కామెడీ బాగా పండించాననడం పెద్ద ప్రశంస" అంటూ సంతోషం వ్యక్తం చేశారు. దర్శకుడు సత్య తాతినేని మాట్లాడుతూ.. "ఇది చాలా మంచి సినిమా. అందరూ థియేటర్‌కి వచ్చి దీన్ని చూసి, ఆదరించాల"ని కోరారు. "ఈ సినిమాలో నేను పోషించిన పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ చిత్రం ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది" అన్నారు దేవ్ మోహన్. ఈ కార్యక్రమంలో నాగ మోహన్, జీవన్ బొటిమల, అభినయ శ్రీనివాస్, సప్తగిరి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.


దేవ్ మోహన్, లావణ్య

సొంతింటికి తిరిగొచ్చినట్లుంది!

డ్రగ్స్ మాఫియాను కట్టడి చేసేందుకు పోలీసు ఆఫీసర్‌గా రంగంలోకి దిగబోతుంది కథానాయిక రాశీ ఖన్నా. ఇదంతా ఆమె ప్రధాన పాత్రలో నటించిన వెబ్‌సిరీస్ 'లుక్కే' గురించే. హిమాంక్ గౌర్ తీర్చిదిద్దిన ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో ఈ నెల 8న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాశి.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. "ఇందులో గుర్బానీ అనే పోలీసు అధికారిణిగా కనిపిస్తా. ఈ పాత్ర పోషించడం వల్ల నాకు సొంత ఇంటికి తిరిగి వచ్చిన అనుభూతిని ఇస్తుంది. నేను చాలా భాషల్లో పని చేశాను. కానీ పంజాబీయే నా అస్తిత్వం. నేను పోషించిన పాత్ర కూడా పంజాబీనే. ఆ పాత్రలో నటించడానికి ఇదీ ఒక ప్రత్యేక కారణమే. ఆమెలో ఎన్నో విషయాలు దాగి ఉంటాయి. కథకు కీలకంగా గుర్బానీ పాత్ర ఉంటుంది. పూర్తి భిన్నమైన కథాంశంతో రూపొందిన 'లుక్కే'లో భాగం కావడం మరింత ఉత్సాహంగా అనిపిస్తుంద"ని చెప్పుకొచ్చింది రాశి. పంజాబ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్‌లో పాలక్ తివారీ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు.


రాశీ ఖన్నా

మానవ సృజనాత్మకతకే పెద్దపీట

- ఏఐ వినియోగంపై ఆస్కార్ అకాడమీ స్పష్టీకరణ
- కొత్త నియమాల ప్రకటన



ఆస్కార్ అవార్డుల నిర్వహణ కమిటీ 2027 అకాడమీ పురస్కారాల కోసం కొత్త నియమాలను ప్రకటించింది. ఇందులో మొట్టమొదటి సారిగా కృత్రిమమేధ (ఏఐ) వినియోగాన్ని ప్రస్తావించింది. నటీనటుల ప్రదర్శన, రచనల్లో (స్క్రిప్టులు) విధి విధానాలను స్పష్టంగా పేర్కొంది. ఏఐ వాడకాన్ని పూర్తిగా నిషేధించకపోయినా, మానవ సృజనాత్మకత ప్రాధాన్యాన్ని నొక్కిచెబుతూ పలు కేటగిరీల్లో విధి విధానాలను వెల్లడించింది. గతంలో తీవ్ర విమర్శలకు గురైన అంతర్జాతీయ చిత్ర విభాగంలోనూ గణనీయమైన మార్పులు చేశారు. కేన్స్, వెనిస్, టొరంటో లాంటి ప్రతిష్ఠాత్మక చలన చిత్రోత్సవాల్లో ఉత్తమ అవార్డులు గెలుచుకున్న చిత్రాలను సైతం పరిగణనలోకి తీసుకునేలా అర్హత పరిధిని విస్తరించారు. ఎప్పటిలాగానే తాము ఈ ఏడాది కూడా ప్రగతిశీలమైన మార్పులు చేశామని భావిస్తున్నట్లు ఫిల్మ్ అకాడమీ సీఈవో బిల్ క్రామర్ మీడియాకు తెలిపారు. అకాడమీ పరిధి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నందున అంతర్జాతీయ చిత్రాలను ఆస్కార్ వేదికపైకి ఆహ్వానించడంపై సహజంగానే తాము పునఃపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త నియమాల ప్రకారం ఆస్కార్ నామినేషనుకు ఏఐ సాధనాలు సహాయపడవు, హాని చేయబోవని స్పష్టం చేశారు. అవసరమైతే ఏఐ వినియోగం గురించి చిత్ర నిర్మాణ బృందం నుంచి మరింత సమాచారం కోరే హక్కు తమకు ఉంటుందని చెప్పారు. సృజనాత్మక ప్రక్రియలో మానవులే కేంద్రంగా ఉండాలన్నది తమ ప్రధాన ఉద్దేశమని అకాడమీ అధ్యక్షుడు లినెట్ హోవెల్ టేలర్ తెలిపారు. రైటింగ్ (స్క్రీన్‌ప్లే) విభాగంలో రచయితలు రాసిన కథలను మాత్రమే పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపింది. ఏఐ సహాయంతో రాసిన వాటిని అనుమతించబోమని వెల్లడించింది. యాక్టింగ్‌లో కూడా కృత్రిమ మేధతో సృష్టించిన సీన్స్, మార్పులు చేసిన ప్రదర్శనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది. నటీనటులు నేరుగా చేసిన ప్రదర్శనలకే అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒకే నటుడు ఒకే జాబితాలో రెండు వేరువేరు సినిమాలకు నామినేట్ అయ్యే అవకాశాన్ని అకాడమీ కల్పించింది. అంతర్జాతీయ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో కూడా అకాడమీ కీలక మార్పులు చేసింది. ఒక దేశం నుంచి ఇప్పుడు ఒకటి కంటే ఎక్కువ సినిమాలు నామినేషన్లకు అర్హత సాధించొచ్చు. మరోవైపు అంతర్జాతీయ సినిమా కేటగిరీలో ట్రోఫీపై దేశం పేరుతో పాటు దర్శకుడి పేరును కూడా ముద్రించనున్నారు. వచ్చే ఏడాది ఆస్కార్ అవార్డుల వేడుకలో ఈ నిబంధనలు అమలుకానున్నాయి. 99వ ఆస్కార్ అవార్డుల వేడుక మార్చి 14న లాస్ ఏంజెలెస్‌లో జరగనుంది.

ఆస్కార్ ప్రతిమను ఆయుధం అనుకుంటే ఏమైంది?

రష్యాకు చెందిన ఓ ఆస్కార్ విజేతకు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ఆస్కార్ అవార్డును ఆయుధంగా భావించిన విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది.. దాన్ని ఆయనతోపాటు విమానం లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతించలేదు. రష్యన్ ఫిల్మ్‌మేకర్ పాషా తాలాన్కిన్.. మిస్టర్ నో బాడీ ఎగెనెస్ట్ పుతిన్ అనే డాక్యుమెంటరీకి కో-డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది ఈ డాక్యుమెంటరీకి ఆస్కార్ గెలుచుకున్నారు. ఇటీవల ఆయన లుఫ్తాన్సా విమానంలో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లేందుకుగానూ న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే, ఆయన ఆస్కార్ విగ్రహాన్ని ఆయుధంగా భావించి దాన్ని విమానంలోకి తనవెంట తీసుకెళ్లేందుకు సెక్యూరిటీ అనుమతించలేదు. దీంతో ఆ అవార్డును ఓ డబ్బాలో పెట్టి.. కార్గోలో ఎక్కించారు. అయితే, ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకున్న అనంతరం ఆ డబ్బా కనిపించకపోవడంతో ఆయన హతాశుడయ్యారు. తాను ఈ పురస్కారంతో అనేకసార్లు విమానంలో ప్రయాణించానని.. ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని మీడియా ఎదుట వాపోయారు. అయితే రెండు రోజులకే ఆ అవార్డు దొరికిందని లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. దాన్ని వీలైనంత త్వరగా ఆయనకు అప్పగిస్తామని తెలిపింది. ఈ ఘటనపై ఆయనకు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించింది. ఏం జరిగిందో తెలుసుకునేందుకు అంతర్గత విచారణను చేపట్టినట్లు పేర్కొంది.

ఆ సమస్యకు పరిష్కారం అప్పుడే రావొచ్చు!


చెర్రీ, సత్య

"ఇంతవరకు ఎవరూ టచ్ చేయని సరికొత్త కథాలోచనతో సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నా. 'జెట్లీ'తో అది సాధ్యమైంది" అన్నారు నిర్మాత చెర్రీ (చిరంజీవి). ఈ సినిమాని తొలి రోజు కొన్ని మల్టీప్లెక్స్‌ల్లో ప్రదర్శించలేదని.. తాజాగా దానిపై వాళ్లతో చర్చించగా నేటి నుంచి ప్రదర్శనలకు అంగీకరించారని తెలియజేశారు. సత్య రియా సింఘా జంటగా నటించిన ఈ సినిమాని రితేశ్ రానా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. చెర్రీతో కలిసి హేమలత పెద్దమల్లు నిర్మించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో రోరింగ్ టేకాఫ్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చెర్రీ నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య నున్న పర్సంటేజీ విధానం సమస్యపై స్పందించారు. ఈ నేపథ్యంలోనే "పెద్ది' విడుదల నాటికి ఈ సమస్య పరిష్కారమవుతుందా" అనే ప్రశ్న ఎదురైంది. దీనిపై చెర్రీ స్పందిస్తూ.. "పర్సంటేజీ విధానంలో సినిమా ప్రదర్శనలు ఉండాలన్నది సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల డిమాండ్. అలా చేస్తే తమకు ఇబ్బందని నిర్మాతలు చెబుతున్నారు. మే 1 నుంచి పర్సెంటేజీ పద్ధతి అయితేనే.. థియేటర్లు ఇస్తామని ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారు. దీనిపై చర్చించాలని ఫిల్మ్ ఛాంబర్ ప్లాన్ చేసినా సాధ్యపడలేదు. మే 8న కీలక సమావేశం ఉంటుంది. అప్పుడే పరిష్కారం లభిస్తుందనుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య, రితేశ్ రానా, అజయ్, గుండు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిర్ణయం ఓ పరీక్షే!

అగ్రహీరో షారుక్ ఖాన్ తన రెడ్‌చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మించిన చిత్రం 'కర్తవ్య'. సైఫ్ అలీఖాన్ కథానాయకుడిగా నటించారు. దీనికి 'భక్షక్' ఫేమ్ పుల్కిత్ దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను పంచుకున్నారు షారుక్. "కర్తవ్యమనే ఈ చిక్కుదారిలో ప్రతి నిర్ణయం ఓ పరీక్షే అవుతుంది. ఈ నెల 15న సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యను జోడించారు. ఓ నిజాయతీ గల పోలీసు అధికారి చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. కుటుంబంలోని సమస్యల్ని, ఉద్యోగంలో తన బాధ్యతలకు అడ్డంగా వస్తున్న శత్రువుల్ని ఆయనెలా ఎదుర్కొన్నాడనేదే ఈ చిత్ర కథాంశం. ఇందులో పోలీసు అధికారిగా కనిపించనున్నారు సైఫ్. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో రసికా దుగల్, సంజయ్ మిశ్రా, జాకీర్ హుస్సేన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.


సైఫ్ అలీఖాన్

"మనందరి జీవితాల్లో చూసిన అందమైన ప్రేమకథలతో రూపొందిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమే 'గోదారి గట్టుపైన'. ఇది తప్పకుండా ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది" అన్నారు దర్శకుడు సుభాష్ చంద్ర. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో సుమంత్ ప్రభాస్, నిధి ప్రదీప్ జంటగా నటించారు. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈ నెల 8న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు సుభాష్ చంద్ర.

తరాలు మారినా ప్రేమ భావోద్వేగం ఒకటే

"ప్రతి ఇంట్లో తండ్రి - కూతురు మధ్య ప్రేమ ఉంటుంది. అలాగే ఇద్దరు ప్రేమికుల మధ్య కూడా ప్రేమ ఉంటుంది. ఈ రెండు ప్రేమల్ని కలిపి ముక్కోణపు ప్రేమకథా చిత్రంగా దీన్ని రూపొందించా. ఈ సినిమాలో జగపతిబాబు పాత్రని నిజ జీవితంలో మా బాబాయిని స్ఫూర్తిగా తీసుకుని రాసుకున్నా. ఈ చిత్రంలో వాడిన బండి కూడా మా బాబాయ్‌దే. ప్రతి తండ్రీ తన కూతుర్ని తనకంటే మంచి వ్యక్తి చేతుల్లో పెట్టాలని అనుకుంటాడు. ఇది ఆయన ప్రేమలోని నిజం. అలాగే అబ్బాయి ప్రేమలోనూ ఓ నిజం ఉంటుంది. అలాంటి అంశాల్నే ఈ చిత్రంతో చెప్పబోతున్నాం. ఎన్ని తరాలు మారినా ప్రేమ ఎమోషన్ ఒకటే అన్నదే ఈ చిత్ర సారాంశం".

"ఈ సినిమాలో సుమంత్‌ది గోదావరి అబ్బాయి పాత్ర. దానికోసం ఆయన గోదారి యాసను నేర్చుకుని అద్భుతంగా పలికారు. ఈ కథే దీనికి తగ్గ నటుల్ని ఎంచుకుంది. దీంట్లో నిధి కళ్లతోనే అద్భుతమైన భావాల్ని పలికించింది. నాకు చిన్నప్పుడు 'ఎగిరే పావురం' సినిమా చూసినప్పటి నుంచి లైలా అంటే చాలా ఇష్టం. ఇందులో ఆమెని జగపతిబాబుకి జోడీగా చూపిస్తే ఆ కాంబో కొత్తగా ఉంటుందనిపించింది. ఆమెకి కథ వినిపిస్తే.. నచ్చి వెంటనే ఒప్పుకున్నారు. అలా ఆమె దాదాపు 20ఏళ్ల తర్వాత ఈ సినిమాతో తిరిగి తెలుగులో నటించారు".

"మాది రేలంగి. మా నాన్న బ్యాంక్ మేనేజర్. నాకు స్టీవెన్ స్పీల్‌బర్గ్ స్ఫూర్తి. చిన్నప్పుడు ఆయన 'జురాసిక్ పార్క్' సినిమాలు చూసి దర్శకత్వంపై ఆసక్తి పెరిగింది. ఆ ఇష్టంతోనే బీటెక్ చేస్తున్నప్పటి నుంచి లఘు చిత్రాలు రూపొందించడం మొదలు పెట్టా. అలా రాజ్‌తరుణ్‌తో చాలా షార్ట్ ఫిల్మ్స్ చేశా. గతంలో ఓ సినిమాని పూర్తి చేసినా.. అది విడుదలకు నోచుకోలేదు. ఇప్పుడు ఎట్టకేలకు ఈ 'గోదారి గట్టుపైన' సినిమాతో తొలిసారి దర్శకుడిగా తెరపైకి వస్తున్నా".


సుభాష్

దేవుళ్లంతా ఏకమై వచ్చినా.. అమ్మ అమ్మేగా

'వంద దేవుళ్లు' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు విజయ్ ఆంటోని. 'బిచ్చగాడు' విజయం తర్వాత ఆయన, దర్శకుడు శశి కలిసి చేసిన ఈ సినిమాని రామాంజనేయులు జవ్వాజి నిర్మించారు. శ్వాసిక, అజయ్, కావ్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ చిత్ర గీతాన్ని విడుదల చేశారు. "లోకంలోని దేవుళ్లంతా ఏకమై వచ్చేసినా.. అమ్మ అమ్మేగా" అంటూ సాగిన ఈ పాటకు బాలాజీ శ్రీరామ్ స్వరాలు సమకూర్చగా.. భాష్యశ్రీ సాహిత్యమందించారు. శ్రీకాంత్ హరిహరణ్ ఆలపించారు. ఈ గీతాన్ని తీర్చిదిద్దిన తీరును బట్టి.. సినిమాలో అమ్మ ఎమోషన్‌కు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అర్థమవుతోంది. వాస్తవ సంఘటనలతో అల్లుకున్న ఆసక్తికర కథతో ఈ చిత్రం రూపొందింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.


'వంద దేవుళ్లు'


యాక్షన్-హారర్ థ్రిల్లర్

"యాక్షన్‌తో పాటు హారర్‌అంశాల్ని మేళవించి రూపొందించిన థ్రిల్లర్ 'పోలీస్ కంప్లైంట్'" అన్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో వరలక్ష్మీ శరత్ కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు పోషించారు. బాలకృష్ణ మహారాణా నిర్మాత. రాగిణి ద్వివేది, కృష్ణసాయి, ఆదిత్య ఓం, రవిశంకర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా మే 22న రానుంది. ఈ నేపథ్యంలోనే దీంట్లో హీరో కృష్ణపై చేసిన ప్రత్యేక పాటను ఇటీవల విడుదల చేశారు.


వరలక్ష్మీ, నవీన్ చంద్ర

అనుపమ్ చిత్రం ఫ్లిక్కర్

ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్ తన 551వ చిత్రాన్ని ప్రకటించారు. 'ఫ్లిక్కర్' అనే టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్‌ని ఇన్‌స్టాలో పంచుకుంటూ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన సినీ ప్రస్థానం గురించి మాట్లాడుతూ.. "మిమ్మల్ని మీరు సవాలు చేసుకోకపోతే నెమ్మదిగా ఒకే పనిని మళ్లీ మళ్లీ చేయడం ప్రారంభిస్తారు" అని అన్నారు. ఈ సందర్భంగా నటుడిగా మాత్రమే కాకుండా ఒక వ్యక్తిగా కూడా తనను తాను తిరిగి నిర్మించుకునేందుకు ఈ చిత్రంతో కఠినమైన మార్గాన్ని ఎంచుకున్నానని తెలిపారు. అలానే ప్రస్తుతం ఈ సినిమా కథాంశాన్ని గోప్యంగా ఉంచినప్పటికీ విడుదల తర్వాత ప్రేక్షకులతోనే ఉండిపోయే చిత్రమిదని ధీమా వ్యక్తం చేశారు.


అనుపమ్ ఖేర్

సినీ ప్రయాణంలో హిట్ ఫ్లాప్‌లు రెండూ సహజం. పెద్ద పెద్ద స్టార్లకు కూడా వైఫల్యాలు ఎదురవుతుంటాయని అంటున్నారు బాలీవుడ్ యువకథానాయకుడు అహాన్ పాండే. 'సైయారా'తో తొలి అడుగులోనే మంచి క్రేజ్‌ను సంపాదించుకున్న హీరో ఈయన. ప్రస్తుతం వరుస అవకాశాల్ని అందుకుంటూ.. వైవిధ్యమైన ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అహాన్.. 'సైయారా' సినిమా, వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు.

సైయారాని ఎవరూ చూడరేమో అనుకున్నాం!

"'సైయారా' షూటింగ్ సమయంలో మేము సినిమా తీస్తున్నట్లు మాకెప్పుడూ అనిపించలేదు. సెట్ సొంత ఇల్లులా అనిపించేది. నిజం చెప్పాలంటే కొత్త వాళ్లం కదా.. ఈ సినిమాను ఎవరూ చూడరేమో అని నేను, అనీత్ అనుకుంటూ ఉండేవాళ్లం. అందుకే ఈ సినిమా కోసం మా సర్వస్వం ఇచ్చేయాలి, వీలైనంత నిజాయతీగా ఉండాలని మాకు మేమే చెప్పుకున్నాం. ఒక్క వ్యక్తి థియేటర్‌కి వచ్చినా చాలు.. మేం మా పనిని సక్రమంగా నిర్వర్తించినట్లే అనుకున్నాం. కానీ ఊహించని ఫలితాన్ని ఇచ్చిందీ చిత్రం".

◆ "ఈ సినిమా విషయంలో అనీత్ పడ్డా నుంచి చాలా నేర్చుకున్నా. తనకు సినిమాకు సంబంధించిన అన్నింటిపై అవగాహన ఉంది. అందుకే ఆమెను సీనియర్ అని పిలిచేవాణ్ని. తనను వేర్వేరు ప్రార్థనా స్థలాలకు తీసుకెళ్లి చిత్రం కోసం ప్రార్థించాం. సినిమా హిట్టవ్వాలని కాదు.. కేవలం దీనికి పెట్టిన పెట్టుబడి తిరిగి రావాలని ప్రార్థించాం. కానీ ఈ సినిమా వసూళ్ల రికార్డులతో రెండు నెలల పాటు నేను పూర్తి షాక్‌లోనే ఉన్నా".

◆ "సినీరంగంలో నా ప్రయాణం ఎంతకాలం సాగుతుందో తెలియదు. కానీ నా లక్ష్యం ప్రపంచం ముందు నిజాయతీగా ఉండటమే. ప్రతి సినిమాతో నన్ను నేను మెరుగుపరుచుకుంటూ నా సర్వస్వాన్ని దానికే అంకితం చేయాలనుకుంటున్నా. పూర్తిగా నిజాయతీగా ఉండటం అంత సులభం కాదు.. కానీ నేను దాని కోసమే కష్టపడుతున్నా. ఎన్ని విమర్శలు వచ్చినా.. నాకు నేనుగా ఉండాలనుకుంటున్నా. నిజంగా నేను ఎవరో, నా వ్యక్తిత్వమేంటో ప్రేక్షకులకు చూపించాల్సిన బాధ్యత నాపై ఉందని గట్టిగా నమ్ముతున్నా".

"నా సినిమాల ద్వారా ప్రేక్షకులకు నిజంగా గుర్తుండిపోయే అనుభూతిని అందివ్వాలనుకుంటున్నా. 'సైయారా' సమయంలో ఓ వ్యక్తి ఈ చిత్రం వల్ల తమ వైవాహిక జీవితం మెరుగుపడిందని అన్నారు. మరొకరు తన భార్యతో ప్రవర్తించే విధానాన్ని మార్చిందీ చిత్రమని చెప్పారు. ఇలాంటి చిన్న చిన్న వ్యక్తిగత కథలు విన్నప్పుడే మేం పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కినట్లు అనిపిస్తుంది. ప్రస్తుతం నా జీవితంలో మారుతున్న పరిణామాలపై నా తల్లిదండ్రులు చాలా సంతోషంగా ఉన్నారు. నేను హీరో అవుతానని నమ్మిన ఏకైక వ్యక్తి మా అమ్మమ్మ స్నేహలతా పాండే".

నేను హీరో అవుతానని నమ్మింది


అహాన్ పాండే

ఈనాడు బిజినెస్ వారాంతం

కోటక్ మహీంద్రా బ్యాంక్ లాభంలో 10% వృద్ధి



ముంబయి: జనవరి- మార్చి త్రైమాసికానికి కోటక్ మహీంద్రా బ్యాంక్ ఏకీకృత ప్రాతిపదికన రూ.5,423 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.4,933 కోట్లతో పోలిస్తే లాభం 10 శాతం పెరిగింది. స్టాండలోన్ పద్ధతిలోనూ బ్యాంక్ నికర లాభం 13 శాతం పెరిగి రూ.4,027 కోట్లుగా నమోదైంది. కీలక వడ్డీ ఆదాయం రూ.7,284 కోట్ల నుంచి 8 శాతం పెరిగి రూ.7,876 కోట్లకు చేరింది. 2025 డిసెంబరు త్రైమాసికం చివరినాటికి 4.54 శాతంగా ఉన్న నికర వడ్డీ మార్జిన్.. జనవరి- మార్చి త్రైమాసికం ముగిసేనాటికి 4.67 శాతానికి పెరిగింది. 2026 మార్చి 31 నాటికి బ్యాంకు నికర రుణాలు 16 శాతం పెరిగి రూ.4.96 లక్షల కోట్లకు చేరాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.42 శాతం నుంచి 1.2 శాతానికి తగ్గింది. కేటాయింపులు కూడా రూ.909 కోట్ల నుంచి 43 శాతం తగ్గి రూ.516 కోట్లకు పరిమితమయ్యాయి.

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డిప్యూటీ గవర్నర్‌గా రోహిత్ జైన్‌ను ప్రభుత్వం నియమించింది. ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత డిప్యూటీ గవర్నర్ టి.రవి శంకర్‌కు పొడిగించిన పదవీ కాలం కూడా శనివారానికి పూర్తి కావడంతో ఆయన స్థానంలో రోహిత్‌ను నియమించింది. ఈ నెల 3 లేదా ఆయన చేరిన తేదీ నుంచి మూడేళ్ల పాటు డిప్యూటీ గవర్నర్‌గా కొనసాగేందుకు కేంద్ర మంత్రివర్గ నియామకాల కమిటీ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ప్రస్తుతం రోహిత్ జైన్ ఆర్‌బీఐలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆర్‌బీఐలో ఇప్పటికే స్వామినాథన్.జె., పూనమ్ గుప్తా, ఎస్.సి.ముర్ము డిప్యూటీ గవర్నర్లుగా ఉన్నారు. రవి శంకర్ 2021 సెప్టెంబరులో డిప్యూటీ గవర్నర్‌గా మూడేళ్ల కాలానికి నియమితులయ్యారు. 2024లో ఒక ఏడాది పదవీ కాలాన్ని పొడిగించగా, 2025లో మరోసారి పొడిగించారు.

తొలి డిజిటల్ లాకర్ శాఖను ప్రారంభించిన యాక్సిస్ బ్యాంక్

దిల్లీ: ప్రైవేట్ రంగ యాక్సిస్ బ్యాంక్ తన తొలి డిజిటల్ లాకర్ శాఖను ఇక్కడ ప్రారంభించింది. ఆధునాతన ఆటోమేషన్, అత్యుత్తమ భద్రత, అత్యాధునిక లాకర్ సేవల ద్వారా వినియోగదారుకు విభిన్న అనుభూతిని అందిస్తూ.. బ్యాంకింగ్ సేవలను మరింత సురక్షితంగా మార్చాలన్న ప్రయత్నంలో భాగమే తమ ఈ కొత్త శాఖ అని యాక్సిస్ బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. యాక్సిస్ బ్యాంక్ ఎండీ అమితాబ్ చౌధ్రి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు మునిష్ శార్దా సమక్షంలో ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు ఈ శాఖను ప్రారంభించారు. బహుళ అంచెల పర్యవేక్షణ, సెన్సార్ ఆధారిత రక్షణతో కూడిన సెంట్రల్ మానిటర్డ్ వాల్ట్ ఈ డిజిటల్ లాకర్ కలిగి ఉంటుందని యాక్సిస్ బ్యాంక్ తెలిపింది.

కోడి గుడ్డు

3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	530
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	593


విమాన ప్రయాణికులకు సులువుగా దేశీయ-అంతర్జాతీయ కనెక్టివిటీ

హబ్ అండ్ స్పోక్ మోడల్‌కు ఎస్‌ఓపీ జారీ

దేశీయ మార్గాల్లో.. అంతర్జాతీయ గమ్యస్థానాలకు విమాన ప్రయాణికుల రద్దీ శరవేగంగా పెరుగుతోంది. దేశంలో చిన్న నగరాలకూ ఉడాన్ కింద విమాన సేవలు అందుబాటులోకి రావడంతో, విదేశాలకు వెళ్లే వారికి మరింత సౌలభ్యంగా ఉంటోంది. దేశంలో 154 విమానాశ్రయాలు కార్యకలాపాలు సాగిస్తుండగా, ఇందులో 30 ఇంటర్నేషనల్ విమానాశ్రయాలు. గత ఆర్థిక సంవత్సరంలో దేశీయంగా 16.77 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని అంచనా. చిన్న నగరాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లేవారు, దేశంలోని ప్రధాన కేంద్రాలకు వెళ్లి, అక్కడ నుంచి ప్రయాణించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో దేశీయ గమ్యస్థానాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు.. విదేశాల నుంచి మనదేశంలోని చిన్న నగరాలకు వచ్చే విమాన ప్రయాణికులను సులువుగా చేరవేసేందుకు ఉపయోగపడే హబ్ అండ్ స్పోక్ నమూనా నిర్వహణకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను పౌర విమానయాన శాఖ జారీ చేసింది. జూన్ నుంచి ఈ నమూనాపై ట్రయల్‌ను ఎయిరిండియా ప్రారంభించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

ఏమిటిది?

స్పోక్ (దేశంలోని చిన్న) విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ గమ్యస్థానాలకు వెళ్లే ప్రయాణికులను ఒక హబ్ లేదా పెద్ద విమానాశ్రయం ద్వారా సులభతర పద్ధతిలో అనుసంధానించేదే ఈ హబ్ అండ్ స్పోక్(హెచ్ అండ్ ఎస్) మోడల్. వేర్వేరు చిన్న విమానాశ్రయాల నుంచి వచ్చే వారిని ఒకచోటకు చేర్చడం, వారికి కావాల్సిన కస్టమ్స్ - లగేజీ క్లియరెన్స్‌ల వంటివి అందించడం ద్వారా, దేశీయ విమానయాన మౌలిక వసతులను మరింత సమర్థంగా వినియోగించేందుకు ఈ విధానం దోహద పడనుంది.



ఏమిటి ప్రయోజనం

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఈ మోడల్ వల్ల ప్రయాణికుల బదిలీ సరళంగా జరుగుతుంది. దేశీయ-అంతర్జాతీయ సెక్టార్లలో నెట్‌వర్క్ అనుసంధానం మెరుగవుతుంది. టర్నరౌండ్ సమయం తగ్గుతుంది. ఈ మోడల్ వల్ల అనుసంధానం బలోపేతం అవడమే కాకుండా, విమానాశ్రయ మౌలిక వసతులను సమర్థంగా వినియోగించుకోవచ్చని ఎయిరిండియా సీఈఓ, ఎండీ క్యాంప్‌బెల్ విల్సన్ పేర్కొన్నారు.

వారణాసి నుంచి మొదలు?



హెచ్ అండ్ ఎస్ ట్రయల్‌ను జూన్ 1న వారణాసి విమానాశ్రయంలో ఎయిరిండియా ప్రారంభించొచ్చని తెలుస్తోంది. వారణాసి నుంచి దిల్లీకి, అక్కడి నుంచి లండన్‌కు ప్రయాణికులను చేరవేస్తారు. భారత్‌ను ఒక అంతర్జాతీయ ఏవియేషన్ హబ్‌గా మార్చాలన్న యత్నాల్లో ఇదీ ఒక భాగం. ఇందులో ఇమిగ్రేషన్ ప్రక్రియ నుంచి బ్యాగేజీ ట్రాన్స్‌ఫర్ వరకు సులభతర పద్ధతిలో జరిగేలా చూస్తారు. ఇమిగ్రేషన్, కస్టమ్స్ అనుమతులను ప్రారంభ, చివరి గమ్యస్థానాల్లో చేస్తారు. లగేజీని కూడా హబ్ విమానాశ్రయాలకు బదిలీ చేస్తారు. సంబంధిత వర్గాలతో చర్చించిన అనంతరమే హెచ్ అండ్ ఎస్ విమానాల నిర్వహణ నిమిత్తం ఎస్‌ఓపీని జారీ చేశారు.

డిజియాత్ర తప్పనిసరి

ఎస్‌ఓపీ కింద భారతీయ 'ఐ (అంతర్జాతీయ)' ప్రయాణికులకు డిజియాత్ర నమోదు తప్పనిసరి. హెచ్ అండ్ ఎస్ విమానాల్లో వెబ్ చెకిన్, ఇ-బోర్డింగ్ పాసుల జారీ (దేశీయ) డీ-ఐ (అంతర్జాతీయ) ప్రయాణికులకు అందుబాటులో ఉండదు. ఐ, డీలను అంతర్జాతీయ(ఐ), దేశీయ(డీ) రద్దీకి అనుగుణంగా సులభంగా గుర్తించుకునేందుకు తీసుకొచ్చారు.

● హెచ్ అండ్ ఎస్ విమానాశ్రయాల్లో నిర్దిష్ట నోడల్ ఆఫీసర్లను నియమించాల్సి ఉంటుంది. ప్రయాణికుల గుర్తింపు తనిఖీ ద్వారా ఇంటర్‌మిక్సింగ్ జరగకుండా వీళ్లు చూసుకుంటారు.

- ఈనాడు వాణిజ్య విభాగం

బీమా రంగంలోకి 100% ఎఫ్‌డీఐ

● ఎల్‌ఐసీలో 20 శాతానికే పరిమితి
● నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు హైదరాబాద్: భారతీయ బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డీఐ) అనుమతిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో విదేశీ కంపెనీలు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండానే పూర్తి స్థాయిలో పెట్టుబడులు పెట్టొచ్చు. భారీగా మూలధనాన్ని ఆకర్షించడం, పోటీని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌డీఐను నేరుగా (ఆటోమేటిక్) అనుమతించడం ద్వారా విదేశీ పెట్టుబడిదారులకు ఇకపై ప్రభుత్వ ముందస్తు అనుమతులతో పనిలేదు.

ప్రస్తుతం 74 శాతమే

ప్రస్తుతం బీమా సంస్థల్లో 74 శాతం వరకే ఎఫ్‌డీఐలకు అనుమతి ఉంది. ఇకపై విదేశీ సంస్థలు 100 శాతం పెట్టుబడితో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) అనుమతితో సొంతంగా భారత బీమా వ్యాపారంలోకి ప్రవేశించవచ్చు. ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓలో ఎవరో ఒకరు తప్పనిసరిగా భారతీయ పౌరుడై ఉండాలన్న నిబంధన ఉంది. ఈ విధానపరమైన మార్పులకు పార్లమెంటు డిసెంబర్ 2025లో 'సట్కా బీమా సబ్‌కే



రక్ష (బీమా చట్టాల సవరణ) బిల్లు-2025'ను ఆమోదించింది. ఈ బిల్లు ద్వారా 1938 నాటి బీమా చట్టం, 1956 నాటి ఎల్‌ఐసీ చట్టం, 1999 నాటి ఐఆర్‌డీఏఐ చట్టాలకు మార్పులు చేసింది. నిబంధనలను నవీకరించడం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడం, విదేశీ రీఇన్సూరర్లకు మూలధన అవసరాలను తగ్గించడం వంటివి ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపరచింది.

ఎల్‌ఐసీకి ప్రత్యేక మినహాయింపు

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులకు పూర్తిగా తలుపులు తెరుచుకున్నప్పటికీ, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసీ)కి మాత్రం ఒక ప్రత్యేకమైన నియంత్రణ హోదాను ప్రభుత్వం కొనసాగించింది. ఆటోమేటిక్ మార్గం ద్వారా ఎల్‌ఐసీలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 20 శాతానికే పరిమితం చేశారు. ఒక ప్రధాన ఆర్థిక సంస్థపై ప్రభుత్వ నియంత్రణను కొనసాగించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

✦ బీమా రంగం విస్తరణకు ఏటా రూ.40,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్ల వరకూ భారీ మూలధనం అవసరం అని అంచనా. తాజా 100% ఎఫ్‌డీఐ విధానం ద్వారా ఈ మూలధన అవసరాలు తీరనున్నాయి.

సవాళ్లూ ఉన్నాయి..

కొత్త విధానం మూలధనాన్ని తీసుకురావడంతోపాటు, పోటీని పెంచుతుంది. దీంతో కొన్ని సవాళ్లూ ఎదురుకానున్నాయి. బలమైన విదేశీ సంస్థల ప్రవేశంతో పోటీ తీవ్రమై, అన్ని సంస్థల లాభాల మార్జిన్లు తగ్గొచ్చు. విదేశీ సంస్థలు కేవలం లాభాలను తమ దేశాలకు తరలించడంపైనే దృష్టి పెట్టి, గ్రామీణ ప్రాంతాలను విస్మరిస్తాయనే విమర్శలూ వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఎల్‌ఐసీకి తొలి సంవత్సర జీవిత బీమా ప్రీమియంలో 57.05 శాతం వాటా ఉండటం వల్ల కొత్తగా వచ్చే సంస్థలకు పోటీ వాతావరణం ఎదురవుతుంది. 2015లో 49 శాతానికి, 2021లో 74 శాతానికి ఎఫ్‌డీఐలను పెంచినప్పటికీ, బీమా విస్తరణ ఆశించిన స్థాయిలో జరగలేదు. కొత్త ఉద్యోగాల సృష్టి చెప్పుకోదగ్గ మేర ఉండకపోవచ్చు.

డాలర్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకులు దీన్‌దయాళ్ గుప్తా ఇక లేరు



కోల్‌కతా: డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, గౌరవ ఛైర్మన్ దీన్‌దయాళ్ గుప్తా (88) వయసు సంబంధిత అనారోగ్యంతో శనివారం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. గుప్తా 1937 సెప్టెంబరు 13న హరియాణాలోని భివానీ జిల్లాలో మాన్‌హెరు గ్రామంలో జన్మించారు. 1962లో కోల్‌కతాకు చేరి అక్కడ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా హోసరీ ఉత్పత్తులను తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. క్రమంగా తయారీ సౌకర్యాలు, రిటెయిల్ నెట్‌వర్క్‌లు ఏర్పాటు చేసి పోటీ లేని మార్కెట్‌ను నిర్మించుకున్నారు. 1972లో డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు పునాది వేసి, అయిదు దశాబ్దాలకు పైగా దాన్ని ఒక సాధారణ స్థాయి నుంచి రూ.1,700 కోట్లకు పైగా ఆదాయం కలిగిన ప్రముఖ హోసరీ, దుస్తుల(వెస్ట్స్, డ్రాయర్లు, సాక్సులు, లాంజ్‌వేర్, థర్మల్స్..) తయారీ సంస్థల్లో ఒకటిగా తీర్చిదిద్దారు. పశ్చిమ బెంగాల్ హోసరీ అసోసియేషన్ నుంచి జీవిత కాల సాఫల్య పురస్కారంతో పాటు సన్మార్గ బిజినెస్ అవార్డు వంటి ఇతర పురస్కారాలను కూడా ఆయన పొందారు.

వ్యూహాత్మక ఇంధన నిల్వలను భారత్ ఏర్పాటు చేసుకోవాలి

ముఖ్య ఆర్థిక సలహాదారు నాగేశ్వరన్ సూచన



దిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో 'అత్యంత క్లిష్టమైన' ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నందున.. వ్యూహాత్మక నిల్వలను భారత్ సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్య ఆర్థిక సలహాదారు వి అనంత నాగేశ్వరన్ సూచించారు. దిగుమతులపై భారత్ అధికంగా ఆధారపడుతున్న నికెల్, టిన్, కాపర్ లాంటి ఇతర విభాగాలపైనా దృష్టి సారించాలని సూచించారు. ఎరువులు, అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరుగుతుండటంతో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 4.3 శాతం ద్రవ్యలోటు లక్ష్యాన్ని సాధించడం కూడా సవాలుతో కూడుకున్నదేనని చెప్పారు. అధిక ఇంధన ధరలకు తోడు వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైతే ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగేందుకు దారితీయొచ్చని ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా ఉద్యోగకల్పన విషయంలోనూ భారత్ సవాలును ఎదుర్కొంటోందని అన్నారు. ఐటీ రంగాన్ని మరింత పోటీతత్వంగా మారేలా చేయడమే కాకుండా.. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోకుండా నివారించాలని ఆయన సూచించారు. అలాగే ఐటీ, ఇతర సేవల రంగాల్లో ఏఐని ఉపయోగించే ఉద్యోగాలను సృష్టించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కరెంటు ఖాతా లోటు జీడీపీలో 2 శాతానికి పెరిగే అవకాశం ఉందని అంచనా వేశారు. 2025-26లో ఇది 1 శాతం లోపే ఉందని గుర్తు చేశారు.

చల్లని ఐస్‌క్రీమ్‌కు యుద్ధం సెగ

ఎండాకాలంలో చల్లని ఐస్‌క్రీమ్ తినాలని అనుకునే వారికి, ఇరాన్ యుద్ధం వేడి తగలనుంది. పశ్చిమాసియా ఘర్షణల కారణంగా అంతర్జాతీయంగా సరకు రవాణా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ఫలితంగా ముడి సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో.. ఈ వేసవిలో ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని నివేదికలు వస్తున్నాయి. ఐస్‌క్రీమ్‌లు, ప్రీమియం చాక్లెట్లలో రుచి కోసం వాడే అత్యంత కీలకమైన ఎండు ఫలాలు (డ్రై ఫ్రూట్స్), నట్స్ వంటి ముడి పదార్థాల ధరలు యుద్ధానికి ముందుతో పోలిస్తే.. 15-22% పెరిగాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వేసవి ఎండల వల్ల ఐస్‌క్రీమ్‌లకు గిరాకీ పెరుగుతుండగా, ముడి సరకుల వ్యయం అధికం కావడంతో కంపెనీల లాభాల మార్జిన్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.

ప్రస్తుతం భరిస్తున్నా: ప్రస్తుతానికి చాలా సంస్థలు



అదనపు భారాన్ని పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేయకుండా భరిస్తున్నాయి. అయితే పెరిగిన రవాణా, ప్యాకేజింగ్ ఖర్చులు ఆ వ్యయాలను తట్టుకోలేని స్థితికి నెట్టేస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. 'డ్రై ఫ్రూట్స్, కోకో వంటి ముడి సరకుల సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడటంతో పాటు, అవి చేరడానికి ఎక్కువ సమయం పడుతోంది' అని చెబుతున్నారు. కొన్ని సంస్థలు ఇప్పటికే ఎంపిక చేసిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల ధరలను పెంచాయి. ప్రత్యామ్నాయానికి మారే వీలు లేకుండా వేసవి ప్రారంభమయ్యే సమయంలోనే పశ్చిమాసియా సంక్షోభం తలెత్తడంతో.. ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల తయారీ విధానాన్ని మార్చడానికి లేదా ప్రత్యామ్నాయ ముడి సరకులను అన్వేషించేందుకు కంపెనీలకు సమయం దొరకలేదు. 'ఉత్పత్తుల నాణ్యత విషయంలో రాజీపడలేం. కాబట్టి ఖర్చు భయంతో డ్రై ఫ్రూట్స్, నట్స్ వాడకాన్ని తగ్గించడం సాధ్యపడదని' కంపెనీలు చెబుతున్నాయి. అందువల్ల ఆయా ఉత్పత్తుల గరిష్ఠ చిల్లర ధరలను పెంచక తప్పదని పేర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా సరకు రవాణా అంతరాయాలు ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో తీపి/చల్లని పదార్థాల ధరలు మరింత ప్రియం కావడం ఖాయంగా కనిపిస్తోంది.

టీవీఎస్ మోటార్ విక్రయాలు 7% పెరిగాయ్

ఏప్రిల్‌లో టీవీఎస్ మోటార్ కంపెనీ విక్రయాలు 7 శాతం పెరిగి 4,73,970 వాహనాలకు చేరాయి. గతేడాది ఇదే నెలలో 4,43,716 వాహనాలను విక్రయించింది. మొత్తం ద్విచక్ర వాహనాల విక్రయాలు కూడా 4,30,150 వాహనాల నుంచి 6 శాతం పెరిగి 4,55,333 వాహనాలకు చేరాయి. దేశీయ ద్విచక్ర వాహనాల విక్రయాలు 3,48,545 వాహనాలుగా నమోదయ్యాయి. 2025 ఏప్రిల్‌లో విక్రయించిన 3,23,647 వాహనాలతో పోలిస్తే 8 శాతం పెరిగాయి. ఎలక్ట్రిక్ వాహనాలు 36 శాతం అధికమై 37,771 వాహనాలకు చేరాయి.

స్పిరిట్ ఎయిర్‌లైన్స్ మూసివేత

● ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి తిరిగి నగదు చెల్లింపు
● ఆర్థిక ఇబ్బందులతో 34 ఏళ్ల సేవలకు స్వస్తి

వెస్ట్ పామ్ బీచ్ (యూఎస్): అమెరికాకు చెందిన విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్ తమ సర్వీసులను శాశ్వతంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేస్తున్నట్లు తెలిపింది. అన్ని విమాన సర్వీసులను రద్దు చేశామని, ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు నగదు తిరిగి చెల్లిస్తామని వెల్లడించింది. ఇతర విమానయాన సంస్థల్లో ప్రయాణ బుకింగ్‌లకు ఎలాంటి సాయం చేయబోమని స్పష్టం చేసింది. 34 ఏళ్లుగా తక్కువ ఛార్జీలతో ప్రయాణికులకు స్పిరిట్ ఎయిర్‌లైన్స్ సేవలు అందిస్తోంది. రోజూ వందలాది సర్వీసులను నడుపుతూ 17,000 మందికి ఉపాధి కల్పించింది. కొవిడ్ తర్వాత పెరిగిన నిర్వహణ వ్యయాలతో ఈ ఎయిర్‌లైన్స్ పలు ఆర్థిక సమస్యలు, అప్పులతో ఇబ్బందులు పడుతోంది. ఇరాన్ యుద్ధం వల్ల జెట్ ఇంధన ధరలు పెరగడంతో, ప్రస్తుతం ఈ విమానయాన సంస్థ దివాలా తీసే పరిస్థితికి వచ్చింది. 2025 ఆగస్టుకు కంపెనీకి 8.1 బిలియన్ డాలర్ల అప్పులు, 8.6 బి.డాలర్ల ఆస్తులు ఉన్నాయి. దివాలా పరిస్థితి నుంచి రక్షణ కల్పించాలని అమెరికా ప్రభుత్వాన్ని స్పిరిట్ కోరినా, ఎటువంటి ఆర్థిక సాయం అందకపోవడంతో సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించుకుంది. దీంతో సుమారు 17,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడుతుందని స్పిరిట్ న్యాయవాది మార్షల్ హ్యూబ్నర్ వెల్లడించారు.



సీడీఎస్‌ఎల్ లాభం రూ.80 కోట్లు

ముంబయి: సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్‌ఎల్) గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.80 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే మూడు నెలల సమయంలో లాభం రూ.100 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం రూ.256 కోట్ల నుంచి రూ.268 కోట్లకు చేరింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి సీడీసీఎల్ నికర లాభం రూ.526 కోట్లుగా నమోదైంది. 2024-25లో ఇది రూ.455 కోట్లుగా ఉంది. మొత్తం ఏకీకృత ఆదాయం రూ.1,199 కోట్ల నుంచి రూ.1,239 కోట్లకు పెరిగింది. 2026 మార్చి 31 నాటికి 18 కోట్లకు పైగా డీమ్యాట్ ఖాతాలు నమోదైన తొలి డిపాజిటరీగా సీడీఎస్‌ఎల్ నిలిచింది. 2025 మార్చి ఆఖరుకు 15.30 కోట్ల డీమ్యాట్ ఖాతాలు నమోదయ్యాయి. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో ఈక్విటీ షేరుకు రూ.12.75 చొప్పున తుది డివిడెండ్ చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది.

చైనా ఎఫ్‌డీఐకి ఆమోదం

● నోటిఫై చేసిన ఆర్థిక శాఖ ● మే 1 నుంచి అమల్లోకి

దిల్లీ: ఫెమా కింద చేపట్టిన మార్పులను ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫై చేయడంతో, ఆటోమేటిక్ రూట్ కింద మన దేశంలో పెట్టుబడి పెట్టడానికి 10 శాతం వరకు చైనా వాటా ఉన్న విదేశీ కంపెనీలను అనుమతించే నిర్ణయం మే 1 నుంచి అమల్లోకి వచ్చింది. డీపీఐఐటీ 2020 ప్రెస్ నోట్ (పీఎన్) 3 సవరణలకు కేంద్ర మంత్రి వర్గం మార్చిలో ఆమోదం తెలిపింది. సవరణల ప్రకారం.. చైనా/హాంకాంగ్ వాటా 10 శాతం వరకు ఉన్న విదేశీ కంపెనీలు, మన దేశంలోని వివిధ రంగాల్లో ఆటోమేటిక్ రూట్ కింద అనుమతించిన రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)ను పెట్టవచ్చు. సవరించిన ఎఫ్‌డీఐ నిబంధనలు చైనా/హాంకాంగ్ లేదా భారత్‌తో భూసరిహద్దులు పంచుకుంటున్న ఇతర దేశాలకు వర్తించవు.

టాటా సన్స్ లిస్టింగ్ తప్పదా?

● టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ ప్రణాళికలకు ఆర్‌బీఐ గండి
● జులై 1 నుంచి కొత్త నిబంధనల అమలు

స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ కాకుండా ఉండడానికి టాటా సన్స్ చేస్తున్న ప్రయత్నాలకు ఆర్‌బీఐ గండి కొట్టింది. గ్రూప్ కంపెనీల నుంచి వచ్చే నిధులను పరోక్షంగా ప్రజల నిధుల కిందే పరిగణించాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు తీసుకొచ్చింది. ప్రధాన పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ పెట్టుకున్న దరఖాస్తుపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. జులై 1 నుంచే అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనలు టాటా సన్స్ భవిష్యత్ ప్రణాళికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ తన ఫైనాన్స్ లైసెన్సును సరెండర్ చేయడం ద్వారా తప్పనిసరి స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌ను తప్పించుకోవచ్చన్న వాదననూ ఇటీవలి ఒక నోటిఫికేషన్ ద్వారా ఆర్‌బీఐ తోసిపుచ్చిందని ఆంగ్ల వార్తా సంస్థ ఒకటి పేర్కొంది.

కొత్త నిబంధనలు ఏమిటంటే..

ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) విడుదల చేసిన మార్గనిర్దేశాల ప్రకారం.. డెట్ మార్కెట్‌తో సంబంధాలున్న గ్రూప్ కంపెనీలు, అనుబంధ సంస్థల నుంచి ఈక్విటీని పొందిన పక్షంలో పరోక్షంగా ప్రజా నిధులను పొందినట్లుగానే పరిగణిస్తారు. న్యాయ నిపుణుల అంచనా ప్రకారం.. టాటా సన్స్‌కు చెందిన టాటా మోటార్స్, టాటా స్టీల్, టాటా పవర్, ఇండియన్ హోటల్స్, టాటా కెమికల్స్ తమ హోల్డింగ్ కంపెనీకి నిధులను అందజేసిన సమయంలో డెట్ మార్కెట్ల ద్వారా నిధులను సమీకరించాయి. ఇంకో వైపు రూ.1,000 కోట్ల ఆస్తుల్లోపు ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలకు మాత్రమే డీరిజిస్ట్రేషన్ మార్గాన్ని తాజా ఆదేశాలు అందజేస్తున్నాయి. టాటాసన్స్ స్టాండలోన్ ఆస్తులు రూ.1.75 లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే ఈ పరిమితికి మించి చాలా అధికంగా ఉన్నాయి. అంతక్రితం రూ.లక్ష కోట్లకు పైగా ఉన్న సంస్థలను అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా వర్గీకరిస్తామని ఆర్‌బీఐ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 2022న తొలిసారిగా ఆర్‌బీఐ అప్పర్ లేయర్ జాబితాను విడుదల చేసినపుడు టాటా సన్స్ ఒక్కటే తప్పనిసరి లిస్టింగ్‌ను చేయకుండా ఉన్న కంపెనీగా ఉంది.

అవసరమైన పరిణామం: మిస్త్రీ

టాటాసన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు కనిపించిన సంగతి తెలిసిందే. ఛైర్మన్ నోయెల్ టాటా లిస్టింగ్‌కు వ్యతిరేకంగా ఉండగా, వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ మద్దతు పలుకుతున్నారు. ఏప్రిల్ 2026లో షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ, వేణు శ్రీనివాసన్‌లు టాటా సన్స్ లిస్టింగ్‌కు మద్దతు పలికారు. అది అవసరమైన పరిణామంగా మిస్త్రీ ఆ సమయంలో అన్నారు. తాజా వార్తల నేపథ్యంలోనూ మిస్త్రీ టాటా సన్స్ లిస్టింగ్‌ను అవసరమైన పరిణామంగా పునరుద్ఘాటించారు. తద్వారా గ్రూప్‌లో పాలన, పారదర్శకత, బాధ్యత బలోపేతమవుతుందన్నారు.



18.37% వాటా నగదీకరణకు వీలు..: ఒకవేళ గ్రూప్ హోల్డింగ్ కంపెనీని అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా వర్గీకరిస్తే లిస్టింగ్ తప్పనిసరి అవుతుందని శ్రీనివాసన్ అన్నారు. టాటా సన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ(ఎస్‌పీ) గ్రూప్‌నకు ఉన్న 18.37 శాతం వాటా నగదీకరణకు మార్గం సుగమం అవుతుందనీ పేర్కొన్నారు. అప్పులు చెల్లించుకోవడం కోసం ఎప్పటి నుంచో టాటా సన్స్ లిస్టింగ్‌ను ఎస్‌పీ గ్రూప్ డిమాండ్ చేస్తూ వస్తోన్న సంగతి విదితమే.

స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదుకు ఆదేశాలివ్వండి

● టాటా సన్స్‌కు మినహాయింపులివ్వొద్దు ● ఇన్‌గవర్న్ రీసెర్చ్ సర్వీసెస్

తాజాగా ఆర్‌బీఐ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం.. ఒక అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా మార్చి 2027లోగా టాటా సన్స్ తన లిస్టింగ్ ప్రక్రియను మొదలుపెట్టేలా స్పష్టమైన ఆదేశాలను ఇవ్వాలని ఆర్‌బీఐని కార్పొరేట్ పాలన సలహా సంస్థ ఇన్‌గవర్న్ రీసెర్చ్ సర్వీసెస్ కోరింది. రూ.1.75 లక్షల కోట్ల విలువైన ఆస్తులను నియంత్రిస్తున్న ఒక సంస్థకు లిస్టింగ్ నుంచి మినహాయింపునివ్వడానికి ఇక ఎటువంటి చట్టపరమైన అవకాశాలు లేవని ఇన్‌గవర్న్ పేర్కొంది. పబ్లిక్ లిస్టింగ్‌ను తప్పించుకోవడానికి ఒక ప్రధాన పెట్టుబడి కంపెనీగా తమను డీరిజిస్టర్ చేయాలంటూ టాటా సన్స్ దాఖలు చేసుకున్న దరఖాస్తును సైతం తిరస్కరిస్తూ కచ్చితంగా అమలయ్యే ఒక పబ్లిక్ ఆర్డర్‌ను ఆర్‌బీఐ జారీ చేయాలంటూ కోరింది. మార్చి 2024లో తన సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్(సీఓఆర్)ను సరెండర్ చేయడానికి దరఖాస్తు చేసుకోగా, అది పెండింగ్‌లో ఉందని ఇన్‌గవర్న్ గుర్తు చేసింది.

కివీ బర్ఫీ



కావలసినవి: కివీ పండ్లు - 5, పంచదార - అర కప్పు, నెయ్యి - 6 స్పూన్లు, ఖోయా - కప్పు, యాలకుల పొడి - పావు స్పూన్, పిస్తా, బాదం పప్పులు - రెండు స్పూన్లు, కుంకుమపువ్వు - కొద్దిగా, ఆకుపచ్చ ఫుడ్ కలర్ - చిటికెడు

తయారీ: బాగా పండిన కివీపండ్లను ఎంచుకుని.. తొక్క తీసి మెత్తగా గ్రైండ్ చేయాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో ఐదు స్పూన్ల నెయ్యి వేడిచేసి.. పిస్తా, బాదం పప్పులను వేయించాలి. అందులో ఖోయా, కివీ ప్యూరీ జోడించి సన్న సెగ మీద ఉడికించాలి. నాలుగైదు నిమిషాల తర్వాత.. పంచదార, యాలకుల పొడి, కుంకుమపువ్వు, ఫుడ్ కలర్ జతచేసి కలియ తిప్పుతుండాలి. చిక్కబడి, పాత్ర నుంచి విడిపోతున్నప్పుడు సెగ తీసేయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన పళ్లెంలో సమంగా సర్ది.. పిస్తా, బాదం పప్పులను చల్లాలి. చల్లారిన తర్వాత రిఫ్రిజిరేటర్‌లో ఉంచాలి. బయటకు తీసి.. చతురస్రం లేదా డైమండ్ ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. అంతే.. నోరూరించే 'కివీ బర్ఫీ' ఆస్వాదించి ఆనందించడమే తరువాయి.

బర్ఫీ.. కట్లెట్.. భలేభలే!

మనలో చాలామందికి చిరుతిళ్లంటే బోల్డంత ఇష్టం. అయితే వాటిలో బజ్జీ, పకోడీ లాంటివి కడుపుబ్బరం కలిగించి చిరాకు పెడతాయి. ఆ ఇబ్బంది లేకుండా తేలిగ్గా జీర్ణమయ్యే స్నాక్స్ కూడా అనేకం ఉన్నాయి. అలాంటి రెసిపీల్లో కొన్ని మీ కోసం.. ఎంచక్కా ఎంజాయ్ చేయండి.



బొప్పాయి జెల్లీ డిలైట్

కావలసినవి: బొప్పాయి పండు ముక్కలు - కప్పు, పంచదార - ముప్పావు కప్పు, నిమ్మరసం - రెండు స్పూన్లు, నీళ్లు - అర కప్పు, జెలటిన్ - టేబుల్ స్పూన్, వెనీలా ఎసెన్స్ - అర స్పూన్, నెయ్యి - స్పూన్, డ్రై ఫ్రూట్స్ - గార్నిష్ చేసేందుకు

తయారీ: బొప్పాయి పండు ముక్కలను మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ ప్యూరీలో అర కప్పు నీళ్లు, పంచదార వేసి మధ్యస్థమైన సెగ మీద కలియతిప్పుతూ ఉడికించాలి. పంచదార కరిగి, మిశ్రమం చిక్కగా అయ్యే వరకూ ఉంచాలి. జెలటిన్‌లో రెండు టేబుల్ స్పూన్ల వేడి నీళ్లు పోసి పూర్తిగా కరిగేలా కలిపి.. ఉడుకుతున్న బొప్పాయి గుజ్జులో జోడించాలి. నిమిషం తర్వాత నిమ్మరసం, వెనీలా ఎసెన్స్ జతచేసి.. బాగా కలిపి సెగ తీసేయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన బౌల్ లేదా అచ్చులోకి తీసి.. సమంగా సర్దాలి. చల్లారాక.. రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే.. గట్టిపడుతుంది. రెండు గంటల తర్వాత.. చిన్న ముక్కలుగా కట్ చేసి, పైన కొబ్బరి తురుము అద్ది డ్రై ఫ్రూట్స్‌తో గార్నిష్ చేయాలి. అంతే.. నోరూరించే బొప్పాయి జెల్లీ డిలైట్ రెడీ అయిపోతుంది. ఇదెంతో రుచి, చేయడం సులభం. బొప్పాయి బాగా పండినదే ఎంచుకోవాలి. జెలటిన్ బదులు అగర్ అగర్ ఉపయోగించవచ్చు. చల్లగా సర్వ్ చేస్తే రిఫ్రెషింగ్‌గా ఉంటుంది.

కట్లెట్



కావలసినవి: అటుకులు - కప్పు, చిలకడదుంపలు - 2, ఉల్లిపాయ - 1, పచ్చిమిర్చి - 2, అల్లం తురుము - స్పూన్, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, కారం - అర స్పూన్, ఉప్పు - తగినంత, జీలకర్ర పొడి - అర స్పూన్, గరం మసాలా, మిరియాల పొడి - పావు స్పూన్ చొప్పున, నిమ్మరసం - స్పూన్, బ్రెడ్ పౌడర్ - అర కప్పు, నూనె - వేయించడానికి సరిపడా

తయారీ: అటుకులను కడిగి నీళ్లు వంపేసి పక్కనుంచాలి. చిలకడదుంపలను ఉడికించి పొట్టు తీసి మెత్తగా మెదపాలి. అందులో నానబెట్టిన అటుకులు, తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, మిరియాల పొడి, అల్లం తురుము, జీలకర్ర పొడి, కొత్తిమీర, కారం, ఉప్పు, నిమ్మరసం, గరం మసాలా వేసి కలపాలి. ఈ మిశ్రమంతో కట్లెట్లు చేసుకోవాలి. వాటిని బ్రెడ్ పౌడర్‌లో ముంచి తీసి.. కాగుతున్న నూనెలో మధ్యస్థమైన సెగ మీద రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వేడివేడిగా టొమాటో సాస్ లేదా పుదీనా చట్నీతో సర్వ్ చేయండి. ఈ పోహా కట్లెట్లు బయట కరకరలాడుతూ లోపల మృదువుగా ఉండి చాలా రుచిగా ఉంటాయి.



పోహా బార్

కావలసినవి: అటుకులు - 180 గ్రాములు, తురిమిన బెల్లం - 150 గ్రా, ఉప్పు - చిటికెడు, నెయ్యి - 5 స్పూన్లు, పల్లీలు - 70 గ్రా, బాదం, జీడిపప్పులు - పావు కప్పు చొప్పున, పిస్తా - 3 టేబుల్ స్పూన్లు, ఖోవా - 2 టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి - అర స్పూన్


తయారీ: అటుకులను క్రిస్పీగా అయ్యే వరకూ సన్న సెగ మీద వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. పల్లీలు, బాదం, పిస్తా, జీడిపప్పులను వేయించి చల్లారాక కచ్చాపచ్చా దంచాలి. బెల్లంలో కొన్ని నీళ్లు పోసి వేడిచేయాలి. కరిగిన బెల్లాన్ని కొద్దిగా నీళ్లలో వేస్తే గట్టిగా ఉండలా అయ్యిందంటే పాకం సరిగ్గా ఉన్నట్టు. ఈ పాకంలో వేయించిన అటుకులు, బాదం, పిస్తా, జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి, ఉప్పు, నాలుగు స్పూన్ల నెయ్యి జతచేసి కలుపుతుండాలి. దగ్గరగా అయ్యాక సెగ తీసేయాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన ట్రేలో సమంగా సర్దాలి. పావు గంట తర్వాత నచ్చిన ఆకృతిలో ముక్కలు కోయాలి. ఇవి పూర్తిగా చల్లారిన తర్వాత గట్టిపడతాయి. బెల్లం పాకం సరిగ్గా ఉంటేనే ఇవి బాగుంటాయి. వాటిని గాలి చొరబడని డబ్బాలో భద్రం చేసుకోవాలి. ఇది ఆరోగ్యకరమైన చిరుతిండి.

ఎనర్జీ బాల్స్

కావలసినవి: అంజీర్ - 150 గ్రాములు, అటుకులు - 100 గ్రా, పల్లీలు - 70 గ్రా, బాదం, జీడిపప్పులు - 50 గ్రా చొప్పున, గుమ్మడి గింజలు - టేబుల్ స్పూన్, ఎండుద్రాక్ష, నువ్వులు - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, యాలకుల పొడి - అర స్పూన్, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు

తయారీ: పల్లీలు, బాదం, జీడిపప్పులను వేయించి బరకగా పొడి చేసుకోవాలి. అటుకులను సన్న సెగ మీద 3 నిమిషాలు వేయించాలి. వాటిని తీసి నువ్వులను కూడా వేయించాలి. అంజీర్‌ను మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇప్పుడు అడుగుభాగం మందంగా ఉన్న గిన్నెలో అంజీర్ పేస్ట్, అటుకులు, పల్లీలు, బాదం, జీడిపప్పుల పొడి, ఎండు ద్రాక్ష నువ్వులు, యాలకుల పొడి, నెయ్యి వేసి బాగా కలపాలి. మిశ్రమం పొడిపొడిలాడుతుంటే ఇంకాస్త నెయ్యి వేయొచ్చు. దీంతో చిన్న బాల్స్‌లా చేసుకోవాలి. ఒక పావుగంటకు అవి గట్టిపడతాయి. ఈ ఎనర్జీ బాల్స్ రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే వారం రోజులు నిలవుంటాయి. ఇవి రుచిగానూ ఉంటాయి, శక్తినీ ఇస్తాయి.





రైస్ కేక్స్

కావలసినవి: బియ్యం - 200 గ్రాములు, నీళ్లు - ఒకటిన్నర కప్పులు, ఉప్పు - రుచికి తగినంత, వెనిగర్ - టేబుల్ స్పూన్, పంచదార - స్పూన్

టాపింగ్ కోసం: టొమాటో, ఉల్లిపాయ - ఒక్కొకటి, పచ్చిమిర్చి - 2, కొత్తిమీర తరుగు - 2 టేబుల్ స్పూన్లు, సోయాసాస్, కారం, నిమ్మరసం - స్పూన్ చొప్పున, ఛాట్ మసాలా - అర స్పూన్, నూనె - 4 టేబుల్ స్పూన్లు

తయారీ: బియ్యం మరీ మెత్తగా అన్నంలా కాకుండా ఉడికించి.. పక్కనుంచాలి. పది నిమిషాల తర్వాత వెనిగర్, పంచదార, ఉప్పు వేసి బాగా కలిపి ట్రేలో అర అంగుళం మందం ఉండేలా సమంగా సర్దాలి. ఒకసారి గట్టిగా నొక్కి.. (లేకుంటే తునిగిపోతాయి) ఫ్రిజ్‌లో ఉంచాలి. ఓ గంటకి గట్టిగా అయ్యాక.. నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేయాలి. ప్యాన్‌లో నూనె వేడిచేసి.. రైస్ కేక్స్‌ను రెండు వైపులా లేత గోధుమ రంగులోకి మారే వరకూ కాల్చుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి పాత్రలో టొమాటో, ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర, కారం, ఛాట్ మసాలా, సోయాసాస్, నిమ్మరసం జతచేసి కలపాలి. క్రిస్పీ రైస్ కేక్స్ పై ఈ మసాలా తగినంత వేసి వడ్డించాలి.

వారెవా.. మసాలా పునుగులు

పాఠక వంట



పానీపూరీ ఇష్టపడనివాళ్లు ఉండరు కదూ! పిల్లలైతే.. ఇక చెప్పాల్సిందే లేదు.. ఇంకా ఇంకా కావాలంటారు. ఇంట్లోనే అంతకంటే టేస్టీగా ఉండే ఈ వంటకం ట్రై చేసి చూడండి.. ఇంటిల్లిపాదికీ నచ్చేయడం ఖాయం.

ఇందుకోసం పెసరపప్పు - వంద గ్రాములు, శనగపిండి - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, నూనె - వేయించడానికి సరిపడా, పుదీనా, కొత్తిమీర - గుప్పెడు చొప్పున, పచ్చిమిర్చి - 3, అల్లం - అంగుళం ముక్క, చింతపండు - ఉసిరికాయంత, ఛాట్ మసాలా, జీలకర్ర పొడి, నిమ్మరసం - అర స్పూన్ చొప్పున, మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్ - పావు స్పూన్ చొప్పున, ఉల్లిపాయ ముక్కలు - 3 టేబుల్ స్పూన్లు తీసుకోవాలి.

ఎలా చేయాలంటే.. పెసరపప్పును రెండు గంటలు నానబెట్టి కాస్త ఉప్పు, శనగపిండి, కొన్ని నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. కాగుతున్న నూనెలో పెసరపిండితో పునుగులు వేసుకోవాలి. ఇప్పుడు పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, అల్లం, చింతపండు గుజ్జులను గ్రైండ్ చేయాలి. అందులో కొన్ని నీళ్లు, ఛాట్ మసాలా, జీలకర్ర పొడి, నిమ్మరసం, మిరియాల పొడి, చిల్లీ ఫ్లేక్స్ ఉల్లిపాయ ముక్కలు, తగినంత ఉప్పు జోడించాలి. ఈ పానీలో పెసర పునుగులు వేసి.. రెండు నిమిషాలు ఉంచితే.. చక్కగా మసాలా పడుతుంది. ఛాట్ బండార్ వద్ద దుమ్మూ ధూళీ పడుతూ పరిశుభ్రత లేని పానీ పూరీ కంటే ఈ మసాలా పునుగులు సూపర్‌గా ఉంటాయి.

– టేకుమళ్ల సుజాత, హైదరాబాద్

ఎర్రెర్రని పనీర్ బటర్ మసాలా

బ్యాచిలర్స్ కిచెన్



చదువైపోగానే బెంగళూరులో ఉద్యోగంలో చేరాను. అక్కడి తెలుగు ఫ్రెండ్స్‌ది ఓ వాట్సప్ గ్రూప్ ఉంది. ఒక ఆదివారం పొద్దున్నే 'మీలో ఎవరికైనా వంట వచ్చా? స్వయంగా వంట చేసి ఫొటో పెట్టండి చూద్దాం' అని సవాల్ విసిరాడో ఫ్రెండ్. 'నేను వంటలో తోపుని! పనీర్ బటర్ మసాలా చేశానంటే రెస్టారెంట్ స్టైల్లో ఉంటుంది' అని బదులిచ్చాను. పదిమంది నా కామెంట్‌కి లైక్స్ కొట్టారు. ఆరుగురు 'ఆల్ ది బెస్ట్' అన్నారు. అమ్మ నాకోసం ప్రత్యేకంగా చేసే కర్రీ అది. పక్కనుంచి చూశా కాబట్టి చేయొచ్చన్న నమ్మకంతో చెప్పేశా.

ఫ్రిజ్ తెరిస్తే పనీర్, టొమాటో ప్యూరీ ప్యాకెట్లు కనిపించాయి. దుకాణానికి వెళ్లి కావాల్సిన సరంజామా కొనుక్కొచ్చాను. పనీర్‌ని కట్ చేశాను. జీడిపప్పు, మిల్క్ పౌడర్, కొన్ని నీళ్లు చేర్చి గ్రైండ్ చేశాను. మూత సరిగా ఫిక్స్ అవనట్టుంది.. పేస్ట్ ఎగిరిపడి కిచెన్ గోడల మీద, నా చొక్కా మీద పడింది. అయ్యో అనుకుని.. స్టవ్ వెలిగించి ప్యాన్‌లో నూనె పోసి జీరా వేశాను. తీరా చూస్తే అది జీరా కాదు.. సోంపు. అయినా చేసేదేముంది? అందులో టొమాటో ప్యూరీ, జార్‌లో మిగిలిన జీడిపప్పు పేస్ట్ వేశాను. గ్రేవీకి మాంచి రంగు రావాలని ఫుడ్ కలర్ కొద్దిగా వేశాను. పెద్దగా రంగు రాకపోవడంతో ఇంకొంచెం వేయబోతే.. అది కాస్తా ఒలికి చాలా పడింది. దాంతో గ్రేవీ మరీ ఎర్రగా మారిపోయింది. వామ్మో.. ఇదేంటి ఇంత భయపెట్టేస్తోంది- అనుకుని పనీర్ మసాలా జోడించాను. బటర్ తేవడం మర్చిపోవడాన దానికి బదులు ఒక స్పూన్ దాల్డా వేసి సరిపెట్టేశాను. అంతా అయ్యాక 'పనీర్ బటర్ మసాలా రెడీ' అంటూ గ్రూప్‌లో ఫొటో పెట్టేశాను. ఇక చూస్కోండి.. కిర్రాక్ కామెంట్లు వచ్చాయి. 'అరేయ్! ఇది పనీర్ కాదు.. వాంపైర్ కర్రీలా ఉంది', 'ఇంత ఎర్రగా ఉంది.. హాలోవీన్ స్పెషలా?' అంటూ తూటాల్లాంటి సెటైర్లు. సురేష్ అయితే మరీ ఘోరంగా 'బ్రో! ఇది తింటే రక్తం బాగా పడుతుందా?' అంటూ పంచ్. వాళ్ల వ్యాఖ్యలూ, వ్యాఖ్యానాలు భరించలేక.. వాట్సప్‌లోంచి బయటికొచ్చేశా. బ్యాచిలర్స్ స్పెషల్ రెసిపీని పక్కన పడేసి.. స్విగ్గీలో వెజ్ ఫ్రైడ్ రైస్ ఆర్డర్ పెట్టేశాను.

– ప్రణవ్, విజయవాడ

కేరళం మటన్ స్టూ

షెఫ్ స్పెషల్



మాంసంతో స్పెషల్ కర్రీ ఏదైనా చేయాలని ఆలోచిస్తున్నారా? అయితే మీ కోసమే మటన్ స్టూ. ఒకసారి చేసి చూడండి.. ఇక మళ్లీ మళ్లీ కావాలనిపిస్తుంది.

కావలసినవి: మాంసం - అర కిలో, ఉప్పు - రుచికి తగినంత, ఉల్లిపాయలు, బంగాళదుంపలు - రెండు చొప్పున, క్యారెట్ - 1, పచ్చిమిర్చి - నాలుగు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, కరివేపాకు - 2 రెబ్బలు, దాల్చినచెక్క - అంగుళం ముక్క, లవంగాలు - 4, యాలకులు - 3, కచ్చాపచ్చా దంచిన మిరియాలు - స్పూన్, కొబ్బరిపాలు - ఒకటిన్నర కప్పులు, నూనె - 2 టేబుల్ స్పూన్లు

తయారీ: మాంసాన్ని శుభ్రంగా కడగాలి. ఉల్లి, క్యారెట్ మొదలైనవాటిని సన్నగా తరగాలి. కుక్కర్‌లో నూనె వేడయ్యాక.. దాల్చినచెక్క, యాలకులు, లవంగాలు, మిరియాలు వేసి మంచి వాసన వచ్చేవరకూ వేయించాలి. తర్వాత ఉల్లి తరుగు వేసి లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేగనివ్వాలి. అందులో సగానికి కోసిన పచ్చిమిర్చి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, కరివేపాకు, మటన్, క్యారెట్, బంగాళదుంప ముక్కలు జతచేయాలి. అవి వేగాక.. సగం కొబ్బరిపాలు, ఉప్పు జోడించి మూత పెట్టి ఉడికించాలి. మూత తీసిన తర్వాత మళ్లీ స్టవ్వు వెలిగించి.. మిగిలిన కొబ్బరిపాలు పోసి కలియబెట్టి... ఒక నిమిషం తర్వాత సెగ తీసేయాలి. అంతే.. కేరళం స్టైల్ మటన్ స్టూ సిద్ధమైపోతుంది. ఇందులో మసాలా ఎక్కువగా ఉండదు, కొబ్బరి పాలతో ప్రత్యేక రుచి వస్తుంది. ఈ కూర అన్నంలోకే కాదు.. అప్పం, చపాతీల్లోకి కూడా చాలా బాగుంటుంది.

ములంగి ఆకుతో పచ్చడి



మనలో చాలామంది ముల్లంగి దుంపలు కొన్నప్పుడు.. వాటి ఆకులను అక్కడే పడేస్తారు. నిజానికి ముల్లంగి ఆకుతో పచ్చడి చేస్తే వహ్వా అనిపిస్తుంది..

ఈ పచ్చడి కోసం.. ముల్లంగి ఆకుల తరుగు - రెండు కప్పులు, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - మూడు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, నువ్వులు - రెండు టేబుల్ స్పూన్లు, శనగ, మినప్పప్పులు - స్పూన్ చొప్పున, చింతపండు - నిమ్మకాయంత, ఉప్పు - రుచికి తగినంత, నూనె - మూడు స్పూన్లు

తాలింపు: ఆవాలు, శనగ, మినప్పప్పులు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, ఎండు మిర్చి - ఒకటి, కరివేపాకు - రెండు రెబ్బలు, ఇంగువ - పావు స్పూన్

ముల్లంగి ఆకులను బాగా కడిగి సన్నగా తరగాలి. కడాయిలో నువ్వులు, శనగ, మినప్పప్పులను వేయించి గిన్నెలోకి తీయాలి. అదే కడాయిలో సగం నూనె వేసి ముల్లంగి ఆకును వేయించాలి. అది కొంత వేగాక.. ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు జోడించి మెత్తగా అయ్యేవరకు వేయించాలి. అందులో కడిగిన చింతపండు జతచేసి స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారిన తర్వాత ఉప్పు, నువ్వులు, శనగ, మినప్పప్పులు, 2 వెల్లుల్లి రెబ్బలు జోడించి గ్రైండ్ చేయాలి. ఇప్పుడు చిన్న ప్యాన్‌లో మిగిలిన నూనె వేడిచేసి.. ఆవాలు, శనగ, మినప్పప్పులు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. చక్కగా వేగి మంచి వాసన వస్తుండగా సెగ తీసేసి.. ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. ఇదెంతో ఆరోగ్యకరం. వేడి అన్నంలో కాస్త నెయ్యి జోడించి తింటే సూపర్‌గా ఉంటుందీ పచ్చడి. ఇడ్లీ, దోశల్లోకి కూడా బాగుంటుంది.

ఎండల్లో యాపిల్ పానీయం



చల్లటి పానీయం ఎంతగానో సేదతీరుస్తుంది. ముఖ్యంగా మండుటెండల్లో మరింత హాయి. అలసట తగ్గి.. ఎక్కడ లేని హుషారూ వచ్చేస్తుంది. మరి ఈ కాలంలో ఆస్వాదించేందుకు యాపిల్ కాన్సన్ట్రేట్ చేసుకుందామా..

కావలసినవి: యాపిల్ పండ్లు - కిలో, పంచదార - అరకిలో, దాల్చినచెక్క - రెండంగుళాల ముక్క, నిమ్మరసం - రెండు టేబుల్ స్పూన్లు, నీళ్లు - కప్పు

తయారీ: యాపిల్ పండ్లను కడిగి చెక్కు, గింజలు తీసి చిన్న ముక్కలుగా కట్ చేయాలి. వాటిని అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో వేసి.. కప్పు నీళ్లు పోసి మధ్యస్థమైన సెగ మీద ఉడికించాలి. యాపిల్ మెత్తగా అవడానికి సుమారు పావుగంట సమయం పడుతుంది. అప్పుడు సెగ తీసేయాలి. చల్లారిన తర్వాత గ్రైండ్ చేయాలి. ఈ గుజ్జును మళ్లీ పాత్రలోకి తీసి.. పంచదార, దాల్చినచెక్క పొడి జతచేసి ఇంకో 20 నిమిషాలు ఉడికించాలి. మిశ్రమం చిక్కగా, తేనెను తలపించే సాంద్రతతో ఉన్నప్పుడు నిమ్మరసం జతచేయాలి. కలియతిప్పుతూ కొన్ని క్షణాలుంచి దించేయాలి. చల్లారిన తర్వాత మరింత చిక్కబడుతుంది. నిమ్మరసం సహజ ప్రిజర్వేటివ్‌లా పనిచేస్తుంది. గాజు సీసాను స్టెరిలైజ్ చేసి.. పూర్తిగా ఆరబెట్టాలి. యాపిల్ కాన్సన్ట్రేట్‌ను అందులోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకోవాలి. ఇది మూడు నెలలు నిల్వ ఉంటుంది. ఫ్రీజర్‌లో అయితే ఆరు నెలల వరకు నిల్వ ఉంటుంది. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో టేబుల్ స్పూన్ కాన్సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. త్వరగా పాడవకూడదంటే.. ఉడికించేటప్పుడు నీళ్లు తగిన పరిమాణంలోనే ఉండాలి. తడి లేని స్పూన్నే ఉపయోగించాలి.

చిత్రంగా..

నవ్వుల సోయగాలు



మనసారా నవ్వుకోగలిగితే అంతకంటే కావలసింది ఇంకేముంటుంది?! ఇవాళ ప్రపంచ నవ్వుల దినోత్సవం.. రోజు కంటే ఇంకొంచెం ఎక్కువ ఆనందంగా, ఆహ్లాదంగా గడుపుదాం. ఈ ప్రత్యేక రోజును పురస్కరించుకుని.. పదార్థాలకి నవ్వుల సోయగాలు అద్ది ప్లేట్లలో అమర్చారు. అవలా నవ్వులు చిందిస్తోంటే తినడానికి మనసొప్పుతుందా?!



డేట్స్ అండ్ నట్స్ క్యాండీ



ఒక్కో వారం ఒక్కో రకమైన క్యాండీ చేసుకుంటున్నాం కదా.. ఈసారి మరింత ఆరోగ్యకరమైన డేట్స్ అండ్ నట్స్ క్యాండీ..

కావలసినవి: గింజలు తీసిన ఖర్జూరాలు - కప్పు, బాదం, జీడిపప్పులు - అర కప్పు చొప్పున, పిస్తా, వాల్‌నట్స్, ఎండుద్రాక్ష - పావు కప్పు చొప్పున, యాలకుల పొడి - అర స్పూన్, నెయ్యి - 3 స్పూన్లు, పంచదార పొడి - స్పూన్

తయారీ: బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పులను నూనె లేకుండా వేయించాలి. చల్లారిన తర్వాత చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఖర్జూరాలను జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ప్యాన్‌లో రెండున్నర స్పూన్ల నెయ్యి వేడిచేసి.. ఖర్జూర గుజ్జును సన్న సెగ మీద కొద్దిసేపు వేయించాలి. అందులో వేయించిన బాదం, పిస్తా, వాల్‌నట్స్, జీడిపప్పులు, ఎండుద్రాక్ష, యాలకులపొడి జతచేసి కలుపుతుండాలి. దగ్గరగా అయ్యాక సెగ తీసేయాలి. మిగిలిన నెయ్యిని పళ్లెంలో రాసి.. ఖర్జూర మిశ్రమాన్ని సమంగా సర్ది.. చతురస్రాకారంలో చిన్న చిన్న ముక్కలుగా కట్ చేయాలి. గట్టిపడిన తర్వాత.. పంచదార పొడి చల్లితే.. ఒకదానికొకటి అంటుకోవు. పిల్లలకు చాక్లెట్ల బదులు హెల్దీగా, సహజమైన తీపితో చేసిన ఆరోగ్యకరమైన క్యాండీలివి. వీటిని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. గది ఉష్ణోగ్రతలో ఉంచితే రెండు వారాలు నిలవుంటాయి. ఫ్రిజ్‌లో అయితే మరిన్ని రోజులుంటాయి. ఈ క్యాండీలకు పంచదార, బెల్లం వేయనవసరం లేదు, ఖర్జూరాల సహజ తీపి చాలు. ఇది మంచి ఎనర్జీ స్నాక్.

ఈ ఉప్మాకి నూనె అక్కర్లేదు

నూనె ఎక్కువగా వాడటం వల్ల గుండెజబ్బులొస్తాయి. మధుమేహం ఎక్కువవుతుంది. అందువల్ల నూనెను ఎంత తగ్గిస్తే అంత మంచిది. ఒక సెలవు రోజున నూనె అక్కర్లేని ఈ ఉప్మా చేసి చూడండి.

ఇందుకోసం.. రవ్వ - కప్పు, ఉప్పు - రుచికి తగినంత, ఉల్లితరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి - 3, సన్నగా తరిగిన అల్లం - స్పూన్, టొమాటో, క్యారెట్ ముక్కలు, బఠాణీలు - అర కప్పు చొప్పున, పల్లీలు, కొత్తిమీర - గుప్పెడు చొప్పున, ఆవాలు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, కరివేపాకు - 2 రెబ్బలు, నిమ్మరసం - టేబుల్ స్పూన్ తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ముందుగా రవ్వను నూనె లేకుండా వేయించాలి. లేత బంగారు రంగు వచ్చాక దాన్ని పళ్లెంలోకి తీసి.. పల్లీలు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకులను వేయించాలి. మరో గిన్నెలో రెండు గ్లాసుల నీళ్లు పోసి వేడిచేయాలి. అందులో ఉల్లితరుగు, క్యారెట్, టొమాటో, పచ్చిమిర్చి, అల్లం ముక్కలు, బఠాణీలు వేయాలి. అవి ఉడికాక.. ఉప్పు, పల్లీలు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకులను జోడించాలి. ఇప్పుడు రవ్వ వేస్తూ ఉండలు కట్టకుండా కలపాలి. సన్న సెగ మీదుంచి రవ్వ ఉడికి, దగ్గరగా అయ్యాక.. నిమ్మరసం, కొత్తిమీర చల్లి దించేయాలి. ఇది తేలికగా జీర్ణమయ్యే ఆరోగ్యకరమైన అల్పాహారం. నూనె లేకున్నా ఈ వెజిటబుల్ ఉప్మా ఎంతో రుచిగా ఉంటుంది. మనం తినే ఆహారంతోనే ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. కొన్నిసార్లు ఇలాంటి జీరో ఆయిల్ వంటకాలను ప్రయత్నించడం.. అందులో భాగమే.



రాజనీతిశాస్త్ర పితామహుడైన అరిస్టాటిల్ రాజ్యాన్ని సజీవ శరీరంతో పోల్చారు. మానవ శరీరంలోని వివిధ అంగాల మధ్య ఏ విధమైన సంబంధం ఉంటుందో అదేవిధంగా రాజ్యం, దాని అంగాల మధ్య అదేవిధమైన సంబంధం ఉండాలని ఆయన విశ్వసించారు. కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలను నెలకొల్పాల్సిన ఆవశ్యకతను రాజ్యాంగ నిర్మాతలు గ్రహించారు. సమాఖ్య రాజ్యాల్లో ప్రజల ఆకాంక్షలు నెరవేరాలంటే కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సుహృద్భావ, ఘర్షణ లేని వాతావరణం ఉండాలి.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

శక్తిమంతమైన ప్రభుత్వం పరిపాలనా అంశాలపై అధికారం

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

భారత రాజ్యాంగం దేశంలో సమాఖ్య తరహా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు.

- సమాఖ్యలో రెండు రకాల ప్రభుత్వాలు ఉంటాయి. అవి:
  - కేంద్ర ప్రభుత్వం
  - రాష్ట్ర ప్రభుత్వం
- రాజ్యాంగంలోని 11వ భాగం కేంద్ర-రాష్ట్రాల మధ్య శాసన, పరిపాలనా సంబంధాలు, 12వ భాగం ఆర్థిక సంబంధాల గురించి తెలియజేస్తాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన సమాఖ్య రాజ్యాంగ ప్రధాన లక్షణం. భారత రాజ్యాంగం సమాఖ్య లక్షణాలతో పాటు ఏకకేంద్ర లక్షణాలను కూడా కలిగి ఉంటుంది.

కేంద్ర, రాష్ట్ర సంబంధాలు - వర్గీకరణ

దేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సంబంధాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:
- శాసన సంబంధాలు
- పరిపాలనా సంబంధాలు
- ఆర్థిక సంబంధాలు

శాసన సంబంధాలు

రాజ్యాంగంలోని 11వ భాగంలో 245 నుంచి 255 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉన్న శాసన సంబంధాల గురించి తెలియజేస్తాయి.

- పార్లమెంట్ దేశం మొత్తానికి లేదా కొంత ప్రాంతానికి చట్టాలు చేయవచ్చు. కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా పార్లమెంట్ చట్టాలు చేస్తుంది.
- రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్‌లో మొదటి జాబితా (కేంద్ర జాబితా)లో పేర్కొన్న ఏదైనా అంశంపై చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. ఇదే షెడ్యూల్ ప్రకారం రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం పార్లమెంట్‌తో పాటు రాష్ట్ర శాసనసభలకు కూడా ఉంటుంది.
- కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన అధికారాల పంపిణీని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:
  - కేంద్ర జాబితా
  - రాష్ట్ర జాబితా
  - ఉమ్మడి జాబితా

కేంద్ర జాబితా: కేంద్ర, రాష్ట్రాల మధ్య శాసన సంబంధాలను ఒక ప్రత్యేకమైన పద్ధతిలో విభజించారు. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి ఈ జాబితాలో '59' అంశాలను పొందుపర్చారు. భారత రాజ్యాంగం అమలు నాటికి 97 అంశాలు ఉండేవి. తదుపరి క్రమంలో 100కి చేరినా ప్రస్తుతం 98 అంశాలు ఉన్నాయి. కేంద్ర జాబితాలోని అంశాలపై చట్టాలు రూపొందించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది.

ఉదా: రైల్వేలు, దేశరక్షణ, పోస్టాఫీస్, బ్యాంకింగ్, ఆదాయపు పన్ను

రాష్ట్ర జాబితా: సాధారణ పరిస్థితుల్లో రాష్ట్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం రాష్ట్ర శాసనసభలకు ఉంటుంది. 1935 భారత ప్రభుత్వ చట్టం ప్రకారం ఇందులో 54 అంశాలు ఉండేవి. రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 66 అంశాలు ఉండగా ప్రస్తుతం 59 అంశాలు ఉన్నాయి.

ఉదా: వ్యవసాయం, ప్రజారోగ్యం, నీటిపారుదల, శాంతిభద్రతలు, స్థానిక స్వపరిపాలన సంస్థలు

ఉమ్మడి జాబితా: ఈ జాబితాలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలకు ఉంటుంది. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి ఇందులో 36 అంశాలు ఉండేవి. రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 47 ఉండగా, ప్రస్తుతం 52 అంశాలున్నాయి.

ఉదా: అడవులు, వివాహం-విడాకులు, విద్యుత్, వార్తాపత్రికలు మొదలైన అంశాలపై పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు చట్టాలు చేసినప్పటికీ, ఏదైనా సమస్య ఉత్పన్నమైతే పార్లమెంట్ రూపొందించిన చట్టాలు మాత్రమే అమల్లోకి వస్తాయి.

అవశిష్టాధికారాలు: పైన పేర్కొన్న మూడు జాబితాల్లో లేని అంశాలను అవశిష్టాధికారాలు అంటారు. వీటిపై శాసనాలు తయారుచేసే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. దీన్ని కెనడా నుంచి గ్రహించారు.

ఉదా: అంతరిక్షం, అణుశక్తి, సంపద పన్ను

ఆర్థిక సంబంధాలు

భారత రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక విషయాల్లో వివాదాలు లేకుండా పన్నుల విధింపు, సేకరణ, పంపిణీ గురించి పేర్కొంది. 12వ భాగంలో 268 నుంచి 293 వరకు ఉన్న అధికరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక సంబంధాలను తెలియజేస్తాయి.

కేంద్రం విధించే పన్నులు, సుంకాలు: దిగుమతి సుంకాలు, కస్టమ్స్, పొగాకు-జనపనారపై ఎక్సైజ్ సుంకం.

కార్పొరేషన్ పన్ను, మూలధన విలువపై పన్ను, రైల్వే, తంతి తపాలా, కరెన్సీ, నాణేల ముద్రణ మొదలైనవి.

రాష్ట్రం విధించి, ఉపయోగించే పన్నులు, సుంకాలు: భూమిశిస్తు, అమ్మకంపై పన్ను, టోల్‌టాక్స్, మద్యపానంపై పన్ను, వినోదపు పన్ను, విద్యుత్ వినియోగంపై పన్ను మొదలైనవి.

కేంద్రం విధించి, రాష్ట్రాలు సేకరించి ఉపయోగించుకునే పన్నులు: ఈ పన్నులను కేంద్రం విధిస్తుంది. అయితే వీటిని రాష్ట్రాలు సేకరించి, ఉపయోగించుకుంటాయి. **ఉదా:** ప్రామిసరీ నోట్లు

కేంద్రం విధించి, సేకరించి, రాష్ట్రాలకు పంపిణీ చేసే పన్నులు: వ్యవసాయేతర ఆస్తిపై ఎస్టేట్ సుంకం, రైల్వే ఛార్జీలు, రైల్వే వస్తువుల రవాణా ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను, ఇతర పన్నులను కేంద్రం విధించి, రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది.

కేంద్రం విధించి, వసూలు చేసి కేంద్ర-రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే పన్నులు: ఈ పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేస్తుంది. కానీ రాష్ట్రాలతో కలిసి పంచుకుంటుంది.

ఉదా: వ్యవసాయేతర ఆదాయంపై పన్ను, ఔషధేతర వస్తువులపై విధించే ఎక్సైజ్ సుంకాలు

పరిపాలనా సంబంధాలు


రాజ్యాంగంలోని 11వ భాగంలో 256 నుంచి 263 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య పరిపాలనా సంబంధాల గురించి తెలియజేస్తాయి.

- భారత సమాఖ్య వ్యవస్థ శక్తిమంతమైన కేంద్ర ప్రభుత్వాన్ని కలిగి ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని పరిపాలనా అంశాలపై అధికారాలను కలిగి ఉంటాయి. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్రాల పరిధిలోని పరిపాలనా అంశాలపై కేంద్ర ప్రభుత్వం తన అధికారాన్ని కలిగి ఉంటుంది. పరిపాలనా సంబంధాల్లో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో పోల్చినప్పుడు కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారాలు ఉంటాయి.

అత్యవసర పరిస్థితుల్లో: జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏకకేంద్ర ప్రభుత్వంలా అధికారాలు చెలాయించడానికి భారత రాజ్యాంగం అవకాశం కల్పించింది. రాష్ట్రపతి పాలన అమల్లో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను రాష్ట్రపతి తరఫున గవర్నర్ చెలాయిస్తారు. ఆర్థిక అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి ఆర్థిక విషయాల్లో కొన్ని షరతులను నిర్దేశించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఉద్యోగులు, హైకోర్టు న్యాయమూర్తుల జీతభత్యాలు తగ్గించమని రాష్ట్రపతి రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయవచ్చు.

సాధారణ పరిస్థితుల్లో: సాధారణ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను నియంత్రించేలా కొన్ని ప్రక్రియలను రాజ్యాంగం రూపొందించింది. కింది విషయాల్లో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన ఆదేశాలను జారీ చేయవచ్చు. అవి:

- కేంద్ర చట్టాలకు అనుగుణంగా రాష్ట్రాలు ఆ రాష్ట్ర చట్టాలను అమలు చేయాలి.
- కేంద్ర చట్టాల అమలు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారాలు అవరోధం కలిగించకూడదు.
- జాతీయ ప్రాధాన్యత ఉన్న లేదా సైనిక దళాలకు అవసరమైన టెలీకమ్యూనికేషన్ల లాంటి సాధనాలను నిర్వహించమని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించవచ్చు.
- రాష్ట్రాల పరిధిలో ఉండే రైల్వేల పరిరక్షణ.
- హిందీ భాష అభివృద్ధికి ఆదేశాలు జారీ చేయడం.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

999 Word of the Day

Reprobate

Telugu meaning: దుర్మార్గుడు, దుర్మార్గపు ప్రవర్తన

English meaning: As a noun, the word reprobate (రెప్రొబేట్) describes a person of unprincipled or immoral character. As an adjective, it refers to morally unprincipled behaviour.

Synonyms: Rogue, Corrupt; ***Antonyms:*** Saint, Virtuous

Usage: **1. As a Noun:** The novel portrays a reprobate who manipulates others for personal gain without any sense of guilt.

2. As an Adjective: His reprobate actions eventually led to his downfall and loss of reputation.

నోటిఫికేషన్స్

జీటీజీహెచ్‌లో ఉద్యోగాలు

రాజమహేంద్రవరం ప్రభుత్వ టీచింగ్ జనరల్ ఆసుపత్రి (జీటీజీహెచ్), ఆల్కహాల్ అండ్ డ్రగ్ డి-అడిక్షన్ సెంటర్ (ఏడీడీసీ)లో ఏడాది కాలపరిమితికిగాను తాత్కాలిక/ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 10. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 9 మే 2026.


దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (మే 3) చివరి తేదీ

- సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలీమెటిక్స్‌లో 16 పోస్టులు. బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు ఉద్యోగానుభవం ఉన్నవారు అర్హులు.
- బీఎంఎల్‌లో అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులు. డిప్లొమా పూర్తి చేసినవారు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం



మీడియాను ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిగా పేర్కొంటారు. కచ్చితమైన సమాచారాన్ని నిర్భయంగా అందించడం దీని విధి. ప్రస్తుతం ప్రభుత్వాలు, సంస్థలు, వివిధ వ్యక్తులు మీడియాపై ఆంక్షలు విధించి, పత్రికా స్వేచ్ఛకు ఆటంకం కలిగించే పరిస్థితులు నెలకొన్నాయి. పత్రికా సంస్థలు, విలేకరులపై భౌతిక దాడులు పెరిగిపోతున్నాయి. వీటన్నింటి నుంచి మీడియాను రక్షించే బాధ్యత మనందరిపై ఉంది. ప్రాథమిక హక్కుల్లో ఒకటైన భావ ప్రకటన స్వేచ్ఛను ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా **మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని (World Press Freedom Day)** నిర్వహిస్తారు. నిష్పక్షపాతంగా వార్తలు అందించే జర్నలిస్టులను గౌరవించడంతోపాటు పత్రికా స్వేచ్ఛ ప్రాముఖ్యాన్ని ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.


జనరల్ నాలెడ్జ్ — చరిత్రలో ఈనాడు — మే 3

పత్రికా స్వేచ్ఛ అంటే?

సమాచారం, ఆలోచనలు, జ్ఞానం, భావాల వ్యాప్తిపై చట్టబద్ధమైన, పాలనాపరమైన నియంత్రణ లేకపోవడమే పత్రికా స్వేచ్ఛ. అంటే మీడియా సంస్థలు ప్రభుత్వం లేదా బయటి వ్యక్తుల నుంచి అనవసరమైన జోక్యం లేదా సెన్సార్‌షిప్ లేకుండా వార్తలు ప్రచురించడానికి, అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి, సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి ఉండే హక్కే పత్రికా స్వేచ్ఛ.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

గజనీ మహమ్మద్ దండయాత్రలు



మహమ్మద్ ప్రవక్త తన బోధనల ద్వారా అరబ్బుల్లో చైతన్యం తెచ్చారు. అదే ఇస్లాం మతంగా రూపొందింది. తురుష్కులూ ఇస్లాంను అనుసరించారు. దీంతో అరబ్బులు, తురుష్కులు ఇస్లాం మత వ్యాప్తి కోసం ఇతర దేశాలపై దండయాత్రలు చేశారు. వీరు గజనీ మహమ్మద్ నేతృత్వంలో భారత్‌పైనా అనేక యుద్ధాలు చేశారు. సింధ్ ఆక్రమణతో దేశంలో వీరి పాలన ప్రారంభమైంది.

క్రీ.శ. 1000లో భారతదేశంలోని రాజకీయ పరిస్థితులు

గజనీ మహమ్మద్ భారతదేశంపై దండెత్తే నాటికి దేశం అనేక చిన్న రాజ్యాలుగా విడిపోయి ఉంది.

- అరబ్ దేశానికి ముల్తాన్, హింద్ షాహీ సరిహద్దు రాజ్యాలు. ముల్తాన్ పాలకుడు ఫతేదావూద్.
- షాహీ రాజ్యం పంజాబ్‌లో జీలం నది వరకు విస్తరించింది. దీని రాజధాని వైహింద్ లేదా ఉద్భండాపూర్. దీన్ని ఆనందపాలుడు పాలించేవాడు. ఇతడు రాజపుత్ర వంశానికి చెందినవాడు.

మహమ్మద్ గజనీ

సుబక్తజిన్ తర్వాత అతడి కుమారుడు మహమ్మద్ రాజయ్యాడు.

- ఖలీఫా ఖాదిర్ బిలాబ్ ఇతడికి యామిన్ ఉద్దౌలా, అమన్ ఉల్‌మిల్లత్ అనే బిరుదులు ఇచ్చాడు.

దండయాత్రలు

క్రీ.శ. 1000లో ఖైబర్ కనుమలోని కొన్ని కోటలు, పట్టణాలను ఆక్రమించాడు.

- క్రీ.శ. 1001లో భారత్‌లోకి ప్రవేశించి పెషావర్ పాలకుడైన జయపాలుడ్ని ఓడించి, బందీగా చేసుకున్నాడు.

Current Affairs



Defence Minister Rajnath Singh holding bilateral talks with his Italian counterpart Guido Crosetto in New Delhi on 30 April 2026 and exchanging a Bilateral Military Cooperation Plan (MCP) for 2026-27. The meeting, held at the Manekshaw Centre, focused on enhancing military engagements and expanding defence industrial cooperation between the two countries. Both ministers reaffirmed that the India-Italy Strategic Partnership is rooted in shared values of peace, stability, freedom, and mutual respect.

The Department for Promotion of Industry and Internal Trade (DPIIT) signed a Memorandum of Understanding (MoU) with Chamber India to strengthen India's startup ecosystem and promote innovation-led growth. The Ministry of Commerce and Industry said that the partnership aims to enhance engagement between startups, corporates, investors, and global stakeholders, while facilitating international linkages and cross-border collaboration.

The Ministry of Statistics and Programme Implementation (MoSPI) on 29 April 2026 released the 27th edition of its publication, Women and Men in India 2025: Selected Indicators and Data, presenting a broad overview of gender-related trends across population, education, health, employment and decision-making in India. The publication was released at the National Deliberative Summit on "Data for Development" in Bhubaneswar.

For more Current Affairs: Scan QR code

Mirror Images

Directions (Qs. 1 - 17): *Select the correct mirror image of the given figure when the mirror is placed at MN as shown below*


1. Pe39EK | MN
A) ꓘƎ9ɛɘꟼ B) ꓘƎ⌒3ꟼ
C) KE⌒3P D) KEꟼɯ9


2. 12649 | MN
A) 94⌒21 B) 9ᔭ6Ƨ1
C) 6ᔭ6Ƨ1 D) 6ᔭ6Ƨ1

3. c25QG | MN
A) GQƧ2c B) ƎQ52ɔ
C) GQ5Ƨɔ D) ƎQƧƧɔ

4. CTORK | MN
A) ꓘЯOTƆ B) KROꓕC
C) ꓘЯOꓕƆ D) KЯOTC

5. 12678 | MN
A) 87621 B) 8ᒣ⌒Ƨ1
C) 8ᒣ6Ƨ1 D) 87ɘƧ1

6.



7.


8. fgKCP | MN
A) PCꓘgf B) ꟼƆꓘgɟ
C) ꟼƆKgɟ D) PCKgf

9. 69523 | MN
A) ƐƧƧ6ɘ B) ƐƧ5ɘ6
C) 325ɘɘ D) Ɛ2596

10. iIpPcC | MN
A) ɔƆPqiI B) Ɔɔꟼqli
C) CcPpiI D) Ccꟼqil


Railway Exams
Reasoning


11.



12. GORTP | MN
A) PꓕЯOG B) ƎOЯTP
C) ꟼTЯOG D) GOЯꓕꟼ

13. 10978 | MN
A) 89ᒣ0I B) 81097
C) 8019ᒣ D) 8ᒣɘ0I

14. ImNoP | MN
A) ꟼoИmI B) ImИoP
C) ImNoꟼ D) PoNIm

15.


16.


17.


Scan the QR code for Key

These model questions were prepared by subject experts

శునకాల్ని చల్లగా చూసుకుందాం..

వేసవి కాలంలో మనతో పాటు... మూగజీవాలూ విలవిల్లాడుతుంటాయి. ఈ సమయంలో ఇంట్లో పెంపుడు జంతువుల విషయంలో యజమానులు చాలా అప్రమత్తంగా ఉండాలి. లేకుంటే అవి తీవ్ర అనారోగ్యం బారిన పడతాయి. వాటి విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.



1. మంచినీరు ప్రాణాధారం



- ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పెంపుడు శునకాలను వడదెబ్బ నుంచి కాపాడుకోవడానికి వాటికి అందుబాటులో చల్లని తాగునీరు ఉంచండి.
- నీటిని ఉంచే పాత్రలను రోజుకు రెండు మూడు సార్లు శుభ్రం చేయాలి. ఇచ్చే నీటిలో ఎలక్ట్రోలైట్స్ ఉండేలా చూసుకోవాలి.

2. నడక సమయాల్లో మార్పు



- పెంపుడు శునకాలను మధ్యాహ్నం వేళల్లో బయటకు తీసుకెళ్లకపోవడం ఉత్తమం. ఉదయం 7 గంటల లోపు లేదా సాయంత్రం 7 గంటల తర్వాత వాకింగ్‌కు తీసుకెళ్లాలి. ఎండ కంటే నేల వేడిగా ఉన్నప్పుడు వాటి పాదాలకు బొబ్బలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అలా కాకుండా ఉండాలంటే అరచేతిని నేల మీద ఉంచి పరీక్షించండి. మీరు 5 సెకన్లు భరించలేకపోతే అది పప్పీకి కూడా ప్రమాదమే.

3. ఆహార నియమాలు



- వేసవిలో ఆకలి తక్కువగా ఉంటుంది. కాబట్టి తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి.
- పెరుగు, మజ్జిగ అన్నం పెట్టడం వల్ల వాటి శరీరం చల్లబడుతుంది. కొన్ని సంద ర్భాల్లో ఇవి కొన్ని పెంపుడు జంతువులకు పడకపోవచ్చు. అవి తినకపోతే ఎగ్ వైట్ వంటివి పెట్టవచ్చు.
- మాంసాహారం తగ్గించి, నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయ (గింజలు తీసేసి) వంటి పండ్లను ఇవ్వవచ్చు.

4. వడదెబ్బ లక్షణాలు



- అతిగా రొప్పుతుండటం
- నోటి నుంచి చొంగ కారడం
- నీరసంగా ఉండడం
- కళ్లు ఎర్రబడడం
- ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని నీటితో వాటి శరీరాన్ని తుడిచి, దగ్గరలోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలి.

5. ఇంట్లోనే సురక్షితం



- శునకాలను గాలి ఆడే గదిలో లేదా ఫ్యాన్ కింద ఉంచడం ఉత్తమం.
- వాటికి ఎండ తగలకుండా తగిన నీడ ఉండేలా చూసుకోవాలి.
- ముఖ్యంగా కార్లలో పప్పీలను వదిలి వెళ్లకూడదు. కారు లోపల ఉష్ణోగ్రత నిమిషాల్లోనే ప్రమాదకర స్థాయికి చేరుకుంటుంది. దీని వల్ల శునకాలు మృతి చెందే అవకాశం ఉంటుంది.

6. కేశ సంరక్షణ



- వాతావరణం బాగా ఎండగా ఉన్నా యని.. కుక్కల రోమాలను పూర్తిగా కత్తిరి స్తుంటారు. ఇది తప్పుడు పద్ధతి.
- కుక్కల వెంట్రుకలు వాటికి ఒక 'ఇన్సు లేటర్'లా పనిచేసి వేడి నుంచి రక్షణ ఇస్తాయి.
- కేవలం వెంట్రుకలను ట్రిమ్ చేయడం, రోజూ బ్రష్ చేయడం ద్వారా గాలి ప్రసరణ పెంచవచ్చు.

కుక్కలు నిద్రించే చోట గాలి ధారాళంగా ఆడేలా చూడాలి. వీలైతే కూలర్ లేదా ఏసీ సౌకర్యం ఉన్న గదిలో ఉంచాలి. పొరపాటున కూడా ఎండలో కట్టేయొద్దు. అలాగే పార్కింగ్ చేసిన కార్లలో వాటిని వదిలి వెళ్తే మృతిచెందే అవకాశం ఉంటుంది.
– విక్రమ్ చైతన్య, వెటర్నరీ వైద్యులు, హైదరాబాద్

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్

పిడుగుపాటుతో ఇద్దరి మృతి

న్యూస్‌టుడే- చంద్రుగొండ, బూర్గంపాడు: తెలంగాణలోని భద్రాదికొత్తగూడెం జిల్లాలో శనివారం పిడుగుపాటుతో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ముగ్గురు గాయాల పాలయ్యారు. చంద్రుగొండ మండలం గానుగ పాడుకు చెందిన కోంద్రు వినోద్(27) తన ఇద్దరు స్నేహి తులతో కలిసి గ్రామ సమీపంలో మొక్కజొన్న చేనులో పని చేస్తున్న మరో స్నేహితుడు కాంతారావును కలిసేం దుకు వెళ్లారు. అక్కడ నలుగురూ కలిసి మాట్లాడుకుం టుండగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. వారంతా అక్కడే ఉన్న ఓ చెట్టు కిందకు వెళ్లారు. ఇంతలో వారికి సమీపంలో పిడుగు పడటంతో నలుగురూ స్పృహ కోల్పోయారు. స్థానికులు వారిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో వినోద్ మృతి చెందారు. మిగతా వారు చికిత్స పొందుతున్నారు. బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన గోపయ్య (50) సాయంత్రం తన పొలంలో పని చేసుకుంటుండగా పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందారు.

'టెలీ మానస్'ను ఆశ్రయిస్తున్న వారిలో 52% మహిళలే

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఉరుకుల పరుగుల జీవి తంలో చాలా మందిని ఆందోళన, నిరాశ, కుంగుబాటు పీడిస్తోంది. కుటుంబ, ఉద్యోగ, ఆర్థిక, వ్యక్తిగత సమస్య లతో పెద్దలు.. చదువులు, పరీక్షల భయంతో చిన్నా రులు.. గృహహింస, వేధింపుల సమస్యలతో మహి ళలు.. నిద్రలేమి, ఒంటరితనంతో వృద్ధులు బాధపడు తున్నారు. వీరికి సాంత్వన చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం 'టెలీ మానస్' కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నంలోని టెలీ మానస్ కేంద్రాల హెల్ప్ లైన్ నంబరు 14416కి ఫోన్ చేస్తే మానసిక వైద్య నిపుణులు సలహాలు, సూచనలు అంది స్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా కేంద్రాలను ఆశ్రయిస్తున్న బాధితుల్లో 52% మంది మహిళలే ఉన్నారని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం వెల్లడించింది.

- టెలీ మానస్‌ను అత్యధికంగా విశాఖ, కర్నూలు, గుంటూరు, నంద్యాల, ఎన్టీఆర్, కృష్ణా తదితర జిల్లాల నుంచి ఆశ్రయిస్తున్నారు.
- అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీ పురం మన్యం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి కాల్స్ వస్తున్నాయి.
- 24 గంటలూ సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రభుత్వం కౌన్సెలర్లను అందుబాటులో ఉంచింది.

మానసిక సమస్యతో సతమతం...

ప్రతి 100 మందిలో 10.06% మంది మానసిక సమ స్యలతో బాధపడుతున్నారని 'నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే'లో తేలింది. దేశవ్యాప్తంగా 19.7 కోట్ల మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం 53 టెలీ మానస్ కేంద్రాల ద్వారా బాధితులకు కౌన్సెలింగ్ వ్యవస్థను అందుబాటు లోకి తెచ్చింది. రాష్ట్రంలో 2022లో విజయవాడలో, 2023లో విశాఖలో ఏర్పాటుచేసిన టెలీ మానస్ కేంద్రా లకు ఇప్పటివరకు 67,573 కాల్స్ వచ్చాయి.

కౌన్సెలింగ్‌లో గుర్తించిన సమస్యలివీ..

- మానసిక కుంగుబాటు: 19.87%
- ఉద్యోగ సమస్యలు, పరీక్షల భయం: 19.20%
- నిద్రలేమి సమస్యలు: 15.57%
- ఆందోళన, భయాలు: 11.7%
- వ్యసనాల నుంచి విముక్తి కోసం: 7.2%
- ఇతర సమస్యలతో..: 26.46%

అదృశ్యమైన వారి ఆచూకీ గుర్తింపులో కీలకంగా 'సీసీ టీవీ-360'

హత్య, దొంగతనం కేసుల్లో నిందితులను పట్టించిన వైనం

ఈనాడు, అమరావతి: వివిధ కేసుల దర్యాప్తులో రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) సాంకేతికత పోలీసులకు దన్నుగా నిలుస్తోంది. తాజాగా అయిదు కేసుల ఛేదనలో 'ఆర్టీజీఎస్ సీసీటీవీ-360' వ్యవస్థ కీలకపాత్ర పోషిం చింది. అదృశ్యమైన బాలికల్ని గుర్తించడం, ద్విచక్ర వాహనాల దొంగ కదలి కల్ని కనిపెట్టడం, హత్య కేసు నిందితుణ్ని పట్టించడంలో సర్వైలెన్సు కెమె రాలు కీలకంగా పనిచేశాయి. ● కర్నూలు జిల్లా నందవరం పోలీస్ స్టేషన్‌లో 17 ఏళ్ల బాలిక ఏప్రిల్ 22న అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందింది. ఆమె ఫొటోను ఆర్టీజీఎస్ సీసీటీవీ-360 అప్లికేషన్‌లో అప్‌లోడ్ చేసి, టైమ్ సెన్సి టివ్ ఎప్రోచ్ ద్వారా డిజిటల్ గాలింపు చేపట్టారు. ఆమె విజయవాడ నగ రంలోని ఓ ప్రధాన కూడలిలో ఉన్నట్లు ఆర్టీజీఎస్ రియల్‌టైమ్ పోలీసులకు ఎలర్టులు పంపింది. దీంతో బాలికను సకాలంలో పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు.● నంద్యాల జిల్లా గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలో అదృ శ్యమైన 16 ఏళ్ల బాలికను గుర్తించడం, చిత్తూరు జిల్లా రొంపిచెర్లలో అదృశ్య మైన యువతి ఆచూకీ కనుక్కోవడంలోనూ ఈ వ్యవస్థ కీలకంగా పనిచేసింది. ● తాడేపల్లిగూడెంలో ఏప్రిల్ 15న హత్య, దోపిడీ కేసు నిందితుణ్ని పట్టుకో వడంలోనూ ఈ వ్యవస్థ ఉపకరించింది. నిందితుడి కదలికలు కెమెరాల్లో నమోదవడంతో అతడిని గుర్తించడం పోలీసులకు సులభమైంది. పోలవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన ఓ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు గుర్తించి, దాన్ని దొంగిలించిన నిందితుణ్ని పట్టుకున్నారు.

వాట్సప్‌తోనూ కొల్లగొడుతున్నారు

- పెద్ద సంస్థలపై సైబర్ నేరగాళ్ల దృష్టి
- బాస్ పేరుతో నకిలీ మెసేజ్‌లు
- ఇటీవల మూడు కేసులు నమోదు
- బాధితులు పోగొట్టుకున్న మొత్తం రూ.4 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: బాస్ ఫోన్ నుంచి వాట్సప్ మెసేజ్. అర్జెంటుగా ఫలానా ఖాతాకి రూ. రెండు కోట్లు బదిలీ చేయాలని ఆదేశం. వాట్సప్ డీపీతోపాటు ఫోన్ నంబర్ కూడా బాస్‌దే కావడంతో అనుమానం రాలేదు. పైగా క్లైయింట్ పేరు కూడా అదే. దాంతో ఆ ఉద్యోగి బాస్ చెప్పినట్లే డబ్బు బదిలీ చేశారు. మర్నాడు ఆఫీసుకు వచ్చిన బాస్, ఖాతాలో సొమ్ము తక్కు వగా ఉండటంతో అనుమానం వచ్చి విచారిస్తే అసలు విషయం బయటపడింది. తాను పంపిన ట్లుగా ఉన్న మెసేజ్ చూసి ఖంగుతిన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మధ్యకా లంలో హైదరాబాద్ కమిషనరేట్లో వరుసగా ఇలాంటి కేసులు మూడు నమోదు కాగా బాధి తులు రూ.4 కోట్లు పోగొట్టుకున్నారు. పెద్దపెద్ద కంపెనీలే లక్ష్యంగా మొదలైన ఈ తరహా నేరాల విషయంలో అప్రమత్తంగా లేకపోతే ఇది మరో డిజిటల్ అరెస్టు మాదిరి మారే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఎలా జరుగుతోంది...

ఇప్పుడు వాట్సప్‌ను కంప్యూటర్‌కు అనుసంధా నించడం మామూలైంది. ప్రత్యేకంగా ఫోన్ చూసుకునే బదులు కంప్యూటర్‌కు అనుసంధాన మైతే పని చేసుకుంటూనే వాట్సప్ చూసుకోవ చ్చన్న ఆలోచనే ఇందుకు కారణం. దాంతోపాటు దాదాపు ప్రతి సంస్థ విధి నిర్వహణలో భాగంగా తన సిబ్బందితో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంది. అందుకే సంస్థ యజమా నులు మొదలు సిబ్బంది వరకూ అంతా తమ వాట్సప్‌ను కంప్యూటర్‌తో అనుసంధానం చేసుకుం టున్నారు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు దీన్నే ఆయు ధంగా మార్చుకుంటున్నారు. తొలుత సంస్థలోని ఎవరో ఒక ఉద్యోగికి మెయిల్ పంపుతారు. దాన్ని తెరవగానే కంప్యూటర్లో మాల్‌వేర్ చేరుతుంది. అప్పటి నుంచి కంప్యూ టర్‌లో జరుగుతున్న వ్యవహారాలు సైబర్ నేరగాడికి చేరిపోతుంటాయి. ఈ కంప్యూటర్‌కు వాట్సప్ అనుసంధానం కాగానే సదరు కంపెనీకి సంబంధించిన వివిధ గ్రూపుల్లో జరుగుతున్న సంభాషణలను నేరగాళ్లు చూస్తుంటారు. లావాదేవీలను గమనిస్తూ ఎక్కువ మొత్తంలో చెల్లిం పులు జరుపుతున్న సంస్థల పేర్లను పోలిన పేర్లతోనే బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. సంస్థ యజమాని ఫొటో, ఫోన్ నంబర్ తదితర వివ రాలను అప్పటికే తస్కరిస్తారు. ఆర్థిక లావాదేవీలు నిర్వహించే గ్రూపులో ప్రధాన ఎకౌంటెంట్ తన బాస్ పేరును ఎలా సేవ్ చేసు కొని ఉంటారో గమనించి నేరగాళ్లు కూడా అదే పేరుతో మెసేజ్ పంపు తారు. డీపీ కూడా బాస్‌దే ఉండటంతో ఎవరికీ అనుమానం రాదు. తాను ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నానని, ఫలానా ఖాతాకు డబ్బు బదిలీ చేయమని ఆదేశిస్తున్నారు.

ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి: సజ్జనార్

డబ్బు బదిలీ చేయమని సందేశం వస్తే కచ్చితంగా ఫోన్ చేసి నిర్ధా రించుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తమ కంప్యూ టర్‌లోకి మాల్‌వేర్ జొరబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యాంటీ వైరస్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలి. అనుమానాస్పద మెయిల్స్ తెరవవద్దని కార్యాలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలి. ఒకవేళ డబ్బుపోయినట్లు గమనిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. వాడకం పూర్తయిన తర్వాత ప్రతిసారీ వాట్సప్‌ను లాగవుట్ చేయాలి.



సగటు వ్యక్తులుగా మిగిలిపోకూడదంటే..

సగటు వ్యక్తుల అలవాట్లు: ✦ టీవీ, ఆన్‌లైన్ గేమ్స్‌తో కాలక్షేపం చేయడం. ✦ సోషల్ మీడియా స్క్రోలింగ్‌తో బుర్రలో చెత్తను నింపుకోవడం. ✦ పార్టీలు, షాపింగ్‌లలో ఆనందాన్ని వెతుక్కోవడం. ✦ ఇతరులను విమర్శించుకుంటూ కూర్చోవడం.

లక్ష్యం కోసం పనిచేసేవారి అలవాట్లు: ✦ జిమ్‌లో వ్యాయామం చేయడం. ✦ కొత్త విషయాలు, నైపుణ్యాలు నేర్చుకోవడం. ✦ ఉన్నత లక్ష్యంతో ఉన్న వ్యక్తులతో సత్సంబంధాలు ఏర్పర్చుకోవడం. ✦ సృజనాత్మకంగా ఆలోచిస్తూ క్రమశిక్షణతో పనిచేయడం. – లిల్లీ, లైఫ్‌కోచ్

వైద్య విద్యార్థులకు సెలవులివ్వరాదన్న ఎన్‌ఎంసీ ఉత్తర్వులపై వివాదం

దిల్లీ: నీట్-యూజీ 2026 ప్రవేశ పరీక్ష నేపథ్యంలో ఈ నెల 2, 3తేదీల్లో వైద్య విద్యా ర్థులకు సెలవులు ఇవ్వరాదంటూ జాతీయ వైద్య మండలి (ఎన్‌ఎంసీ) నుంచి కళాశాల లకు ఉత్తర్వులు జారీ కావడంపై వివాదం తలెత్తింది. వీటిని తక్షణమే ఉపసంహరించు కుని, క్షమాపణలు తెలపాలని ఎన్‌ఎంసీని అఖిల భారత వైద్యుల సంఘం డిమాండ్ చేసింది. నీట్ యూజీ ప్రవేశ పరీక్ష పవిత్ర తను, నిష్పాక్షికతను కాపాడటం కోసం వైద్య కళాశాలన్నీ అప్రమత్తంగా ఉండాలంటూ ఏప్రిల్ 23న ఎన్‌ఎంసీ ఉత్తర్వులు ఇచ్చింది. పరీక్షల్లో వైద్య విద్యార్థులకు అక్రమాలకు సహకరిస్తారని అనుమానించడం సరికాదని వైద్యుల సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

కరీబియన్ దేశాల పర్యటనకు జైశంకర్

దిల్లీ: విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం నుంచి తొమ్మిది రోజుల పాటు కరీబియన్ దేశాల్లో పర్యటించనున్నారు. జమైకా, సురినామ్, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలతో భారత వ్యూహాత్మక, సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి ఆయన ఈ సందర్భంగా కృషి చేస్తారు.

తుక్కు సామాన్లతో ఎలక్ట్రిక్ బైకులు ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల ప్రతిభ

ఈటీవీ భారత్: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లా ప్రభుత్వ గ్రీన్ ఐటీఐ విద్యా ర్థులు తుక్కు సామాన్లతో ఈ-బైక్‌లు రూపొం దిస్తున్నారు. ఇవి పర్యావరణ హితంగా ఉంటూ రోజువారీ ప్రయాణ ఖర్చులను కూడా ఆదా చేస్తాయని విద్యార్థులు అంటు న్నారు. పాత మోపెడ్‌లు, మోటార్‌సైకిళ్లకు కొత్త రూపు ఇవ్వాలనే ఆలోచనతో వీటిని రూపొందించారు. బ్యాటరీలు, ఎలక్ట్రిక్ మోటార్ల వంటి అవసరమైన భాగాలను మార్కెట్లో కొనుగోలు చేసి, ఈ ప్రాజెక్టును ఒక ప్రయోగాత్మక కార్యక్రమంగా ప్రారంభిం చామన్నారు. ఈ బైక్‌లు, మోపెడ్‌లను ఒక్క సారి ఛార్జ్ చేస్తే 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం సులభంగా ప్రయాణించవచ్చని చెప్పారు. ఇదే బైక్‌ను మార్కెట్‌లో కొను గోలు చేస్తే రూ.లక్షకు పైగా ఉంటుందని, తమ విద్యార్థులు రూపొందించిన బైక్‌కు రూ. 40,000 మాత్రమే ఖర్చయినట్లు ఐటీఐ శిక్షణా ధికారి సందీప్‌కుమార్ జైన్ వివరించారు.



తాము ఓడుతూ.. అందరినీ ఓడిస్తూ!

పశ్చిమాసియా యుద్ధం మొదలై రెండు నెలలైంది. ఒక్కసారి వెనక్కి తిరిగి చూసు కుంటే... ఇందులో భాగమైన దేశాలన్నీ ఓడుతూ... ప్రపంచాన్నీ ఓడిస్తున్నాయ్! ఆధునిక యుద్ధంలో విజేతలుండరు.. అందరూ పరాజితులే.. అంటే ఇదేనేమో..!



అమెరికా

యుద్ధాన్ని ఒకట్రెండు వారాల్లో ముగిస్తా మంటూ రంగంలోకి దిగిన అమెరికాకు ఈ యుద్ధం ఎదురు దెబ్బే అని చెప్పాలి. రెండు నెలలైనా యుద్ధంలో అగ్రరాజ్యం నిర్ణయా త్మక విజయం సాధించలేకపోయింది. గల్ఫ్ దేశాల్లో తన సైనిక స్థావరాలపై ఇరాన్ చేసిన దాడులను నిలువరించలేకపోయింది. దీంతో గల్ఫ్ దేశాల నమ్మకాన్ని కోల్పోయింది. ఈ యుద్ధం కారణంగా ఐరోపాతోనూ సంబంధాలు దెబ్బతిన్నాయి. హర్మూజ్ జలసంధి తెరవడా నికి సహకరించాలన్న విజ్ఞప్తిని నాటో దేశాలు కూడా పక్కనపెట్టడం అమెరికాకు ఊహించని పరిణామం. మరోవైపు దేశీయంగా గ్యాస్ ధరలు పెరగడంతో అగ్రరాజ్యంలో ద్రవ్యో ల్బణం 3.3 శాతానికి చేరింది. రాజకీయం గానూ ఈ యుద్ధం అధ్యక్షుడు ట్రంప్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఆయన పాపులారిటీ 37% శాతానికి పడిపోయింది. పెరిగిన ధరల కారణంగా.. యుద్ధం ఎంత కాలం సాగితే, ట్రంప్ అంత బలహీనమైన నాయకుడిగా కని పించే అవకాశం ఉంది. ఇరాన్ అగ్రనేతలను చంపామన్న సంతోషం తప్పిస్తే... ఇజ్రాయెల్ కూడా సాధించిందేమీ లేదు. పైగా తన రక్షణ బలహీనతలను బయటపెట్టుకుంది.

ఇరాన్

పైకి గాంభీర్యం ప్రకటిస్తున్నా... యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోయింది. ఆ దేశ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సుప్రీంనేత ఖమేనీ సహా కీలక నేతలందరూ హతమయ్యారు. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయి. ద్రవ్యో ల్బణం 67 నుంచి 69 శాతం మధ్యలో ఉంది. యుద్ధం కారణంగా 10 లక్షల మంది ఉద్యో గాలు కోల్పోయారు. ఇంటర్నెట్‌పై ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. దీంతో మళ్లీ తిరుగుబాటు వస్తుందన్న భయం ఇరాన్ పాలకులను భయ పెడుతోంది. ఐఆర్‌జీసీ, ప్రభుత్వం మధ్య విభే దాలు కూడా తారస్థాయికి చేరుకున్నాయి.

గల్ఫ్ దేశాలు

ఈ యుద్ధం కారణంగా తీవ్రంగా ప్రభావి తమైంది గల్ఫ్ దేశాలే. హర్మూజ్ జలసంధి దిగ్బంధనంతో సౌదీ అరేబియా, యూఏఈ ఇరాక్, కువైట్, ఖతార్ తదితర దేశాల చమురు, సహజ వాయువు ఎగుమతులు దాదాపుగా నిలిచిపోయాయి. దీంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. ఇజ్రాయెల్ కంటే ఎక్కువగా గల్ఫ్ దేశాల పైనే ఇరాన్ దాడులు నిర్వహించింది. దీంతో ప్రపంచ వ్యాపార, పర్యాటక కేంద్రాలు వెలుగొందిన గల్ఫ్ నగ రాల ప్రతిష్ఠ దెబ్బతింది. అమెరికా సైనిక స్థావరాలున్నాయి.. తమ రక్షణకు ఢోకా లేదని ఇన్నాళ్లూ అనుకున్న గల్ఫ్ దేశాలకు ఈ యుద్ధం ఆ భ్రమలను పటాపం చలు చేసింది. దీంతో రక్షణ కోసం అమెరికాపై ఆధారపడటంపై పున రాలోచనలో పడ్డాయి. గల్ఫ్ దేశాల ఐక్యతకూ ఈ యుద్ధంతో బీటలువారింది. ఒపెక్ నుంచి యూఏఈ నిష్క్రమించింది.

ప్రపంచం

హర్మూజ్ జలసంధి దిగ్బంధనంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో తమ చమురు అవసరాలకు గల్ఫ్ దేశా లపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్, చైనా, జపాన్ వంటి దేశాలకు ఈ యుద్ధం శరాఘాతమైంది. ఇంధన ధరలు పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా వస్తువుల రవాణా ఖర్చులు పెరిగాయి. ఎరువుల తయారీలో వినియోగించే యూరియాలో మూడో వంతు కూడా హర్మూజ్ జలసంధి నుంచే వస్తుంది. ఈ మార్గాన్ని మూసివేయడంతో ఎరువుల ధరలు కూడా ఆకాశాన్ని తాకాయి. ఆఫ్రికా, ఆసియా దేశాల్లోని రైతులు పంటలు పండించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఐరోపాకు ముడి చమురు, సహజ వాయువు సరఫరా నిలిచిపో యింది. దీంతో గ్యాస్ ధరలు దాదాపు రెట్టింపు అయ్యాయి. జర్మనీ, ఇటలీ వంటి దేశాలు 2026 చివరి నాటికి ఆర్థిక మాంద్యంలోకి వెళ్తా యని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

- నేషనల్ డెస్క్

మీకు చేరిందా ఆ హెచ్చరిక?

'సచేత్' విపత్తుల అప్రమత్తత వ్యవస్థ ప్రారంభం

దిల్లీ: ప్రకృతి విపత్తులు సంభవించే ప్రదే శాల్లో స్థానిక ప్రజల్ని అప్రమత్తం చేసే జాతీయ "సెల్ బ్రాడ్‌కాస్ట్ అలర్ట్ సిస్టమ్"ను కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శనివారం లాంఛనంగా ప్రారంభిం చారు. కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా మార్గదర్శనంలో ఈ అప్రమత్తత వ్యవస్థ రూపొందిందని ఒక అధికార ప్రకటన తెలి పింది. "సచేత్ అత్యవసర అప్రమత్త వ్యవస్థ' ' పేరుతో రూపొందించిన ఈ సాంకేతికతను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో టెలీ కమ్యూనికేష న్ శాఖ (డీఓటీ), జాతీయవిపత్తు నిర్వహణ సంస్థ(ఎన్‌డీఎంఏ) సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. దీనిని పరీక్షించే క్రమంలో ప్రజల ఫోన్లకు ఆంగ్లంతో పాటు వారి ప్రాంతీయ భాషల్లో డమ్మీ ఎమర్జెన్సీ సందేశం పంపి అప్రమత్తం చేశారు. ఉదయం 11.46 నిమిషా లకు ఫోన్‌లకు పెద్ద శబ్దం/ వైబ్రేషన్‌తో అత్యవసర హెచ్చరిక నోటిఫికేషన్ వచ్చింది. డిస్‌ప్లేపై ఆ సందేశం ప్రత్యక్షమైంది. ఇది పరీక్ష మాత్రమేనని, ఎవరూ భయపడొద్దని ఆ సందేశం పేర్కొంది. మే 2న హెచ్చరికలు వస్తాయని, ఎవరూ భయాందోళనలకు గురి కావద్దని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ముందుగానే సమాచారం ఇచ్చింది.

భాజపాలో చేరిన ఎంపీపై పంజాబ్ పోలీసుల ఎఫ్ఐఆర్

దిల్లీ: రాజ్యసభ సభ్యుడు సందీప్ పాఠక్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఇవి నాన్ బెయిలబుల్ కేసులు. ఆమ్ ఆద్మీ పార్టీని వీడి.. సందీప్ పాఠక్ భాజపాలో చేరిన కొద్ది రోజులకే ఆయనపై కేసులు నమోదు కావడం గమనార్హం. వీటి వివరాలే మిటనేది వెల్లడికాలేదు. పంజాబ్ పోలీసులు పాఠక్ ఇంటి వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దీంతో ఆయనను అరెస్టు చేసే అవ కాశం ఉన్నట్లు తెలుస్తోంది.



లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో కొలువుదీరిన సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ మైనపు బొమ్మలు. ఈ వారం సినిమా, క్రికెట్ ప్రపంచానికి చెందిన ప్రముఖుల మైనపు బొమ్మలను ప్రదర్శిస్తూ 'ఐకాన్స్ ఆఫ్ ఇండియా' వేడుకలను ప్రారంభించింది. ప్రముఖ బ్రిటిష్ పర్యాటక ఆకర్షణలోని ప్రత్యేక అవార్డ్స్ పార్టీ జోన్‌లో 13 మంది ప్రముఖ భారతీయ నటులు, క్రికెటర్ల మైనపు బొమ్మలు ఉంటాయి.

2029 ఎన్నికల్లో భాజపా, శివసేన విడిగా పోటీ: 'మహా' మంత్రులు

ముంబయి: మహారాష్ట్రలో మహాయుతి కూట మిగా ఏర్పడి సంకీర్ణ సర్కారు నడుపుతున్న భాజపా, శివసేన 2029 ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేస్తాయని ఆ రాష్ట్ర సామాజిక న్యాయశాఖ మంత్రి సంజయ్ శిర్సాట్ (శివసేన) శనివారం వెల్లడించారు. తదుపరి ఎన్నికల్లో పోటీ గురించి ఇరు పార్టీల మధ్య నిర్దిష్టమైన ఒప్పందం లాంటిది ఏదీ లేదన్నారు. 2014లో ఒక సీటు కారణంగా తలెత్తిన వివాదంతో భాజపా, శివసేన కూటమి విడిపోయిందని.. పార్టీలు తమ సొంత బలంపై పోటీ చేయాలనుకోవడంలో ఎటువంటి తప్పు లేదని చెప్పారు. రాబోయే సవాలును ఎదుర్కొనే సత్తా శివసేనకు ఉందన్నారు. రాజకీయాల్లో ప్రతి పార్టీ మరింత విస్తరించాలనే కోరుకొంటుందని మరో మంత్రి ఉదయ్ సామంత్ (శివసేన) తన సహచరుడి వాదనకు వత్తాసు పలికారు. ■ శివసేన మంత్రుల వ్యాఖ్యలపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ స్పందన కోరగా "మా ఉప ముఖ్యమంత్రి, శివసేన అధ్యక్షుడు శిందే అటు వంటి ప్రకటన చేస్తే మాట్లాడతా" అన్నారు.

ఇకపై యాప్‌లో కాశీ విశ్వనాథుని దర్శనం!

వారణాసి: ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న కాశీ విశ్వనాథుని ఆలయంలో భక్తుల సౌక ర్యార్థం శ్రీ కాశీ విశ్వనాథ ఆలయ ట్రస్టు ఓ యాప్ ఆధారిత దర్శన విధానాన్ని ప్రవేశపెట్ట నుంది. భాషా అవరోధాలు, ప్రాంతీయ భేదాల కారణంగా భక్తులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో ఈ నూతన విధానం సహా యపడుతుందని ట్రస్ట్ సీఈవో విశ్వ భూషణ్ మిశ్ర విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ నెల 1 నుంచి మొదలైన ఈ ప్రణాళికను దశల వారీగా అమ లుచేయనున్నట్లు ఆయన తెలిపారు. దీని ప్రకారం.. సుగమ దర్శనం, అభిషేకం వంటి ప్రత్యేక పూజా సేవలను కోరుకునే భక్తులు ఆధార్ వివరాలతో సహా ప్రాథమిక సమాచారం అందించాల్సి ఉంటుంది. అధికారుల వద్ద సంద ర్శకుల ప్రాథమిక సమాచారం పరిమిత కాలం పాటు మాత్రమే అందుబాటులో ఉంటుంది.

ఎట్టకేలకు 'ఎస్వాటిని'కి తైవాన్ అధినేత

తైపే: తైవాన్ అధ్యక్షుడు లాయి చింగ్ టే ఎట్టకేలకు తమను ప్రత్యేక దేశంగా గుర్తించిన ఏకైక ఆఫ్రికా దేశమైన ఎస్వాటి నికి శనివారం చేరుకున్నారు. తైవాన్ అధ్య క్షునిగా ఆయన అధికారిక విమానం తమ ఆకాశ మార్గంలో నడిచేందుకు వివిధ దేశాలు అనుమతి నిరాకరించిన కారణంగా ఇదివరకు ఆయన పర్యటన వాయిదా పడింది. నిజానికి లాయి చింగ్ టే గత ఏప్రి ల్‌లోనే ఎస్వాటిని సందర్శించాల్సి ఉంది. అయితే సిషెల్స్, మారిషస్, మడగాస్కర్ దేశాలు ఆయన విమానానికి అనుమతులు ఇవ్వలేదు. చైనా ఒత్తిడి మేరకే ఆయా దేశాలు తమ అనుమతులు ఉపసంహరించు కున్నాయన్నది తైవాన్ ఆరోపణ.

జబల్‌పుర్ ప్రమాద ఘటన.. వెలుగులోకి పర్యాటకుల వీడియో

జబల్‌పుర్: మధ్యప్రదేశ్‌లోని జబల్‌పుర్ జిల్లాలో నర్మదా నదిపై ఉన్న బర్గీ జలాశ యంలో బోటు ప్రమాదానికి కొన్ని క్షణాల ముందు కాపాడాలంటూ పర్యాటకులు హాహాకా రాలు చేస్తున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. బోటులోకి నీరు వస్తుండడంతో ప్రయాణికులు భయాందోళనకు గురైన, పడ వలో భారీ కుదుపులు వచ్చిన సమయంలో సిబ్బంది లైఫ్ జాకెట్లు ఇవ్వడానికి మూటలు విప్పుతున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తు న్నాయి. సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మృతుల సంఖ్య పెరిగిందని ప్రమాదం నుంచి బయటప డిన వారు ఆరోపిస్తున్నారు. ప్రమాదానికి ముందు మరీనా(39) అనే మహిళ.. తన కుమారుడు త్రిషాన్(4)ను పొదివిపట్టుకున్న దృశ్యాలు వీడియోలో ఉన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 11కు చేరింది.

జర్మనీపై ట్రంప్‌నకు కోపం వచ్చింది

- 5 వేల మంది సైనికులను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన

వాషింగ్టన్: ఇరాన్ యుద్ధంలో తమకు సహక రించడం లేదని ఐరోపా దేశాలపై గత కొంతకా లంగా అగ్గి మీద గుగ్గిలమవుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. జర్మనీపై తన ఆగ్ర హాన్ని చూపారు. ఇటీవల జర్మనీ ఛాన్సలర్ ఫెడ రిక్ మెర్జ్ మాట్లాడుతూ.. ఇరాన్ దౌత్యవేత్తల చేతిలో అమెరికా అవమానాలకు గురైందంటూ వ్యాఖ్యలు చేశారు. ఓ వ్యూహమంటూ లేకుండా యుద్ధంలోకి అగ్రరాజ్యం దిగిందని విమర్శిం చారు. ఈ నేపథ్యంలో జర్మనీ నుంచి 5,000 మంది సైనికులను ఉపసంహరించుకుంటున్నట్లు శుక్రవారం అమెరికా ప్రకటించింది. ఐరోపాలోనే అమెరికా అతి పెద్ద సైనిక స్థావరం జర్మనీలోని రామ్‌స్టెయిన్‌లో ఉంది. ఇక్కడ ఆ దేశానికి చెందిన 36 వేల మంది సైనికులు ఉన్నారు. వీరిలో 14 శాతం అంటే.. 5,040 మంది రానున్న 6 నుంచి 12 నెలల్లో ఈ స్థావరాన్ని వీడను న్నారు. అయితే ఇది తాము ఊహించిందేనని జర్మనీ రక్షణ మంత్రి బోరిస్ పిస్టోరియస్ పేర్కొ న్నారు. ఉపసంహరణ వల్ల అమెరికా ప్రయోజ నాలు కూడా దెబ్బతింటాయని అన్నారు.